4-9Pg1exHNWMJQE.qxd OK:4-9Pg1exHNWMJQE.qxd 1/1/02 6:51 AM Page 1




ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

శ్రీకాకుళం

: fb.com/vaartha Digital

Published from Srikakulam, Visakhapatnam, Vijayawada, Hyderabad, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem,

4-9-2026 శుక్రవారం సంపుటి: 32 సంచిక: 216 పేజీలు: 16 వెల: 6.50


**ట్రంప్‌కు మళ్లీ షాక్ !**
**జన్మతః పౌరసత్వం కొత్త ఆదేశాలూ నిలిపివేసిన కోర్టు** 5లో

**సుంకాలపై రాయితీ ఇస్తేనే అమెరికాతో వాణిజ్య ఒప్పందం**



## భారత్, బెల్జియం వాణిజ్యం
# ఐదేళ్లలో రెట్టింపు

**ఢిల్లీలో ప్రధాని మోడీతో బెల్జియం ప్రధాని బార్ట్ డి వెవర్ భేటీ**

**భాగస్వామ్యం బలోపేతానికి అధినేతల అంగీకారం**

**రక్షణ, వాణిజ్యంలో ద్వైపాక్షిక ఒప్పందాలు** 5లో



## రష్యా ఉక్రెయిన్ యుద్ధం
# మధ్యవర్తిత్వానికి భారత్ సిద్ధం

**కీవ్ వేదికగా కేంద్ర మంత్రి జైశంకర్ కీలక వ్యాఖ్యలు**

**కీవ్, సెప్టెంబరు 3:** రష్యా- ఉక్రెయిన్ మధ్య గత నాలుగున్నరేళ్లుగా యుద్ధం కొనసాగుతూనే ఉంది. ఇరు దేశాలూ పరస్పరం దాడులు చేసుకుంటూనే ఉన్నాయి. అయితే భారత విదేశాంగ మంత్రి జై శంకర్ ప్రస్తుతం ఉక్రెయిన్‌లో పర్యటిస్తున్న సంగతి తెలిసిందే. ఉక్రెయిన్ రాజధాని కీవ్ నగరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ రష్యా - ఉక్రెయిన్ యుద్ధంపై ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరు దేశాల మధ్య శాంతిని నెలకొల్పేందుకు భారత్ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని.. మధ్యవర్తిత్వంతో సహా ఇతర సహాయానికి కూడా భారత్ రెడీ అని తెలిపారు. ఉక్రెయిన్-రష్యా మధ్య శాంతికుదరడమే ప్రాధాన్యం అనితెలిపారు. ఇరు దేశాల మధ్య చర్చలు, మధ్యవ >>2

# స్థానిక పోరుకు రెఢీ!

**● అక్టోబరు నెలాఖరులోపు పూర్తికి చర్యలు ● రాష్ట్ర ప్రభుత్వం ముమ్మర కార్యాచరణ ● డీలిమిటేషన్ ప్రక్రియపై పిటిషన్లు కొట్టేసిన హైకోర్టు ● మంత్రులు, పార్టీ నేతలతో సిఎం డిన్నర్ భేటీ ● ఎన్నికల వ్యూహం, సమన్వయంపై సుదీర్ఘ చర్చలు ● అటు మంత్రులతో లోకేష్ అల్పాహార విందు సమావేశం ● ఎన్నికలు వాయిదా పడే ప్రసక్తే లేదని స్పష్టీకరణ**



**విజయవాడ, సెప్టెంబరు 3 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం ముమ్మర కసరత్తు చేస్తోంది. తొలుత మున్సిపాలిటీలు, తర్వాత ఎంపిటిసి, జడ్‌పిసి, ఆతర్వాత సర్పంచ్ ఎన్నికలు నిర్వహించాలని కూటమి ప్రభుత్వం యోచిస్తోంది. ఈ దిశగా కార్యా చరణకు శ్రీకారం చుట్టింది. అటు పురపాలక సంఘా లలో వార్డుల పునర్విభజన చేయవద్దని దాఖలైన మొత్తం 50 పిటిషన్లు హైకోర్టు కొట్టివేసింది. ఎస్ఐఆర్ ప్రక్రియ నడిచే సమయంలో వార్డుల విభజన సరికాదని పిటిషన్లు దాఖలైన విషయం తెలిసిందే. అయితే, తాము వార్డుల వైశాల్యం జోలికి వెళ్ళడం లేదని చట్ట నిబంధనల మేరకు ప్రభుత్వం ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లడంతో ఇరువర్గాలు వాదనలు విని, పిటిషన్లు అన్నింటిని కొట్టివేస్తూ హైకోర్టు తీర్పు వెల్లడించింది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా పెరిగిన వార్డుల ప్రకారం జరగనున్న స్థానిక ఎన్నికలు నిర్వహణకు లైన్‌క్లియర్ అయింది.

**స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కండి: సిఎం చంద్రబాబు డిన్నర్ మీట్**

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్షా సమావేశం నిర్వహించారు. గుంటూరుజిల్లా ఉండవల్లిలోని సిఎం నివాసంలో మంత్రులు, >>2

ఏ ప్రాజెక్ట్ పూర్తయినా అది కూటమి ప్రభుత్వం చేసిందే

మనం చేస్తున్న మంచిని జెన్ జీ వద్దకు తీసుకువెళ్లాలి

కేబినెట్ సమావేశంలో మంత్రులకు సిఎం దిశానిర్దేశం

31 అజెండా అంశాలకు మంత్రిమండలి ఆమోదం

అమరావతి సంగమం నిర్మాణానికి రూ.759.79 కోట్లు

పొగాకు రైతులకు డిబిటి ద్వారా రూ.94 కోట్ల ఆర్థిక సాయం

అమరావతిలో సిసి రోడ్ల స్థానంలో బిటి రోడ్లకు గ్రీన్‌సిగ్నల్

మత్స్యరంగాన్ని ప్రోత్సహించేలా రిజర్వాయర్ కేజ్ కల్చర్ పాలసీ

2026 ముసాయిదాకు ఓకే

సిఎంకి చప్పట్లతో మంత్రులు స్టాండింగ్ ఓవేషన్ గౌరవం

# క్రెడిట్ మనదే!



గురువారం కేబినెట్ హాలులోకి వచ్చే సమయంలో సిఎం కి స్టాండింగ్ ఓవేషన్ ఇస్తున్న మంత్రులు

**విజయవాడ, సెప్టెంబరు 3 ప్రభాతవార్త ప్రతినిధి:** కొత్త జనరేషన్ జెన్ జీ అన్ని విషయాలపై అవగాహనతో ఉందని సిఎం చంద్రబాబు నాయుడు కీలక వ్యాఖ్యలు చేసారు. "జెన్‌జీ వాళ్లు సోషల్ మీడియాలో క్రియాశీలకంగా ఉన్నారు. మనం కూడా అందుకు తగినట్టుగా సిద్ధమవ్వాలి. మనం చేస్తున్న మంచిని జెన్ జీ వద్దకు తీసుకువెళ్లాల్లి అని సూచించారు. జెన్‌జీ తరహా వేదిక ద్వారా మనం ఎన్ని పనులు చేస్తున్నాం అనేది ప్రజలకు తెలియాలన్నారు. చేసిన సంక్షేమం, అభివృద్ధి ప్రజలకు చెప్పుకోవాలన్నారు. వైసిపి చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని మంత్రులతో చంద్రబాబు అన్నారు. తప్పుడు, ఫేక్ ప్రచారాలు చేయడంలో వైసిపి ముందు ఉంటుందని విమర్శించారు. వెలిగొండ, పోలవరం ఎడమ కాలువకు నీటి విడుదలపై కూడా >>2

### ఎకరం కూడా ఎండిపోకూడదు

**ఎల్ నినో ప్రభావంతో వర్షాలు అంతంత మాత్రమే**

**రైతులు ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలి**

**కేబినెట్ భేటీలో విస్తృత చర్చ: మంత్రి పార్థసారథి** 12లో

### వన్య ప్రాణుల మరణాలపై సమగ్ర అధ్యయనం

**అటవీ శాఖ సలహాదారు, అదనపు ప్రధాన అటవీ సంరక్షణాధికారి నేతృత్వంలో కమిటీ** 3లో

### ప్రైవేటు పాఠశాలల్లో 25% ఉచిత ప్రవేశాలు

**అధ్యయనం, మార్గదర్శకాల సవరణకు కమిటీ ఏర్పాటు**



గురువారం సచివాలయంలో శ్రీక్షేత్ర లాజిస్టిక్స్ సంస్థ ప్రతినిధులతో భేటీ అయిన మంత్రి బిసి జనార్దనరెడ్డి

## లాజిస్టిక్స్, ఏవియేషన్ రంగాల్లో పెట్టుబడుల వెల్లువ

**రూ.300 కోట్లు పెట్టనున్న 'శ్రీక్షేత్ర**

**భోగాపురం, కర్నూలు, విజయవాడ విమానాశ్రయాల్లో ఎంఆర్‌ఓ ఏర్పాటుకు మెల్‌స్టార్ ఏవియేషన్ ఆసక్తి**

**విజయవాడ, సెప్టెంబరు 3 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో లాజిస్టిక్స్, ఏవియేషన్ రంగాల్లో పెట్టుబడులకు ప్రముఖ సంస్థలు ఆసక్తి చూపుతున్నాయని రాష్ట్ర పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బిసి జనార్దన్ రెడ్డి తెలిపారు. సుస్థిర ప్రభుత్వం, సిఎం >>2

## రూ. 100 కోట్లతో వంద పడకలతో
# యోగా- ప్రకృతి వైద్య పరిశోధన సంస్థ

**గుంటూరు శివారులోని నడింపాలెంలో ఏర్పాటు**

**కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు**

**రూ.9.94 కోట్లతో త్వరలో పనులు ప్రారంభం**

**మధుమేహం, రక్తపోటు, ఊబకాయం, శ్వాసకోశ, మానసిక ఒత్తిడి, ఇతర సమస్యలకు యోగా- నేచురోపతి విధానాల్లో చికిత్స**

**విజయవాడ, సెప్టెంబరు 3 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో కేంద్ర యోగా-ప్రకృతి వైద్య పరిశోధన సంస్థ ఏర్పాటుపై కేంద్రం నుంచి ఉత్తర్వులు అందినట్లు ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఆ క్రమంలోనే గుంటూరు నగర సమీపంలోని ప్రత్తిపాడు మండలం నడింపాలెంలో కేంద్ర యోగా-ప్రకృతి వైద్య పరిశోధన సంస్థ ఏర్పాటు పనులు వేగం పుంజుకున్నాయని మంత్రి వివరించారు. కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ ఇన్ యోగా అండ్ నేచురోపతి ద్వారా 100 పడకల ఆసుపత్రితో ఈ సంస్థను ఏర్పాటు చేయనున్నారు. సంస్థ ఏర్పాటుపై కేంద్రం నుంచి అధికారిక సమాచారం వచ్చినట్లు రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వివరించారు. ఈ మేరకు మంత్రి కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. ఇందుకు తగ్గట్లు సంస్థ ఏర్పాటుకు అవసరమైన భూమి, రహదారి, డ్రెయినేజీ, స్థల సమతలీకరణ తదితర ప్రాథమిక పనుల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.9.94 కోట్లను మంజూరు చేసినందున తదుపరి పనుల్లో మర్నిత పెరుగుతుందని చెప్పారు. ప్రతిపాదిత స్థలంలో చేపట్టాల్సిన పనులపై రాష్ట్ర, జిల్లా అధికారులు, కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ ప్రతినిధులతో ఆగస్టు 4న సంయుక్తంగా పరిశీలించారు. స్థల అనుకూలత, మౌలిక వసతులను పరిశీలించిన అనంతరం పలు నిర్ణయాలు తీసుకున్నారు. అంగీకరించిన పనులను మూడు నెలల్లో పూర్తి చేసి భూమిని సిసిఆర్‌వైఎన్‌కు అప్పగించేలా చర్యలు చేపట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మంజూరైన రూ.9.94 కోట్లలో రూ.6.74 కోట్లు భూసంబంధిత అవసరాలకు, రూ.3.20 కోట్లు స్థల నింపుదల, సమతలీకరణకు కేటాయించారు. ప్రాంగణంలోని కొన్ని ప్రాంతాలు ఎన్‌హెచ్-16 స్థాయి కంటే 2-3 మీటర్ల మేర దిగువన ఉండటంతో అవసరమైన మేరకు నాణ్యమైన మట్టితో నింపి నిర్దేశిత స్థాయికి తీసుకురానున్నారు. సంస్థకు నేరుగా చేరుకు నేలా జాతీయ రహదారి-16 నుంచి ఆనుకుని ఉన్న ప్రభుత్వ >>2




## ఎల్‌నినో ఎఫెక్ట్..
# 'పవర్ పెరిగింది

**275 మిలియన్ యూనిట్లకు పైగా విద్యుత్తు వినియోగం**

**నిరంతర విద్యుత్ సరఫరాకు ప్లాంట్లను సిద్ధం చేయాలి**

**ఉత్పత్తికి ఇబ్బంది లేకుండా 15 రోజుల బొగ్గు నిల్వలు తప్పనిసరి**

**అధికారులకు మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశాలు**

**విజయవాడ, సెప్టెంబరు 3 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో దానికి అనుగుణంగా ఉత్పత్తి, సరఫరా వ్యవస్థలను పూర్తి స్థాయిలో సన్నద్ధం చేయాలని ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధికారులను ఆదేశించారు. సచివాలయంలో విద్యుత్‌శాఖ అధికారులతో గురువారం నిర్వహించిన సమీక్షలో ప్రస్తుత డిమాండ్, ఉత్పత్తి సామర్థ్యం, ప్లాంట్ల పనితీరు, భవిష్యత్తు అవసరాలపై మంత్రి చర్చించారు. ఎల్‌నినో ప్రభావంతో ఉష్ణోగ్రతలు పెరగడం, ఫలితంగా గృహ, వాణిజ్య,వ్యాపార, పారిశ్రామిక రంగాల్లో విద్యుత్ వినియోగం పెరుగుతున్న విషయాన్ని మంత్రి ఈ సందర్భంగా ప్రస్తావించారు. గతంలో రోజుకు సగటున 218 మిలియన్ యూనిట్లుగా ఉన్న విద్యుత్ వినియోగం ప్రస్తుతం 275 మిలియన్ యూనిట్లకు పైగా చేరిన నేపథ్యంలో, పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా ఉత్పత్తి ప్లాంట్లు సిద్ధంగా ఉంచాలని ఆయన అధికారులకు సూచించారు. ఎల్‌నినో ప్రభావం కొనసాగుతున్న నేపథ్యంలో విద్యుత్ డిమాండ్ మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. >>2




## 'అక్షర ఆంధ్ర అద్భుత ఫలితాలు

**రెండేళ్లలో అక్షరాస్యత 72.6శాతం నుంచి 82.1శాతానికి పెరుగుదల**

**విజయవాడ, సెప్టెంబరు 3 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో ప్రతి పౌరుడికి అక్షర జ్ఞానం అందించాలనే సంకల్పంతో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ నాయకత్వంలో చేపట్టిన 'అక్షర ఆంధ్ర కార్యక్రమం అద్భుత ఫలితాలను సాధిస్తోంది. ప్రతి ఇంటా అక్షరం, ప్రతి చేతిలో జ్ఞానం ప్రతి పౌరుడి జీవితంలో వెలుగు అనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం చేస్తున్న కృషి ద్వారా ఆంధ్రప్రదేశ్‌ను సంపూర్ణ అక్షరాస్యత కలిగిన రాష్ట్రంగా నిలబెట్టడమే తమ ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర >>2

## ఇంద్రకీలాద్రిపై అక్టోబర్ 11నుంచి
# శరన్నవరాత్రి ఉత్సవాలు

**విజయవాడ, సెప్టెంబరు 3 ప్రభాతవార్త ప్రతినిధి:** విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన కనకదుర్గాదేవి దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు ముహూర్తం ఖరారైంది. అక్టోబరు 11 నుంచి 20వ తేదీ వరకు పది రోజుల పాటు ఈ ఆధ్యాత్మిక వేడుకలను నిర్వహించనున్నారు. శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరగనున్నాయి. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లపై అధికారులు ముమ్మర కసరత్తు ప్రారంభించారు. ఉత్సవాల సమయంలో రాష్ట్ర నలు మూలల నుంచి భక్తులు భారీగా ఇంద్రకీలాద్రికి తరలివస్తారు. జగన్మాత >>2





**అక్రమాస్తుల కేసులో**

**తిరుమల ఆలయ డిప్యూటీ ఇఒ**

## లోకనాథం అరెస్ట్

**నెల్లూరు ఎసిబి కోర్టులో హాజరు**

**రూ.5కోట్లపైగా ఆస్తులున్నట్లు గుర్తింపు**

**తిరుపతి,సెప్టెంబరు 3ప్రభాతవార్తప్రతినిధి:** ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారనే ఆరోపణలపై దాదాపు 30గంటలపైగా కొనసాగిన అవినీతి నిరోధకశాఖ (ఎసిబి) అధికారుల విచారణతో గురువారం మధ్యాహ్నం తిరుమల శ్రీవారి ఆలయ డిప్యూటీ ఇఒ మెండు లోకనాథంను అరెస్ట్ చేశారు. బుధవారం ఉదయం 6.30గంటల నుండి గురువారం మధ్యాహ్నం 12గంటల వరకు సుదీర్ఘంగా చేపట్టిన ఈ తనిఖీల్లో సుమారు ఐదుకోట్ల రూపాయలు పైగా విలువైన అక్రమ ఆస్తులు కలిగి ఉన్నాడని ఎసిబి అధికారులు తేల్చారు. ఇదేగాక ఒకటిన్నరరోజు కొనసాగిన తనిఖీల్లో ఆయన నివాసంలో రెండు కిలోల బంగారం, 6.5 >>2

## వివేకా హత్య కేసులో ఇడి దూకుడు

**● రూ.40 కోట్ల ఆర్థిక లావాదేవీలపై ఆరా ● అప్రూవర్ దస్తగిరిని సుదీర్ఘంగా ప్రశ్నిస్తున్న అధికారులు ● బ్యాంక్ స్టేట్‌మెంట్లతో విచారణకు హాజరు ● హత్యకు ముందు, తర్వాతి లావాదేవీలపై ప్రత్యేక దృష్టి**

**పులివెందుల, సెప్టెంబరు 3 ప్రభాత వార్త :** మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) దర్యాప్తును ముమ్మరం చేసింది. ఈకేసులో సిబిఐకి అప్రూవర్‌గా మారిన షేక్ దస్తగిరిని ఇడి అధికారులు సుదీర్ఘంగా విచారిస్తున్నట్లుసమాచారం. ముఖ్యంగా హత్యకు ముందు, అనంతరం చోటుచేసుకున్న ఆర్థిక లావాదేవీలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలుస్తోంది.

**రూ.40 కోట్ల డీల్‌పై ప్రశ్నలు**

వివేకానందరెడ్డి హత్యకు సంబంధించి గతంలో దస్తగిరి సిబిఐకి ఇచ్చిన వాంగ్మూలంలో కీలక విషయాలను వెల్లడించి నట్లు ప్రచారం జరిగింది. హత్యకు సంబంధించిన ఒప్పందంలో భారీ మొత్తంలో డబ్బు చేతులు మారినట్లు, మొత్తం వ్యవహారం సుమారు రూ.40 >>2




## నేడు నింగిలోకి జిఎస్‌ఎల్వి ఎఫ్-17

**కక్షలోకి చేరనున్న భూ పరిశీలన ఉపగ్రహం ఇఒఎస్ 05**

**సూళ్లూరుపేట, సెప్టెంబరు 3, ప్రభాతవార్త:** సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ శ్రీహరికోట నుంచి శుక్రవారం వేకువ జామున 2 గంటల 55 నిమిషాలకు ఇస్రోకు అత్యంత ప్రతిష్టాకరమైన జిఎస్‌ఎల్‌వి ఎఫ్-17 ప్రయోగం జరగనున్నది. ఈ ప్రయోగం ద్వారా భారత దేశ ప్రథమ భూ పరిశీలన ఉపగ్రహం ఇఒఎస్05 కక్షలోకి ఇస్రో శాస్త్రవేత్తలు ప్రవేశ పెట్టనున్నారు. ఇందుకు సంబంధించి బుధవారం రాత్రి 11గంటల 25నిమిషాలకు కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. >>2



## తెలంగాణ కేబినెట్ నుంచి
# కొండా సురేఖ ఔట్

**గవర్నర్‌కు సిఎం రేవంత్‌రెడ్డి సిఫారసు లేఖ**

**ఆమోదించినట్లు రాజ్‌భవన్ ప్రకటన**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, సెప్టెంబరు3:** తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామం చోటు చేసుకుంది. రాష్ట్ర కాంగ్రెస్‌లో కొద్దిరోజులుగా నలుగుతున్న కొండా సురేఖ ఎపిసోడ్‌కు తెరపడింది. కొండా సురేఖను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని సిఎం రేవంత్‌రెడ్డి గవర్నర్ శివ్ ప్రసాద్ శుక్లాకు లేఖను పంపారు. దీంతో మంత్రి కొండా సురేఖను కేబినెట్ నుంచి తొలగించడం ఖరారైంది. గురువారం రాత్రి కొండా సురేఖను మంత్రి పదవి నుంచి తొలగించే అంశంపై గవర్నర్ తుది నిర్ణయం తీసుకున్నారు. మంత్రివర్గంనుంచికొండా సురేఖను >>2

వార్త

ధైర్యంతో అన్ని సమస్యల్ని పరిష్కరించుకోవచ్చు. కనుక ఎట్టి పరిస్థితుల్లోనూ ధైర్యాన్ని కోల్పోరాదు.

న- రోజర్

# మాటలతో ధరలు తగ్గవు!

'పదాల కన్నా గొప్పది వాక్‌శక్తి, వాక్‌శక్తి కన్నా గొప్పది మనసు, మనసు కన్నా గొప్పది సంకల్పం' మన పాలకుల్లో ఆ సంకల్ప లోపం కారణంగానే ప్రజలకు ఇక్కట్ల మీద ఇక్కట్లు వచ్చిపడుతున్నాయేమోననిపిస్తున్నది. ఇతర సమస్యల మాట ఎలా ఉన్నా రోజురోజుకు పెరిగిపోతూ ప్రజాజీవితం నరకప్రాయంగా మారుస్తున్న నిత్యావసర వస్తువుల ధరలు అదుపులోనికి తెచ్చేందుకు ఆలోచన కానీ, ప్రయత్నం కానీ త్రికరణశుద్ధిగా జరగడం లేదు. మాటలు మాత్రం కోటలు దాటుతున్నాయి. చేతలు మాత్రం గడప దాటలేదన్నట్లుగా ఉంది. ధరల నియంత్రణకు, సమీక్షా, సమావేశాలకు కొరత లేదు. కమిటీల మీద కమిటీలు ఏర్పాటు చేస్తున్నారు. పెరుగుతున్న ధరలపై ఉక్కుపాదం మోపుతాం, అవసరమైతే ఎస్మా చట్టాన్ని ప్రయోగిస్తాం అంటూ హెచ్చరికలు జారీ చేస్తున్నారు. కానీ ఇవేమీ పట్టించుకునే పరిస్థితుల్లో దళారులు లేరు. ప్రస్తుత పాలకులే కాదు, ఏ పార్టీ అధికారంలో ఉన్నా ధరలు పెరగడం, వాటిని నియంత్రిస్తామని పెద్దపెద్ద మాటలు చెప్పడం, అక్రమ నిల్వలు చేసే వారిపై చర్యలు తీసుకొని కటకటాల వెనక్కి పంపుతామని బెదరించడం రివాజుగా మారిపోయింది. ఈ విషయంలో ఎప్పుడూ చర్యలు తీసుకోలేదని చెప్పడం లేదు. రకరకాల చట్టాలు తెచ్చారు. బ్లాక్ మార్కెటీర్లను జైళ్లకు పంపారు. ప్రభుత్వమన్నా, అందులో పనిచేసే అధికారులన్నా దళారులు గడగడలాడిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. కానీ అవి రానురాను తగ్గిపోతున్నాయి. అధికారులను వారివారి విధులను స్వేచ్ఛగా చేయనివ్వడం లేదేమోననిపిస్తున్నది. అన్నింటిలోనూ మితిమీరిన రాజకీయ జోక్యం, తమ సిఫార్సులకు, రాజకీయ ఒత్తిడిలకులొంగని సమర్థులైన అధికారులను బదిలీవేటుతో శంకరగిరి మాన్యాలు పట్టించడం ఏనాటి నుంచో ఆరంభమైంది. అందుకే అప్పటి భయభక్తులు ఇప్పుడు లేవు. అధికారుల్లో కూడా అంకితభావం తగ్గిపోయిందని చెప్పొచ్చు. బిల్లు, బెల్లు అనే తీరులోనే వ్యవహరించేవారు ఎక్కువైపోతున్నారు. దీనికితోడు రాజకీయాల్లో కీలకపాత్ర వహిస్తున్న కొందరు పెద్దలు మరి కొందరు అక్రమ వ్యాపారస్తులతో మమేకమైపోతున్నారు. కొన్ని ప్రాంతాల్లో అయితే నాయకులే కుటుంబ సభ్యుల పేరుతోనో, లేక స్వయంగా వ్యాపారాలు చేసే వారు కూడా ఉన్నారు. ఇదేమీ కొత్త విషయం కాదు. ఇప్పటికిప్పుడు ప్రారంభమైంది కూడా కాదు. కానీ ఈ సంప్రదాయం రానురాను పెరిగిపోతుండడం ఆందోళన కలిగించే అంశం. రాజకీయమే వ్యాపకంగా జీవనం సాగించేవారి సంఖ్య క్రమేపీ తగ్గిపోతున్నది. డబ్బు సంపాదనే ధ్యేయంగా మారిపోతున్నది. ఎన్నికలు కూడా అలా రూపాంతరం చెందాయి. డబ్బు, మద్యం, పంపిణీ చేయలేనివారు ఎన్నికల వైపు చూసే పరిస్థితులు లేవు. ఇందులో ప్రజల బాధ్యత కూడా కొంతవరకు ఉందని చెప్పక తప్పదు. కొందరు బడా వ్యాపారులు, మరికొందరు రాజకీయ నాయకులకు అవినాభావ సంబంధాలు ఏర్పడుతున్నాయి. కొందరు అవినీతి అధికారులు వీరితో చేతులు కలుపుతున్నారు. చివరకు ఈ భారమంతా ప్రజలు భరించకతప్పదు. దీంతో ఎన్నికేకలు పెట్టినా, మరెన్ని హెచ్చరికలు చేసినా ఇంకెన్ని కేసులు పెట్టినా తమను ఏమీ చేయలేవనే దీమా అక్రమ వ్యాపారస్తుల్లో పెరిగిపోతున్నది. ధరలు పెరగడానికి ముఖ్యకారణాల్లో ఇదొకటి. ద్రవ్యోల్బణంతోపాటు ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న యుద్ధాలు కారణం కాగా ప్రస్తుతం సూపర్ ఎల్‌నినో ప్రభావంతో ఈ ఖరీఫ్‌లో సాగు తగ్గిపోవడంతోపాటు మార్కెట్ మాయాజాలం అన్నింటి కంటే ముఖ్యకారణంగా చెప్పొచ్చు. పప్పుదినుసుల ధరలు అందుకోలేనంతగా పెరిగిపోయాయి. ఈసారి పప్పుదినుసుల సాగు కూడా అంతంత మాత్రంగా ఉండడంతో దిగుబడులు గణనీయంగా తగ్గుతాయనే ముందస్తు అంచనాలతో కొందరు దళారులు ఉన్న సరుకును గోదాముల్లో నిల్వ చేసుకున్నారు. పప్పుదినుసులే కాదు పేదలు నిత్యం వాడే కారం, ఉప్పు, నూనె వంటి ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. అన్నింటికంటే మించి తెలుగు రాష్ట్రాల్లో గత మూడు, నాలుగేళ్లుగా విపరీతంగా దిగుబడులు వస్తున్నా, బియ్యం ధరలు ఆకాశానికి అంటుకుంటున్నాయి. గతంలో ఎన్నడూలేని విధంగా ఈసారి బియ్యం కిలో డెబ్భైరూపాయల వరకు అమ్ముతున్నారు. ఈ యేడాది ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడడం, చీడపీడలు పెరగడం, దిగుబడులు మరింత పడిపోయే అవకాశమున్నట్లు నిపుణులే అంగీకరిస్తున్నారు. ఇలాంటి రాబోయే పరిస్థితులను ముందుగానే ఊహించి దీన్ని సొమ్ము చేసుకునేందుకు కొందరు వ్యాపారులు, దళారులు పావులు కదుపుతున్నారు. ఇదంతా పాలకులకు తెలియంది ఏమీ కాదు. కానీ ఆ వైపు అడుగులు పడడం లేదు. మరోకవైపు రైతుకు గిట్టుబాటు ధర రాకపోవడంతో వ్యవసాయరంగం రోజురోజుకు సంక్షోభంలో కూరుకుపోతున్నది. మరోకవైపు మార్కెట్లో చూస్తే వినియోగదారులు కొనలేక నానాయాతన పడుతున్నారు. పండిన పంటలు ఎక్కడ ఉన్నాయి? గోదాములు ఎవరివి? నిబంధనలను అతిక్రమించి దాచిన అక్రమ నిల్వలు ఎన్ని? తదితర వివరాలు, సమాచారం అధికారులకు తెలియకుండాపోయే అవకాశం లేదు. వాటిని బయట పెట్టి వినియోగదారులకు అందుబాటులోకి తీసుకురాగలిగితే కొంతవరకైనా ధరలు అదుపుచేసే అవకాశాలున్నాయి. ఇక కూరగాయల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. కూరగాయల సాగు తెలుగు రాష్ట్రాల్లో గణనీయంగా తగ్గిపోతున్నది. బీదా బిక్కేకాదు సామాన్యులు, మధ్యతరగతి వర్గాలు కూడా రేట్లు అందుకోలేనంతగా పెరిగిపోతున్నాయి. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్రాల పాలకులు అదుపులేకుండా పెరిగిపోతున్న ధరల విషయంలో నిర్దిష్టమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

దురలవాట్లు మొదట్లో సాలెగూళ్ల లాంటివి. తర్వాత అవి ఇనుప గొలుసులై మిమ్మల్ని బంధిస్తాయి.



హెచ్.లాంగ్‌ఫెలో

నైతిక విలువలు విడిచిపెట్టి పూజచేసినా, జపం చేసినా, ధ్యానం చేసినా అది భక్తి కాదు రాక్షసభక్తి.



బెర్నార్డ్ షా

# ప్రజావాక్కు



### ఆస్పత్రుల్లో రక్షణ కరవు

ఒక నవజాత శిశువు ప్రపంచంలోకి అడుగుపెట్టిన క్షణం నుంచి అతడి ప్రాణాలను కాపాడటం వైద్య వ్యవస్థకు అత్యంత పవిత్రమైన బాధ్యత. కానీ అమరావతిలోని నియో నేటల్ ఐసీయూలో అగ్నిప్రమాదంలో ముగ్గురు పసికందులు మృతి చెందిన ఘటన, మైసూరులోని చెలువాంబ ఆసుపత్రిలో గత ఏడాది 1,026 ప్రసవాల్లో 110 మంది నవజాత శిశువులువివిధ ఇన్ఫెక్షన్ల కారణంగా మృతి చెందినట్లు వెలువడిన సమాచారం ప్రత్యేక వైద్య సంరక్షణ అవసరమైన పసిప్రాణాలు ఎంతటి ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందో గుర్తుచేస్తున్నాయి. ఈ ఘటనలపై ఎవరి తప్పిదాన్ని ముందుగానే నిర్ణయించడం ఉద్దేశంకాదు. కానీ ఒక్కసారికాదు, పదేపదే ఇలాంటి విషాదాలు చోటుచేసుకుంటున్నప్పుడు వ్యవస్థను ప్రశ్నించడం మాత్రం తప్పనిసరి. నవజాత శిశువుల విభాగాల్లో సాధారణ ఆసుపత్రుల కంటే మరింత కఠినమైన భద్రతా ప్రమాణాలు అవసరం.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### పాశ్చాత్య ధోరణులు

భారతదేశ వాతావరణ పరిస్థితులను బట్టి మనది ఉష్ణ మండల దేశంగా పరిగణిస్తారు. మనదేశంలో వివిధ ప్రాంతాలలో విభిన్నమైన వాతావరణ పరిస్థితులు ఉండటం కద్దు. వేసవిలో అయితే అసాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతూ ఉంటాయి. ఈ మధ్యకాలంలో పిల్లలు, యువతీ యువకులు, స్త్రీలు, పురుషులు ఉష్ణతాపం తట్టుకోలేకనో లేక పాశ్చాత్య ధోరణిలో చిన్నదుస్తులు ధరించి మండు వేసవిలో యథేచ్ఛగా సంచరిస్తున్నారు. సాధారణంగా సూర్యకిరణాల వేడిమి 30నుంచి 35 డిగ్రీల సెల్సియస్ అంతకు మించితే సూర్యకిరణాలలో అల్ట్రా వయొలెట్ కిరణాలు ఎక్కువగా ఉంటాయి. ఈ కిరణాలు చర్మానికి నేరుగా సోకితే చర్మ క్యాన్సర్లు వచ్చే ప్రమాదం ఉంది.

- కె. వెంకట్, సికింద్రాబద్

### బిఎల్‌ఓలు ఇంటింటికి తిరిగి ఇవ్వాలి

ఓటరు జాబితా ప్రక్షాళనలో భాగంగా ఇటీవల విడుదల అయిన జాబితాలో కొందరి ఓటర్ల పేర్లు, తల్లిదండ్రుల పేర్లు, చిరునామాలు తప్పుగా ఉండడం వలన బిఎల్‌ఓలు ప్రతి ఇంటికి వెళ్ళి నోటీసులు ఇవ్వడంతో పాటు ఓటర్లకు అవగాహన కల్పించాలి. గ్రామంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. అర్హతగా ఉన్న ఏ ఒక్క ఓటరు అనర్హులుగా మిగలొద్దు.

-మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

### అతివేగం అనర్థదాయకం

పెరుగుతున్న వాహనాల సంఖ్య, మితిమీరిన వేగం కారణంగా నేడు రోడ్డు ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి. ఎందరో ప్రాణాలు కోల్పోవడమే కాకుండా, అనేక కుటుంబాలు వీధిన పడుతున్నాయి. రోడ్లను ప్రమాదరహితంగా మార్చడం అనేది కేవలం ప్రభుత్వం బాధ్యత మాత్రమే కాదు, ప్రతి పౌరుడి కర్తవ్యం. రహదారి భద్రత విషయంలో నిర్లక్ష్యం వహించడం వల్ల కలిగే పరిణామాలు అత్యంత భయంకరంగా ఉంటున్నాయి. ప్రమాదాల నివారణకు రహదారుల రూపకల్పనలో శాస్త్రీయ పద్ధతులు పాటించాలి. మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు, రాత్రివేళల్లో తగినంత వెలుతురు ఉండేలా విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలి. గుంతలమయమైన రోడ్లను వెంటనే మరమ్మతు చేయడం ద్వారా చాలా ప్రమాదాలను నివారించవచ్చు. అలాగే, అతివేగం, మద్యం సేవించి వాహనం నడపడం వంటి ఉల్లంఘనలపై కఠినమైన జరిమానాలు, చట్టపరమైన చర్యలుతీసుకోవాలి. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించే వారిపట్ల ఎటువంటి మినహాయింపు ఉండదు.

- సి. సాయిరుత్విక్, శ్రీకాకుళం

### కేసులను వెంటనే పరిష్కరించాలి

వినియోగదారుల ఫోరంలో రోజురోజుకి ఇంత జాప్యం జరుగుతున్నా పట్టించుకునేవారు లేరు. ఈకోర్టు కేసులో ఫోరంలో కేసు వేసినచో 90రోజుల్లో పరిష్కారం లభించేది. కానీ ఇప్పుడు మూడునాలుగు సంవత్సరాలు గడిచినకానీ కేసు పరిష్కారం జరగటంలేదు కానీ కేసు బాధితులుమాత్రం కోర్టు చుట్టూ ప్రదక్షిణ చేయాల్సిన పరిస్థితి నెలకొన్నాయి. అన్ని కేసుల వైపు కాకుండా వినియోగదారు ఫోరంలో తక్షణమే ఆధారాలతో యుక్తంగా ఉంటే వెంటనే పరిష్కారం తీర్పు వెలబడును. కానీ నేటివరకు కూడా పరిష్కార దిశలు కనుక్కోలేకపోతున్నారు. సిబ్బంది కూడా అంతంత మాత్రమే ఉన్నారు.

- సి. లక్ష్మీనారాయణ, కరీంనగర్

### వర్షపు నీటిని ఒడిసిపట్టాలి

ఉపాధిహామీ కొత్త రూపం సంతరించుకున్న తరువాత రోజుల పెంపు గురించి దానిని అందుకోవడం గురించి చాలా చర్చ జరుగుతున్నది. ఐతే అందరికి 125రోజుల లక్ష్యం అందుకోవడం సాధ్యంకాకపోవచ్చు. కానీ కనీసంలో కనీసం 110 రోజుల లక్ష్యం చేరుకోవడం విఫలం ఏమికాదు. అయితే ఎల్‌నినో ప్రభావం సెప్టెంబర్ మాసంలో తెలంగాణలో తీవ్ర ప్రభావం చూపబోతున్నది తద్వారా పడిన కాసిన్ని చినుకులు అయినా వడిసి పట్టే అవకాశం ఉంటుంది.

- భారత అవినాష్, జనగామ

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు
మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# ఎల్‌నినో కట్టడికి ప్రత్యేక కార్యాచరణ

**ప్రభుత్వ చర్యలతో పాటు ప్రజల భాగస్వామ్యమూ అంతేకీలకం. పరిశ్రమలు నీటి పునర్వినియోగాన్ని తప్పనిసరి చేయాలి. విద్యుత్ పొదుపు చేసే సాంకేతికతలను ప్రోత్సహించాలి. బ్యాంకులు, బీమా సంస్థలు వాతావరణ ముప్పులను దృష్టిలో ఉంచుకుని రైతులు, చిన్న వ్యాపారులకు రక్షణ కల్పించే కొత్త పథకాలను రూపొందించాలి. విద్యాసంస్థలు విద్యార్థుల్లో నీటి సంరక్షణ, పర్యావరణ బాధ్యతను పెంపొందించాలి. ప్రతి కుటుంబం నీటి పొదుపు, విద్యుత్ ఆదా, మొక్కల పెంపకాన్ని దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలి. ఎల్‌నినోను మనం ఆపలేం. ఎందుకంటే అది ప్రకృతి వ్యవస్థలో భాగం. కానీ దాని ప్రభావాన్ని జాతీయ సంక్షోభంగా మారకుండా నిరోధించే శక్తి మన చేతుల్లోనే ఉంది. శాస్త్రీయ ఆలోచన, దూరదృష్టి గల పాలన, ప్రకృతి వనరుల వివేక వంతమైన వినియోగం, ప్రజల బాధ్యతాయుతమైన భాగస్వామ్యం కలిసి నడిస్తే ఎల్‌నినో ప్రభావాన్ని గణనీయంగా తగ్గించవచ్చు.**

డి జె మోహన రావు

ఒకప్పుడు ఎల్‌నినో అంటే రుతుపవనాల తీరు మారడానికి కారణమయ్యే ప్రకృతి పరిణామం అనే అవగాహనే ఉండేది. కానీ నేడు అది దేశ వ్యవసాయం, నీటి వనరులు, విద్యుత్ ఉత్పత్తి, ప్రజారోగ్యం, పర్యావరణం, ఆర్థిక వ్యవస్థ వంటి సమస్త జీవన రంగాలను ఒకేసారి ప్రభావితం చేసే సవాలుగా మారింది. వాతావరణ మార్పులు దీనికి తోడవడంతో ప్రమాద తీవ్రత మరింత పెరుగుతోంది. అందుకే ఎల్‌నినోను కేవలం వాతావరణ ఘటనగా కాకుండా దేశ భవిష్యత్తును ప్రభావితం చేసే జాతీయ సవాలుగా గుర్తించి దీర్ఘకాలిక కార్యాచరణను రూపొందించాల్సిన అవసరం ఉంది. ఎల్‌నినో తొలి దెబ్బ వ్యవసాయ రంగంపైనే పడుతుంది. దేశంలోని సుమారు సగానికి పైగా సాగుభూమి ఇప్పటికీ వర్షాధారంగానే ఉంది. వర్షాలు ఆలస్యమైనా, తక్కువగా కురిసినా, ఒక్కసారిగా అధికంగా కురిసినా రైతే ఎక్కువ నష్టపోతాడు. ఈ పరిస్థితిని మార్చాలంటే వ్యవసాయాన్ని పూర్తిగా వర్షాలపై ఆధారపడే స్థితి నుంచి క్రమంగా బయటకు తీసుకురావాలి. ప్రతి నీటి బొట్టును ఆదా చేసే డ్రిప్, స్ప్రింక్లర్ వంటి సూక్ష్మ సాగు పద్ధతులను విస్తృతంగా ప్రోత్సహించాలి. గ్రామస్థాయిలోనే రైతులకు ఖచ్చితమైన వాతావరణ సమాచారాన్ని అందించి, ఏ పంట వేయాలి, ఎప్పుడు విత్తాలి, ఎంత నీరు ఇవ్వాలనే నిర్ణయాలను శాస్త్రీయ సూచనల ఆధారంగా తీసుకునేలా వ్యవస్థను బలోపేతం చేయాలి. నీటి కొరతను ఎదుర్కోవడం వ్యవసాయానికే కాదు, తాగునీరు, పరిశ్రమలు, పట్టణ జీవనానికీ అత్యంత కీలకం. అందువల్ల నీటి సంరక్షణను జాతీయ ఉద్యమంగా చేపట్టాలి. గ్రామాల్లో ఫామ్‌పాండ్లు, పట్టణాల్లో ఇంకుడు గుంతలు, వర్షపు నీటి నిల్వ వ్యవస్థలను తప్పనిసరి చేయాలి. నిర్లక్ష్యానికి గురైన చెరువులు, కాలువలను పునరుద్ధరించాలి. భూగర్భ జలాల విచ్చలవిడి వినియోగాన్ని నియంత్రిస్తూ వాటి పునరుద్ధరణకు ప్రాధాన్యం ఇవ్వాలి. పరిశ్రమల్లో శుద్ధి చేసిన నీటిని తిరిగి వినియోగించే విధానాన్ని విస్తృతంగా అమలు చేయాలి. వ్యవసాయ విధానంలో కూడా మార్పు అవసరం. నీటి కొరత ప్రాంతాల్లో వరి, చెరకు వంటి అధిక నీటి అవసరమున్న పంటలపై ఆధారపడటం భవిష్యత్తులో మరింత ప్రమాదకరం. అలాంటి ప్రాంతాల్లో చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, నూనెగింజలు వంటి తక్కువ నీటితో పండే పంటలను ప్రోత్సహించాలి. నేలలో తేమను నిలిపే ఆధునిక సాగు పద్ధతులను విస్తరించాలి. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టపోయిన రైతు పరిహారం కోసం నెలల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితి మారాలి. ఉపగ్రహ చిత్రాలు, డిజిటల్ సాంకేతికత ఆధారంగా పంట నష్టాన్ని వేగంగా అంచనా వేసి బీమా పరిహారాన్ని నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేసే పారదర్శక వ్యవస్థను ఏర్పాటు చేయాలి. ఎల్‌నినోతో వేడి తరంగాల తీవ్రత కూడా పెరుగుతోంది. వేసవి కాలం పొడవుగా మారుతుండగా ఉష్ణోగ్రతలు కొత్త రికార్డులు నమోదు చేస్తున్నాయి. రైతులు, నిర్మాణ కార్మికులు, వృద్ధులు, చిన్నారులు ఎక్కువగా ప్రభావితమవుతున్నారు. వడదెబ్బలు, నిర్జలీకరణ, గుండె సంబంధిత సమస్యలు పెరుగుతున్నాయి. కాబట్టి హీట్‌వేవ్‌లను సాధారణ వేసవి సమస్యగా కాకుండా ప్రజారోగ్య అత్యవసర పరిస్థితిగా పరిగణించాలి. ముందస్తు హెచ్చరికలు, తాగు నీటి కేంద్రాలు, పనివేళల మార్పు వంటి చర్యలతో పాటు పట్టణ ప్రణాళికలో చెట్ల పెంపకం, హరిత ప్రాంతాలు, గ్రీన్



బిల్డింగ్‌లకు ప్రాధాన్యం ఇవ్వాలి. నగరాలు వేడిని వెదజల్లే కాంక్రీట్ ద్వీపాలుగా మారకుండా ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి అవసరం. అధిక ఉష్ణోగ్రతలతో డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధుల వ్యాప్తి తీరులో మార్పులు కనిపిస్తున్నాయి. మరోవైపు దీర్ఘకాలం ఎండలు కొనసాగితే అడవుల్లో కార్చిచ్చుల ప్రమాదం పెరుగుతుంది. ఇది జీవవైవిధ్యానికి తీవ్రమైన ముప్పు. అందువల్ల అడవులు, మడ అడవులు, చిత్తడి నేలలను సంరక్షి ంచడం పర్యావరణ పరిరక్షణమాత్రమేకాదు దేశ భద్రతలో భాగంగా భావించాలి. ఎల్‌నినో ప్రభావాన్ని ముందుగానే గుర్తించి నష్టాన్ని తగ్గించడంలో శాస్త్ర సాంకే తిక పరిజ్ఞానం కీలకం. పసిఫిక్ మహాసముద్రంలో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు, కెల్విన్ తరంగాల కదలికలు, వాతా వరణ మార్పులను నిరంతరం పరిశీలిస్తూ మరింత ఖచ్చిత మైన అంచనాలు రూపొందించాలి. కృత్రిమ మేధస్సు, ఆధు నిక వాతావరణ నమూనాలను విస్తృతంగా వినియోగించాలి. పరిశోధనల ఫలితాలు రైతుకు అర్థమయ్యే భాషలో గ్రామ స్థాయికి చేరి, అధికారుల నిర్ణయాలకు మార్గదర్శకంగా మారి నప్పుడే వాటి అసలు ప్రయోజనం ఉంటుంది. ఉష్ణోగ్రతలు పెరగడంతో విద్యుత్ వినియోగం భారీగా పెరుగుతుంది. అదే సమయంలో జలాశయాల్లో నీరు తగ్గి జలవిద్యుత్ ఉత్పత్తి పడిపోతుంది. ఈ పరిస్థితిని ఎదుర్కోవాలంటే సౌర, పవన విద్యుత్ ఉత్పత్తిని వేగంగా విస్తరించాలి. రూఫ్ టాప్ సోలార్, విద్యుత్ నిల్వ బ్యాటరీలు, శక్తి సామర్థ్యం ఎక్కువగా ఉన్న పరికరాల వినియోగాన్ని ప్రోత్సహించాలి. ఎల్‌నినో ప్రభావం చివరకు సామాన్యుడి వంటింటికీ చేరుతుంది. వర్షాభావంతో పంట దిగుబడులు తగ్గితే బియ్యం, పప్పులు, కూరగాయలు, వంటనూనెల ధరలు పెరుగుతాయి. పేద, మధ్యతరగతి కుటుంబాలపై అదనపు భారం పడుతుంది. అందువల్ల ప్రభుత్వం ముందుగానే ఆహార నిల్వలను బలోపేతం చేయాలి. ఆధునిక శీతల గిడ్డంగులను విస్తరించి పంట కోత తర్వాతి నష్టాలను తగ్గించాలి. మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా దిగుమతి–ఎగుమతి విధానాలను సకాలంలో సవరించాలి. కృత్రిమ కొరత సృష్టించే అక్రమ నిల్వదారులపై కఠిన చర్యలు తీసుకోవాలి. రైతుకు గిట్టుబాటు ధర, వినియోగదారుడికి అందుబాటు ధర లభించేలా సమతుల్య విధానాలు అమలు చేయాలి. ఎల్‌నినోను ఎదుర్కోవడం ఒక్క శాఖ బాధ్యత కాదు. వ్యవసాయం, నీటిపారుదల, గ్రామీణాభివృద్ధి, విద్యుత్, ఆరోగ్యం, పర్యావరణం, విపత్తు నిర్వహణ, ఆర్థిక శాఖలు సమన్వయంతో పనిచేయాలి. దేశమంతటికీ ఒకే విధానం సరిపోదు. రాజస్థాన్‌కు అవసరమైన ప్రణాళిక కేరళకు సరిపోదు, ఈశాన్య రాష్ట్రాల అవసరాలు దక్కన్ పీఠభూమి పరిస్థితులతో పోల్చలేం. ప్రతి రాష్ట్రం తన భౌగోళిక పరిస్థితులు, నీటి లభ్యత, పంటల స్వభావాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలను రూపొందించుకోవాలి. ప్రభుత్వ చర్యలతో పాటు ప్రజల భాగస్వామ్యమూ అంతే కీలకం. పరిశ్రమలు నీటి పునర్వినియోగాన్ని తప్పనిసరి చేయాలి. విద్యుత్ పొదుపు చేసే సాంకేతికతలను ప్రోత్సహించాలి. బ్యాంకులు, బీమా సంస్థలు వాతావరణ ముప్పులను దృష్టిలో ఉంచుకుని రైతులు, చిన్న వ్యాపారులకు రక్షణ కల్పించే కొత్త పథకాలను రూపొందించాలి. విద్యాసంస్థలు విద్యార్థుల్లో నీటి సంరక్షణ, పర్యావరణ బాధ్యతను పెంపొందించాలి. ప్రతి కుటుంబం నీటి పొదుపు, విద్యుత్ ఆదా, మొక్కల పెంపకాన్ని దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలి. ఎల్‌నినోను మనం ఆపలేం. ఎందుకంటే అది ప్రకృతి వ్యవస్థలో భాగం. కానీ దాని ప్రభావాన్ని జాతీయ సంక్షోభంగా మారకుండా నిరోధించే శక్తి మన చేతుల్లోనే ఉంది. శాస్త్రీయ ఆలోచన, దూరదృష్టి గల పాలన, ప్రకృతి వనరుల వివేక వంతమైన వినియోగం, ప్రజల బాధ్యతాయుతమైన భాగస్వామ్యం కలిసి నడిస్తే ఎల్‌నినో ప్రభావాన్ని గణనీయంగా తగ్గించవచ్చు. ఎల్‌నినోను సాధారణ వాతావరణ ఘటనగా కాకుండా దేశ భవిష్యత్తుకు ప్రకృతి వినిపిస్తున్న హెచ్చరికగా

# పట్టిసీమ నీటితో డెల్టాకు కొత్త ఊపిరి

జి.సూర్యనారాయణ

రాజకీయ నేతలు ఓట్ల కోసం ఆలోచిస్తే రాజకీయ వేత్తలు ముందు చూపుతో భావితరాల కోసం ఆలోచిస్తారని నానుడి. రాజకీయ వేత్తలు దూరదృష్టితో తీసుకున్న నిర్ణయాలే భవిష్యత్తులో ప్రజలకు ఉపయుక్తంగా వుంటుందని అనటానికి పట్టిసీమ ఎత్తిపోతల పథకం ఒక ఉదాహరణగా అని చెప్పవచ్చు. నవ్యాంధ్రప్రదేశ్ ఏర్పడిన తర్వాత నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయ్యారు. ఆర్థిక లోటుతో పాటు నీటి సమస్యలు తీవ్రంగా ఉన్నాయి. పోలవరం బహుళార్థక సాధక ప్రాజెక్టు నిర్మాణం పూర్తి కావటానికి చాలా సంవత్సరాలు పడుతుంది. కృష్ణానదికి ఎగువన కర్ణాటక, తెలంగాణలో నిర్మించిన ప్రాజెక్టుల వల్ల ప్రకాశం బ్యారేజీకి రానురాను నీటి ప్రవాహం తగ్గిపోతోంది. ఈ నేపథ్యంలో కృష్ణాడెల్టాలోని 13లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీటిని, లక్షల ప్రజలకు తాగు నీటిని ఇచ్చి కాపాడేందుకు నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టితో దక్షి ణ భారతంలోతొలిగా నదుల అనుసంధానికి శ్రీకారం చుట్టారు. గోదావరి జిల్లా లోని పట్టిసీమ గ్రామంలో గోదావరి నదీ వద్ద పట్టిసీమ ఎత్తిపోతల పథకాన్ని యుద్ధ ప్రాతిపదికన నిర్మించేందుకు రాష్ట్ర బడ్జెట్‌లో రూ. 1600 వందల కోట్లను కేటాయిం చారు. అప్పటి ప్రతిపక్షనేత ఇది పట్టిసీమ కాదు, వట్టిసీమ అని రాష్ట్ర అసెంబ్లీలో నానా రగడ చేశారు. ఈ పథకాన్ని మా పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని ఖరాకండీగా ప్రకటిం చారు. ఈ ప్రాజెక్టు



కాంట్రాక్టర్ల జేబులు నింపటానికేనని ఆయన తీవ్రంగా విమర్శించారు. ఎన్ని విమర్శలు చేసినా చంద్రబాబు పంతం పట్టి ఒక్క ఏడాదిలోనే పట్టి సీమ పథకం నిర్మాణం చేశారు. పోలవరం కుడి కాలువలో మిగిలిన వందల కిలో మీటర్ల ప్రాంతాన్ని తవ్వి ఇబ్రహీం పట్నం వద్ద కృష్ణానదిలో అనుసంధానం చేశారు. గోదావరికి వరద వచ్చే సమయంలో 24 పంపులతో రోజుకీ 8వేలు పైగా క్యూసెక్కులు నీటిని ఇది ఎత్తిపోస్తుంది. కృష్ణానదికి వరద ప్రవాహం లేని రోజులలో పట్టిసీమ నీటిని తోడి కృష్ణా డెల్టాలోని 13 లక్షల ఎకరాల ఆయకట్టుకు జీవం పోస్తుంది. రైతులకు, ప్రజలకు ఉభయతారకంగా నిలిచింది. నేడు ఎల్‌నిన్ ప్రభావంతో నైరుతీ రుతుపవనాలు వచ్చినా నేటికీ పూర్తిస్థాయిలో వర్షాలు కురవలేదు. ఈనేపథ్యంలో కృష్ణా నదిలో నీటి ప్రవాహం లేదు. వరదలురాలేదు. ఈ నేప థ్యంలో పట్టి సీమ నీరే కృష్ణాడెల్టాలోని లక్షలాది ఎకరాల భూములకు, లక్షల ప్రజల తాగునీరుకు నేడు శరణ్యమైంది. ఎల్‌నిన్ ప్రభావంతో ఉమ్మడి కృష్ణాజిల్లాలలో ఇప్పటికీ సరైన వర్షపాతం లేదు. ఈ తరుణంలో పట్టిసీమ పథకం లేకపోతే సాగు సరే తాగునీటికి ప్రజలు అల్లాడిపోయేవారు. ముందుచూపుతో, దార్శనికతతో పట్టిసీమను నిర్మించిన ముఖ్యమంత్రి చంద్రబాబును రైతులు, ప్రజలు ప్రత్యేకంగా అభినందిస్తున్నారు. పట్టిసీమను వ్యతిరేకించిన వారి నిర్ణయాలను జనం తూర్పార పడుతున్నారు. ప్రతి పథకాన్ని గుడ్డిగా విమర్శించటం అవివేకం. అవినీతి జరిగితే ప్రభుత్వాన్ని నిలదీయవచ్చు. విపక్షాలు ప్రతిదాన్ని విమర్శించటం వల్ల ప్రజలలో చులకనై నవ్వులు పాలవ్వ

# సముద్ర సంరక్షణే ఆర్థికాభివృద్ధికి మూలం

డి. జయరాం

మన దేశం మూడు వైపులా సముద్రాలను ఆనుకుని ఉన్న దేశం. అయినప్పటికీ మన అభివృద్ధి చర్చల్లో సముద్రాలకు తగిన స్థానం దక్కలేదు. వ్యవసాయం, పరిశ్రమలు, రహదారులు, నగరాల గురించి ఎంతమాట్లాడామో, సముద్రాల గురించి అంతగా ఆలోచించలేదు. కానీప్రపంచం ఇప్పుడు మరో వాస్తవాన్ని గుర్తిస్తోంది. భూమిపై అవకాశాలు కుదుస్తున్న కొద్దీ భవిష్యత్తు విస్తరిస్తున్నది సముద్రాల్లోనే. సముద్రాలు కేవలం నీటి విస్తీర్ణాలు కావు. అవి వాణిజ్య మార్గాలు. ఆహార వనరులు, ఉపాధి ఆధారాలు, వ్యూహాత్మక ఆస్తులు, భారత విదేశీ వాణిజ్యంలో పరిమాణం పరంగా దాదాపు 95 శాతం, విలువ పరంగా సుమారు 70 శాతం సరకు రవాణా సముద్ర మార్గాల ద్వారానే సాగుతోంది. దేశానికి రెండు మిలియన్ చదరపు కిలోమీటర్లకు పైగా ప్రత్యేక ఆర్థిక మండలం, 7,500 కిలోమీటర్లకు పైగా తీర రేఖ ఉన్నాయి. మత్స్యరంగం నుంచి ఇంధన భద్రతవరకు, ఓడరేవుల నుంచి అంతర్జాతీయ వాణిజ్యం వరకు అనేక రంగాలు సముద్రాలపై ఆధారపడి ఉన్నాయి. అందుకే సముద్రాల ఆరోగ్యం దెబ్బతింటే నష్టపోయేది పర్యావరణం మాత్రమే కాదు. ఆర్థిక వ్యవస్థ కూడా. ప్రపంచం నేడు సముద్రాలను కాపాడాలని మాట్లాడటానికి కారణం వాటిపై పెరుగుతున్న ఒత్తిడే. అధిక మత్స్యవేట, ప్లాస్టిక్ కాలుష్యం, వాతావరణ మార్పులు సముద్ర జీవవైవిధ్యాన్ని క్రమంగా క్షీ ణింపజేస్తున్నాయి. సముద్ర ఉష్ణోగ్రతలు పెరుగుతున్నా యి. పగడపు దిబ్బలు తెల్లబడుతున్నాయి. అనేక చేపల జాతులు ఒత్తిడికి గురవుతున్నాయి. ఒకప్పుడు అంతులేని వనరులుగా కనిపించిన సముద్రాలు కూడా పరిమిత సామర్థ్యం కలిగిన పర్యావరణ వ్యవస్థలేనని ప్రపంచం ఆలస్యంగా గ్రహిస్తోంది. ఈ క్షీ ణత సముద్రాల్లోనేఆగిపోదు. దాని ప్రభావం ఆహార భద్రతపై పడుతుంది. ఉపాధిపై పడుతుంది. వాణిజ్యంపై పడుతుంది. చివరికి వాతావరణ స్థిరత్వంపైనా పడుతుంది. భారత్ కూడా ఈ సవాళ్లకు అతీతం కాదు. తీరప్రాంతాల్లో వేగంగా పెరుగుతున్న నగరీకరణ, పారిశ్రామిక వ్యర్థాలు, ప్లాస్టిక్ కాలుష్యం, మడ అడవుల క్షీ ణత, కొన్ని ప్రాంతాల్లో అధిక మత్స్య వేట ఇప్పటికే హెచ్చరికలు జారీ చేస్తున్నాయి. మరోవైపు వాతా వరణ మార్పుల కారణంగా సముద్ర మట్టం పెరుగుతోంది. తుఫానుల తీవ్రత అధికమవుతోంది. తీరప్రాంత ప్రజల జీవన విధానాలు ఒత్తిడికి గురవుతున్నాయి. ఒకప్పుడు ప్రకృతి వైపరీత్యాలుగా కనిపించిన అనేక సంఘటనలు ఇప్పుడు వాతావరణ సంక్షోభం తీవ్రతను గుర్తుచేస్తున్నాయి. అందుకే సముద్ర సంరక్షణను ఖర్చుగా కాదు, భవిష్యత్తుపై పెట్టుబడిగా చూడాల్సిన అవసరం ఉంది. సముద్రాలను కాపాడాలా? మత్స్యకారుల జీవనోపాధిని కాపాడాలా? అనే ప్రశ్నతరచూ వినిపిస్తుంది. కానీ ఈ రెండింటి మధ్యవిరోధం లేదు. సముద్ర జీవవైవిధ్యం క్షీ ణిస్తే మొదట దెబ్బతినేది మత్స్యకారుడే. చేపల నిల్వలు తగ్గితే ఆదాయంతగ్గుతుంది. పర్యావరణ వ్యవస్థ బలహీనపడితే



జీవనోపాధి అస్థిరమవు తుంది. అందుకే సముద్ర సంరక్షణ మత్స్యకారులకు వ్యతి రేకమైన విధానం కాదు, వారి భవిష్యత్తుకు రక్షణ కవచం. సముద్రాలను కాపాడటం అంటే మత్స్యకారుడి రేపటిని కాపాడటమే. ఈ వాస్తవాన్ని భారత మత్స్యరంగగణాంకాలే స్పష్టం చేస్తున్నాయి. ప్రపంచ చేపల ఉత్పత్తిలో భారత్ దాదాపు 8శాతం వాటా కలిగి ఉంది. ఈరంగం ప్రత్యక్షంగా సుమారు 58 లక్షల మందికి ఉపాధి కల్పిస్తోంది. ప్రత్యక్షం గా, పరోక్షంగా దాదాపు మూడు కోట్ల మంది జీవనోపాధి దీనిపైనే ఆధారపడి ఉంది. 2023–24లో చేపలు, మత్స్య ఉత్పత్తుల ఎగుమతుల ద్వారా రూ.60 వేల కోట్లకు పైగా విదేశీ మారకద్రవ్యం లభించింది. ఈ సంఖ్యలు ఒక విష యాన్ని స్పష్టంగా చెబుతున్నాయి. సముద్రాల సంరక్షణ పర్యావరణ లక్ష్యం మాత్రమే కాదు. ఉపాధి, ఆదాయం, ఎగుమతులు, ఆహార భద్రతకు సంబంధించిన ఆర్థిక అవసరం కూడా. ఇదే నేపథ్యంలో ప్రపంచం మెరైన్ ప్రొటెక్టెడ్ ఏరియాస్ గురించి మాట్లాడుతోంది. సముద్రంలోని కొన్ని ప్రాంతాలను ప్రత్యేక రక్షణ కింద ఉంచి జీవవైవిధ్య పునరుద్ధరణకు అవకాశం కల్పించాలన్నదే దీని ఉద్దేశం. దీనిని కొందరు అభివృద్ధికి అడ్డంకిగా చూస్తారు. కానీ అసలు ప్రశ్న వేరే. నేడు కొంత నియంత్రణ విధించకపోతే రేపు సంరక్షి ంచడానికి ఏమి మిగులుతుంది? ప్రకృతి వనరులవిషయంలో ప్రపంచం చేసిన తప్పులను సముద్రాల విషయంలో పునరావృతం చేయకూడదన్న ఆలోచనే ఈ విధానాలకుపునాది. అయితే ప్రపంచ లక్ష్యాలను యథాతథంగా అనుసరించడం భారత్‌కు సాధ్యం కాదు. 2030నాటికి భూమి, జలవనరు లు, సముద్రాల్లో 30శాతం ప్రాంతాలను రక్షి త మండలాలు గా మార్చాలనే లక్ష్యం వెనుక ఉన్న ఉద్దేశం సమర్థనీయమే. కానీ అభివృద్ధి చెందుతున్న దేశాల సామాజిక, ఆర్థిక వాస్త వాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి. సంరక్షణ పేరు తో స్థానిక సమాజాలను దూరం చేయడం కాదు. వారిని భాగస్వాములను చేయడం ముఖ్యం. సముద్రాలను కాపాడే పోరాటం మత్స్యకారులతో కలిసి సాగాలి తప్ప, వారిపై సాగకూడదు. ఈ చర్చలో తరచూ వినిపించే మరో పదం బ్లూ ఎకానమీ. దీనిని చాలామంది సముద్ర ఆర్థిక వ్యవస్థగా మాత్రమే అర్థం చేసుకుంటారు. కానీ దీని పరిధి మరింత విస్తృతమైనది. సముద్ర రవాణా, ఓడరేవులు, మత్స్యరంగం, తీర పర్యాటకం, సముద్ర జీవసాంకేతిక రంగాలు, సముద్ర గర్భ ఖనిజాలు, సముద్ర ఆధారిత పునరుత్పాదక ఇంధనం, లోతట్టు సముద్ర పరిశోధనలాంటివి ఇందులో భాగమే. సంక్షి ప్తంగా చెప్పాలంటే భవిష్యత్తు ఆర్థికవృద్ధికి సముద్రాల ను కొత్త సరిహద్దులుగా మార్చే అభివృద్ధి నమూనానే బ్లూ ఎకానమీ. భారత్ ఇప్పటికే ఆ దిశగా అడుగులు వేస్తోంది. సాగర్‌మాల, డీప్ ఓషన్ మిషన్ వంటి కార్యక్రమాలు అందు కు నిదర్శనం. ప్రత్యేక ఆర్థిక మండలంలో అపార మత్స్య సంపద ఉంది. సముద్రగర్భంలో విలువైన ఖనిజాలున్నా యి. సముద్ర ఆధారిత ఇంధన రంగంలో కొత్త అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే ఒక విషయం మాత్రం స్పష్టం. ఆరోగ్యకరమైన సముద్రాలు లేకుండా బ్లూఎకానమీ కేవలం నినాదంగానే మిగులుతుంది. సముద్ర పర్యావరణ వ్యవస్థలు క్షీ ణిస్తే ఈ అవకాశాలన్నీ కాగితాలకే పరిమితమవుతాయి. అందుకే సముద్ర సంరక్షణ, ఆర్థికాభివృద్ధి

4-9Pg5.qxd:4-9Pg5.qxd 1/1/02 6:17 AM Page 1






# ట్రంప్‌కు మరో షాక్!

## జన్మతః పౌరసత్వం రద్దు ఉత్తర్వులను నిలిపివేసిన ఫెడరల్ కోర్టు

**వాషింగ్టన్, సెప్టెంబరు 3:** అమెరికా గడ్డపై అడుగుపెట్టి బిడ్డకు జన్మనిస్తే చాలు.. ఆ బిడ్డకు ఆటోమేటిక్‌గా అమెరికా పౌరసత్వం వచ్చేస్తుంది! పదేపదే ఈ విధానంపై విరుచుకుపడే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ఆ దేశ న్యాయస్థానం మరోసారి గట్టి షాక్ ఇచ్చింది. పుట్టుకతో వచ్చే పౌరసత్వాన్ని రద్దు చేస్తూ ఆయన తీసుకొచ్చిన కొత్త ఉత్తర్వుల అమలును ఫెడరల్ కోర్టు గురువారం నిలిపివేసింది. సుప్రీంకోర్టు ఇప్పటికే ఒకసారి ఈ ప్రయత్నాన్ని తిరస్కరించినా, వెనక్కి తగ్గకుండా ట్రంప్ మరో రూపంలో తీసుకొచ్చిన ఉత్తర్వులకు మేరీల్యాండ్ ఫెడరల్ జడ్జ్ డెబోరా బోర్డ్‌మాన్ బ్రేకులు వేశారు. అమెరికా పౌరులు లేదా గ్రీన్‌కార్డు హోల్డర్లు కాని విదేశీయులకు పుట్టే పిల్లలకు పౌరసత్వాన్ని ట్రంప్ గతంలోనే ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ ఇచ్చారు. అయితే జూన్ 30న అమెరికా సుప్రీంకోర్టు ఆ ఉత్తర్వును తీవ్రంగా తప్పుపట్టింది. అమెరికా రాజ్యాంగంలోని 14వ సవరణలో ఉన్న పౌరసత్వ నిబంధనలకు ఇది పూర్తిగా విరుద్ధమని స్పష్టం చేసింది. అమెరికా భూభాగంలో జన్మించిన ప్రతి ఒక్కరికీ చట్టబద్ధంగా పౌరసత్వం లభిస్తుందని తేల్చిచెప్పడంతో ట్రంప్ తొలి ప్రయత్నం దారుణంగా విఫలమైంది.

**మళ్లీ పంతానికి పోయిన ట్రంప్.. 'బర్త్ టూరిజం'పై గురి**

సుప్రీంకోర్టు షాక్ ఇచ్చినప్పటికీ ట్రంప్ తన పంతాన్ని వీడలేదు. కొందరు మహిళలు కేవలం తమ పిల్లలకు అమెరికా పౌరసత్వం దక్కాలనే ఉద్దేశంతోనే ప్రసవ సమయానికి వీసాలపై ఇక్కడికి వస్తున్నారని, దీనినే 'బర్త్ టూరిజం' అంటారని ఆరోపిస్తూ గత నెల 6న మరొక కొత్త ఆదేశంపై సంతకం చేశారు. విదేశీ ప్రభుత్వ ఉద్యోగులు, మోసపూరిత మార్గాల్లో లేదా వ్యాపారాల ద్వారా పౌరసత్వం పొందాలని చూసేవారి పిల్లలకు, అలాగే 'శత్రు దేశాల పౌరులు'గా వర్గీకరించిన వారి పిల్లలకు పౌరసత్వాన్ని నిరాకరించేలా ఆయన అందులో కఠిన నిబంధనలు చేర్చారు.

**న్యాయస్థానాన్ని ఆశ్రయించిన హక్కుల సంఘాలు**

ట్రంప్ కొత్త ఆర్డర్ వెలువడగానే వలసదారుల హక్కుల కోసం పోరాడే 'కాసా' (సిఎఎస్‌ఎ), 'అసైలమ్ సీకర్ అడ్వకేసీ ప్రాజెక్ట్' వంటి సంస్థలు తక్షణమే కోర్టు తలుపులు తట్టాయి. 'పౌరసత్వ హక్కు కోల్పోయే ప్రమాదంలో పడిన చిన్నారుల తరఫున క్లాస్-యాక్షన్ పిటిషన్ దాఖలు చేశాయి'. ట్రంప్ తీసుకొచ్చిన ఈ 'న భూతో న భవిష్యత్' తరహా ఆదేశాలను తక్షణమే నిలిపివేసి, పిల్లల హక్కులను కాపాడాలని జడ్జి డెబోరా బోర్డ్‌మన్‌ను కోరాయి. బాధితుల వాదనలతో ఏకీభవించిన న్యాయమూర్తి, ట్రంప్ సర్కార్ నిర్ణయంపై స్టే విధిస్తూ ప్రాథమిక ఇంజక్షన్ ఆర్డర్ జారీ చేశారు.

# డ్రైవింగ్ లైసెన్స్ జారీలో కొత్త మార్పులు!

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 3:** డ్రైవింగ్ చేసే వారికి కేంద్రం కీలక మార్పులు తీసుకొచ్చేందుకు సిద్ధమవుతోంది. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారికి లైసెన్స్‌పై పాయింట్లు తగ్గించే విధానం తీసుకురావాలని ప్రభుత్వం యోచిస్తోంది. నిబంధనలు పదేపదే ఉల్లంఘిస్తే లైసెన్స్ సస్పెండ్ లేదా రద్దు చేసే అవకాశం ఉంటుంది. అదే సమయంలో సురక్షితంగా వాహనం నడిపే వారికి గుడ్ పాయింట్లు ఇచ్చి ప్రోత్సాహకాలు అందించనున్నారు. కేంద్ర రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ గురువారం 66వ సియామ్ వార్షిక సమావేశంలో ఈ విషయాలు వెల్లడించారు. ప్రతిపాదిత విధానంలో ప్రతి ట్రాఫిక్ ఉల్లంఘనకు డ్రైవింగ్ లైసెన్స్‌పై పాయింట్లు తగ్గుతాయని చెప్పారు. నిర్ణయించిన పరిమితి దాటితే లైసెన్స్‌ను ముందుగా సస్పెండ్ చేసి, ఆ తర్వాత రద్దు చేసే అవకాశం ఉంటుందని తెలిపారు. మంచి పాయింట్లు సాధించే డ్రైవర్లకు బీమా సంస్థల నుంచి ప్రత్యేక ప్రయోజనాలు కల్పించే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నట్లు గడ్కరీ చెప్పారు. వాహన రిజిస్ట్రేషన్‌కు కూడా ఇదే తరహా పాయింట్ల విధానాన్ని తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు. దేశంలో రోడ్డు ప్రమాదాల పరిస్థితి చాలా తీవ్రంగా ఉందని గడ్కరీ ఆందోళన వ్యక్తం చేశారు. 2024లో బస్సు ప్రమాదాల్లో 3,855 మంది ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. ద్విచక్ర వాహన ప్రమాదాల్లో 81,780 మంది మరణించారని చెప్పారు. సీటు బెల్ట్ పెట్టుకోకపోవడం వల్ల 14,466 మరణాలు నమోదయ్యాయని, హిట్ అండ్ రన్ ఘటనల్లో 34,030 మంది చనిపోయారని వివరించారు. రాంగ్ సైడ్ డ్రైవింగ్, మద్యం తాగి వాహనం నడపడం, డ్రైవింగ్ సమయంలో ఫోన్ వాడటం ప్రమాదాలకు ప్రధాన కారణాలుగా ఉన్నాయన్నారు.

# భారత్, బెల్జియం వాణిజ్యం ఐదేళ్లలో రెట్టింపు

## - ఢిల్లీలో ప్రధాని మోడీతో బెల్జియం ప్రధాని బార్ట్ డి వెవర్ భేటీ - భాగస్వామ్యం బలోపేతానికి అధినేతల అంగీకారం - రక్షణ, వాణిజ్యంలో ద్వైపాక్షిక ఒప్పందాలు

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 3:** ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, బెల్జియం ప్రధాని బార్ట్ డి వెవర్ గురువారం న్యూఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో నిర్వహించిన ద్వైపాక్షిక చర్చల సందర్భంగా తమ దేశాల మధ్య ఉన్న సమగ్ర సంబంధాలను సమీక్షించారు. రక్షణ, వాణిజ్యం, పెట్టుబడులు, ఆవిష్కరణలు, సెమీకండక్టర్లు, ఫిన్‌టెక్, కీలక ఖనిజాలు, ప్రజల మధ్య సంబంధాలు, విద్యాపరిశోధన సహకారం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ ఇద్దరు నేతలు చర్చలు జరిపారు. పరస్పర ఆసక్తి ఉన్న ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై అభిప్రాయాలను పంచుకోవడంతో పాటు, భారత్–బెల్జియం మధ్య ఉన్న సన్నిహిత, బహుముఖ భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడానికి తాము కట్టుబడి ఉన్నామని వారు పునరుద్ఘాటించారు. ఈ విషయాన్ని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ 'ఎక్స్' వేదికగా వెల్లడించింది. ఇరుదేశాల ప్రధానమంత్రుల సమక్షంలో రక్షణ, పునరుత్పాదక ఇంధనం, నేరాల నియంత్రణ, దౌత్యపరమైన శిక్షణ వంటి రంగాలలో రెండు దేశాల మధ్య కుదిరిన అవగాహన ఒప్పందాలు కుదిరాయి. రాబోయే ఐదేళ్లలో ద్వైపాక్షిక వాణిజ్యాన్ని రెట్టింపు చేయడంతో పాటు, ఒక వ్యాపార వేదిక, పెట్టుబడుల వేదిక, కాన్సులర్ చర్చల యంత్రాంగాన్ని ఏర్పాటు చేయడానికి ఇరు పక్షాలు అంగీకరించినట్లు విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ సమావేశంలో జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, ప్రధాని ముఖ్య కార్యదర్శి పికె మిశ్రా, విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ కార్యదర్శి (పశ్చిమ) సిబి జార్జ్, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంయుక్త మీడియా సమావేశంలో ప్రధాని మోడీ మాట్లాడుతూ, గత త్రైమాసికంలో భారత్ 7.8 శాతం వృద్ధి రేటును నమోదు చేసిందని తెలిపారు. ప్రస్తుత సవాళ్లతో కూడిన ప్రపంచంలో ఈ పురోగతి ప్రపంచ దేశాలకు ఎంతో ఆత్మవిశ్వాసాన్ని, నూతన అవకాశాలను సృష్టిస్తోందని మోడీ పేర్కొన్నారు. భారత్– బెల్జియం ద్వైపాక్షిక సహకారం సంప్రదాయ రంగాలకే పరిమితం కాకుండా రక్షణ వంటి కీలక రంగాలకూ విస్తరించిందని మోడీ అన్నారు. ఆధునిక రక్షణ పరికరాల తయారీలో ఇరు దేశాలు కలిసి పనిచేస్తున్నాయని, జొరావర్ ట్యాంక్ వంటి వ్యవస్థల విషయంలోనూ సహకారం కొనసాగుతోందని తెలిపారు. ప్రపంచం ప్రస్తుతం తీవ్ర పరిణామాలు, అనిశ్చితితో కూడిన పరిస్థితులను ఎదుర్కొంటోందని పేర్కొన్నారు. ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో ఘర్షణలు కొనసాగుతున్నాయని, ఆహారం, ఇంధనం, సరఫరా వ్యవస్థల నుంచి దాదాపు ప్రతి రంగంపైనా అనిశ్చితి ప్రభావం చూపుతోందన్నారు. ఇలాంటి సవాళ్ల మధ్యనూ భారత ఆర్థిక వ్యవస్థ తన వేగాన్ని కొనసాగిస్తోందని చెప్పారు. భారత్, బెల్జియం దేశాలు సంభాషణ, దౌత్యంపై విశ్వాసం ఉంచుతున్నాయని ప్రధాని చెప్పారు. ఉక్రెయిన్ అయినా, పశ్చిమాసియా అయినా, అక్కడ కొనసాగుతున్న ఘర్షణలకు వీలైనంత త్వరగా ముగింపు పలికేందుకు చేపట్టే అన్ని ప్రయత్నాలకు భారత్ మద్దతు ఇస్తుందని స్పష్టం చేశారు. స్వచ్ఛమైన ఇంధన భవిష్యత్తు, విశ్వసనీయమైన సరఫరా వ్యవస్థలు భారత్, బెల్జియం ఉమ్మడి ప్రాధాన్యతలుగా ఉన్నాయని తెలిపారు. సెమీకండక్టర్ రంగంలో బెల్జియంకు ఉన్న సాంకేతిక నైపుణ్యం, భారత్ వద్ద ఉన్న విస్తృత స్థాయి సామర్థ్యాలు పరస్పరపూరకంగా ఉంటాయని పేర్కొన్నారు. ఈ రంగంలో ఇరు దేశాల సహకారానికి మంచి అవకాశాలు ఉన్నాయని చెప్పారు.





# మెరుగైన టారిఫ్ రేటు ఇస్తేనే బిటిఎ

## వివరాలు వెల్లడిస్తాం: కేంద్రమంత్రి పీయూష్ గోయల్ వెల్లడి

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 3:** అమెరికా పోటీ దేశాలకు అందిస్తున్న టారిఫ్ రేట్ల కంటే భారతీయ వస్తువులకు మెరుగైన సుంక రాయితీలు కల్పించిన తర్వాతే అమెరికాతో కుదుర్చుకోనున్న ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం వివరాలను వెల్లడిస్తామని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ గురువారం తెలిపారు. భారత్ ఇప్పటికే తొమ్మిది స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు (ఎఫ్‌టీఏలు) అమలు చేస్తోందని గోయల్ చెప్పారు. ఈ ఒప్పందాల పరిధిలో ఉన్న దేశాల సంయుక్త స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) సుమారు 60 ట్రిలియన్ డాలర్లుగా ఉందని తెలిపారు. వీటి ద్వారా ఇప్పటికే ప్రపంచ వాణిజ్యంలో దాదాపు మూడింట రెండొంతుల భాగానికి భారత్‌కు ప్రాధాన్య మార్కెట్ లభిస్తోందన్నారు. కెనడా, మెక్సికో, చిలీ, మెర్కోసూర్, ఎస్ఏసీయూ, జీసీసీ, ఇజ్రాయెల్ తదితర దేశాలు, వాణిజ్య కూటములతో భారత్ త్వరలో వాణిజ్య ఒప్పందాలను కుదుర్చుకునే ప్రయత్నాలు చేస్తోందని గోయల్ వెల్లడించారు. అలాగే ఆసియాన్, దక్షిణ కొరియా, జపాన్‌తో ఇప్పటికే ఉన్న వాణిజ్య ఒప్పందాలను సమీక్షించే ప్రక్రియ కూడా కొనసాగుతోందన్నారు. ఈ చర్యల ద్వారా భవిష్యత్తులో ప్రపంచ వాణిజ్యంలో సుమారు 75 శాతం భాగానికి పోటీ దేశాల కంటే తక్కువ టారిఫ్ రేట్లతో భారత్‌కు మార్కెట్ ప్రాప్యత లభించే అవకాశం ఉందని వివరించారు. ఇప్పటికే బ్రిటన్, మారిషస్, ఒమన్, యూఏఈ, ఆస్ట్రేలియాలతో భారత్ వాణిజ్య ఒప్పందాలను అమలు చేస్తోంది.

న్యూజిలాండ్‌తో కుదిరిన వాణిజ్య ఒప్పందం త్వరలో అమల్లోకి వస్తుంది. ఆ తర్వాత 27 దేశాల యూరోపియన్ యూనియన్‌తో కుదిరిన ఎఫ్‌టీఏ కూడా అమల్లోకి వస్తుంది. అమెరికా మన పోటీ దేశాలతో పోలిస్తే భారతీయ వస్తువులకు ప్రాధాన్య టారిఫ్ రేటును అందించగలిగిన వెంటనే బీటీఏను ఖరారు చేసి తుది వివరాలను ప్రకటిస్తాం" అని వాణిజ్య మంత్రిత్వ శాఖ నిర్వహించిన ఎఫ్‌టీఏలపై వర్క్‌షాప్‌లో గోయల్ తెలిపారు. అమెరికా టారిఫ్‌లతో మళ్లీ చర్చలుభారత్, అమెరికా గత ఫిబ్రవరిలో వాణిజ్య ఒప్పందం తొలి దశకు సంబంధించిన చట్రాన్ని ఖరారు చేసినట్లు ప్రకటించాయి. అయితే అమెరికా టారిఫ్‌లలో మార్పులు రావడంతో ఇరు దేశాల మధ్య చర్చలు మళ్లీ కొనసాగుతున్నాయి. జూలై 24 నుంచి భారత్ సహా పలు దేశాలపై అమెరికా అదనంగా 10 శాతం టారిఫ్‌ను విధించింది.

దీంతో భారత్‌అమెరికా వాణిజ్య చర్చల్లో టారిఫ్ రేట్లు కీలక అంశంగా మారాయి. జీ20 వాణిజ్య మంత్రుల సమావేశం కోసం సెప్టెంబర్ చివర్లో గోయల్ అమెరికాలోని మిల్వాకీ నగరాన్ని సందర్శించే అవకాశం ఉంది. అక్కడ అమెరికా వాణిజ్య ప్రతినిధి జేమీసన్ గ్రీర్‌తో ఆయన ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారు. ఈ సమావేశాల్లో భారత్‌అమెరికా వాణిజ్య చర్చలు ప్రధాన అంశాల్లో ఒకటిగా ఉండే అవకాశం ఉంది. రెండు రోజుల పాటు జరిగే జీ20 వాణిజ్య మంత్రుల సమావేశం సెప్టెంబర్ 30న ప్రారంభం కానుంది. 2026లో జీ20 అధ్యక్ష బాధ్యతలను అమెరికా నిర్వహిస్తోంది. పోటీ దేశాల కంటే టారిఫ్ ప్రయోజనం అవసరంఅమెరికా మార్కెట్‌లో భారత్ శ్రీలంక, బంగ్లాదేశ్, థాయ్‌లాండ్, కంబోడియా, వియత్నాం, ఇండోనేషియా, మలేషియా వంటి దేశాలతో పోటీపడుతోందని గోయల్ తెలిపారు. ఈ దేశాలతో పోలిస్తే భారతీయ వస్తువులకు టారిఫ్ ప్రయోజనం లభిస్తే అమెరికా మార్కెట్‌లో అవి మరింత పోటీ సామర్థ్యాన్ని సాధిస్తాయని చెప్పారు. గత ఆర్థిక సంవత్సరంలో భారత్ అమెరికాకు సుమారు 87 బిలియన్ డాలర్ల విలువైన వస్తువులను ఎగుమతి చేసింది.



## న్యాయవిద్యార్థులపై చర్యలు తీసుకునే అధికారం

# నల్సార్ వర్సిటీదే!

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 3:** లా విద్యార్థులపై చర్యలు తీసుకునే చట్టబద్ధమైన అధికారం బీసీఐ (బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా)కు లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. వారు విద్యార్థులు అని, వారంతా సంబంధిత యూనివర్సిటీలు, విద్యా సంస్థల పరిధిలోని వస్తారని వెల్లడించింది. ఇటీవల నల్సార్ లా యూనివర్సిటీ విద్యార్థుల అంశంలో చెలరేగిన వివాదంపై విచారణ సందర్భంగా కోర్టు తాజా సూచనలు చేసింది. హైదారాబాద్‌లోని నల్సార్ యూనివర్సిటీలో 2026 లా గ్రాడ్యుయేట్ విద్యార్థుల స్నాతకోత్సవం జరగాల్సి ఉంది. దీనికి సీజేఐ సూర్యకాంత్‌ను ముఖ్య అతిథిగా ఆహ్వానించింది. అయితే, ఆయనను చీఫ్ గెస్టుగా రావడాన్ని విద్యార్థులు వ్యతిరేకించారు. దీంతో కార్యక్రమం రద్దైంది. ఆ తర్వాత బెంగళూరు లా విద్యార్థులు కూడా ఇలాగే చేశారు. అయితే, నల్సార్ విద్యార్థుల వైఖరిపై బీసీఐ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ విద్యార్థుల్ని ఎన్‌రోల్ చేయకూడదని లాయర్లకు ఆదేశాలు జారీ చేసింది. దీనిపై విద్యార్థులు, న్యాయ కోవిదుల నుంచి వ్యతిరేకత రావడంతో వెంటనే ఆ నిర్ణయాన్ని బీసీఐ వెనక్కు తీసుకుంది. అయితే, సీజేఐ రాకను అడ్డుకున్న లా విద్యార్థులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్‌పై తాజాగా విచారణ జరిగింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి, జస్టిస్ వి మోహన ఆధ్వర్యంలోని బెంచ్ విచారణ జరిపింది. విద్యార్థులపై చర్యలు తీసుకునే చట్టబద్ధమైన హక్కు బీసీఐకి లేదా రాష్ట్ర బార్ కౌన్సిల్స్‌కు లేదని వివరించింది. వారు విద్యార్థులు అని, వారిపై చర్యలు తీసుకునే హక్కు సంబంధిత యూనివర్సిటీలకే ఉంటుందని పేర్కొంది. ఒకవేళ వారు అడ్వకేట్లుగా ఎన్‌రోల్ అయితే, అప్పుడు వారిపై చర్యలు తీసుకునేందుకు బీసీఐకి హక్కు ఉంటుందని వెల్లడించింది.

# కేజ్రీవాల్ బి టీమ్‌గా మారిన సిజెపి!

## కాక్రోచ్ జనతాపార్టీ డెమొక్రటిక్ కొత్త పార్టీ ఆవిర్భావం..




**న్యూఢిల్లీ, సెప్టెంబరు 3:** నీట్ పేపర్ లీక్, విద్యార్థుల సమస్యలు కేంద్రంగా కాక్రోచ్ జనతా పార్టీ ఏర్పాటైంది. జంతర్ మంతర్ వద్ద ఉద్యమం చేసి ఏకంగా విద్యాశాఖ మంత్రిగా ఉన్న ధర్మేంద్ర ప్రధాన్‌తో రాజీనామా చేయించేలా చేసిన కాక్రోచ్ పార్టీలో విభేదాలు వచ్చాయి. సీజేపీపై ఆరోపణలు చేస్తూ మనీష్ బ్రహ్మభట్ కాక్రోచ్ జనతా పార్టీడెమొక్రటిక్ పేరుతో కొత్త వర్గాన్ని ఏర్పాటు చేశారు. కొత్త జాతీయ టీమ్‌లో ప్రతీ రాష్ట్రం నుంచి ఐదుగురు చొప్పున వాలంటీర్లు, నిరసనకారుల్ని చేర్చాలని తాము సూచించామని, కానీ సీజేపీ ఏకపక్షంగా వ్యవహరించిందని చెప్పారు. సీజేపీడెమొక్రటిక్ పారదర్శకత, జవాబుదారీతనం, ప్రజాస్వామ్య నిర్ణయ ప్రక్రియకు ప్రాధాన్యం ఇస్తుందని బ్రహ్మభట్ చెప్పారు. జంతర్ మంతర్ ఉద్యమం సక్సెస్ అయిన తర్వాత సీజేపీ అమ్ముడుపోయిందని, రాజకీయంగా మారిందని బ్రహ్మభట్ ఆరోపించారు. ప్రస్తుతం అది టీమ్ కేజ్రీవాల్‌గా మారిందని దుయ్యబట్టారు. సీజేపీడెమొక్రటిక్ ఏర్పాటుకు, ఇటీవల సీజేపీ ప్రకటించిన కొత్త టీమ్ ఎంపిక కారణమని ఆయన చెప్పారు. కొత్త కమిటీ ఏర్పాటు చేసే సమయంలో ఒక్క వాలంటీర్‌ను కూడా సంప్రదించలేదని ఆరోపించారు. సీజేపీ కొత్త టీమ్‌లో 12 మందిలో 8 మంది ఆమ్ ఆద్మీ పార్టీ తో సంబంధం ఉన్న వారిని చేర్చారని ఆరోపించారు.

సీజేపీ టీమ్ కేజ్రీవాల్‌గా మారిందని దుయ్యబట్టారు. 8 మందితో పాటు ఒక మహిళా స్నేహితురాలిని, కాలేజీ స్నేహితుడిని కూడా టీమ్‌లో చేర్చారని ఆరోపించారు. కేజ్రీవాల్ ఆదేశాల మేరకే సీజేపీ పనిచేస్తోందని సంచలన వ్యాఖ్యలు చేశారు. సీజేపీ టీమ్‌లో అధికార ప్రతినిధి తప్పా మరే మహిళ లేదని, ముస్లింలు, సిక్కుల్ని వాడుకుని అన్యాయం చేశారని, వారికి చోటు కల్పించలేదని అన్నారు. ఇది పేపర్ లీక్‌లకు వ్యతిరేకంగా జరిగిన విద్యార్థి ఉద్యమం అయినప్పటికీ, ఇందులో ఏ విద్యార్థినీ భాగస్వాములను చేయలేదని అన్నారు. సీజేపీనే పేపర్ లీక్ మాఫియాగా మారిపోయిందని ఆరోపించారు. ఉద్యమంలో శివసేన, ఆప్, సమాజ్‌వాదీ, ఆర్జేడీ, బీజేపీ, కాంగ్రెస్‌తో సహా దేశవ్యాప్తంగా ఉన్న వివిధ పార్టీలకు చెందిన వారు ఉద్యమంలో పాల్గొన్నారని అయినప్పటికీ ఒక్కరికీ సీజేపీలో చోటుకల్పించలేదని అన్నారు. సీజేపీ కేవలం ఒకే పార్టీకి వ్యతిరేకంగా పనిచేస్తోందని ఆరోపించారు.

## ఇరాన్‌కు ఏదేశం సహకరించినా తీవ్ర ఆంక్షలు ఎదుర్కోనాల్సిందే

### అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో

**వాషింగ్టన్, సెప్టెంబరు 3:** ఇరాన్‌తో భారత్ వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోబోతోందన్న వార్తలను అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో కొట్టిపారేశారు. అమెరికా ఆంక్షలను తప్పించుకోవడానికి ఇరాన్‌కు ఏ దేశం సహకరించినా, ఆ దేశం కూడా తీవ్రమైన ఆంక్షలను ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన గట్టిగా హెచ్చరించారు. కిర్గిజ్‌స్థాన్‌లోని బిష్కెక్‌లో జరిగిన 26వ షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) శిఖరాగ్ర సదస్సులో భారత ప్రధాని నరేంద్ర మోడీ, ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్‌తో భేటీ అయిన నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు అంతర్జాతీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. భారత్, ఇరాన్ మధ్య వాణిజ్య ఒప్పందం ఉందని నేను అనుకోవడం లేదని రూబియో ఓ ఇంటర్వ్యూలో స్పష్టం చేశారు. అయితే, ప్రపంచంలోని చాలా దేశాలు తమ విదేశాంగ విధానాలను స్వతంత్రంగా రూపొందించుకుంటాయని, ఇరాన్‌తో సంప్రదింపులు జరుపుతాయని ఆయన అంగీకరించారు. అవసరమైనప్పుడు ఇరాన్ ప్రభుత్వ ప్రతినిధులతో తాము కూడా చర్చలు జరిపినట్లు ఆయన గుర్తుచేశారు. అదే సమయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గతంలో చేసిన హెచ్చరికను రూబియో పునరుద్ఘాటించారు.

అమెరికా ఆంక్షలను తప్పించుకోవడానికి ఇరాన్‌కు ఏ దేశం సాయం చేయకూడదు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహించడానికి, అణ్వాయుధాన్ని నిర్మించడానికి అవసరమైన ఆదాయాన్ని సమకూర్చుకునే మార్గాలను ఇరాన్‌కు కల్పించకూడదు. ఒకవేళ ఏవైనా దేశాలు అలా చేస్తే, వాటిపై కూడా మేము ఆంక్షలు విధించాల్సి వస్తుందని రూబియో హెచ్చరించారు. ట్రంప్ యంత్రాంగం ప్రధాన లక్ష్యం ఇరాన్‌ను అణ్వాయుధ శక్తిగా మారకుండా నిరోధించడమేనని రూబియో స్పష్టం చేశారు.

అధ్యక్షుడిగా ట్రంప్ ఉన్నంత కాలం ఇరాన్‌ను అణ్వస్త్ర దేశంగా మారేందుకు ఎప్పటికీ అనుమతించమని ఆయన అన్నారు. ఇరాన్‌పై ఒత్తిడి తెచ్చేందుకు ప్రాథమికంగా ఆర్థిక ఆంక్షలను ఉపయోగిస్తామని, అయితే అవసరమైతే సైనిక చర్యకు కూడా వెనుకాడబోమని ఆయన తెలిపారు. ఇరాన్ తన ఆర్థిక వనరులను దేశ ప్రజల సంక్షేమానికి కాకుండా ఉగ్రవాదం, అణ్వాయుధాల కోసమే ఖర్చు చేస్తోందని రూబియో ఆరోపించారు.



# స్టాలిన్‌కు మద్రాస్ హైకోర్టు షాక్

## ఇవిఎంలపై పిటిషన్ కొట్టివేత

**చెన్నై, సెప్టెంబరు 3:** తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి, డీఎంకే అధినేతఎంకే స్టాలిన్‌కు మద్రాస్ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. కొలత్తూరు అసెంబ్లీ ఎన్నికల్లో ఈవీఎంలు, వీవీప్యాట్ ధ్రువీకరణలో అవకతవకలు జరిగా యంటూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు గురువారం కొట్టివేసింది. ఈ పిటిషన్ అసలు విచారణకే అర్హమైనది కాదని ఉన్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. 2026 తమిళ నాడు అసెంబ్లీ ఎన్నికల్లో కొలత్తూరు నియోజకవర్గం నుంచి పోటీ చేసిన స్టాలిన్‌ను తమిళగ వెట్రి కళగం (టీవీకే) అభ్యర్థి వీఎస్ బాబు ఓడించారు. బాబుకు 82,997 ఓట్లు రాగా స్టాలిన్‌కు 74,202 ఓట్లు వచ్చాయి. దాంతో బాబు 8,795 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. స్టాలిన్ రెండో స్థానంలో నిలిచారు. మే 4న ఫలితాలు వెలువడగా మే 7నే 14 ఈవీఎంల బర్న్ మెమొరీ, మైక్రో కంట్రోలర్‌ను పరిశీలించాలన్నారు.

# పూరీ జగన్నాథునికి రూ.1912కోట్ల డిపాజిట్లు - 60వేల 821 ఎకరాల భూములు

**భువనేశ్వర్, సెప్టెంబరు 3:** పూరీ జగన్నాథ ఆలయ యాజమాన్య సంస్థ ఆలయ బ్యాంకు బ్యాలెన్స్‌కు సంబంధించిన వివరాలను అధికారికంగా వెల్లడించింది. అయోధ్య రామ్ మందిర విరాళాల దుర్వినియోగంపై ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో పారదర్శకతను చాటుకునేందుకు జగన్నాథుని పేరిట బ్యాంకుల్లో రూ. 1,912 కోట్లకు పైగా డిపాజిట్లు ఉన్నట్లు ప్రకటించింది. ఆలయ నిధుల నిర్వహణ అత్యున్నత పారదర్శకతతో, క్రమబద్ధమైన ఆడిటింగ్, అకౌంటింగ్ పద్ధతుల ద్వారా జరుగుతోందని ఎస్‌జేటీఏ చీఫ్ అడ్మినిస్ట్రేటర్ అరవింద కుమార్ పఢీ స్పష్టం చేశారు. భక్తుల నమ్మకాన్ని కాపాడేందుకు స్పష్టమైన జవాబుదారీతనం అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఆలయానికి వివిధ మార్గాల ద్వారా ఆదాయం సమకూరుతోంది. భక్తులు సమర్పించే కానుకలు, విరాళాలు, ఆలయానికి చెందిన గనులు, క్వారీల ద్వారా వచ్చే ఆదాయం, ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వచ్చే వడ్డీ, భూముల లావాదేవీల ద్వారా లభించే ఆదాయంతో పాటు ప్రభుత్వ గ్రాంట్లు ప్రధాన వనరులుగా ఉన్నాయి. ఈ ఆదాయంలో కొంత భాగాన్ని కార్పస్ ఫండ్, ఫౌండేషన్ ఫండ్, టెంపుల్ ఫండ్ అనే మూడు విభాగాలలో ఫిక్స్‌డ్ డిపాజిట్లుగా జమ చేస్తారు.

# సంక్షిప్త వార్తలు

## హార్ముజ్ దాటిన 40 వాణిజ్య నౌకలు



**వాషింగ్టన్, సెప్టెంబరు 3:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తీవ్రరూపం దాల్చిన వేళ కీలకమైన హార్ముజ్ జలసంధి మీదుగా 40 వాణిజ్య నౌకలకు అమెరికా సైన్యం రక్షణ కల్పించింది. ఈ ఆపరేషన్ లో సుమారు 18 మిలియన్ బ్యారెళ్ల చమురును తరలిస్తున్న నౌకలు సురక్షితంగా జలసంధిని దాటినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. యుద్ధం వేళ ఒక రోజులో హార్ముజ్ మీదుగా ఇంత భారీ సంఖ్యలో నౌకలకు అమెరికా నౌకాదళం రక్షణ కల్పించడం ఇదే తొలిసారి.

## 86 టన్నుల బంగారాన్ని లండన్‌కు తరలించిన నెదర్లాండ్స్



**ఆమ్‌స్టర్‌డ్యామ్, సెప్టెంబరు 3:** నెదర్లాండ్స్ దేశం కొన్ని నెలలపాటు 86 టన్నుల బంగారాన్ని తరలించింది. బిలియన్ డాలర్ల విలువైన ఆ పసిడిని అమెరికా, కెనడ దేశాల నుంచి తీసుకొచ్చి లండన్‌లోని బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్‌లో భద్రపరిచింది. ఈ విషయాన్ని డచ్ సెంట్రల్ బ్యాంక్ (డిఎన్‌బి) ధ్రువీకరించింది. అంతర్జాతీయంగా అస్థిర పరిస్థితుల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. లండన్‌లో భద్రపరిస్తే.. సంక్షోభ సమయంలో దానిని సులభంగా ట్రేడ్ చేయడానికి వీలవుతుందని నెదర్లాండ్స్ కేంద్ర బ్యాంకు పేర్కొంది.

## సిఎం విజయ్‌ను కలిసిన టిఎంసి రెబల్‌ఎంపి సాయానిఘోష్



**చెన్నై, సెప్టెంబరు 3:** తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్‌ను బెంగాల్ నటి, తృణమూల్ కాంగ్రెస్ తిరుగుబాటు ఎంపీ సయానీ ఘోష్ కలిశారు. చెన్నై సచివాలయంలో విజయ్‌ను కలిసి రాష్ట్ర సుపరిపాలనను, దార్శనికతను ప్రశంసించారు. అనంతరం విజయ్‌తో సయానీ ముఖ్యమంత్రితో సమావేశమైన అనంతరం సయోని ఘోష్ మాట్లాడుతూ విజయ్ పశ్చిమ బెంగాల్ గురించి ఆప్యాయంగా మాట్లాడారని గొప్ప సంస్కృతి, సంప్రదాయాల పట్ల తన ప్రశంసలను వ్యక్తం చేశారని తెలిపారు.

## జల్‌బోర్డు కేసులో మాజీ మంత్రి సత్యేంద్ర జైన్‌కు ఊరట

**న్యూఢిల్లీ,సెప్టెంబరు 3:** ఆప్ నేత, మాజీ మంత్రి సత్యేంద్ర జైన్‌కు భారీ ఊరట లభించింది. జల్ బోర్డు కేసులో అరెస్టైన ఆయనకు ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు గురువారం బెయిల్ మంజూరు చేసింది. రూ.2 లక్షల పూచీకత్తు, ఇద్దరు సంతకాల హామీతో సత్యేంద్ర జైన్‌కు బెయిల్ లభించింది. పీసీ యాక్ట్ కింద స్పెషల్ జడ్జి సత్యేంద్ర జైన్‌కు బెయిల్ ఇస్తున్నట్లు ప్రకటించారు. సత్యేంద్ర జైన్ గతంలో అరవింద్ కేజ్రీవాల్ ప్రభుత్వంలో మంత్రిగా పని చేశారు.

## టిబెట్ నేపాల్ సరిహద్దుల్లో భూకంపం




**లాసా, సెప్టెంబరు 3:** టిబెట్‌లో గురువారం భూకంపం సంభవించింది. నేపాల్ సరిహద్దులో 5.0 తీవ్రతతో భూకంపం నమోదైంది. ఈ భూకంపం కారణంగా నేపాల్‌లోనే మరోసారి ప్రజల్లో ఆందోళన నెలకొంది. వరదలతో అతలాకుతలం అయిన నేపాల్ సరిహద్దులో మరోసారి అదే నేపాల్ సరిహద్దు ప్రాంతంలో.. టిబెట్ దేశంలో భూకంపం నమోదు కావడం ఆందోళనకు గురిచేసింది. స్థానిక కాలమానం ప్రకారం మధ్యాహ్నం 1.46 గంటల సమయంలో, భూమికంపించి 14 కిలో మీటర్ల లోతున ఈ భూకంపం నమోదైనట్లు ఇండియాకు చెందిన నేషనల్ సెంటర్ ఫర్ సిస్మాలజీ వెల్లడించింది.

4-9Pg6exHMNWJQE FF.qxd:4-9Pg6exHMNWJQE FF.qxd 1/1/02 6:28 AM Page 1



## గుంటూరు పట్టాభిపురం పోలీసులపై హైకోర్టు అసహనం

**విజయవాడ, సెప్టెంబరు 3 ప్రభాతవార్త ప్రతినిధి:** గుంటూరు పట్టాభిపురం పోలీసులుపై హైకోర్టు అసహనం వ్యక్తం చేసింది. షేక్ జాన్ సైదా (రబ్బానీ) అనే వ్యక్తి 10వ తరగతి చదువుతున్న 15యేళ్ల బాలికను తీసుకెళ్లి మూడు నెలలు గడిచినా, గుంటూరు పట్టాభిపురం పోలీసులు ఆమె ఆచూకీని కనుగొనడంలో విఫలం కావడంపై హైకోర్టు ఆశ్చర్యం వ్యక్తం చేసింది. ఇది నిస్సందేహంగా పోలీసుల వైఫల్యమేనని స్పష్టం చేసిన కోర్టు, అటువంటి పోలీసు సిబ్బంది ఉండటం ప్రభుత్వానికి సిగ్గుచేటని ఘాటుగా వ్యాఖ్యానించింది. గుంటూరులోని ఓ ప్రైవేట్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న తన కుమార్తె ట్యూషన్‌కు వెళ్లి తిరిగి రాలేదని, ఆమెను కోర్టు ముందు హాజరుపరిచేలా పోలీసులను ఆదేశించాలంటూ తండ్రి హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ వేశారు. షేక్ జాన్ సైదా ఇన్‌స్టా ద్వారా పరిచయమై ట్రాప్ చేసి తన కుమార్తెను తీసుకెళ్లాడని దీనిపై పట్టాభిపురం పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి మూడు నెలలవుతున్నా తన కుమార్తె ఆచూకీ కనిపెట్టలేదని పేర్కొన్నారు. పిటిషనర్ తరపున న్యాయవాది డివి శశిధర్ వాదనలు వినిపిస్తూ బాలికను సైదా ఎక్కడికి తీసుకెళ్లాడో పోలీసులకు తెలిసినా తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టడం లేదన్నారు. పోలీసులు బాలిక కోసం మూడు రాష్ట్రాల్లో గాలించారన్న ప్రభుత్వ సహాయ న్యాయవాది (ఎజిపి) కృష్ణ ప్రణీత్ వాదనల్ని ధర్మాసనం తోసిపుచ్చింది. బాలికను కోర్టు ముందు హాజరుపరచాలని డిజిపిని ఆదేశించింది. అయితే డిజిపికి కాకుండా జిల్లా ఎస్పీకి ఆదేశాలు జారీచేయాలని ఎజిపి కోరగా ఎస్పీ, ఎస్‌హెచ్ఒలపై కోర్టుకు నమ్మకం లేదని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

### సాదిక్ ఖాన్ కస్టడీ పిటీషన్ విచారణ 7కు వాయిదా

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, సెప్టెంబరు 3 ప్రభాతవార్త:** కాకినాడ జిల్లా పిఠాపురం పంచాయతీరాజ్ శాఖ అధికారి టీ నూకరాజు కుటుంబం ఆత్మహత్యల కేసులో నిందితుడిగా ఉన్న సాదిక్ ఖాన్‌పై కస్టడీ పిటిషన్ ఈనెల 7వ తేదీన విచారణ వాయిదా వేసినట్లు న్యాయవాది జవహర్ అలీ తెలిపారు. సర్పవరం పోలీసులు ముందుగా కాకినాడ సబ్ జైలుకు తరలించగా భద్రతకు సంబంధించి సమస్యలు తలెత్తే పరిస్థితి ఉండడం వలన రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించిన విషయం తెలిసిందే. అయితే నూకరాజు కుటుంబం ఆత్మహత్యకు దారితీసిన పరిస్థితులతో పాటు సౌజన్య భర్త జగదీశ్వర్ రెడ్డి మరణానికి సంబంధించిన అంశాలను, ఈ సంఘటనలో వెనుక మరిన్ని విషయాలపై వస్తున్న ఆరోపణ నేపథ్యంలో సాధిక్ ఖాన్ కస్టడీలో మరింత లోతుగా విచారిస్తే వాస్తవాలు మరెన్నో బయటకు వస్తాయని భావిస్తున్నారు. అలాగే జగదీశ్వర్ రెడ్డికి ఇచ్చినట్టుగా చెబుతున్నా విష పదార్థాన్ని కేరళ నుంచి సరఫరా చేస్తున్నట్టుగా భావిస్తూ ఇరువురిని ఇప్పటికే పోలీసులు గుర్తించినట్లు సమాచారం. అలాగే సాధిక్ ఖాన్‌ను విచారణకు సంబంధించి తమ కస్టడీలో విచారించాల్సిన విషయాలపై ప్రణాళికలను పోలీసు అధికారులు రూపొందించినట్లు సమాచారం.

## 14వ అంతస్తు నుంచి దూకి నేవీ ఉద్యోగి భార్య ఆత్మహత్య

**గాజువాక,సెప్టెంబర్ 3 ప్రభాతవార్త:** విశాఖపట్నం నావికాదళ గృహసముదాయమైన నౌసనాబాగ్‌లో గురువారం ఉదయం తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఒక వివాహిత ఎత్తయిన భవనం పైనుంచి దూకి బలవన్మరణానికి పాల్పడింది.!! మల్కాపురం పోలీసుల సమాచారం ప్రకారం... మధ్యప్రదేశ్‌కు చెందిన ప్రియాంక వర్మ (22)కు ఐదేళ్ల క్రితం దీపక్ వర్మతో వివాహమైంది. ఆయన విశాఖపట్నంలోని భారత నౌకాదళంలో ఉద్యోగం చేస్తున్నారు. వీరికి ఒక బాబు, పాప ఉన్నారు. ప్రస్తుతం వీరు మల్కాపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని నౌసనాబాగ్‌లో ఉన్న గోమతి అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్నారు.!! గురువారం ఉదయం సుమారు 8:00 గంటల సమయంలో ప్రియాంక వర్మ తాను ఉంటున్న గోమతి అపార్ట్‌మెంట్ 14వ అంతస్తు నుంచి ఒక్కసారిగా కిందకు దూకేశారు. తీవ్ర గాయాలపాలైన ఆమె అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. సమాచారం అందుకున్న నేవీ పోలీసులు వెంటనే మల్కాపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. విశాఖకు చేరుకున్న తర్వాత ఇచ్చే ఫిర్యాదు ఆధారంగా పూర్తిస్థాయి ఎఫ్ఐఆర్ నమోదు చేస్తామని మల్కాపురం సి.ఐ. ఇ.నరసింహారావు తెలిపారు. ఆత్మహత్యకు గల ఖచ్చితమైన కారణాలపై అన్ని కోణాల్లో దర్యాప్తు జరుపుతున్నట్లు ఆయన వెల్లడించారు.

## తిరుమల సమాచారం

### మహాపూర్ణాహుతితో శాస్త్రోక్తంగా ముగిసిన కారీరిష్టి యాగం



**తిరుమల, సెప్టెంబరు 3 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రపంచ మానవాళి సంక్షేమం కోసం తిరుమల ధర్మగిరి వేద విజ్ఞాన పీఠంలోఐదు రోజుల పాటు టిటిడి నిర్వహించిన కారీరిష్టి, వరుణ జపం, పర్జన్యశాంతి హోమాలు గురువారం మహాపూర్ణాహుతితో శాస్త్రోక్తంగా ముగిశాయి. వేంకటేశ్వర వేద విజ్ఞాన పీఠం ప్రిన్సిపల్ కుప్పా శివ సుబ్రహ్మణ్య అవధాని కారీరిష్టి, వరుణ జపం, పర్జన్యశాంతి మంత్రాలను పఠించి అందరితో పలికించారు. శ్రీవారి దివ్య అనుగ్రహంతో భారతదేశవ్యాప్తంగా సకాలంలో సస్యానుకూలమైన వర్షాలు కురిసి, అతివృష్టి, అనావృష్టి బాధలు లేకుండా ప్రజలందరూ మంచి పాడిపంటలతో సుభిక్షంగా వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ అనేక దశాబ్దాలుగా కొనసాగుతున్న సంప్రదాయాన్ని అనుసరించి ఈ యాగాలను నిర్వహించినట్లు తెలిపారు. గత ఐదు రోజులుగా 32 మంది ఋత్వికులతో కారీరిష్టి సహిత వరుణ జపం, పర్జన్యశాంతి కార్యక్రమాలను వైభవంగా నిర్వహించి, మహాపూర్ణాహుతితో సంపూర్ణం చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర,అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, బోర్డు సభ్యులు భానుప్రకాష్ రెడ్డి, పనబాక లక్ష్మి, శాంతా రామ్, ధర్మగిరి వేద విజ్ఞాన పీఠం అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### బ్రహ్మోత్సవాల్లో వసతికి ఇబ్బంది రాకూడదు

#### వసతి కల్పన విభాగంపై అదనపు ఇఒ సమీక్ష



**తిరుమల, సెప్టెంబరు 3 ప్రభాతవార్త ప్రతినిధి:** మరో పదిరోజుల్లో తిరుమలలో ప్రారంభం కానున్న శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో అటు భక్తులకు ఇటు సిబ్బందికి వసతికి ఇబ్బంది లేకుండా చూడాలని టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి అధికారులను ఆదేశించారు. ఈనెల 15 నుండి 23 వరకు శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్న నేపథ్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వసతి గదుల కేటాయింపునకు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం తిరుమలలో సుధర్మ సమావేశ మందిరంలో వసతి కల్పన విభాగంపై అదనపు ఇఒ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గదులకు మరమ్మతులు ఏవైనా ఉంటే త్వరితగతిన పూర్తి చేయాలని చెప్పారు. బ్రహ్మోత్సవ విధులకు డిప్యూటేషన్ పై వచ్చే సిబ్బందికి వసతి కేటాయించేందుకు వీలుగా తిరుమలలోని మఠాలు, కర్ణాటక సత్రాల్లోని 60 శాతం గదులను బ్రహ్మోత్సవ రోజుల్లో టిటిడి రిసెప్షన్ విభాగం నియంత్రణలోకి తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో తిరుమల ఎస్టేట్ అధికారి వేంకటేశ్వర్లు, ఇన్‌ఛార్జ్ ఐటీ జిఎంవేంకటేశ్వర్లు నాయుడు, రిసెప్షన్ ఒఎస్‌డి సత్రే నాయక్, ఎఇఒ అశోక్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఎ.కొండూరుకు జెజెఎం-అమరజీవి జలధారలు

- కొండూరు కిడ్నీ బాధితుల జీవితాల్లో కొత్త ఆశలు నింపిన డి.సిఎం పవన్ కల్యాణ్
- ఉద్దానం తరహా మూత్రపిండాల సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు
- 26 నెలల కాలంలో రూ. 49.94 కోట్ల పనులు పూర్తి
- 38 ఆవాసాల పరిధిలో 130 కిలోమీటర్ల పైప్‌లైన్
- ఇంటింటికీ కుళాయిలతో దాదాపు 75,000 మందికి స్వచ్ఛమైన మంచినీరు





ఎ.కొండూరులో పవన్ కల్యాణ్ వాగ్దానం మేరకు నిర్మించిన రక్షిత మంచినీటి పథకం జల్ జీవన్ మిషన్-అమరజీవి జలధార పథక పరిధిలో ఏర్పాటు చేసిన కుళాయి నీటిని పట్టుకుంటున్న ఎ.కొండూరు గ్రామ మహిళ

**విజయవాడ, సెప్టెంబరు 3 ప్రభాతవార్త ప్రతినిధి:** మూత్రపిండాల వ్యాధి (క్రానిక్ కిడ్నీ డిసీజ్) బారినపడిన ప్రజలతో మరో ఉద్దానాన్ని తలపించే ఎన్టీఆర్ జిల్లా, ఎ.కొండూరు మండల ప్రాంతం. ఈ మండల పరిధిలో మొత్తం 21 గ్రామ పంచాయతీలు, 38 ఆవాసాలు ఉండగా, దాదాపు అన్ని గ్రామాలు దీర్ఘకాలిక కిడ్నీ వ్యాధి ప్రభావిత ప్రాంతాలుగా ఉన్నాయి. అందులో గిరిజనులు మాత్రమే నివసించే 15 తండాలున్నాయి. తాగేందుకు గుక్కెడు నీరు దొరక్క, ప్రమాదమని తెలిసినా కలుషిత జలాలతో గొంతు తడుపుకునే పరిస్థితి నెలకొంది. 2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు ఈ సమస్య పవన్ కల్యాణ్ దృష్టికి వచ్చింది. ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే ఎ.కొండూరుకు రక్షిత మంచినీటి సౌకర్యం కల్పించడం ద్వారా ఆ ప్రాంత ప్రజలను కిడ్నీ వ్యాధి బారి నుంచి కాపాడాలని సంకల్పించారు. అధికారం చేపట్టిన 26 నెలల్లోనే తన పరిధిలోని గ్రామీణ మంచినీటి సరఫరా శాఖ ద్వారా జల్ జీవన్ మిషన్-అమరజీవి జలధారల నిధులతో ఎ.కొండూరు తాగునీటి ప్రాజెక్టును పూర్తి చేశారు. రూ.49.94 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టు 100 శాతం పనులు పూర్తి చేసుకుని ఆ ప్రాంత ప్రజల నీటి కష్టాలను తీర్చింది. గత ప్రభుత్వం టెండర్ల ప్రక్రియ కూడా మొదలుపెట్టలేదు ఎ.కొండూరు తాగునీటి ప్రాజెక్టును కూడా గత ప్రభుత్వం ఆర్భాటం చేసి, కనీసం టెండర్ ప్రక్రియను కూడా మొదలుపెట్టలేదు. ఒక్క పనీ ప్రారంభించలేదు. జల్ జీవన్ మిషన్ కింద చేపట్టిన ప్రాజెక్టు కావడం, గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో 2024 మార్చి నాటికి గడువు కూడా ముగియడంతో ఈ ప్రాజెక్టుపై నీలినీడలు కమ్ముకున్నాయి. అయితే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈ పనులను ముందుకు తీసుకెళ్లారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం జల్ జీవన్ మిషన్‌ను మరో నాలుగేళ్లు పొడిగించగా, రాష్ట్ర ప్రభుత్వం వాటా కూడా తక్షణమే విడుదల చేసి, పనులను యుద్ధప్రాతిపదికన ముందుకు తీసుకువెళ్లింది. కిడ్నీ వ్యాధితో ప్రజలు పడుతున్న అవస్థలను చూసి చలించిన ఉప ముఖ్యమంత్రి, నిర్దేశిత గడువులోపు పనులు పూర్తి చేయించారు. ఇబ్రహీంపట్నం ఎన్టిపిసి కాలువ నుంచి కృష్ణా జలాలను స్వీకరించి, అక్కడే శుద్ధి చేసి, 130 కిలోమీటర్ల పైప్‌లైన్, 12 ఓవర్‌హెడ్ ట్యాంకుల సహకారంతో దాదాపు 75వేల మందికి ఒక్కొక్కరికి రోజుకు 55 లీటర్ల చొప్పున స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తున్నారు. ఎ.కొండూరు తాగునీటి ప్రాజెక్టుకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చిన పవన్ కల్యాణ్, గ్రామీణ నీటి సరఫరా శాఖ ఆధ్వర్యంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, రెవెన్యూ, అటవీ, పర్యావరణ, రైల్వే శాఖలతో పాటు నేషనల్ హైవేస్ అథారిటీ అధికారులతో సమన్వయం చేసుకుంటూ, పైప్‌లైన్ నిర్మాణానికి అత్యంత త్వరితగతిన అనుమతులు లభించేలా ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లారు. గతంలో ఎ.కొండూరు మండల పరిధిలోని ప్రజలకు ట్యాంకర్ల సాయంతో తాగునీరు అందించేందుకు ప్రభుత్వం ఏటా రూ. 2.5 కోట్లు ఖర్చు చేయాల్సి వచ్చేది. పవన్ కల్యాణ్ ప్రత్యేక శ్రద్ధతో జల్ జీవన్ మిషన్-అమరజీవి జలధారల రూపంలో తాగునీటి సమస్యకు, తద్వారా కిడ్నీ సమస్యలకు శాశ్వత పరిష్కార మార్గం లభించినట్టయింది. త్వరలో ఎ.కొండూరు ప్రాంతంలో పర్యటించి మంచినీటి పథకం పనుల నాణ్యతను ఉప ముఖ్యమంత్రి పరిశీలించనున్నారు. అందుకు సంబంధించి షెడ్యూల్ సిద్ధం చేయాలని ఇప్పటికే కార్యాలయ అధికారులకు నిర్దేశం చేశారు.

## విశాఖ వేదికగా 10నుంచి 12వరకు 41వ ఐఎటిఒ జాతీయ వార్షిక సదస్సు

### పర్యాటక మంత్రి కందుల దుర్గేష్

**సచివాలయం, సెప్టెంబరు 3 ప్రభాతవార్త:** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ల నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు స్థానిక పర్యాటక భాగస్వాములకు జాతీయ స్థాయిలో విస్తృత అవకాశాలు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మక నిర్ణయాలు తీసుకుందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. వెలగపూడి సచివాలయంలో ఆయన మాట్లాడుతూ విశాఖపట్నంలో ఈనెల 10నుంచి 12వరకు జరగనున్న 41వ ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ టూర్ ఆపరేటర్స్(ఐఎటిఒ) వార్షిక సదస్సు విశేషాలను వివరించారు. దేశవ్యాప్తంగా ప్రముఖ పర్యాటక ప్రతినిధులు,టూర్ ఆపరేటర్లు,హోటల్ నిర్వాహకులు, విధాన నిర్ణేతులను ఒకే వేదికపైకి తీసుకొచ్చే ఈ ప్రతిష్టాత్మక సదస్సుకు విశాఖపట్నం ఆతిథ్యం ఇవ్వడం రాష్ట్ర పర్యాటక రంగానికి దక్కిన గొప్ప అవకాశమని మంత్రి పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా 2,068కి పైగా సభ్యులతో ఇన్-బౌండ్ టూరిజంలో అగ్రగామిగా ఉన్న ఐఎటిఒ, ఎపి పర్యాటక భాగస్వాముల భాగస్వామ్యాన్ని పెంపొందించడానికి ప్రత్యేక డ్రైవ్‌ను ప్రారంభించిందని తెలిపారు. రాష్ట్రానికి చెందిన టూర్ ఆపరేటర్లు, హోటళ్ళు, పర్యాటక భాగస్వాములు ఐఎటిఒ సభ్యత్వం పొందేందుకు చెల్లించాల్సిన రూ.10,000 (+జిఎస్టీ) వన్‌టైమ్ అడ్మిషన్ ఫీజును పూర్తిగా రద్దుచేయడం జరిగిందన్నారు. ఈ రాయితీ 2026 డిసెంబర్ 31వరకు అందజేసే దరఖాస్తులకు వర్తిస్తుందని వివరించారు. సాధారణంగా ఐఎటిఒ సభ్యులకు రూ.6,000, సభ్యులు కాని వారికి రూ.8,500 ఉండే సదస్సు రిజిస్ట్రేషన్ ఫీజును ఎపి ప్రతినిధులకు కేవలం రూ.3,000కే నిర్ణయించామన్నారు. అర్హులైన స్థానిక పర్యాటక ప్రతినిధులు ఎటువంటి ప్రాథమిక ప్రవేశ రుసుము చెల్లించకుండా ఐఎటిఒ అధికారిక పోర్టల్ ఐఎటిఓ.ఇన్/రిజిస్టర్/ఫోరమ్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఈ సదస్సుకు దేశ నలుమూలల నుండి 1,000మందికి పైగా ప్రముఖ ఇన్-బౌండ్ టూర్ ఆపరేటర్లు, డొమెస్టిక్ ట్రావెల్ కంపెనీలు, డెస్టినేషన్ మేనేజ్‌మెంట్ కంపెనీలు, హోటల్ రంగ ప్రతినిధులు, విమానయాన సంస్థల ప్రతినిధులు హాజరు కానున్నారని తెలిపారు. దీనివల్ల ఎపిలోని హోటళ్ళు, రిసార్టులు, పర్యాటక ప్రాంతాలను జాతీయ స్థాయిలో ఉచితంగా ప్రచారం చేసుకోవడంతో పాటు దేశంలోని అగ్రగామి టూర్ ఆపరేటర్లతో నేరుగా వ్యాపార సంబంధాలు నెలకొల్పుకునే అవకాశం లభిస్తుందని మంత్ర దుర్గేష్ అన్నారు. రాష్ట్రంలోని హోటళ్ళు, రిసార్టుల యాజమాన్యాలు, టూర్ ఆపరేటర్లు, ట్రావెల్ ఏజెన్సీలు, హోమ్‌స్టే నిర్వాహకులు, ట్రాన్స్‌పోర్టు ఆపరేటర్లు, టూరిస్ట్ గైడ్లు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలందరూ ఈ అపూర్వ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఐఎటిఒ సభ్యత్వం పొందడంతో పాటు సదస్సులో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కేంద్ర సహకారంతో ఎపిని దేశంలోని అగ్రగామి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి కందుల దుర్గేష్ పునరుద్ఘాటించారు.

## బ్రహ్మోత్సవాల్లో మాడ వీధుల్లో భక్తులకు సమన్వయంతో సేవలు

- వైద్య సేవల ఏర్పాట్లపై అదనపు ఇఒ చౌదరి సమీక్ష



**తిరుమల, సెప్టెంబరు 3 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమలలో ఈనెల 15 నుండి 23వ తేది వరకు జరగనున్న శ్రీవారి బ్రహ్మోత్సవాలలో భక్తులకు సమన్వయంతో సేవలందించాలని టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ఆదేశించారు.బ్రహ్మోత్సవాలు జరిగే సమయంలో మాఢవీదుల్లో అత్యవసర పరిస్థితులు తలెత్తినప్పుడు భక్తులకు ఇబ్బంది కలగకుండా త్వరితగతిన వైద్య సేవలు అందించాలని సూచించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా మందులను అందుబాటులో ఉంచుకోవాలని చెప్పారు. మాడ వీధుల్లో భక్తులకు సమస్యలు తలెత్తితే పోలీసుల సమన్వయంతో సురక్షి తంగా త్వరితగతిన ఆసుపత్రికి తరలించాలని చెప్పారు. అత్యవసర పరిస్థితుల్లో మాడ వీధుల్లో అంబులెన్సు లకు క్లియరెన్స్ ఇచ్చేలా చర్యలు చేపట్టాలని తిరుమల డిఎస్పీ కె. విజయశేఖర్‌ను కోరారు. శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల నేపథ్యంలో వైద్య సేవలు, రవాణా విభాగాలు, పోలీసుల భద్రతపై టిటిడి అదనపు ఇఒ వెంకయ్య చౌదరి తన క్యాంపు కార్యాలయంలో గురువారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టిటిడి చీఫ్‌వైద్యాధికారిణి డాక్టర్ కుసుమ కుమారి భక్తులకు అందుబాటులో ఉంచనున్న వైద్య సదుపాయాలను అదనపు ఇఒకు వివరించారు. బ్రహ్మోత్సవాల్లో భక్తులకు వైద్య సేవలు అందించేందుకు తిరుమలలో అశ్వినీ ఆసుపత్రి, అపోలో కార్డియాక్ సెంటర్లు 24 గంటలు నిరంతరాయంగా పని చేస్తాయని తెలిపారు. వైకుంఠం క్యూ కాంప్లెక్స్ 1, 2, గాలి గోపురం, ఎటిసి.కల్యాణకట, పిఎసి 5 ప్రాంతాల్లో 6 డిస్పెన్సరీలు, పీఏసీ2, భాష్యకార్ల సన్నిధి, అలిపిరి రాజగోపురం, 1500 మెట్టు, ఏడో మైలు, శ్రీవారి మెట్టు 1200 మెట్టు, మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్న ప్రసాద కేంద్రం, శ్రీవారి ఆలయం, నారాయణగిరి షెడ్లు, దర్శన క్యూలైన్లలో ఒక మొబైల్ క్లినిక్ (కృష్ణతేజ సర్కిల్ నుండి గోగర్భం సర్కిల్ వరకు) 10 ప్రథమ చికిత్సా కేంద్రాలతో పాటు రామ్ భగీచా, శిలాతోరణం, పాపవినాశనం, శ్రీవారి సేవా సదన్, శ్రీవారి మెట్టు, అలిపిరి పాదాల మండపం వద్ద నూతనంగా 6 వైద్య శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అదేవిధంగా ప్రస్తుతం అందుబాటులో ఉన్న 11 మంది డాక్టర్లు, 139 మంది పారా మెడికల్ సిబ్బందికి అదనంగా 75 మంది డాక్టర్లు, 60 మంది పారా మెడికల్ సిబ్బందిని అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. అత్యవసర వైద్య సేవల కోసం తిరుమలలో మొత్తం 16 అంబులెన్సులు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో విఎస్ఒ సురేంద్ర, అశ్వినీ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్బారెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## బ్రహ్మోత్సవాలకు అదనపు ప్రత్యేక బస్సు సర్వీసులు



**తిరుమల, సెప్టెంబరు 3 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు సెప్టెంబరు, అక్టోబరు నెలలో రెండు పర్యాయాలు జరగనున్న నేపథ్యంలో తిరుమలకు వచ్చే భక్తుల రద్దీ గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. పెరుగుతున్న రద్దీ దృష్ట్యా అనుగుణంగా భక్తులకు తగినన్ని బస్సు ట్రిప్పులు అందించేందుకు అదనపు ప్రత్యేక సర్వీసులను నిర్వహించడానికి ఎపిఎస్ఆర్టీసీ విస్తృత ఏర్పాట్లు చేసింది. ఇందులో భాగంగా, తిరుపతి తిరుమలతో బాటు తిరుమలలోని వివిధ ముఖ్య ప్రాంతాల నుండి తిరుపతికి అదనపు ప్రత్యేక అంతర్రాష్ట్ర బస్సు సర్వీసులను నిర్వహించేందుకు తిరుమల సిటీ ట్రాన్స్‌పోర్ట్ అండర్‌టేకింగ్‌తో ఆర్టీసీ పర్యవేక్షణ బృందం ఏర్పాటు చేయబడుతుంది. తిరుపతి జిల్లా ప్రజారవాణా అధికారిక కార్యాలయంలో జిల్లా ప్రజారవాణా అధికారి కె. శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో తిరుమల సిటీ ట్రాన్స్‌పోర్ట్ అండర్‌టేకింగ్‌కు చెందిన మేనేజింగ్ డైరెక్టర్ కె. గుణశేఖర్, పి. కృష్ణమూర్తితో బాటు వివిధ ఎస్టీఏల జనరల్ మేనేజర్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. తిరుమల నుండి తిరుపతికి 150 అదనపు ప్రత్యేక బస్సులు, తిరుపతి నుండి తిరుమలలోని వివిధ ముఖ్య ప్రాంతాలకు 150 అదనపు ప్రత్యేక బస్సులు వివిధ మార్గాల్లో నడపేందుకు అంగీకారం కుదిరింది. బ్రహ్మోత్సవాల సందర్భంగా పెరగనున్న భక్తుల రద్దీ, రవాణా అవసరాలను దృష్టిలో ఉంచుకుని, డిమాండ్‌కు అనుగుణంగా అదనపు ట్రిప్పులు నిర్వహించి, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగిన రవాణా సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా ఈ ఏర్పాట్లు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ పి. విశ్వనాథ్, డిప్యూటీ డిఎం మెకానికల్ ఇంజనీర్, తిరుమల పి. బాలాజీ ఆర్టీసి, తిరుమల సిటీ ట్రాన్స్‌పోర్ట్ అండర్ టేకింగ్‌కు చెందిన ఇతర అధికారులు పాల్గొన్నారు.

## జిమ్ ట్రైనర్ సతీష్ రెడ్డి హత్య కేసులో నలుగురు నిందితుల అరెస్టు

### ప్రాణభయంతోనే వురిగొల్పిన హత్య



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, సెప్టెంబరు 3 ప్రభాతవార్త:** కాకినాడ భానుగుడి సెంటర్‌లో జరిగిన జిమ్ ట్రైనర్ కొడమాటి సతీష్ రెడ్డి సంచలన హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఈ కేసులో నలుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందుమాధవ్ తెలిపారు. టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ హత్యపై ఎస్పీ ఆదేశాల మేరకు కాకినాడ అడిషనల్ ఎస్పీ, ఇన్‌చార్జి సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ డాక్టర్ మహంతి కిషోర్ కుమార్ పర్యవేక్షణలో ప్రత్యేక దర్యాప్తు బృందాలు ఏర్పాటు చేసి సాంకేతిక ఆధారాలతో నిందితులను గుర్తించారు. ఈవివరాలను విలేకరుల సమావేశంలో వివరించారు. కేసు వివరాల్లోకి వెళితే రామకృష్ణారావుపేటకు చెందిన జిమ్ ట్రైనర్ కొడమాటి సతీష్ రెడ్డి ఆగస్టు 26వ తేదీ తెల్లవారుజామున సుమారు 2 గంటల సమయంలో కాకినాడ భానుగుడి సెంటర్‌లోని చార్మినార్ టీ సెంటర్ వద్ద హత్యకు గురయ్యాడు. మృతుడి స్నేహితుడైన బొందల సాయికిరణ్‌తో పాటు అతని స్నేహితులు ఇంటి సత్యనారాయణ, ప్రయాగ దుర్గాప్రసాద్, ఇంటి ఆదికృష్ణ కలిసి సతీష్ రెడ్డిపై దాడి చేశారు. అనంతరం ఆయనను ఫుట్‌పాత్ ర్యాంప్‌పై పడేసి కాళ్లతో తన్నడంతో పాటు, ముందుగా సిగ్నల్ లైట్ల వద్ద దాచిపెట్టిన చెక్కబద్దతో దాడి చేశారు. దాడి సమయంలో చెక్కబద్ద విరిగిపోవడంతో, దాని పదునైన ముక్కతో సాయికిరణ్ సతీష్ రెడ్డి గొంతులో పలుమార్లు పొడవడంతో ఆయన మృతి చెందినట్లు దర్యాప్తులో వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు. దీంతో తీవ్ర గాయాలతో సతీష్ రెడ్డి మృతి చెందినట్లు వెల్లడించారు. మృతుడి అన్న కొడమాటి యర్రయ్యరెడ్డి ఫిర్యాదు మేరకు కాకినాడ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. నేరం అనంతరం నలుగురు నిందితులు పరారయ్యారు. దుర్గాప్రసాద్ తన బుల్లెట్ మోటార్‌సైకిల్‌ను కాకినాడ టౌన్ రైల్వే స్టేషన్ పార్కింగ్‌లో ఉంచి అక్కడి నుంచి పరారైనట్లు పోలీసులు గుర్తించారు. బొందల సాయికిరణ్(సాయి), ఇంటి సత్యనారాయణ, ప్రయాగ దుర్గాప్రసాద్, ఇంటి ఆదికృష్ణ అరెస్టయిన నిందితులని తెలిపారు. కాకినాడ టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ మజ్జి అప్పలనాయుడు, ఎస్ఐలు సువర్ణ కుమారి, ఎల్ భీష్మ కుమార్, పి. సత్తిబాబు, వారి స్టేషన్ సిబ్బంది, క్రైమ్ సిబ్బంది సహాయంతో దర్యాప్తు బృందాలు ఏర్పాటు చేసి, సాంకేతిక, ఇతర దర్యాప్తు పద్ధతుల ద్వారా నిందితుల కోసం గాలింపు చేపట్టారు. కాగా దర్యాప్తులో వెల్లడైన అంశాలను వివరిస్తూ ప్రధాన నిందితుడు బొందల సాయికిరణ్ ప్రేమ వ్యవహారానికి సంబంధించి సతీష్ రెడ్డితో విభేదాలు ఏర్పడినట్లు వెల్లడైంది. సాయికిరణ్ వేరే యువతితో ఉన్నట్లు ఫొటోలను మార్ఫింగ్ చేసి అతని ప్రియురాలికి సతీష్ రెడ్డి పంపడంతో వారి మధ్య విభేదాలు తలెత్తినట్లు విచారణలో తెలిసింది. అలాగే, సాయికిరణ్‌ను చంపేస్తానని సతీష్ రెడ్డి బెదిరించిన నేపథ్యంలో, అతను జీవించి ఉంటే తనకు ప్రాణహాని కలుగుతుందనే ఉద్దేశంతో సతీష్ రెడ్డిని హత్య చేసినట్లు ప్రధాన నిందితుడు విచారణలో తెలిపినట్లు పోలీసులు వెల్లడించారు. అరెస్టు చేసిన నలుగురు నిందితులను విచారణ అనంతరం న్యాయస్థానం ముందు హాజరుపరచి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించనున్నట్లు పోలీసులు తెలిపారు. కాకినాడ టూ టౌన్ సీఐ అప్పలనాయుడుకి అందిన విశ్వసనీయ సమాచారం మేరకు, రైల్వే స్టేషన్ పార్కింగ్ వద్ద పోలీసులు మాటువేసి ఉండగా, అక్కడ పార్కింగ్ చేసిన బుల్లెట్ మోటార్ సైకిల్‌ను తీసుకుని పరారయ్యేందుకు వచ్చిన నలుగురును అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి నాలుగు సెల్‌ఫోన్లు, బుల్లెట్ మోటార్ సైకిల్‌తో పాటు నేరం జరిగిన సమయంలో వారు ధరించిన దుస్తులను మధ్యవర్తుల సమక్షంలో స్వాధీనం చేసుకున్నారు.

## బ్రహ్మోత్సవాలకు తిరుపతి నగరంలో ఆధ్యాత్మిక వైభవం ఉట్టిపడాలి

**తిరుమల, సెప్టెంబరు 3 ప్రభాతవార్త ప్రతినిధి:** కలియుగ ప్రత్యక్ష దైవం వేంకటేశ్వర స్వామి సాలకట్ల బ్రహ్మోత్సవాల సందర్భంగా తిరుపతి నగరం భక్తి, ఆధ్యాత్మికత, వైభవంతో వెలుగొందేలా అన్ని ఏర్పాట్లు చేపట్టాలని టిటిడి జెఇఒ డాక్టర్ ఎ. శరత్ అధికారులను ఆదేశించారు. టిటిడి అధికారులతో కలిసి గురువారం రేణిగుంట విమానాశ్రయం నుండి అలిపిరి గరుడ సర్కిల్ వరకు ఆయన పర్యటించి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జెఇఒ మాట్లాడుతూ ఈ నెల 15 నుండి 23వ తేదీ వరకు అత్యంత వైభవంగా జరుగనున్న శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు దేశం నలుమూలల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు తిరుపతికి తరలిరానున్న నేపథ్యంలో, తిరుపతి నగరానికి అడుగుపెట్టిన ప్రతి భక్తుడికి శ్రీవారి బ్రహ్మోత్సవాల దివ్య వైభవం ప్రస్ఫుటంగా కనిపించేలా నగర పరిసరాలను తీర్చిదిద్దాలని ఆయన సూచించారు. రేణిగుంట విమానాశ్రయం నుంచి తిరుపతి నగరానికి చేరుకునే మార్గంతో పాటు, నగరాన్ని నాలుగు వైపుల నుంచి కలిపే ప్రధాన కూడళ్లన్నీ శ్రీవారి భక్తి పరిమళాలు వెదజల్లేలా, ఆధ్యాత్మిక శోభతో అలరారేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఇ మనోహరం, ఎస్ఇ వేంకటేశ్వర్లు, అదనపు ఆరోగ్యఅధికారి డాక్టర్ సునీల్, విఎస్ఒ గిరిధర, ఇఇలు రవిశంకర్ రెడ్డి, సరస్వతి తదితర అధికారులు పాల్గొన్నారు.

## డిప్యూటీ ఇఒ లోకనాథంపై రెడ్ బుక్ పంజా

### వైసిపి నేత భూమన ఘాటు వ్యాఖ్యలు

**తిరుపతి, సెప్టెంబరు 3 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల శ్రీవారి ఆలయ డిప్యూటీ ఇఒ ఎం. లోకనాథం యాదవ్‌పై జరిగిన ఎసిబి దాడులు, అరెస్టు వెనుక కుట్ర, కుతంత్రం దాగి ఉన్నాయని టిటిడి మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. సిబిఐ సిట్ వందల మందిని విచారణచేసి ఛార్జ్‌షీట్ దాఖలు చేసినా అందులో లోకనాథం యాదవ్ పేరు ఎక్కడా లేదని, కనీసం ఆయనను విచారణకు కూడా పిలవలేదని భూమన పేర్కొన్నారు. అలాంటప్పుడు సిబిఐ ఇచ్చిన సమాచారం ఆధారంగానే ఎసిబి చర్యలు చేపట్టిందనే ప్రచారం ఎలా వచ్చిందని ప్రశ్నించారు. ఎసిబి డిఎస్పీ మాత్రం తమకు అందిన ఫిర్యాదు, కోర్టు అనుమతి మేరకు దాడులు నిర్వహించినట్లు చెప్పారని గుర్తుచేశారు. కల్తీనెయ్యిలో ప్రభుత్వానికి ఇచ్చిన నివేదికలోనూ ఆయన పేరు లేదంటున్నారని, మరి మధ్యలో లోకనాథం యాదవ్ ఎలా వచ్చారని అనుమానం వ్యక్తం చేశారు. ఎసిబికి సమాచారం ఇచ్చిందో బయటకు రావాలని భూమనడిమాండ్ చేశారు. టిటిడిలో కొందరు అధికారుల కుమ్మక్కై లోకనాథం యాదవ్‌ను టార్గెట్ చేశారని ఆరోపించారు. ఇది సిబిఐ రిపోర్ట్ కాదని, టిటిడిపై పడిన రెడ్ బుక్ పంజా అని వెంకటేశ్వరస్వామిని అడ్డుపెట్టుకొని టిటిడిని రాజకీయ వనరుగా మార్చుతున్నారని కరుణాకర్‌రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు.

## అలిపిరి తనిఖీ కేంద్రంలో భారీగా మద్యం సీసాలు పట్టివేత

**తిరుమల,సెప్టెంబర్ 3ప్రభాతవార్తప్రతినిధి:** పుణ్యక్షేత్రం తిరుమల పవిత్రతను దెబ్బతీసేలా తిరుమలకు మద్యం తరలిస్తున్న యువకుడిని అలిపిరి తనికీ కేంద్రంలో భద్రత సిబ్బంది పట్టుకున్నారు. గురువారం రాత్రి ఈ సంఘటన జరిగింది. తిరుమల వైభవాన్ని, ఆధ్యాత్మిక వాతావరణాన్ని దెబ్బతీసేందుకు కొందరు అక్రమార్కులు తెగబడుతున్నారు. భక్తుడిలా తిరుపతి లీలామహల్ సెంటర్‌కు చెందిన కె.బాబ్జి సాహసంతో తన వెంట మద్యం బాటిళ్లను లగేజీ సంచిలో తీసుకుని అలిపిరి తనిఖీ కేంద్రం చేరాడు. అక్కడ భద్రత సిబ్బంది నిశితంగా తనిఖీలు చేయడంతో తిరుమలకు తరలించేందుకు తీసుకువచ్చిన మద్యం బాటిళ్ళు, హాన్స్ ప్యాకెట్లు పట్టుబడ్డాయి. భక్తుడిలా ఇతను అక్రమ రవాణాకు పాల్పడుతున్నట్లు ఏవిఎస్ఒ రమేశ్ కృష్ణ గుర్తించారు. అలిపిరి తనిఖీల్లో భద్రత సిబ్బంది సమర్థవంతంగా అడ్డుకున్నారు. అతని వద్ద 9 మద్యం క్వార్టర్ బాటిళ్లు బయటపడ్డాయి. వెంటనే విజిలెన్స్, పోలీసులు మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, బాబ్జిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి తదుపరి విచారణ జరుపుతున్నారు. భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా ఇలాంటి చర్యలకు పాల్పడితే చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని విజిలెన్స్, పోలీసులు హెచ్చరిస్తున్నారు.

## స్పీకర్ అయ్యన్నపాత్రుడు పుట్టినరోజు సందర్భంగా

# మెగా రక్తదాన శిబిరం

### రాజ్యసభ ఎంపీ చింతకాయల విజయ్ పిలుపు



**నర్సీపట్నం, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు 70వ జన్మదినాన్ని పురస్కరించుకుని సెప్టెంబర్ నేడు ఉదయం 9 గంటల నుంచి నర్సీపట్నంలోని ఎన్టీఆర్ ప్రభుత్వ ఆసుపత్రి, పెద్ద బొడ్డేపల్లి మార్కెట్ యార్డు ప్రాంగణంలో భారీ మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నారు. ఈ సేవా కార్యక్రమంలో అయ్యన్నపాత్రుడి అభిమానులు, పార్టీ శ్రేణులు మరియు యువత పెద్ద ఎత్తున పాల్గొని రక్తదానం (తరువాయి 8వ పేజీలో)

## బాలసదనం విద్యార్థినుల నడుమ

# స్పీకర్ అయ్యన్నపాత్రుడు జన్మదిన వేడుకలు

### ఘనంగా పుస్తకాలు, కూలింగ్ ప్లాస్క్ వాటర్ బాటిళ్ల పంపిణీ

### రేపటి రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని డాక్టర్ సువర్ణ పిలుపు



**నర్సీపట్నం, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు 70వ జన్మదినోత్సవం, అలాగే వారి మనవడు శివన్ పాత్రుడు పుట్టినరోజును పురస్కరించుకుని స్థానిక బీసీ కాలనీలోని బాలసదనంలో విద్యార్థినుల మధ్య ఒకరోజు ముందే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు పుస్తకాలు, వాటర్ బాటిల్స్, స్వీట్లను అందజేశారు. ఈ సేవా కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు చింతకాయల విజయ్ సతీమణి డాక్టర్ సువర్ణ, టీడీపీ పట్టణ అధ్యక్షులు చింతకాయల రాజేష్ సతీమణి చింతకాయల దివ్యశ్రీ, నిహిత పాల్గొని చిన్నారులకు స్వయంగా కానుకలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సువర్ణ మాట్లాడుతూ, తమ కుటుంబంలో (తరువాయి 8వ పేజీలో)

## హోమిబాబా క్యాన్సర్ ఆసుపత్రిలో

# పాలియేటివ్ కేర్ సెంటర్ ప్రారంభం

### కోటి రూపాయలుతో ఆసుపత్రిలో మౌళిక వసతులు కల్పనకు హామీ

### అనకాపల్లి జిల్లా కలెక్టర్‌తో కలసి ప్రారంభించిన పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల



**విశాఖపట్నం, సెప్టెంబర్ 3, ప్రభాత వార్త :** క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించి, సకాలంలో వైద్యం అందించడం అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ అన్నారు. అనకాపల్లి జిల్లా బాటజంగాలపాలెం ప్రాంతంలోని హోమిబాబా క్యాన్సర్ ఆసుపత్రి, రీసెర్చ్ సెంటర్, సీతార – ఉపశమన సంరక్షణ (పాలియేటివ్ కేర్) కేంద్రంను గురువారం ఉదయం పెందుర్తి శాసన సభ్యులు పంచకర్ల రమేష్‌బాబుతో కలిసి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ మాట్లాడుతూ క్యాన్సర్‌ను తోలి దశలోనే గుర్తించి, వైద్యం అందించడం అత్యంత కీలకమని తెలిపారు శాసనసభ్యులు పంచకర్ల (తరువాయి 8వ పేజీలో)

# అగనంపూడిని సుందరంగా తీర్చిదిద్దుతా

### రాష్ట్ర టిడిపి అధ్యక్షులు గాజువాక ఎమ్మెల్యే పల్లా



**అగనంపూడి, సెప్టెంబరు 3, ప్రభాతవార్త :** అగనంపూడి సుందరంగా తీర్చిదిద్దుతానని రాష్ట్ర టిడిపి అధ్యక్షులు గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. 85వ వార్డు అధ్యక్షు లు కర్రీ దశంద్ర ఆధ్వర్యంలో అగనంపూడి మినీ జగదంబ జంక్షన్‌లో జరిగిన ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని మాట్లాడుతూ, ఎలక్షన్లో అగనంపూడి ప్రజలు అత్యధిక మెజార్టీ ఇచ్చారని కొనియాడారు. అగనంపూడి ఆసుపత్రి త్వరలోనే ప్రారంభిస్తామని, శివాలయం నుండి అమ్మ అపార్ట్మెంట్ వరకు రోడ్డులు సుందరీకరణ (తరువాయి 8వ పేజీలో)

# 'డ్రైవ్ మోడ్'లో రెవెన్యూ సమస్యలకు పరిష్కారం

### ప్రభుత్వ భూముల పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి

### విశాఖ, భీమిలి రెవెన్యూ కాన్ఫరెన్స్‌ల్లో జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిశోర్



**విశాఖపట్నం, సెప్టెంబరు 3, ప్రభాతవార్త :** రెవెన్యూ శాఖకు సంబంధించిన దీర్ఘకాలిక, క్లిష్టమైన సమస్యల పరిష్కారానికి అధికారులు డ్రైవ్ మోడ్‌లో పనిచేయాలని విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ ఆదేశించారు. పెండింగ్ సమస్యలను నిర్ణీత కాలపరిమితిలోగా పరిష్కరించి ప్రజలకు సత్వర సేవలు అందించాలని సూచించారు. విశాఖపట్నం, భీమిలి రెవెన్యూ డివిజన్ల రెవెన్యూ కాన్ఫరెన్స్ గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మండలాల వారీగా బల్క్ ఇష్యూస్, పెండింగ్ సమస్యలు, 22ఏ కేసులు, డీ-నోటిఫికేషన్, ఆక్రమణల క్రమబద్ధీకరణ, మాన్యువల్ దరఖాస్తుల (తరువాయి 8వ పేజీలో)

## 'గ్రేటర్'లో 120 వార్డుల పెంపునకు

# హైకోర్టు ఓకే

### డీలిమిటేషన్‌పై పిటిషన్లు కొట్టివేత..

### స్థానిక సంస్థల ఎన్నికలకు లైన్ క్లియర్



**(ప్రభాతవార్త – విశాఖపట్నం)** గ్రేటర్ విశాఖపట్నం నగరపాలక సంస్థ(జీవీఎంసీ)లో వార్డుల సంఖ్యను 98 నుంచి 120కి పెంచుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో జీవీఎంసీ పరిధిలో 120 వార్డుల ప్రాతిపదికన స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు ఉన్న న్యాయపరమైన అడ్డంకులు తొలగిపోయాయి.
ఎస్ఐఆర్ ప్రక్రియ సమయంలో వార్డుల డీలిమిటేషన్ చేపట్టడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణ జరిపిన హైకోర్టు గురువారం వాటిని కొట్టివేసింది. ప్రభుత్వం తరఫున వార్డుల వైశాల్యంలో ఎలాంటి మార్పులు చేయలేదని కోర్టుకు వివరించింది. ఈ నేపథ్యంలో డీలిమిటేషన్ ప్రక్రియపై ఉన్న అభ్యంతరాలకు తెరపడింది. వార్డుల సంఖ్య 120కి పెరగడంతో జీవీఎంసీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ప్రభుత్వం తదుపరి చర్యలు చేపట్టేందుకు మార్గం సుగమమైంది. ఇప్పటికే స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తుండగా, హైకోర్టు తాజా తీర్పుతో ఎన్నికల ప్రక్రియ మరింత వేగం పుంజుకునే అవకాశం ఉంది. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలన్నీ ఈ ఏడాదిలోనే పూర్తి చేయాలని ఇటీవల జరిగిన మంత్రివర్గ సమావేశంలో సీఎం చంద్రబాబు కీలక సూచనలు చేసిన విషయం తెలిసిందే. అలాగే ఏపీ విద్యాశాఖ మంత్రి లోకేష్ కూడా అక్టోబర్‌లో తొలి విడతగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉందని స్పష్టం చేశారు. దీంతో జీవీఎంసీలో 120 వార్డుల ఆధారంగా ఎన్నికల ప్రక్రియ ఎప్పుడు ప్రారంభమవుతుంది, వార్డుల వారీగా ఓటర్ల జాబితాలు, రిజర్వేషన్ల ప్రక్రియ ఎలా సాగుతుందన్న అంశాలపై నగరవాసుల్లో ఆసక్తి నెలకొంది.

# నేడు కృష్ణాష్టమి



**విశాఖపట్నం, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త** శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలకు నగరంలోని ఆలయాలు ముస్తాబయ్యాయి. భగవాన్ శ్రీకృష్ణుడి జన్మదినాన్ని పురస్కరించుకుని గురువారం భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించనున్నారు. ఆలయాల్లో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించేందుకు ఏర్పాట్లు చేశారు. కృష్ణాష్టమి సందర్భంగా చిన్నారులను శ్రీకృష్ణుడు, రాధా వేషధారణలో అలంకరించి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వ హించనున్నారు. పలుచోట్ల ఉట్టి కొట్టే కార్య క్రమాలు, భజనలు, కోలాటాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. శ్రీకృష్ణుడి జన్మవృత్తాంతాన్ని స్మరించుకుంటూ భక్తులు ఉపవాస దీక్షలు చేపట్టి రాత్రి వేళ ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. శ్రీకృష్ణుని ఆరాధనతో కుటుంబాల్లో సుఖశాంతులు, సౌభాగ్యం కలుగుతాయని భక్తుల విశ్వాసం. కృష్ణాష్టమి సందర్భంగా ఆలయాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

# అమ్మకానికి విశాఖ ఉక్కు భూములు

### కేంద్రం గ్రీన్ సిగ్నల్..

### 459 ప్లాట్లకు ఈ-వేలం

**విశాఖపట్నం, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త :** విశాఖ ఉక్కు కర్మాగారానికి చెందిన విలువైన భూములను విక్రయించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ ప్రక్రియలో భాగంగా మొత్తం 93,572 చదరపు గజాల విస్తీర్ణం కలిగిన 459 ఆర్ఎన్ఎల్ ప్లాట్లను ఈ-వేలం పద్ధతిలో విక్రయించనున్నారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల ఆధీనంలో ఉన్న అదనపు ఆస్తుల మానిటైజేషన్లో భాగంగా నేషనల్ ల్యాండ్ మానిటైజేషన్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈ విక్రయాలు జరగనున్నాయి. ఈ వేలంలో ప్రధానంగా మద్దిలపాలెం హెచ్‌బీ కాలనీ పరిధిలోని 456 నివాస స్థలాలు, అలాగే గాజువాక ఆటోనగర్‌లోని వాణిజ్య, నివాస అవసరాలకు అనువైన ప్లాట్లు అందుబాటులో ఉన్నాయి. స్పష్టమైన యాజమాన్య హక్కులు, అన్ని రకాల మౌలిక సదుపాయాలు కలిగి ఉన్న ఈ స్థలాలు విశాఖపట్నం నగరంలోని కీలక ప్రాంతాల్లో విస్తరించి ఉన్నాయి. ఈ ఆన్‌లైన్ వేలం ప్రక్రియను అక్టోబర్ 12, 16 తేదీల్లో 'రైల్టెల్ ఈ-నివిదా' వేదికగా నిర్వహించనున్నారు. వేలంలో పాల్గొనడానికి ఆసక్తి కలిగిన దరఖాస్తుదారులు ముందుగా ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, కేవైసీ ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంటుంది. అనంతరం ప్రతి ప్లాట్‌కు రూ.2 లక్షల చొప్పున ధరావత్తు చెల్లించాల్సి ఉంటుంది. విశాఖ ఉక్కు కర్మాగారానికి చెందిన భూముల విక్రయానికి కేంద్రం ఆమోదం తెలపడంతో నగరంలో ఈ అంశం చర్చనీయాంశంగా మారింది. కీలక ప్రాంతాల్లో ఉన్న స్థలాలు ఈ-వేలం ద్వారా అందుబాటులోకి రావడంతో కొనుగోలుదారుల నుంచి స్పందన ఎలా ఉంటుందన్నది ఆసక్తికరంగా మారింది.



## టీడీపీలోకి యువ నాయకురాలు కొల్లాబత్తుల ప్రసూన

# స్వాగతించిన ఎంపీ శ్రీభరత్

- రాజకీయాల్లో పదవుల కోసం కాకుండా ప్రజాసేవ కోసం యువత ముందుకు రావాలి: శ్రీభరత్
- పోలవరం పూర్తయితే ఉత్తరాంధ్రలో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం...
- కలిసికట్టుగా పనిచేస్తే వార్డుల అభివృద్ధి వేగవంతం..
- అభివృద్ధితో పాటు ప్రజల జీవనశైలిలోనూ మార్పు రావాలి
- పరిశుభ్రత, పౌర బాధ్యతపై ప్రజల్లో అవగాహన పెరగాలి



**విశాఖపట్నం, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త :** తెలుగుదేశం పార్టీలోకి యువతేజం కొల్లాబత్తుల ప్రసూన రాజకీయ రంగప్రవేశం చేయడాన్ని విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు మతుకుమిల్లి శ్రీభరత్ స్వాగతించారు. విశాఖలోని టిడిపి కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో 47వ వార్డుతో పాటు వివిధ వార్డుల నుంచి వచ్చిన ప్రజా ప్రతినిధులు, సీనియర్ కార్యకర్తలు, మహిళా నాయకులు, పార్టీ శ్రేణుల సమక్షంలో జరిగిన కార్యక్రమంలో ప్రసూనతో పాటు ఆమె అనుచరులు 13 మందికి ఎంపీ శ్రీభరత్ పార్టీ కండువా కప్పి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా శ్రీభరత్ మాట్లాడుతూ.. బీటెక్, ఎంబీఏ పూర్తి చేసి దుబాయ్‌లో మంచి (తరువాయి 8వ పేజీలో)

## 14వ అంతస్తు నుంచి దూకి

# నేవీ ఉద్యోగి భార్య ఆత్మహత్య

### నౌసనాబాగ్ గోమతి అపార్ట్‌మెంట్‌లో విషాదం



**గాజువాక, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త :** విశాఖపట్నం నావికాదళ గృహసముదాయమైన నౌసనాబాగ్‌లో గురువారం ఉదయం తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఒక వివాహిత ఎత్తయిన భవనం పైనుంచి దూకి బలవన్మరణానికి పాల్పడింది.
మల్కాపురం పోలీసుల సమాచారం ప్రకారం. మధ్యప్రదేశ్‌కు చెందిన ప్రియాంక వర్మ (22) కు ఐదేళ్ల క్రితం దీపక్ వర్మతో వివాహమైం ది. ఆయన విశాఖపట్నంలోని భారత నౌకా దళంలో ఉద్యోగం చేస్తున్నారు. వీరికి ఒక బాబు, పాప ఉన్నారు. ప్రస్తుతం వీరు మల్కా పురం పోలీస్ స్టేషన్ పరిధిలోని నౌసనా బాగ్‌లో ఉన్న గోమతి అపార్ట్‌మెంట‌్‌లో నివాస ముంటున్నారు. గురువారం ఉదయం సుమారు 8:00 గంటల సమయంలో ప్రియాంక వర్మ తాను ఉంటున్న గోమతి అపార్ట్‌మెంట్ 14వ అంతస్తు నుంచి ఒక్కసారిగా కిందకు దూకేశారు. తీవ్ర గాయాలపాలైన ఆమె అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. సమాచారం అందుకున్న నేవీ పోలీసులు వెంటనే మల్కాపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. మృతురాలి తల్లిదండ్రులు ప్రస్తుతం అరుణాచల్ ప్రదేశ్‌లో (తరువాయి 8వ పేజీలో)

# ఉన్నత శిఖరాలు చేరుకోవాలంటే క్రమ శిక్షణ, పట్టుదల ఆయుధాలు

### మాజీ మంత్రి అవంతి

### పరిశోధనా నైపుణ్యాలతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

### ఇంజనీరింగ్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు అవంతి శ్రీనివాసరావు దిశానిర్దేశం

### అవంతి కళాశాల మీ సొంత ఇళ్ళు లాంటిది

**తగరపువలస, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త :** విద్యార్థి దశ ఎంతో కీలకమైందని, ఈ దశలోనే ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని క్రమశిక్షణ, పట్టుదలతో ముందుకు సాగితే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని అవంతి విద్యాసంస్థల చైర్మన్, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. తగరపువలసలోని అవంతి ఇంజనీరింగ్ ఆటోనమస్ కళాశాలలో ప్రథమ సంవత్సరం విద్యార్థుల కోసం నిర్వహించిన ఇండక్షన్ ప్రోగ్రామ్ కార్యక్రమాన్ని ఆయన ముఖ్య అతిథులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థుల ఆలోచనలు నూతనంగా, ఉన్నతంగా, సృజనాత్మకంగా ఉండాలని సూచించారు. ప్రస్తుత సమాజంలో మంచి గుర్తింపు పొందేలా తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని చెప్పారు. సమాజంలోని (తరువాయి 8వ పేజీలో)




## విశాఖలో ఇండియన్ ఆర్మీ

# అగ్నివీర్ నియామక ర్యాలీ ప్రారంభం

### బుధవారం అర్ధరాత్రి నుంచే ప్రారంభమైన ఆర్మీ నియామక ర్యాలీ

### తొలి రోజు 1.6 కే రన్నింగ్ రేస్ టెస్ట్ లో పాల్గొన్న 725 మంది అభ్యర్థులు

### పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేసిన జిల్లా యంత్రాంగం

### రాత్రి ఒంటి గంట నుంచి తెల్ల వారు జాము నాలుగు గంటల వరకూ నిర్వహణ



**విశాఖపట్నం, సెప్టెంబర్ 3 ప్రభాత వార్త :** అగ్నివీర్ పథకం కింద విశాఖపట్నంలో ఇండియన్ ఆర్మీ నిర్వహించతలపెట్టిన ఆర్మీ నియామక ర్యాలీ బుధవారం అర్ధరాత్రి నుంచి ప్రారంభమైంది. సెప్టెంబర్ 2 అర్ధరాత్రి నుంచి 20వ తేదీ వరకు ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ర్యాలీనిర్వహించనున్న నేపథ్యంలో జిల్లా యం త్రాంగం అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది. తొలి రోజు బుధవారం అర్ధ రాత్రి విశాఖ బీచ్ రోడ్డు లో ప్రారంభం అయిన ఆర్మీ నియామక (తరువాయి 8వ పేజీలో)

# విశాఖ రైల్వే అభివృద్ధికి సమగ్ర కార్యాచరణ చేపట్టాలి

### మూడో, నాలుగో లైన్ల నిర్మాణం పూర్తి చేయాలి.. 14 ప్లాట్‌ఫారాలకు విస్తరణ వేగవంతం చేయాలి

### ఎంపీ శ్రీభరత్‌కు రైల్వే జాతీయ కార్మిక నేత చలసాని గాంధీ విజ్ఞప్తి



**విశాఖపట్నం, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త :** దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటు నేపథ్యంలో విశాఖపట్నం రైల్వే డివిజన్‌లో మౌలిక సదుపాయాల అభివృద్ధి, రైళ్ల సమయపాలన మెరుగుదల, ప్రయాణికుల సౌకర్యాల విస్తరణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సీనియర్ రైల్వే జాతీయ కార్మిక నాయకులు, డీఆర్‌యూసీసీ వాల్తేర్ డివిజన్ సభ్యులు చలసాని గాంధీ కోరారు. ఈ మేరకు విశాఖ లోక్‌సభ సభ్యులు మతుకుమిల్లి శ్రీభరత్‌కు వినతిపత్రం సమర్పించారు.
గతంలో వాల్తేర్ డివిజన్‌గా ఉన్న విశాఖపట్నం డివిజన్ దేశంలోనే ముఖ్యమైన ఆదాయ వనరులున్న డివిజన్లలో ఒకటని, ముఖ్యంగా ఇనుప ఖనిజం, బొగ్గు, ఉక్కు, పోర్టు ఆధారిత సరుకు రవాణాలో కీలక పాత్ర పోషిస్తోందని గాంధీ పేర్కొన్నారు. అయితే రైళ్ల రద్దీ, సరుకు రవాణా పెరుగుతున్న స్థాయిలో మౌలిక సదుపాయాలు అభివృద్ధి చెందకపోవడంతో సమయపాలన, రైళ్ల నిర్వహణలో ఇబ్బందులు (తరువాయి 8వ పేజీలో)

## స్పీకర్ అయ్యన్నపాత్రుడు పుట్టినరోజు సందర్భంగా మెగా రక్తదాన శిబిరం

(7వ పేజీ తరువాయి)

చేయాలని రాజ్యసభ సభ్యులు చింతకాయల విజయ్ పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా ఎంపీ చింతకాయల విజయ్ మాట్లాడుతూ, 1995 నుంచే అయ్యన్నపాత్రుడు రక్తదానం ప్రాముఖ్యతను గుర్తించి, అనేక మంది ప్రాణాలు కాపాడవచ్చనే ఉద్దేశంతో 'అయ్యన్న యూత్' ఆధ్వర్యంలో రక్తదాన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని గుర్తుచేశారు. అప్పటి నుంచి ఇప్పటివరకు ఆయన తన పుట్టినరోజు నాడు కేక్ కటింగ్లు, పూలమాలలు, సన్మానాలకు బదులుగా రక్తదానం చేయడానికే ప్రాధాన్యతనిస్తూ వస్తున్నారని తెలిపారు. రెడ్ క్రాస్, ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా నారా భువనేశ్వరి చేపడుతున్న సేవా భావాలను సైతం ఆదర్శంగా తీసుకుని ఈ కార్యక్రమాలు కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. ప్రస్తుత తరానికి చెందిన యువత (జెన్-జీ, జెన్-ఆల్ఫా) రక్తదానంపై పూర్తి అవగాహన పెంచుకోవాలని, ప్రతి ఆరు నెలలకొకసారి రక్తం ఇవ్వడం వల్ల ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు ఎంతోమంది ప్రాణాలు నిలబెట్టవచ్చని సూచిం చారు. ఈ శిబిరం పూర్తిగా అనుభవజ్ఞులైన వైద్యుల పర్యవేక్షణలో జరుగుతుందని, రక్తదానం చేసిన వారికి అధికారిక ధ్రువీకరణ పత్రాలు అందజేస్తామని వివరించారు. ఎమర్జెన్సీ సమయాల్లో అయ్యన్నపాత్రుడి నివాసానికి ఎందరో బాధితులు రక్తం కోసం వస్తుంటారని, అలాంటి ఆపదలో ఉన్నవారికి ప్రాణదానం చేసినప్పుడు కలిగే సంతృప్తి అమూల్యమైనదని అన్నారు. కాబట్టి గ్రామీణ ప్రాంతాల నుంచి యువత, ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి రక్తదానం చేసి, అయ్యన్నపాత్రుడి 70వ పుట్టినరోజు రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని ఆయన సవినయంగా కోరారు.

## బాలసదనం విద్యార్థినుల నడుమ స్పీకర్ అయ్యన్నపాత్రుడు జన్మదిన వేడుకలు

(7వ పేజీ తరువాయి)

ఏ శుభకార్యం జరిగినా బాలసదనం విద్యార్థినులతో పంచుకోవడం ఆనవాయితీగా వస్తోందని పేర్కొన్నారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు, బాబు శివన్ పాత్రుడు పుట్టినరోజు వేళ ఇక్కడి పిల్లలతో కలిసి సమయం గడపడం ఎంతో సంతోషాన్ని, సంతృప్తిని ఇచ్చిందని ఆనం దం వ్యక్తం చేశారు. అలాగే అయ్యన్నపాత్రుడు జన్మదినాన్ని పురస్కరిం చుకుని శుక్రవారం నిర్వహించనున్న మెగా రక్తదాన శిబిరంలో పార్టీ శ్రేణులు, అభిమానులు, యువత పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి లాలం మురళీకృష్ణతో పాటు నాయకులు చితికెల శేఖర్, తమ్మినాయుడు, డాబాల శ్రీను, కన్నూరు శ్రీను, సలీమ్ తదితరులు పాల్గొన్నారు.

## హోమిబాబా క్యాన్సర్ ఆసుపత్రిలో పాలియేటివ్ కేర్ సెంటర్ ప్రారంభం

(7వ పేజీ తరువాయి)

రమేష్ బాబు మాట్లా డుతూ, అవసాన దశలో ఉన్న క్యాన్సర్ రోగుల ఉపశమన సంరక్షణకు అవసరమైన సేవలు ఇక్కడ అందుతాయని పేర్కొన్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులు, సహాయకుల వసతి, మౌలిక సదుపాయాల కోసం విడతల వారీగా దాదాపు రూ.1 కోటి సహాయం అందిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అలాగే రోగులు, సహాయకులకు ఆహార సదుపా యాలు కల్పించేందుకు సహకరిస్తామన్నారు. అభివృద్ధికి సహకరించిన ఇంబెల్ (ఇండియా) లిమిటెడ్, ఐసీఐసీఐ ఫౌండేషన్, సిప్లా ఫౌండేషన్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అనకాపల్లి జిల్లా కలెక్టర్‌ను ఈ సందర్భంగా అభినందించారు. ఈ కేంద్రంలో ప్రతి గురువారం ఉదయం ఎంఎల్హెచ్పీలకు, మధ్యాహ్నం ఆశా కార్యకర్తలకు క్యాన్సర్ అవగాహన, స్క్రీనింగ్, పాలియేటివ్ కేర్‌పై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తారు. నేడు మొదటి విడత శిక్షణ పూర్తి అయినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ . ఆర్. అచ్యుత కుమారి, హోమిబాబా క్యాన్సర్ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ . ఉమేష్ మహంతశెట్టి, ట్రైనింగ్ హెడ్ డాక్టర్ . డోలా రోసా, ప్రాజెక్ట్ నోడల్ ఆఫీసర్ జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ . చంద్రశేఖర్ దేవ్, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ . ఎస్థర్ రాణి తదితర అధికారులు పాల్గొన్నారు.

## 'డ్రైవ్ మోడ్'లో రెవెన్యూ సమస్యలకు పరిష్కారం

(7వ పేజీ తరువాయి)

పరిష్కార స్థితి తదితర అంశాలపై జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరితో కలిసి ఆయన సమీక్షించారు. ప్రతి అంశానికి స్పష్టమైన టైమ్‌లైన్ నిర్దేశించుకుని లక్ష్యాలను సాధించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ భూముల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని, వాటర్ బాడీస్ ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని చెప్పారు. క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. ప్రజా ప్రయోజనాల కోసం భూములు కోల్పోయిన వారికి నిబంధనల ప్రకారం పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. 22ఏ కేసులు, డీ-నోటిఫికేషన్ అంశాల పరిష్కారంలో వారాంతపు లక్ష్యాలను నిర్దేశించుకుని పురోగతి సాధించాలన్నారు. పెండింగ్ సమస్యలను ప్రత్యేకంగా గుర్తించి వాటి పరిష్కారానికి డ్రైవ్ మోడ్ అనుసరించాలన్నారు. పీజీఆర్ఎస్ ద్వారా అందుతున్న వినతులకు నాణ్యమైన, శాశ్వత పరిష్కారం అందించాలన్నారు. ఒకే సమస్యపై ప్రజలు పదేపదే కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండకూడదన్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలను తెలుసుకుని, వాస్తవ పరిస్థితుల ఆధారంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో ఇప్పటి వరకు అధికారుల దృష్టికి రాని క్లిష్టమైన రెవెన్యూ సమస్యలు ఏమైనా ఉన్నాయా అనే అంశాన్ని వీఆర్వోల ద్వారా ప్రత్యేకంగా తెలుసుకుని నివేదించాలన్నారు. ఆన్‌లైన్ సేవలను విస్తృతం చేయాలని సూచించారు. మెట్రో, రైల్వే తదితర కీలక అభివృద్ధి ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న పనులను గుర్తించి పూర్తి చేయడంతో పాటు ప్రతి అంశానికి టైమ్‌లైన్ ఏర్పాటు చేసుకుని నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. సమావేశంలో జేసీతో పాటుడీఆర్వో.ఎం.విశ్వేశ్వరనాయుడు, ఆర్డీవోలు దిలీప్ చక్రవర్తి, సంగీత్ మాథుర్, డిప్యూటీ కలెక్టర్లు గోవిందు, అనిత, మాధవీలత, కలెక్టరేట్ ఏవో బీవీ రాణి, తహశీల్దార్లు, డీటీలు, కలెక్టరేట్ సెక్షన్ల సూపరింటెండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## అగనంపూడిని సుందరంగా తీర్చిదిద్దుతా

(7వ పేజీ తరువాయి)

చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతుందని అన్నారు. అక్టోబర్లో 3 లక్షల మందికి నూతనంగా కొత్త పెన్షన్లు మంజూరు చేస్తామన్నారు. ఎవరికైనా ఆరోగ్య సమస్యలు ఉంటే ఎంతటి ఆపరేషన్ అయినా చేయించేందుకు ఎల్లవేళలా నేను ముందు ఉంటానని అన్నారు. బొర్రా మాంబ గుడి దగ్గర వాకింగ్ ట్రాక్ అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. మాజీమంత్రి, జిసిసి చైర్మన్ కిలారి శ్రావణ్ మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షుడు మీ నియోజకవర్గంలో ఉండడం మీ అదృష్టమని ఆయన అన్నారు. నియోజవర్గ అభివృద్ధికి ఎనలేని కృషి చేస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వార్డు మాజీ కార్పొరేటర్, ఇ ల్లపు వరలక్ష్మి ప్రసాదు, గాజువాక సమన్వయకర్త ప్రసాదల శీను, వార్డు అబ్జర్వర్ కల్లేపల్లి శ్రీనివాస్ వర్మ, ఏ డి సి చైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ, కర్రి అప్పలరాజు, విందుల రాజు,చందు రమేష్, కో ట్రాయి జగదీశ్వరరావు, కడవల రమణ, అండి బోయిన మంగరాజు, పూడి యుగంధర్, మేడిశెట్టి వెంకటేశ్వరరావు, కర్ణం అప్పారావు, దొక్కా రమేష్, తలారి శ్రీను, పలక అచ్చుతా, వడ్డాది శ్రీను, అధిక సంఖ్యలో కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

## 3.70 కేజీల గంజాయితో పట్టుబడ్డ ముగ్గురు అరెస్ట్, ఒకరు పరార్

**ఆరిలోవ, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త**



ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను ఆరిలోవ పోలీసులు అదుపులో తీసుకొని అరెస్ట్ చేయుగా మరొకరు పరారైనట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాలు ప్రకారం ఆరిలోవ బీఆర్ టి ఎస్ రోడ్డ్ డంపింగ్ యార్డ్ వద్ద నలుగురు వ్యక్తులు గంజాయిని విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో పోలీసులు అక్కడికి చేరుకొని సీతమ్మధారకు చెందిన పిన్నింటి శ్యామ్ చరణ్, అక్కయ్యపాలెం రవీంద్ర నగర్ కు చెందిన కేలవలస హేమంత్ కుమార్, జగదాంబ తాడి వీధికి చెందిన బోనుల ప్రవీణ్ తేజ ను శాంతిభద్రతల ఎస్సై వరహాల నాయుడు వీరిని పట్టుకొని అదుపులో తీసుకున్నారు. వీరితో పాటు అమీర్ అనే నిందితుడు పోలీసులు వద్ద నుండి తప్పించుకొని పరారైనట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు. వీరి వద్ద నుండి మూడు ప్యాకెట్ల గంజాయి మొత్తం 3.70 గంజాయితో పాటు 3 సెల్ ఫోన్లు, మహేంద్ర టియువి 300కారును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. పోలీసుల నుండి తప్పించుకున్న అమీర్ కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపడుతున్నట్లు సీఐ తెలిపారు.

## టీడీపీలోకి యువనాయకురాలు కొల్లాబత్తుల ప్రసూన స్వాగతించిన ఎంపీ శ్రీభరత్

(7వ పేజీ తరువాయి)

ఉద్యోగాన్ని వదులుకుని ప్రజాజీవితంలోకి రావాలనే నిర్ణయం తీసుకోవడం అభినందనీయమన్నారు.

### ప్రజాసేవే రాజకీయాలకు ప్రాథమిక లక్ష్యం

యువత మంచి నాయకులను స్ఫూర్తిగా తీసుకుని, ప్రజలకు ఉపయోగపడే విధంగా రాజకీయాల్లో ముందుకు సాగాలని శ్రీభరత్ ఆకాంక్షించారు. మంచి పేరు సంపాదించుకునేలా పనిచేస్తేనే రాజకీయ జీవితం సార్థకమవుతుందని అన్నారు.

### అభివృద్ధితో పాటు జీవనశైలిలో మార్పు అవసరం

రాష్ట్రంలో పెట్టుబడులు రావడం, పరిశ్రమలు ఏర్పడటం, ఉద్యోగాలు లభించడం మాత్రమే అభివృద్ధికి కొలమానం కాదని శ్రీభరత్ అన్నారు. ప్రజల జీవనశైలిలో కూడా సానుకూల మార్పు రావాల్సిన అవసరం ఉందన్నారు. విశాఖపట్నానికి పర్యాటకులు పెద్ద సంఖ్యలో వస్తున్న నేపథ్యంలో నగరాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు.

### చట్టాలను గౌరవించే పౌర సమాజం అవసరం

ప్రపంచంలోని అభివృద్ధి చెందిన నగరాల్లో ప్రజలు చట్టాలను క్రమశిక్షణతో పాటిస్తున్నారని, మన నగరాల్లో కూడా అదే సంస్కృతి పెంపొందాల్సిన అవసరం ఉందని శ్రీభరత్ అన్నారు. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు అభివృద్ధి కోసం పనిచేస్తున్నప్పటికీ ప్రజల సహకారం లేకుండా సంపూర్ణ మార్పు సాధ్యం కాదన్నారు. మార్పు ఒక్కరోజులో రాదని, నిబద్ధతతో, ఓపికతో నిరంతరం పనిచేస్తే కాలక్రమేణా మంచి ఫలితాలు వస్తాయని శ్రీభరత్ పేర్కొన్నారు.

### పోలవరం పూర్తయితే ఉత్తరాంధ్రకు నీటి భద్రత

వర్షాలు సక్రమంగా లేకపోవడంతో భూగర్భ జలాలు తగ్గిపోయి అనేక ప్రాంతాల్లో నీటి సమస్య తలెత్తిందని శ్రీభరత్ తెలిపారు. పోలవరం ప్రాజెక్టు పూర్తయితే ఏడాది పొడవునా నీటి లభ్యతకు మరింత భరోసా ఏర్పడుతుందని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయడంపై ప్రత్యేక దృష్టి సారించారని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టు పనులు ఆలస్యం కావడంతో నిర్మాణ వ్యయం గణనీయంగా పెరిగిందని శ్రీభరత్ పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వం పోలవరం పనులను వేగవంతం చేసి, ఈ టర్మ్‌లో ప్రాజెక్టును పూర్తి చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోందన్నారు. ఇప్పటికే అనకాపల్లి ప్రాంతానికి గోదావరి జలాలు చేరడం శుభపరిణామమని, త్వరలోనే విశాఖపట్నానికి కూడా పోలవరం ఎడమ కాలువ ద్వారా నీరు అందుబాటులోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రానున్న కాలంలో ఉత్తరాంధ్రకు నీటిని తీసుకురావడమే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యమన్నారు.

### కలిసికట్టుగా పనిచేస్తే వార్డుల అభివృద్ధి వేగవంతం

కొల్లాబత్తుల ప్రసూన స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమన్వయంతో పనిచేయాలని శ్రీభరత్ సూచించారు. వార్డులోని అన్ని వర్గాలను కలుపుకుని ముందుకు వెళ్తే అభివృద్ధి కార్యక్రమాలను సమన్వయంతో అమలు చేయగలమన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరూ కలిసికట్టుగా పనిచేసి వార్డుల అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. "మంచి దారిని ఎంచుకుని, ప్రజలకు సేవ చేస్తూ మంచి పేరు సంపాదించుకోవాలి. ప్రసూన గారికి, ఆమెతో పాటు పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ తెలుగుదేశం పార్టీలోకి హృదయపూర్వక స్వాగతం" అని ఎంపీ శ్రీభరత్ అన్నారు. విశాఖపట్నం పార్లమెంటరీ నియోజకవర్గం టిడిపి అధ్యక్షులు చోడే పట్టాభిరామ్ మాట్లాడుతూ పోలవరం, అమరావతి చంద్రబాబు కలలని గత ప్రభుత్వ హయాంలో పోలవరం, అమరావతిల పై నిర్లక్ష్యం, అవరోధాలు చోటుచేసుకున్నాయని విమర్శించారు. వాటిని పూర్తి చేయాలన్నది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంకల్పమని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వ హయాంలో ఎంపీ శ్రీభరత్ సహకారంతో విశాఖపట్నంలో రైల్వే జోన్ నుంచి డేటా సెంటర్ల వరకు అనేక కీలక అభివృద్ధి కార్యక్రమాలు ముందుకు సాగుతున్నాయని తెలిపారు.

ఈ కార్యక్రమంలో విశాఖ టిడిపి ఉత్తర నియోజకవర్గం పరిశీలకులు కిమిడి రామ్ మల్లిక్ నాయుడు, మాజీ కార్పొరేటర్ హనూక్ ఉత్తర నియోజకవర్గం నాయకులు తదితరులు పాల్గొన్నారు..

## విశాఖలో ఇండియన్ ఆర్మీ అగ్నివీర్ నియామక ర్యాలీ ప్రారంభం

(7వ పేజీ తరువాయి)

ర్యాలీ లో 725 మంది పాల్గొన్నారు. అభ్యర్థులకు ర్యాలీలో భాగంగా తొలుత 1.6 కే ఫిజికల్ రన్నింగ్ టెస్ట్ ను నిర్వహించారు. ఇందుకోసం శారీరక పరీక్షల్లో భాగంగా 1.6 కిలోమీటర్ల రన్నింగ్ రేస్ కోసం ఆర్కే బీచ్ రోడ్డులోని ది పార్క్ హోటల్ జంక్షన్ నుంచి విశ్వప్రియ ఫంక్షన్ హాల్ వరకు ప్రత్యేకంగా ట్రాక్ ఏర్పాటు చేశారు.రాత్రి ఒంటి గంట నుంచి తెల్ల వారు జాము 4 గంటల వరకు ఆర్.కె. బీచ్‌రోడ్డులోని ఎన్‌టీఆర్ సర్కిల్ నుంచి 1.6 కిలోమీటర్లవరకు నిర్వహించిన రన్నింగ్ రేస్ టెస్ట్ లో ప్రతి బ్యాచ్ లో వంద మంది అభ్యర్థులు వుండే విధంగా జాగ్రత్త తీసుకొన్నారు రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ట్రాఫిక్, భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. ర్యాలీ ప్రాంగణం, రన్నింగ్ సైట్ వద్ద వైద్య బృందాలు, అంబులెన్సులను అందుబాటులో ఉంచారు. అగ్నిప్రమాద నివారణకు ఫైర్ టెండర్, విద్యుత్ అంతరాయాలు లేకుండా జనరేటర్లను సిద్ధంగా ఉంచారు. జిల్లా యంత్రాంగం, ఆర్మీ రిక్రూటింగ్ ఆఫీస్, పోలీస్, జీవీఎంసి, రెవెన్యూ, విద్యుత్, వైద్యారోగ్య శాఖల అధికారులు సమన్వయంతో ర్యాలీని విజయవంతంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టారు. అభ్యర్థులు తమకు కేటాయించిన తేదీ, సమయానికి ర్యాలీ ప్రాంగణానికి చేరుకుని, సంబంధిత అర్హత పత్రాలు, ఒరిజినల్ సర్టిఫికెట్లు, అవసరమైన ఇతర డాక్యుమెంట్లతో హాజరుకావాలని అధికారులు సూచించారు. ర్యాలీ విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ తెలిపారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆయన ఆదేశించారు.

### రాత్రి 11 నుంచి వాహనాల రాకపోకలకు ఆంక్షలు

ఆర్మీ నియామక ర్యాలీ దృష్ట్యా సెప్టెంబర్ 2 నుంచి 20వ తేదీ వరకు ప్రతిరోజూ రాత్రి 11 గంటల నుంచి ఉదయం 7 గంటల వరకు పార్క్ హోటల్ జంక్షన్ నుంచి ఎన్‌టీఆర్ సర్కిల్ వరకు ఇరువైపులా ఎటువంటి వాహనాలను అనుమతించరు. ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు ట్రాఫిక్ ఆంక్షలను గమనించి, ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించుకోవాలని జిల్లా యంత్రాంగం సూచించింది. ఆర్మీ నియామక ర్యాలీ సజావుగా నిర్వహించేందుకు వాహనదారులు, ప్రజలు సహకరించాలని కోరింది.

## ఉన్నత శిఖరాలు చేరుకోవాలంటే క్రమ శిక్షణ, పట్టుదల ఆయుధాలు

(7వ పేజీ తరువాయి)

మంచి చెడులను గుర్తించి, మంచి మార్గాన్ని ఎంచుకుని ఉజ్వల భవిష్యత్‌ను నిర్మించుకోవాలని ఆకాంక్షించారు. టైమ్ మేనేజ్‌మెంట్, కెరీర్ ప్లానింగ్, ప్రాజెక్టులు, పరిశోధనాత్మక ఆలోచనలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.

తాము ఎంచుకున్న రంగంలో అత్యున్నత నైపుణ్యాన్ని సాధించడంతో పాటు నూతన ఆలోచనలు, ఆవిష్కరణలపై ఆసక్తి పెంచుకోవాలని చెప్పారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన నిరుపేద విద్యార్థులు సైతం ఇంజనీరింగ్ విద్యను అభ్యసించాలనే సంకల్పంతో అవంతి విద్యాసంస్థలు వారికి భరోసా కల్పిస్తున్నాయని తెలిపారు. విద్యార్థులు కష్టపడి, క్రమశిక్షణతో చదువుకోవడంతో పాటు యోగ, ధ్యానం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. మీ భవిష్యత్‌ను మీరే నిర్మించుకోవాలని తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జె.ఎన్.టి.యూ. గురజాడ-విజయనగరం రిజిస్ట్రార్ ఇన్‌చార్జ్ ప్రొఫెసర్ కె.చంద్రభూషణరావు మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి, క్రమశిక్షణతో చదివి మంచి భవిష్యత్‌ను నిర్మించుకోవాలని సూచించారు. విద్యార్థులు మంచి ప్రవర్తన, క్రమశిక్షణతో మెలగేలా తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలన్నారు. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో అనేక ఉద్యోగావకాశాలు ఉన్నాయని, వాటిని అందిపుచ్చుకోవాలంటే నైపుణ్యం, అంకిత భావం, కష్టపడే తత్వం అవసరమని తెలిపారు. ఈరోజు నుంచే భవిష్యత్‌కు ప్రణాళిక రూపొందించుకోవాలని సూచిం చారు. ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని అన్నారు.కిషోర్ కొంచాడ, గ్రూప్ మేనేజర్, సీఎస్ఆర్, ఇన్ఫోసిస్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకుని, తమపై తమకు పూర్తి నమ్మకం కలిగి ఉండాలని సూచించారు. 'నేను ఏదైనా సాధించగలను' అనే దృఢ సంకల్పంతో ముందుకు సాగాలని చెప్పారు. సీనియర్ విద్యార్థుల నుంచి మంచి విషయాలను నేర్చుకుని, రెండో సంవత్సరం నుంచే స్పష్టమైన కెరీర్ లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థి తాను ఎంచుకున్న బ్రాంచ్‌లో నైపుణ్యం సాధించి, నూతన ఆలోచనలతో ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలని ఆకాంక్షించారు.

ఫెనోమ్ పీపుల్ సొల్యూషన్ ఆర్కిటెక్ట్ శ్రీ మధు రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవాలంటే కమ్యూనికేషన్ స్కిల్స్‌తో పాటు టెక్నికల్ స్కిల్స్‌ను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. పైథాన్, జావా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, క్లౌడ్ కంప్యూటింగ్ వంటి ఆధునిక సాంకేతిక అంశాలపై అవగాహన పెంచుకోవాలని విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారు. సిస్టర్ స్వాతి, బ్రహ్మకుమారీస్, విశాఖపట్నం మాట్లాడుతూ ప్రథమ సంవత్సరం మొదటి రోజు నుంచే విద్యార్థులు పక్కా ప్రణాళికతో చదువుకోవాలని సూచించారు. ఆరోజు బోధించిన పాఠాలను ఆరోజే అవగాహన చేసుకుంటే చదువులో ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. కష్టపడే తత్వాన్ని అలవర్చుకోవాలని, జీవితంలో యోగ, ధ్యానానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచిం చారు. మానసిక, శారీరక ఆరోగ్యంతో పాటు 'నేను శక్తివంతుడిని.. ఏదైనా సాధించగలను' అనే ఆత్మవిశ్వాసం కలిగి ఉండాలని చెప్పారు.

### క్రమశిక్షణతో లక్ష్యాన్ని చేరుకోవచ్చు

కళాశాల ప్రిన్సిపాల్ డా.బి.మురళీకృష్ణ మాట్లాడుతూ క్రమశిక్షణ, పట్టుదల, ఏకాగ్రతతో సబ్జెక్టులపై పూర్తి అవగాహన కలిగి ఉన్న విద్యార్థులు తప్పనిసరిగా తమ లక్ష్యాలను చేరుకోగలరన్నారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు అవంతి కళాశాల పూర్తి భరోసా కల్పిస్తుందని తెలిపారు.

కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఏ. చంద్రశేఖర్, డా. గండి సత్యనారాయణ, డీన్ అకడమిక్స్, బేసిక్ సైన్స్ అండ్ హ్యూమానిటీస్ విభాగాధిపతి జె.ఆర్.జి. పట్నాయక్, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## వసతి సౌకర్యం కల్పిస్తే ఐదు పంచాయతీలకు మేలు

### 500కు పైపడే విద్యార్థులు చేరేందుకు ఆసక్తి

### లిసంగడ హై స్కూల్ సందర్శన అనంతరం వెల్లడించిన జడ్పీ చైర్ పర్సన్ శ్రీమతి జల్లిపల్లి సుభద్ర

**ముంచంగిపుట్టు, సెప్టెంబరు 3, (ప్రభాతవార్త):**

సంగడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు వసతి సౌకర్యం కల్పిస్తే నాలుగు పంచాయతీల పరిధిలో 500 పైగా విద్యార్థులు ఇక్కడ చేరేందుకు ఆసక్తిగా ఉన్నారని ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్తు చైర్పర్సన్ జల్లిపల్లి సుభద్ర పేర్కొన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టు మండలం సంగడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను గురువారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమస్యలను తెలియజేశారు. గతంలో ఈ పాఠశాల ఎయిడెడ్ గా ఉండేదని ఏపీ జెన్ కో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి అప్పగించిన నేపథ్యంలో ప్రస్తుతం ప్రభుత్వ ఉన్నత పాఠశాలగా నిర్వహణ అవుతుందని తెలిపారు. పాఠశాల శిథిలావస్థకు చేరుకోవడం అందులోనూ హాస్టల్ వసతి లేకపోవడం కారణంగా ఇక్కడ అత్యుత్తమ ఉపాధ్యాయులు ఉన్నా సరే పిల్లలను చేర్చేందుకు తల్లిదండ్రులు ఇష్టపడటం లేదని వారు తెలిపారు. ఈ నేపథ్యంలో తమ పాఠశాలకు హాస్టల్ వసతులు కల్పిస్తే ఖచ్చితంగా 500కు పైబడి విద్యార్థులు ఇక్కడ విద్యను అభ్యసించేందుకు సిద్ధంగా ఉన్నారని ఉపాధ్యాయులు తల్లిదండ్రులు తెలియజేశారు. ఈ సందర్భంగా సుభద్ర మాట్లాడుతూ సంగడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల పరిధిలో నాలుగు పంచాయతీలు ఉన్నాయని వనుగుమ్మ, మాకవరం, దోడిపుట్టు, రంగబయలు ఉన్నాయన్నారు. ఈ పంచాయతీల పరిధిలో ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నాయని వీరందరికీ సంగడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఒకటే ప్రధానమైనటువంటి ఏకైక హై స్కూల్ అన్నారు. ఈ హైస్కూల్ పరిధిలో ఉన్న ఎంపీ యు పి స్కూల్ లలో చదివే పిల్లలంతా ఈ స్కూల్లోనే చదవాలన్నారు. కానీ హాస్టల్ సౌకర్యం లేని పక్షంలో ఇక్కడ విద్యార్థులను తీసుకొని పోయి వారి



వారి పంచాయితీ పరిధిలో ఉన్నటువంటి పాఠశాలల్లో తల్లిదండ్రులు చేర్పిస్తున్నారు. ప్రస్తుతం 20 నుంచి 30 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. అందుకే ప్రభుత్వం స్పందించి ఈ పాఠశాలకు హాస్టల్ సౌకర్యం కల్పించాలని ఆమె డిమాండ్ చేశారు. ఐటీడీఏ అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించి సంగడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హాస్టల్ సౌకర్యం కల్పించాలని ఆమె కోరారు. హాస్టల్ సౌకర్యం లేకే ఇక్కడ చదువుతున్న పిల్లలు తమ తల్లిదండ్రులు టీసీలు తీసేసుకొని వేరే పాఠశాలలో చేర్పించారన్నారు. ఇప్పుడు వీరంతా వారి ఎదుర్కొంటున్న ఇబ్బందులు దృష్ట్యా ఈ పాఠశాలలో హాస్టల్స్ సౌకర్యం కల్పించాలని కోరుతున్నారన్నారు. పీఎం జన్ మన్ నుంచి పాఠశాలకు వసతి సౌకర్యం మంజూరుకు అధికారుల కృషి చేయాలన్నారు. ఈ పాఠశాలను 1982లో స్థాపించారని 40 ఏళ్లు అవుతున్న పాఠశాలకు కనీసం మరమ్మతులు లేవని తక్షణమే పాఠశాలకు మరమ్మతులు కూడా చేపట్టాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సిరగం భాగ్యవతి, మాజీ సర్పంచ్ మిల్కి భర్త నీలకంఠం, జెసిఎస్ కోఆర్డినేటర్ అరబీరు జగబంధు , మాజీ సర్పంచ్ తిరుపతి తదితరులు హాజరయ్యారు.

## పేద విద్యార్థుల చదువుకు రూ.లక్ష విరాళం

**గాజువాక, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త :**




పేద, ప్రతిభావంతులైన విద్యార్థుల విద్యాభివృద్ధికి తోడ్పాటుగా బొత్స దిలీప్‌కుమార్ రూ.లక్ష విరాళాన్ని జేసీఐ ఇండియా ఫౌండేషన్‌కు అందజేశారు. తన తల్లి స్వర్గీయ బొత్స ఉమ జ్ఞాపకార్థం ఈ ఆర్థిక సాయాన్ని అందించారు. జేసీఐ ఇండియా జాతీయ అధ్యక్షుడు ఆర్‌పీపీ ఎన్.భరత్ ఆచార్య, జోన్ అధ్యక్షుడు జేఎఫ్ఆర్ చైతన్య వసంతవాడల సమక్షంలో ఈ విరాళాన్ని అందజేశారు. ఆర్థిక ఇబ్బందుల వల్ల చదువు ఆగిపోకూడదనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు దిలీప్‌కుమార్ తెలిపారు. విద్య ద్వారా ఒక కుటుంబంతో పాటు సమాజ భవిష్యత్తు మారుతుందని పేర్కొన్నారు. ఈ సేవా కార్యక్రమాన్ని జేసీఐ నాయకులు అభినందించారు. కార్యక్రమంలో జోన్ మెంటార్ కేవీ రావు, జోన్ సలహాదారు రఘురామ్ పత్రి, పీఎంజీ శంకర్, జేసీఐ సేన్ అధ్యక్షురాలు బి.సిరీష, బి.శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ముద్దులొలికే కృష్ణయ్యలు.. కన్నులపండువగా వేడుకలు

### -ఆకట్టుకున్న 'డాలి ప్లే స్కూల్' చిన్నారుల నృత్యాలు

### -ఉత్సాహంగా సాగిన ఉట్టికొట్టే కార్యక్రమం

**గాజువాక, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త :**



జీవీఎంసీ 87వ వార్డు కణితి కళింగ వీధిలోని 'డాలి ప్లే స్కూల్' ఆవరణ లో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు కన్నులపండువగా సాగాయి. ముం దుగా శ్రీకృష్ణుని చిత్రపటానికి పాఠశాల ప్రిన్సిపాల్ మాధురి, వైస్ ప్రిన్సిపాల్ శిరీషలు పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికలు, సత్యభామల వేషధారణలో అలరించారు. 'గోపికమ్మ', 'రఘుకుల తిలక రారా' వంటి భక్తి గీతాలకు విద్యార్థులు చేసిన నృత్యాలు, కోలాటాలు వీక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. మన సనాతన సంస్కృతీ సాంప్రదా యాలను ప్రతిబింబించేలా నిర్వహించిన ఉట్టికొట్టే కార్యక్రమం కోలాహలంగా సాగింది. చిన్నారుల ముద్దులొలికే ప్రదర్శనలను చూసి తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయురాలు సుధ, విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే జరిమానా

### ప్రతి దుకాణం వద్ద డస్ట్‌బిన్ తప్పనిసరి: జీవీఎంసీ అదనపు కమిషనర్ పల్లి నల్లనయ్య

**విశాఖపట్నం, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త :**



కాలువలు, రహదారులు, బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలు వేసే వారిపై కఠిన చర్యలు తీసుకుని జరిమానాలు విధించాలని జీవీఎంసీ అదనపు కమిషనర్ పల్లి నల్లనయ్య అధికారులను ఆదేశించారు. గురువారం గాజువాక జోన్ 64వ వార్డు దిబ్బపాలెంలో పారిశుధ్య నిర్వహణను ఆయన పరిశీలించారు. కాలువలు, రహదారులపై వ్యర్థాలు పేరుకుపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి దుకాణం వద్ద డస్ట్‌బిన్ ఏర్పాటు చేయాలని, ప్రజలకు పారిశుధ్యంపై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. ఇంటింటి వ్యర్థాలను పారిశుధ్య వాహనాలకు మాత్రమే అందించాలని ప్రజలు, వ్యాపారులు సహకరించాలని కోరారు.

## విశాఖ రైల్వే అభివృద్ధికి సమగ్ర కార్యాచరణ చేపట్టాలి

(7వ పేజీ తరువాయి)

ఎదురవుతున్నాయని తెలిపారు. విశాఖపట్నం టెర్మినల్ స్టేషన్‌పై ఒత్తిడి పెరుగుతోందని, విజయనగరం--కొత్తవలస--గోపాలపట్నం--విశాఖపట్నం మార్గంలో క్రాస్ మూవ్‌మెంట్ల కారణంగా రైళ్లు ఆలస్యమవుతున్నాయని వివరించారు. ప్రస్తుతం డివిజన్ మీదుగా ప్రతిరోజూ సుమారు 130 మెయిల్, ఎక్స్‌ప్రెస్ రైళ్లు, 25 ప్యాసింజర్ రైళ్లు, దువ్వాడ--సింహాచలం నార్త్ బైపాస్ మార్గంలో 30కి పైగా రైళ్లు నడుస్తున్నందున ట్రాక్ సామర్థ్యాన్ని మరింత పెంచాల్సిన అవసరం ఉందన్నారు.

గోపాలపట్నం - విశాఖపట్నం మధ్య నిర్మాణంలో ఉన్న మూడో, నాలుగో రైల్వే లైన్లను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని కోరారు. ఈ లైన్లు పూర్తయితే రైళ్లను ఒకేసారి ఎక్కువ సంఖ్యలో నిర్వహించడంతో పాటు ఔటర్ సిగ్నళ్ల వద్ద రైళ్ల నిరీక్షణ, ఆలస్యాలను తగ్గించవచ్చన్నారు. విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో ప్లాట్‌ఫారాల సంఖ్యను ఎనిమిది నుంచి 14కు పెంచే విస్తరణ పనులను వేగవంతం చేయాలని, జ్ఞానాపురం వైపు స్టేషన్ విస్తరణ, కోచింగ్ యార్డు ఆధునీకరణ, ఆధునిక సిగ్నలింగ్ వ్యవస్థలు, ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలు, లిఫ్టులు, ఎస్కలేటర్లు, నిరీక్షణ మందిరాలు, పార్కింగ్, పారిశుధ్య సదుపాయాలను సమగ్రంగా అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు.

విశాఖ టెర్మినల్‌పై ఒత్తిడిని తగ్గించేందుకు గతంలో ప్రతిపాదించిన బల్బ్ లైన్‌ను సాంకేతికంగా పునఃపరిశీలించాలని, సింహాచలం నార్త్--దువ్వాడ బైపాస్ మార్గాన్ని మరింత సమర్థవంతంగా వినియోగించే అవకాశాలను పరిశీలించాలని కోరారు. రద్దీ తక్కువగా ఉన్న కొన్ని రైళ్లను సాధ్యమైన మేరకు బైపాస్ మార్గంలో నడపడం ద్వారా విశాఖ స్టేషన్‌పై ఒత్తిడి తగ్గించవచ్చని తెలిపారు.

దక్షిణ కోస్తా రైల్వే ప్రధాన కార్యాలయం విశాఖపట్నంలో ఉండటం ఈ ప్రాంతానికి ప్రత్యేక అవకాశమని గాంధీ పేర్కొన్నారు. రైల్వే బోర్డు, కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖతో సమన్వయం చేసి పెండింగ్‌లో ఉన్న అనుమతులు, నిధులను త్వరగా మంజూరు చేయించేలా ఎంపీ శ్రీభరత్ చొరవ తీసుకోవాలని కోరారు.

విశాఖపట్నం డివిజన్‌ను సరుకు రవాణాలోనే కాకుండా ప్రయాణికుల సేవల్లోనూ దేశంలో ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దేందుకు సమగ్ర కార్యాచరణ రూపొందించాలని విజ్ఞప్తి చేశారు. దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటుతో పాటు రైల్వే అభివృద్ధి పనుల విషయంలో సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రులు, ఎంపీ శ్రీభరత్, కూటమి ప్రభుత్వ ప్రజాప్రతినిధులు తీసుకుంటున్న చొరవ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని చలసాని గాంధీ పేర్కొన్నారు.

## నేవీ ఉద్యోగి భార్య ఆత్మహత్య

(7వ పేజీ తరువాయి)

ఉన్నారని, వారు విశాఖకు చేరుకున్న తర్వాత ఇచ్చే ఫిర్యాదు ఆధారంగా పూర్తిస్థాయి ఎఫ్ఐఆర్ నమోదు చేస్తామని మల్కాపురం సి.ఐ. ఇ.నరసింహారావు తెలిపారు. ఆత్మహత్యకు గల ఖచ్చితమైన కారణాలపై అన్ని కోణాల్లో దర్యాప్తు జరుపుతున్నట్లు ఆయన వెల్లడించారు.

వార్త VAARTHA CLASSIFIEDS CLASSIFIEDS వార్త VAARTHA CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, PINAPOTHULA RAJESH S/O PINAPOTHULA VEER RAJU, previously called PINAPOTULA RAJESH VENKATA APPA RAO R/O 31-43-4/1/184, FNO. 502, DNK TOWERS, DWARAKAPURI COLONY, DUVVADA, VISAKHAPATNAM now changed my name from PINAPOTULA RAJESH VENKATA APPARAO to PINAPOTHULA RAJESH. Henceforth I will be called as PINAPOTHULA RAJESH for all purposes.

(Ro.No. 22677)

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

## రాంబిల్లి జంక్షన్లో భారీ వాహనాలతో ట్రాఫిక్కు అంతరాయం

**మార్గ సూచికలు లేక 10 కిలోమీటర్లు ముందుకు వచ్చి తిరిగి వెళ్తున్న వాహనాలు-ఇబ్బందులు పడుతున్న డ్రైవర్లు**

రాంబిల్లి, సెప్టెంబర్ 03, ప్రభాతవార్త



మండల కేంద్రంలోని జంక్షన్‌లో భారీ వాహనాలు దారి తప్పి రావడంతో తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. ముఖ్యంగా అచ్చుతాపురం ప్రత్యేక ఆర్థిక మండలి (సెజ్)లోని పరిశ్రమలకు వెళ్లాల్సిన భారీ వాహనాలు ప్రస్తుతం అచ్చుతాపురం జంక్షన్‌లో జరుగుతున్న రోడ్డు, అండర్‌బ్రిడ్జి నిర్మాణ పనుల కారణంగా ప్రత్యామ్నాయ మార్గాల్లోకి మళ్లిస్తున్నారు. జంగాలపాలెం నుంచి పరిశ్రమల వైపు వెళ్లేందుకు తాత్కాలికంగా రహదారిని కేటాయించినప్పటికీ, మార్గమధ్యంలో సరైన దిశా సూచికలు ఏర్పాటు చేయకపోవడంతో పరిశ్రమలకు వెళ్లే భారీ వాహనాలు రాంబిల్లి మండల కేంద్రం వరకు వచ్చేస్తున్నాయి. ఇక్కడికి చేరుకున్న తర్వాత తాము వెళ్లాల్సిన మార్గం కాదని గుర్తించి తిరిగి వెనక్కి వెళ్లాల్సి వస్తోంది. దీంతో భారీ వాహనాలు రివర్స్ చేయడానికి చాలా సమయం పడుతుండటంతో జంక్షన్‌లో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. భారీ వాహనాలతో పాటు బస్సులు, కార్లు, ద్విచక్ర వాహనాలు అధిక సంఖ్యలో నావికాస్థావరం వైపు రాకపోకలు సాగిస్తుండటంతో ట్రాఫిక్ సమస్య మరింత తీవ్రమవుతోంది. భారీ వాహనాలు రివర్స్ చేసే సమయంలో రహదారిపై వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పరిశ్రమలకు సరుకులు రవాణా చేసే వాహనాలు సుమారు 10 కిలోమీటర్ల వరకు అదనంగా ప్రయాణించి తిరిగి వెనక్కి వెళ్లాల్సి వస్తోందని వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్గం తెలియక సమయం, ఇంధనం వృథా అవుతున్నాయని తెలిపారు. వెంకటాపురం జంక్షన్ దాటిన తర్వాత జంగాలపాలెం మీదుగా పరిశ్రమలకు వెళ్లే మార్గంలో స్పష్టమైన మార్గ సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహన చోదకులు, స్థానికులు కోరుతున్నారు. భారీ వాహనాలకు ప్రత్యేకంగా దిశానిర్దేశం చేసే బోర్డులు ఏర్పాటు చేస్తే దారి తప్పే వాహనాల సంఖ్య తగ్గడంతో పాటు రాంబిల్లి జంక్షన్‌లో ట్రాఫిక్ సమస్యకు కూడా కొంతమేర పరిష్కారం లభిస్తుందని వారు పేర్కొన్నారు. అధికారులు వెంటనే స్పందించి ప్రత్యామ్నాయ మార్గాల్లో అవసరమైన స్పష్టమైన సైన్‌బోర్డులు, దిశా సూచికలు ఏర్పాటు చేసి ట్రాఫిక్ అంతరాయాన్ని నివారించాలని స్థానికులు, వాహన చోదకులు కోరుతున్నారు.

## యలమంచిలి పురపాలక సంఘం ఆవరణలో ఎన్నికల ఫోటో ఓటరు జాబితా ప్రచురణ

ఎలమంచిలి, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘం పురపాలక సంఘంలో ఎన్నికల నిర్వహణ నిమిత్తం తే. 01-01-2026 ది నాటి అర్హతతో వార్డుల వారీగా ఫోటో ఓటరు జాబితాను తయారు చేసి గురువారం పట్టణ ప్రజలు తెలియజేయాల్సిందిగా ఆదేశించినారు. ఆదేశానుసారం యలమంచిలి పురపాలక సంఘం 32 వార్డుల ఓటరు జాబితాను తయారుచేసి కార్యాలయ ఆవరణలో ప్రచురించడమైనది. యలమంచిలి పురపాలక సంఘం 32 వార్డుల ఓటరు జాబితాను పట్టణ ప్రజలకు అందుబాటులో ఉంచుటకు కొరకు యలమంచిలి పురపాలక సంఘం కార్యాలయంలో, యలమంచిలి తహశీల్దారు కార్యాలయం, రెవెన్యూ డివిజన్ అధికారి కార్యాలయం అద్దరోడ్డు, కార్యాలయంలో ప్రజల పరిశీలన కొరకు 32 వార్డుల ఓటరు జాబితాను అందుబాటులో ఉంచడమైనదిగా పట్టణ ప్రజలకు పత్రిక ప్రకటన ద్వారా తెలియజేయడమైనది. కమిషనర్ ప్రసాద్ రాజు తెలిపారు.



## ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

(నక్కపల్లి, ప్రభాతవార్త)

శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా నక్కపల్లిలోని గురుస్ స్కూల్ కరస్పాండెంట్ షేక్ సుభాని ల ఆధ్వర్యంలో ఆ వేడుకలను చిన్నారుల మధ్య గురువారం ఘనంగా నిర్వహించారు. "కృష్ణం వందే జగద్గురుం" అనే సందేశంతో విద్యార్థుల్లో ఆధ్యాత్మికతతో పాటు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, నైతిక విలువలపై అవగాహన కల్పించేలా కార్యక్రమాలను నిర్వహించారు. చిన్నారులు శ్రీకృష్ణుడు, రాధాదేవి వేషధారణలతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. విద్యార్థులు భగవద్గీత శ్లోకాలను పఠిస్తూ, శ్రీకృష్ణుని జీవిత విశేషాలను వివరిస్తూ అందరినీ విశేషంగా ఆకట్టుకున్నారు. చిన్నారుల నృత్య ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు, కృష్ణుని బాల్య ఘట్టాలను ప్రతిబింబించే ప్రదర్శనలు వేడుకలకు ప్రత్యేక శోభను తీసుకువచ్చాయి. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు భగవద్గీత శ్లోకాల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల ద్వారా పిల్లల్లో సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ, సంస్కృతి పట్ల గౌరవం పెంపొందుతాయని పాఠశాల యాజమాన్యం తెలిపారు. శ్రీకృష్ణుని బోధనలు నేటి విద్యార్థులకు ఎంతో అవసరమని, కష్టాలను ధైర్యంగా ఎదుర్కొంటూ ధర్మం, సత్యం, కర్తవ్యబద్ధతతో ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు.



విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ షేక్ సుభాని మాట్లాడుతూ, "పిల్లలకు కేవలం విద్యను అందించడం మాత్రమే కాకుండా, సంస్కారం, విలువలు, బాధ్యతాయుతమైన వ్యక్తిత్వాన్ని అందించడం కూడా విద్యాసంస్థల బాధ్యత" అని పేర్కొన్నారు. అందుకే ప్రతి పండుగను మా పాఠశాలలో నిర్వహించి విద్యార్థుల్లో జాతీయ సమైక్యతను, సోదర భావాలు పెంపించేలా కృషి చేస్తున్నామని చెప్పారు. పాఠశాలలో చేసే ప్రతి కార్యక్రమానికి సహకరిస్తున్న తల్లి దండ్రులకు, ఉపాధ్యాయులకు ధన్యవాదాలు తెలుపుతూ అందరికీ శ్రీ కృష్ణ జన్మాష్టమి శుభాకాంక్షలు తెలియచేశారు.

## అంబేద్కర్‌పై అసత్య ప్రచారం చేస్తే సహించేది లేదు..

**బాధ్యులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి : దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు కృష్ణ స్వరూప్ డిమాండ్**

(నక్కపల్లి, ప్రభాతవార్త)



భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను కించపరిచేలా అవహేళన, అసత్య ప్రచారం చేస్తున్న వారిపై విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని దళిత బహుజన పార్టీ (డీబీపీ) జాతీయ అధ్యక్షుడు వడ్డ మూరి కృష్ణ స్వరూప్ డిమాండ్ చేశారు. ఈ వ్యవహారం వెనుక ఆర్ఎస్ఎస్‌కు సంబంధం ఉందని ఆయన ఆరోపిస్తూ, ఆ సంస్థ చీఫ్ మోహన్ భగవత్ బాధ్యత వహించాలని పేర్కొన్నారు. పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, సామాజిక న్యాయం కోసం అంబేద్కర్ చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. అంబేద్కర్‌ను కులం కోణంలో చూస్తూ కించపరిచే ప్రయ త్నాలు చేయడం బాధాకరమని పేర్కొన్నారు. అంబేద్కర్‌ను అవమానించేలా ప్రచారం చేయడం ఆయనను అభిమానించే కోట్లాది మంది మనోభావాలను దెబ్బతీయడమేనన్నారు. అంబేద్కర్‌పై తప్పుడు ప్రచారం చేస్తున్నారంటూ తెలంగాణ డీజీపీకి ఇప్పటికే పలు ఫిర్యాదులు అందాయని పేర్కొన్న కృష్ణ స్వరూప్.. వాటిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎన్ఎస్ఎల్‌వో జాతీయ అధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది పి.పద్మారావు, ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ అడ్వకేట్స్ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.రాజలింగం, డీబీపీ నగర నాయకుడు ఎం.స్వామిదాస్, మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మద్దెల రాయప్ప తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశీస్సులు తీసుకున్న నాయకులు



(నక్కపల్లి, ప్రభాతవార్త)

పాయకరావుపేట పోలవరం ఎడమ కాలువకి జలహారతి కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత నాయకత్వంలో పర్యటనకు వచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లను హోం మంత్రి అనితమ్మ ఆధ్వర్యంలో పలువురు ప్రజాప్రతినిధులు కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో పెద్ద తీనార్ల ఎంపిటిసి మెరుగు నాగేశ్వరరావు, బిజెపి మండల శాఖ అధ్యక్షులు పోలినాటి నానాజీ, యువకుడు బండారు మణికంఠతో పాటు పలువురు ఉన్నారు.

## ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశీస్సులు తీసుకున్న కొప్పిశెట్టి



నక్కపల్లి, ప్రభాతవార్త

పాయకరావుపేట పోలవరం ఎడమ కాలువకి జలహారతి కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత నాయకత్వంలో పర్యటనకు వచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ను హోం మంత్రి అనితమ్మ ఆధ్వర్యంలో పాయకరావుపేట నియోజకవర్గ టిడిపి కన్వీనర్ కొప్పి వెంకటేష్ ఆశీస్సులు తీసుకున్నారు. ఆయనతోపాటు పలువురు ప్రజాప్రతినిధులు కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు వైబోయిన వెంకటరమణ ఉపమాక మాజీ సర్పంచ్ ప్రగడ వీరబాబు తదితరులు ఉన్నారు.

## పోలవరం ప్రాజెక్టుపై ప్రజలను మోసగిస్తున్న సీఎం చంద్రబాబు

**పోలవరం ప్రాజెక్ట్ పునాది వేసింది దివాంగత వైఎస్ఆర్**

**-అనకాపల్లి జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించాలి :**

**మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్**

అనకాపల్లి, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త



గోదావరి జలాలు పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లికి తీసుకువస్తామని ప్రజలను నమ్మించి పురుషోత్తమ పట్నం నుంచి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా జలాలను పోలవరం ఎడమ కాలువలోకి తరలించి సీఎం చంద్రబాబు నాయుడు జల హారతి కార్యక్రమం ద్వారా ప్రారంభోత్సవం చేయ డం అన్యాయమని మాజీమంత్రి చోడవరం నియోజకవర్గం సమన్వయకర్త గుడివాడ అమర్నాథ్ పేర్కొన్నారు. స్థానిక రింగ్ రోడ్డు పార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి అమర్నాథ్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు పరిపాలన ఈవెంట్ మేనేజ్మెంట్‌పై సాగిస్తూ కాలయా పన చేస్తున్నారని విమర్శించారు. చంద్రబాబు పర్యటనలు వల్ల ప్రజలకు కలిసి వచ్చింది ఏమీ లేదు అన్నారు. అనకాపల్లి జిల్లా కరువు ప్రాంతంగా ప్రకటించవలసింది పోయి ప్రతిపక్ష పార్టీని విమర్శించడానికి సమయం సరిపోవడం లేదన్నారు. మాజీ ఎమ్మెల్యేలు పెట్ల ఉమా శంకర్ గణేష్, అన్నం రెడ్డి అదీప్ రాజు, మాజీ ఎంపీ డాక్టర్ బివి సత్యవతి వైసీపీ జిల్లా అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్, మాడుగుల వైసిపి నాయకురాలు ఈర్ల అనురాధ తదితరులు మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి దివంగత వైయస్ రాజశేఖర్ రెడ్డి 2004 లో రైతుల అభ్యున్నతి కోసం పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణానికి సంకల్పించారు అన్నారు. అందుకు అవసరమైన అనుమతులు కేంద్రం నుంచి తీసుకువచ్చి భూసేకరణ చేసి 2005లో ప్రాజెక్టు నిర్మాణానికి శంకుస్థాపన చేసి 70% నిర్మాణ పనులు పూర్తి చేసిన ఘనత దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రాజెక్ట్ నిర్మాణ పనులు పూర్తికా కుండానే ప్రారంభోత్సవం చేసి ఉత్తరాంధ్ర ప్రజలను మోసగించారని ఆరోపించారు. సూపర్ సిక్స్ పథకాల పేరుతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని వారు పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ సమావేశంలో వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## శ్రీ చైతన్య స్కూల్‌లో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

ఎలమంచిలి, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త



స్థానిక శ్రీ చైతన్య ఇంగ్లీష్ మీడియం స్కూల్ నందు కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులచే అనేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిం చారు. దీనిలో భాగంగా విద్యార్థులు శ్రీకృష్ణుని వేషధారణలో, గోపికల వేషధారణలో అలరించారు. ఈ సంద ర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ చంద్రశేఖరరావు మాట్లాడుతూ ఇలాంటి పండుగలు జాతీయ సమైక్యతను తెలియజేస్తాయని, విద్యార్థులలో మన పండుగల యొక్క విశిష్టతను తెలుసుకోవడానికి ఇలాంటి వేడుకలు దోహదపడతాయని అన్నారు. ఈ కార్యక్రమానికి ఏ.సి.ఓ గోవింద్, డీన్ దత్తు, సి-బ్యాచ్ ఇంచార్జ్ లోవేశ్వర రావు, ప్రైమరీ ఇంచార్జ్ శ్రీలక్ష్మి, ప్రీ-ప్రైమరీ ఇంచార్జ్ భవాని, ఏ.ఓ ప్రకాష్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు. శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా ఏ.జి.ఎం సురేష్, ఆర్.ఐ గోపీనాథ్ విద్యార్థులకు, ఉపాధ్యాయ సిబ్బందికి కృష్ణాష్టమి శుభాకాంక్షలు తెలియజేశారు.



## అమరావతి ఛాంపియన్ షిప్ విజేతలను అభినందించిన జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్

ఎలమంచిలి, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త

అమరావతి ఛాంపియన్ షిప్‌లో విజేతలుగా నిలిచిన అనకాపల్లి జిల్లా హాకీ జట్టు (అండర్-17, అండర్-23) సభ్యులను అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ అభినందించారు. హాకీలో జిల్లాకు మంచి పేరు తీసుకొచ్చారని, భవిష్యత్తులో మరింత రాణించి జిల్లా ఖ్యాతిని ఇనుమడింపజేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్, జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి శైలజ పాల్గొని విజేతలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా హాకీ అసోసియేషన్ కన్వీనర్ కోటారు నరేష్, జి.వి రెడ్డి, శెట్టి రమేష్, రాంబాబు పాల్గొన్నారు.

## రాంబిల్లి మండలంలో సెప్టెంబర్ 5న విద్యుత్‌కు అంతరాయం

(రాంబిల్లి సెప్టెంబర్ 03 ప్రభాతవార్త)

రాంబిల్లి 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రంలో సబ్‌స్టేషన్ నిర్వహణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో ఈ నెల 5వ తేదీ శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని అనకాపల్లి ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. రాంబిల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని 11 కేవీ ఫీడర్లకు విద్యుత్ సరఫరా నిలిపివేసి చెట్లు నరకడం అటవీ నిర్మూలన పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. దీంతో రాంబిల్లి మండలంలోని రాంబిల్లి, వాడపాలెం, కొండవారిపాలెం, ఎం.చింతువ, నేవీ కాలనీ, కొత్తపేట, చిన్న కలవలపల్లి, కొప్పుగుండుపాలెం, గోవిందపాలెం, వాడ నరసాపురం, కొత్తపట్నం, పెద్ద కలవలపల్లి, వై లోవ, రాంబిల్లి ఫ్యాషన్ టెక్నాలజీ, వాడ రాంబిల్లి తదితర గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోనుంది. విద్యుత్ శాఖ చేపడుతున్న నిర్వహణ పనులకు ప్రజలు సహకరించాలని, ముందస్తుగా అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులు కోరారు. నిర్వహణ పనులు పూర్తయిన వెంటనే విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తామని తెలిపారు.



## 3 కోట్ల విలువైన 600 కేజీల భారీ గంజాయి పట్టివేత ముగ్గురు అంతర్రాష్ట్ర నిందితుల అరెస్ట్

అనకాపల్లి, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త

అనకాపల్లి జిల్లాను సంపూర్ణ గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దే లక్ష్యంతో జిల్లా పోలీసులు కట్టుదిట్టమైన తనిఖీలు, నిఘా చర్యలు చేపడుతున్నారని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. ఒడిస్సా నుంచి అనకాపల్లి మీదుగా తుని వైపు తరలిస్తున్న మూడు కోట్ల రూపాయల 600 కేజీల భారీ గంజాయిని, రవాణాకు ఉపయోగించిన వాహనాలను అనకాపల్లి రూరల్ పోలీసులు సమయస్ఫూర్తితో పట్టుకున్నారని గురువారం మీడియా సమావేశంలో వెల్లడించారు. పశ్చిమ గోదావరి జిల్లా ధర్మాజీగూడెంకు చెందిన షేక్ మస్తాన్ వలి గతంలో జి.మాడుగుల పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి కేసులో విశాఖపట్నం సెంట్రల్ జైలులో ఉండగా, అదే జైలులో ఉన్న అల్లూరి సీతారామరాజు జిల్లా నర్సీపట్నానికి చెందిన పాంగి రత్నాలు తో పరిచయం ఏర్పడింది. ఒడిస్సా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ నుంచి 600 కేజీల గంజాయిని సమకూర్చి, తుని సమీపంలో తనకు అప్పగిస్తే సరుకు ఖరీదు కాకుండా అదనంగా రూ.3 లక్షలు కమీషన్ ఇస్తానని ఒప్పందం కుదుర్చుకున్నారు. గంజాయి కొనుగోలు చేసి పాంగి రత్నాలు సహాయంతో చెక్‌పోస్టులు తప్పించేందుకు ఒడిస్సా సరిహద్దుల నుండి నడక ద్వారా, మోటార్ సైకిళ్లపై దఫదఫాలుగా తరలించారు. అనంతరం ఆ సరుకును వ్యాన్ లోకి లోడ్ చేసి, దానికి పైలట్‌గా హోండా సివిక్ కారును ఏర్పాటు చేసుకుని తుని వైపు తరలించేందుకు పన్నాగం పన్నారు. రూరల్ పోలీసులకు అందిన పక్కా ముందస్తు సమాచారంతో అనకాపల్లి రూరల్ ఎస్సై, సిబ్బంది రంగంలోకి దిగి అనకాపల్లి మండలం సంపతిపురం జంక్షన్ వద్ద మాటువేసి గంజాయి లోడుతో ఉన్న వ్యాన్‌తో పాటు పైలట్ కారును పట్టుకున్నారు. అరెస్ట్ అయిన నిందితులు షేక్ మస్తాన్ వలి, షేక్ మదీనా, పాంగి రత్నాలు ఉన్నారు. మరో ముగ్గురు పరారీలో ఉన్నట్లు తెలిపారు.

**పోలీస్ సిబ్బందికి అభినందనలు - రివార్డుల ప్రదానం**

ఈ ఆపరేషన్‌లో చాకచక్యంగా వ్యవహరించి భారీ గంజాయి ముఠాను పట్టుకున్న ఎస్.బి సీఐ ఎస్.బాల సూర్యరావు, అనకాపల్లి టౌన్ సీఐ జి.ప్రేమ కుమార్, రూరల్ సీఐ జి.అశోక్ కుమార్, రూరల్ ఎస్సై జి.రవికుమార్, టౌన్ ఎస్సై షేక్ జిలాని, ఈగల్ టీం సీఐలు టీ.ధనుంజయనాయుడు, వి.నాగరాజు వారి సిబ్బందిని ఎస్పీ తుహిన్ సిన్హా ప్రత్యేకంగా అభినందించారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన అధికారులకు, సిబ్బందికి నగదు రివార్డులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. జిల్లాలో మత్తు పదార్థాల విక్రయాలు, రవాణాపై ఉక్కుపాదం మోపుతామని, అక్రమ వ్యాపారాలకు పాల్పడే వారిపై పీడీ యాక్ట్ వంటి కఠిన చట్టాల కింద చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.



## చెక్కపై చిన్ని కృష్ణులు

నక్కపల్లి, ప్రభాతవార్త

మండలంలోని చిన్న దొడ్డిగళ్ళుకు చెందిన సూక్ష్మ కళాకారుడు దార్ల రవి శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా బాల చిన్నికృష్ణులు రూపాలను చెక్కపై తయారు చేశాడు. ఇది తయారు చేయడానికి గంటన్నర సమయం పట్టిందని రవి తెలిపారు.

## హెచ్.ఐ.వి.ఎయిడ్స్‌పై విస్తృత ప్రచారం.. విద్యార్థులు అవగాహన ర్యాలీ

(నక్కపల్లి ,ప్రభాతవార్త)



ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ వారి ఆధ్వర్యంలో అనకాపల్లిజిల్లా దిశ ఆదేశాలమేరకు లింక్ వర్కర్ స్కీమ్ ఆధ్వర్యంలో స్థానిక మండలంలో గురువారం పలు పాఠశాలల విద్యార్థులకు అవగాహన తరగతులను నిర్వహించారు. దీనిలో భాగంగా మండలంలో పెదబోదుగల్లం హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో జోనల్ సూపర్ వైజర్ డి.రమణ మాట్లాడుతూ హెచ్.ఐ.వి. ఎయిడ్స్, టీబీ వీటి లక్షణాలపై వివరించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. దీనిపై సందేహాలను టోల్ ఫ్రీ నంబరు 1097 ద్వారా తెలుసుకోవచ్చని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లింక్ వర్కర్.ఎన్.రత్నం, హెచ్.ఎమ్ ఎస్.జయశ్రీ, ఉపాధ్యాయులు ఎన్.వి.ఎస్.ఆచార్యులు, ఎస్.ఫాల్గుణరావు, నాగేశ్వరరావు, అమ్మాజీ తదితరులు పాల్గొన్నారు.




## మండల పరిషత్ ఆఖరి సమావేశంలో.. సభ్యులకు సన్మానం

గొలుగొండ సెప్టెంబర్ 3 ప్రభాతవార్త



మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ గజ్జలపు మణికుమారి అధ్యక్షతన నిర్వహించారు. ఐదేళ్ల పదవీకాలంలో ఆఖరి సమావేశం కావడంతో సభ్యులంతా వారి పార్టీ కండువాళ్ళతో హాజరయ్యారు. ఒకరికొకరు పలకరించుకుంటూగా ఈ సమావేశం సాగింది. అనంతరం పలు శాఖలపై సమీక్ష నిర్వహించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. అనంతరం జడ్పిటిసి సుర్ల వెంకటగిరి బాబు అధికారులు కలిసి ఎంపీపీ, ఎంపీటీసీలను ఘనంగా సత్కరించి మెమొంటోలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఉలబాల శ్రీనివాసరావు, ఏవో మహేశ్వర రావు, డిప్యూటీ ఎంపీడీవోలు శ్రీనివాసరావు, రమణమూర్తి, ఏపిఎం కరుణానిధి, ఏపీ సూర్యమణి, అన్ని శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్డు పక్కన చెత్త తొలగింపు

**వార్త ప్రభావం**



(రాంబిల్లి సెప్టెంబర్ 03 ప్రభాతవార్త)

రాంబిల్లి మండలంలోని ప్రత్యేక ఆర్థిక మండలి (సెజ్) పరిశ్రమల నుంచి వెలువడుతున్న వ్యర్థాలను రోడ్డు పక్కన డంపింగ్ చేయడంపై "రోడ్డు పక్కనే చెత్త డంపింగ్.. ఎవరికీ పట్టని ఇబ్బందులు" అనే శీర్షికతో ఆగస్టు 9న వార్తాపత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. వార్తా కథనం ప్రచురితమైన అనంతరం అధికారులు రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్తను తొలగించి, సమీపంలోని సుమారు మూడు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ప్రదేశంలోకి తరలించి డంపింగ్ చేసి, మంటలు పెట్టి కాల్చి శుభ్రం చేసే చర్యలు చేపట్టారు. దీంతో రోడ్డు పక్కన పేరుకుపోయిన వ్యర్థాలు తొలగిపోవడంతో స్థానికులు కొంత ఊపిరి పీల్చుకున్నారు. ఇప్పటివరకు అధికారులు పట్టించుకోని సమస్యను వార్తాపత్రికలో ప్రచురించడంతో స్పందించి శుభ్రపరిచే చర్యలు చేపట్టడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చి అధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో వార్తాపత్రికలు కీలక పాత్ర పోషిస్తున్నాయని వాహనదారులు, పాదచారులు, స్థానికులు పేర్కొన్నారు.

## బాధితునికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

అనకాపల్లి, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త



అనారోగ్యంతో బాధపడుతున్న వారికి సీఎం రిలీఫ్ ఫండ్ ఆర్థికంగా ఎంతో దోహదపడుతుందని అనకాపల్లి మండలం సంపతిపురం మాజీ సర్పంచ్ నంబారి శ్రీను అన్నారు. అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ సూచనలుతో రాష్ట్రఅర్బన్ ఫైనాన్స్ డవలప్మెంట్ చైర్మెన్, అనకాపల్లి తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ పీలా గోవింద సత్యనారాయణ సహాయ సహకారాలు తో వెలుగుల వెంకటరావుకి సీఎం రిలీఫ్ ఫండ్ 94,058 రూపాయల చెక్కును వారికి గురువారం అందజేశారు. ఎంపీటీసీ కడిమి గణేష్, టిడిపి సీనియర్ నాయకులు ముప్పిన శ్రీనివాసరావు, మాజీ ఉప సర్పంచ్ ఇరుగుల శంకర్రావు, ఇరుగుల రవణమ్మ సంపతిపురం జనసేన పార్టీ అధ్యక్షులు బర్నికాన లోవరాజు, జనసేన పార్టీ నాయకులు బోద్ధపు శ్రీను, సంపత్ పురం బిజెపి అధ్యక్షులు పంచదార్ల రామ అప్పారావు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## నూకాంబిక హుండీ ఆదాయం లెక్కింపు

అనకాపల్లి, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త



ఉత్తరాంధ్ర జిల్లాల ఇలవేల్పు రాష్ట్ర పండుగ గుర్తింపు పొందిన అనకాపల్లి గవరపాలెం వెలసిన శ్రీ నూకాంబిక అమ్మవారికి భక్తులు హుండి ద్వారా సమర్పించిన కానుకలు జూన్ 18 నుండి సెప్టెంబర్ 3 తేదీ వరకు మొత్తం 77 రోజులలో భక్తులు సమర్పించిన ముడుపులు, మొక్కుబడులను గురువారం ఆలయ మండపములో లెక్కించారు. ఈ లెక్కింపులో నగదుగా రూ.81,97,691లు, బంగారం 22 గ్రాముల 100 మిల్లీగ్రాములు, వెండి 1 కేజీ 130 గ్రాములు వచ్చినట్లుగా ఆలయ అధికారులు తెలిపారు. దేవస్థానం చైర్మన్ పీలా నాగశ్రీను (గొల్ల బాబు), ఆలయ సహా కమిషనర్ యాళ్ళశ్రీధర్, జిల్లా సహాయ కమిషనర్ కేఎల్ సుధారాణి, దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ వసంతరావు ఆలయ ధర్మకర్తలు సూరే సతీష్, దాడి రవికుమార్ పొలిమేర స్వాతి ఆనంద్, మారిశెట్టి శంకర్రావు, కాండ్రేగుల రాజారావు, మజ్జి జానకి శ్రీనివాసరావు, కొడుకుల శ్రీకాంత్, వద్దాది మంగ, కోనేటి సూర్యలక్ష్మి పైడ్రాజు, యర్రవరపు సంతోషి కుమారి నాగేష్, హుండీల లెక్కింపునకు దేవస్థానము సిబ్బంది, శ్రీవారిసేవ సభ్యులతోను, యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా, గవరపాలెం బ్రాంచ్ సిబ్బంది, అనకాపల్లి టౌన్ పోలీసు వారు భక్తులు పాల్గొన్నారు

## రేపు బుచ్చయ్యపేట పరిధిలో పవర్ కట్

బుచ్చయ్యపేట సెప్టెంబర్ 03, ప్రభాతవార్త

రాజాం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో శనివారం (సెప్టెంబరు 5) విద్యుత్ సరఫరా నిలిచిపోనుంది. సబ్ స్టేషన్‌లో బ్రేకర్ల మార్పిడితో పాటు ఆర్‌డీఎస్ఎస్ (=ఙూా) పనుల నిమిత్తం విద్యుత్ బంద్ పాటిస్తున్నట్లు నర్సీపట్నం డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (డిఈఈ) బి. వెంకటరమణ స్పష్టం చేశారు. ఉదయం 8.00 గంటల నుంచి మధ్యాహ్నం 2.00 గంటల వరకు పవర్ సరఫరా ఉండదని ఆయన తెలిపారు. సరఫరా లేని గ్రామాలు రాజాం, నీలకంఠాపురం, పెద మదీనా, చిన మదీనా, తైపురం, తురకలపూడి, సీతయ్యపేట, పెదపూడి, పెదపూడి అగ్రహారం, మల్లాం, ఆర్.భీమవరం, ఆర్.శివరాంపురం, గున్నెంపూడి, అయితంపుడి, చింతపాక, చిన్నయ్యపాలెం, చిట్టియపాలెం, కరక, గొర్లేపాలెం, రాజుపాలెం, పంగిడి వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.



## పంట భూములకు గోదావరి జలాలు

(నక్కపల్లి ,ప్రభాతవార్త)

పాయకరావుపేట మండలంలోని పంట భూములకు గోదావరి జలాలను స్థానిక కూటమి పార్టీల నాయకులు జల హారతి ఇచ్చి స్వాగతం పలికారు. పోలవరం ఎడమ కాలువ ద్వారా గోదావరి జలాలు ఈ ప్రాంతానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జలహారతి ఇచ్చి ప్రారంభించిన విషయం తెలిసిందే అన్నారు. ఈ మేరకు గోదావరి జలాలు పాయకరావుపేట మండలంలోని పంట భూములకు వచ్చేందుకు పోలవరం కాలువ నుంచి భూమి కాలువకు అనుసంధానం చేస్తూ కాలువ నిర్మించారు. దీనికి సంబంధించి నీటిని విడుదల చేశారు. కూటమి పార్టీల నాయకులు పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ పెదిరెడ్డి చిట్టిబాబు, టిడిపి మండల అధ్యక్షులు చించలపు ప్రదీప్, పట్టణ అధ్యక్షులు యాళ్ల వరహాల బాబు, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కంకిపాటి వెంకటేశ్వరరావు, పాండురంగ స్వామి దేవస్థానం చైర్మన్ మజ్జూరి నారాయణరావు, పెదిరెడ్డి శ్రీను, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి బొంది కాశీ విశ్వనాథ్, మల్లపురెడ్డి కుమారి, జూరెడ్డి ప్రసాద్, గొల్లపల్లి నాగు, ఆచంట దొర, నారపురెడ్డి పద్మావతి, వేములపూడి అప్పారావు, రావాడ గోవిందరెడ్డి, గణపర్తి దొర, పిరమళ్ళ గోవింద్, మనీషా బేగం తదితరులు ఉన్నారు.

## జిల్లాలో హోమిబాబా క్యాన్సర్ ఆసుపత్రి రీసెర్చ్ సెంటర్, పాలియేటివ్ కేర్ సెంటర్ ప్రారంభం

అనకాపల్లి, సెప్టెంబర్ 3 (ప్రభాత వార్త)



క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించి, సకాలంలో వైద్యం అందించడం అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ పేర్కొన్నారు. అనకాపల్లి జిల్లా బాటజంగాలపాలెం ప్రాంతం లో హోమి బాబా క్యాన్సర్ ఆసుపత్రి రీసెర్చ్ సెంటర్, సీతార- ఉపశమన సంరక్షణ (పాలియేటివ్ కేర్) కేంద్రంను పెందుర్తి శాసనసభ్యులు పంచకర్ల రమేష్‌బాబుతో కలిసి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ప్రారంభిం చారు. జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ మాట్లాడుతూ క్యాన్సర్‌ను తొలి దశలోనే గుర్తించి, వైద్యం అందించడం అత్యంత కీలకమని తెలిపారు. శాసనసభ్యులు పంచకర్ల రమేష్‌బాబు మాట్లాడుతూ అవసాన దశలో ఉన్న క్యాన్సర్ రోగుల ఉపశమన సంరక్షణకు అవసరమైన సేవలు ఇక్కడ అందుతాయని పేర్కొన్నారు. అభివృద్ధికి సహకరించిన ఇంబెల్ (ఇండియా) లిమిటెడ్, ఐసిఐసిఐ ఫౌండేషన్, సిప్లా ఫౌండేషన్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అనకాపల్లి జిల్లా కలెక్టర్‌ను అభినందించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.ఆర్.అచ్యుత కుమారి, హోమిబాబా క్యాన్సర్ హాస్పిటల్ డైరెక్టర్ డా.ఉమేష్ మహంతశెట్టి, ట్రైనింగ్ హెడ్ డా. డోలా రోసా, ప్రాజెక్ట్స్ నోడల్ ఆఫీసర్ జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా. చంద్రశేఖర్ దేవ్, ప్రోగ్రామ్ ఆఫీసర్ డా. ఎస్థర్ రాణి పాల్గొన్నారు.

## వెల్లంకి విద్యార్థిని పూజిత అంతర్జాతీయ విజయం

### నగదు బహుమతి అందజేసిన డిఈవో



ఆనందపురం, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త: క్రీడల పట్ల అంకితభావం, నిరంతర సాధన, పట్టుదల ఉంటే గ్రామీణ ప్రాంత విద్యార్థులు సైతం అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటగలరని వెల్లంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థిని తాతపూడి పూజిత నిరూపించింది. అండర్-15 'గోల్ షార్ట్ బాల్' ఫైనల్ మ్యాచ్‌లో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించి భూటాన్‌పై విజయం సాధించడం ద్వారా పూజిత పాఠశాలకు, గ్రామానికి గర్వకారణంగా నిలిచింది. గత నెల 24వ తేదీ నుంచి 27వ తేదీ వరకు జరిగిన అండర్-15 'గోల్ షార్ట్ బాల్' పోటీల్లో పూజిత ఇండియా తరపున పాల్గొని తన ప్రతిభను చాటుకుంది. చిన్న వయసులోనే క్రీడారంగంలో ఉన్నత లక్ష్యంతో శ్రమిస్తూ అంతర్జాతీయ స్థాయికి ఎదగడం ఆమె కృషి, పట్టుదలకు నిదర్శనమని పలువురు ప్రశంసించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్. ప్రేమ్ కుమార్ పూజితను ప్రత్యేకంగా అభినందించి, ఆమె ప్రతిభను ప్రోత్సహించేందుకు రూ.5 వేల నగదు బహుమతిని ప్రకటించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి దేశానికి కీర్తి తీసుకురావాలని ఆకాంక్షించారు. పూజితకు శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయురాలు తోనంగి సరిత, పాఠశాల ప్రధానోపాధ్యాయులు దాడిశెట్టి రమేష్ కుమార్లను జిల్లా విద్యాశాఖ అధికారి అభినందించారు.

## కీర్తిశేషులు ఎమ్మెల్ రెడ్డి, కర్రీ చంద్రశేఖర్ రెడ్డిల జ్ఞాపకార్థంగా బహుమతుల ప్రధానం



విశాఖపట్నం, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త : 1,50,000 వేల రూపాయలు స్కాలర్షిప్ మరియు బైరెడ్డి అప్పల రెడ్డి ఏడు బహుమతులు పెద వాల్తేరు గ్రామంలో గ్రామంలో నివసిస్తున్న పదవ తరగతి విద్యార్థిని విద్యార్థులకు ఈ బహుమతులను గ్రామ సేవా సంఘం పెద్దలు మరియు కర్రీ పోలమాంబ బైరెడ్డి అప్పలమూర్తి, బైరెడ్డి పోతన రెడ్డి చేతుల మీదుగా అందజేయడం జరిగింది. మొదటి బహుమతి 1,00000 లక్ష రూపాయలు పండ చాందిని, రెండవ బహుమతి 25000 వేలు మద్ది సాయి ప్రణీత్ రెడ్డి, మూడవ 15000వేలు బహుమతి చిల్లా జయంతి కుమార్ రెడ్డి, నాలుగో బహుమతి 10,000వేల రూపాయలు రౌతుల శ్రావ్య లక్ష్మి మిగతా బెస్ట్ ప్రైస్ ఏడుగురికి ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు ప్రెసిడెంట్ బచ్చు తవిటిరెడ్డి, మరడ శ్రీనివాసరెడ్డి, వాకాడ బాపిరెడ్డి, పలికిల నీలరెడ్డి, చిన్నిపిల్లి రామిరెడ్డి, దల్లి పైడితల్లిరెడ్డి, బోర కుమారరెడ్డి, మద్ది శ్రీనివాసరెడ్డి పోలమాంబ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ పాల్గొన్నారు.

## శ్రీకృష్ణ జన్మాష్టమి ఉత్సవాలు ప్రారంభం



విశాఖపట్నం సెప్టెంబర్ 3 ప్రభాతవార్త : సాగర్ నగర్ ఇస్కాన్ ప్రాంగణం లో శ్రీ రాధా దామోదర సన్నిధా నంలో సాంప్రదాయ రీతిలో శ్రీకృష్ణ జన్మాష్టమి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి ఈ ఉత్సవాలను ఇస్కాన్ విశాఖపట్నం శాఖ అధ్యక్షులు సాంబదాస్ ప్రభుజి జ్యోతిని వెలిగించి ప్రారం భించారు. అనంతరం ఆయన ప్రసంగిస్తూ లీలావతారుడైన శ్రీకృష్ణ పరమాత్ముని దివ్య అనుగ్రహాన్ని పొందే దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. బాలకృష్ణునీ లీలలు వర్ణనాతీతమని ప్రతి లీలలో కూడా ప్రత్యేకత ఉందని తెలిపారు. శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని వివిధ అంశాలపై సాంస్కృతిక పోటీలు నిర్వహిం చడం జరిగింది. పాల్గొన్న ప్రతి ఒక్కరికి ప్రశంసా పత్రాలను అందజేశారు. వేడు కగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఇస్కాన్ మాతాజీ నితాయ్ సేవిని , ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్ వంశీకృష్ణ ప్రభు జీవితకాల సభ్యులు సేవకులు పాల్గొన్నారు. ఇస్కాన్ మందిరంలో నిర్వహించే శ్రీకృష్ణ జన్మాష్టమి ఉత్సవాలలో భక్తులు పాల్గొని శ్రీకృష్ణ పరమాత్మను దర్శించుకుని తీర్థ ప్రసాదములు స్వీకరిం చాలని కోరారు .

## విశాఖలో ఘనంగా జేసీఐ జాతీయ అధ్యక్షుడి పర్యటన



గాజువాక, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త : జేసీఐ ఇండియా జాతీయ అధ్య క్షుడు ఆర్‌పీపీ ఎన్. భరత్ ఆచార్య అధికారిక పర్యటన సందర్భంగా విశాఖలో 'మల్టీ-ఎల్ఓ' సమావేశం ఘనంగా జరిగింది. జోన్ అధ్య క్షుడు జేఎఫ్ఆర్ చైతన్య వసంత వాడ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని జేఎఫ్ఎస్ భార్గవ మహర్షి సమన్వయం చేశారు. ఈ సందర్భంగా జేసీఐ విశాఖ, విశాఖ వ్యాలీ ఆధ్వర్యంలో అనాథాశ్రమ చిన్నారులకు నిత్యావసరాలు పంపిణీ చేశారు. 111 మంది దాతలను గుర్తించి సత్కరించడంతో పాటు బి. దిలీప్ కుమార్, వినయ్ కుమార్, చైతన్యలను ప్రత్యేకంగా సన్మానించారు. సమావేశంలో పలు కీలక నిర్ణయాలు, పదోన్నతులు ప్రకటించారు. విశాఖ రిన్యూ కోర్ ఆధ్వర్యంలో మట్టి వినాయకుల పంపిణీ, గాజువాక పవర్ 'పవర్ పల్స్' సంచిక ఆవిష్కరణ, వేంపాడలో కొత్త శాఖ విస్తరణ, విశాఖ వ్యాలీకి 'జోన్‌కాన్' సహ ఆతిథ్య హోదా,పలువురు సభ్యులు హెచ్ జీఎఫ్ నుంచి జెఎఫ్ఎం, జెఎఫ్‌డిలుగా పదోన్నతులు సాధించారు. జేసీఐ కుటుం బంలో ఐక్యత, సేవా భావాన్ని చాటుతూ సమావేశం విజయవంతంగా ముగిసింది.

## డిజైర్ సొసైటీ చిన్నారులకు పౌష్టికాహారం పంపిణీ



గాజువాక, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త : డిజైర్ సొసైటీలోని హెచ్.ఐ.వి బాధిత చిన్నారులకు గాజువాక బిజెపి కన్వీ నర్, రాష్ట్ర మీడియా ప్యానెలిస్ట్ కరణంరెడ్డి నరసింగరావు (కేఎన్ఆర్) పౌష్టికాహారం, పండ్లు, బిస్కెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిజైర్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ ద్వారా ప్రత్యేక పిల్లలను అక్కున చేర్చుకుని, వారికి ఉచిత భోజనం, వసతి, వైద్య సదుపాయాలు అందించడం అభినం దనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బిజెపి సోషల్ మీడియా కో-కన్వీనర్ కృష్ణారెడ్డి, కేవీ రమణ, శ్రీను, డిజైర్ సొసైటీ మేనేజర్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## జీవీఎంసీ 62వ వార్డులో మెగా ఫాగింగ్

### పనులను పరిశీలించిన వార్డ్ అధ్యక్షులు మాలినాయుడు



గాజువాక, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త : జీవీఎంసీ 62వ వార్డులో గురువారం సాయంత్రం చేపట్టిన మెగా ఫాగింగ్ పనులను వార్డు టీడీపీ అధ్యక్షుడు మజ్జి మాలినాయుడు పరిశీలించారు. మలేరియా ఇన్‌స్పెక్టర్ డి. రవికుమార్ పర్యవేక్షణలో ఈ పనులు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ.. ఎమ్మెల్యే గణబాబు ఆదేశాల మేరకు ప్రజారోగ్య రక్షణ పనులను పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. ప్రతి శుక్రవారం 'డ్రై డే' పాటిస్తూ ఇళ్ల పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని కోరారు. చెత్తను బహిరంగ ప్రదేశాల్లో వేయకుండా పారిశుధ్య వాహనాలకు తడి, పొడి వ్యర్థాలను వేర్వేరుగా అందించాలని సూచించారు. కార్యక్రమంలో మలేరియా సూపర్‌వైజర్ శ్రీనివాసరావు, గ్రామాభివృద్ధి సంఘం అధ్యక్షుడు నీలంరాజు, టీడీపీ నాయకులు సన్యాసిరావు, రాము, లక్ష్మి పాల్గొన్నారు.

## కీలక జంక్షన్లలో మల్టీ స్క్రీన్ సీసీ కెమెరాలు

- త్వరలో భీమిలి క్రాస్ రోడ్డు చెక్‌పోస్టు ప్రారంభం
- భద్రతకు మరింత పటిష్టం
- ఆనందపురం సీఐ ఎర్రంనాయుడు



ఆనందపురం, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త: పోలీస్ కమిషనర్, డీసీపీ-1 ఆదేశాల మేరకు ఆనందపురం పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రజల భద్రత, నేరాల నియంత్రణకు మరింత పటిష్ట చర్యలు చేపడుతున్నట్లు ఆనందపురం సీఐ ఎర్రంనాయుడు తెలిపారు. ఇందులో భాగంగా గురువారం మధ్యాహ్నం భీమిలి క్రాస్ రోడ్ జంక్షన్, బోయపాలెం జంక్షన్‌లలో రెండు మల్టీ స్క్రీన్ సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ ఎర్రం నాయుడు మాట్లాడుతూ, ప్రధాన కూడళ్లు మరియు రద్దీ ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు ద్వారా నిరంతర నిఘా సాధ్యమవు తుందన్నారు. నేరాలకు పాల్పడే వ్యక్తులను గుర్తించడంలో, రోడ్డు ప్రమాదాల సమయం లో వాహనాల వివరాలను సేకరించడంలో, ట్రాఫిక్ పరిస్థితులను పర్యవేక్షించడంలో ఈ కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ఏదైనా నేర సంఘటన జరిగిన సమయంలో సీసీ కెమెరాల ఫుటేజీ ద్వారా నిందితులను త్వరితగతిన గుర్తించి పట్టుకు నేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నా రు. అదేవిధంగా అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలపై నిఘా ఉంచడంతో పాటు చోరీలు, ఇతర అసాంఘిక కార్యకలా పాలను అరికట్టడంలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. ప్రజల్లో భద్రతా భావం పెంపొందించడంతో పాటు శాంతి భద్రతల పరిరక్షణకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నామని తెలిపారు. అనంతరం భీమిలి క్రాస్ వద్ద ఉన్న పోలీస్ చెక్‌పోస్టును సీఐ ఎర్రంనాయుడు పరిశీలిం చారు. చెక్‌పోస్టు లోపల, పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం నిర్వహించి పరిశుభ్రం చేశారు. చెక్‌పోస్టును త్వరలో పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువచ్చి కార్యకలాపాలు ప్రారంభించనున్నట్లు తెలిపా రు. భీమిలి క్రాస్ ప్రధాన రహదారుల కూడలి కావడంతో చెక్‌పోస్టు ఏర్పాటు ద్వారా వాహనాల తనిఖీ, అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిఘా, అక్రమ రవాణా నిరోధం మరింత సమర్థవంతంగా చేపట్టవచ్చని సీఐ పేర్కొన్నారు. ముఖ్యంగా మద్యం, మాదకద్ర వ్యాలు, ఇతర నిషేధిత వస్తువుల అక్రమ రవాణాను అరికట్టడంలో చెక్‌పోస్టు కీలకంగా పనిచేస్తుందన్నారు.

సీసీ కెమెరాల నిఘా, చెక్‌పోస్టు కార్యకలాపాలు సమన్వయంతో పనిచేయడం ద్వారా ఆనందపురం పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతిభద్రతలను మరింత బలోపేతం చేయనున్నట్లు సీఐ ఎర్రంనా యుడు తెలిపారు. ప్రజలు కూడా పోలీ సులకు సహకరిస్తూ అనుమానాస్పద కదలికలు లేదా సంఘటనలపై వెంటనే సమాచారం అందించాలని ఆయన కోరారు.

## బిఆర్‌టిఎస్ కాలువపై ప్రత్యేక సిమెంట్ దిమ్మలు

- జ్ఞానాపురం గోల్డెన్ జూబ్లీ పాఠశాల కాలువను బిఆర్‌టిఎస్ కాలువకు అనుసంధానించాలి
- మలేరియా ఇతర వ్యాధుల నుంచి బాలలకు రక్షణ కల్పించండి



జ్ఞానాపురం, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త జ్ఞానాపురం గోల్డెన్ జూబ్లీ పాఠశాల ఎదుట బిఆర్‌టిఎస్ కాల్వ పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి.. ఎర్రగడ్డ ప్రధాన కాలువ నుంచి జెఎన్ఎన్ యుఆర్ఎం ఆంజనేయ స్వామి ఆలయం వరకు ఉన్న బిఆర్‌టిఎస్ కాల్వ పై ప్రత్యేకంగా సిమెంటు పలకలు ఏర్పాటు చేస్తున్నారు. గతంలో బిఆర్‌టిఎస్ ప్రాజెక్టులో భాగంగా ఈ కాలువపై పెద్ద సిమెంట్ పలకలు వేశారు. కాల్వలో పేరుకు పోయిన చెత్తను తొలగించేందుకు జీవీఎంసీ శానిటేషన్ విభాగం ప్రతిసారి ఈ దిమ్మలను తొలగించేందుకు ఇబ్బంది పడుతుంది. దీనితో అర కిలోమీటర్ నిడివి ఉన్న ఈ కాలువ పూర్తి స్థాయిలో చెత్తను తొలగించ లేకున్నారు, శానిటేషన్ విభాగం జీవీఎంసీ ఉన్నతాధికారులకు ఈ సమస్యపై చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సమస్యను పరిశీలిం చిన జీవీఎంసీ ఇంజనీరింగ్ విభాగం ప్రత్యేకంగా సిమెంట్ పలకలను తయారుచేసి కాల్వపై వేసేందుకు సిద్ధమయింది. ఈ పలకలు ఎప్పుడు కావాలంటే అప్పుడు తాత్కాలికంగా తొలగించి శానిటేషన్ పనులు నిర్వహించే అవకాశం ఉంది. ప్రస్తుతం వీటికి సంబంధించిన సిమెంటు పలకలు పని ప్రదేశంలో తీసుకొచ్చారు. అలాగే వీటిని వేయాల్సిన చోట ఉన్న పాత పలకలను తొలగించే కార్యక్రమం ప్రారంభమైంది. ఈ పలకల ఏర్పాటు మరో వారం రోజుల్లో పూర్త య్యే అవకాశం ఉన్నట్టు జీవీఎంసీ ఇంజనీ రింగ్ అధికారులు చెబుతున్నారు. అలాగే చెత్తను తొలగించిన తర్వాత ప్రస్తుతం కాలువను బిఆర్‌టిఎస్ కాలువకు కలెక్టివిటీ ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు. దీని ద్వారా పాఠశాల, కళాశాల, మదర్ తెరిసా కార్యాలయాల నుంచి వచ్చిన వేస్ట్ వాటర్ నేరుగా బిఆర్‌టిఎస్ కాలువ ద్వారా ఎర్రి గడ్డలోకి ప్రవహించే అవకాశం ఏర్పడు తుంది. ప్రస్తుతం ఈ పాత కాలువ ద్వారా నీరు సజావుగా ఎర్రగడ్డలోకి వెళ్లకుండా నిలిచిపోతుంది. ఈ నీటిలో మలేరియా దోమల విజృంభన భారీగా పెరుగుతుంది. దీనిపై జీవీఎంసీ మలేరియా విభాగం కూడా పరిశీలన చేసింది. ఇక్కడ నిల్వ ఉన్న నీటిలో మలేరియా లార్వా ఉన్నట్టు గుర్తించారు. ఇక్కడ పాఠశాలలో మూడవ సంవత్సరం నుంచి పిల్లలు విద్యను అభ్యసిస్తున్నారు. మలేరియా దోమలతో పిల్లలకు జ్వరాలతో పాటు ఇతర శారీరిక రుగ్మతలు వచ్చే అవకాశాలు ఉన్నాయి. అందుకే మురుగు నీరు బయటకు కనిపించకుండా బి ఆర్ టి ఎస్ కాలువ ద్వారా ఎర్రగడ్డలోకి వెళ్లేలా అధికారులు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. అలాగే ప్రస్తుతమున్న కాలువను మట్టితో నింపి అక్కడ మొక్కలు పెంచి పచ్చదనాన్ని ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

## మహిళల చోరీ ముఠా గుట్టురట్టు..!

- సీసీ కెమెరాల ఆధారంగా ఇద్దరు మహిళల అరెస్ట్
- బంగారు ఆభరణాలు రికవరీ..





విశాఖ క్రైమ్, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త : నగరంలో బంగారు ఆభరణాల చోరీ కేసును ఎంవీపీ క్రైమ్ పోలీసులు ఛేదించారు. సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా ఇద్దరు మహిళలను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి చోరీకి గురైన బంగారు ఆభరణాలను పోలీసులు రికవరీ చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఫిర్యాదుదారు పూర్ణా మార్కెట్‌కు షాపింగ్ కోసం వెళ్లి ఆటోలో ప్రయాణించారు. జగదాంబ జంక్షన్ వద్ద ఇద్దరు మహిళలు అదే ఆటోలో ఎక్కారు. అనంతరం సెవెన్ హిల్స్ ఆసుపత్రి జంక్షన్ వద్ద వారు ఆటో నుంచి దిగిపోయారు. ఆ తర్వాత ఫిర్యాదుదారు పెదవాల్తేరు విశాఖ ఐ హాస్పిటల్ వద్ద ఆటో దిగుతున్న సమయంలో తన బ్యాగ్‌లో పెట్టుకున్న బంగారు ఆభరణాలు కనిపించకపోవడంతో పోలీసుల ను ఆశ్రయించారు. దీంతో ఎంవీపీ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వెంకోజిపాలెం ప్రాంతంలోని సీసీ కెమెరాలతో పాటు కమాండ్ కంట్రోల్‌లోని సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలించి నింది తులను గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. ఈ క్రమంలో ఎంవీపీ కాలనీలోని బృందావన్ పార్క్ వద్ద రావుల వసంత, ఆవుల పార్వతి అనే ఇద్దరు మహిళలను అదుపులోకి తీసుకుని విచారించారు. వారి నుంచి చోరీకి గురైన బంగారు ఆభరణాలను రికవరీ చేసి.. కోర్టులో హాజరుపరిచి జైలుకు తరలించినట్లు పోలీసులు వెల్లడించారు. పోలీసుల ప్రకా రం.. రావుల వసంతపై ఇప్పటికే విశాఖ పట్నం, విజయనగరం, అనకాపల్లి, కాకినాడ, నెల్లూరు జిల్లాల్లో పలు చోరీ కేసులు నమోదై ఉన్నట్లు తెలుస్తుంది. ఉన్నట్లువుల పార్వతిపై కూడా శ్రీకాకుళం, విజయనగరం తదితర ప్రాంతాల్లో పలు చోరీ కేసులు నమోదై ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కేసును త్వరితగతిన ఛేదించిన ఎంవీపీ క్రైమ్ సీఐ వి.చక్రధరరావు, ఎస్ఐ ఎస్.రాజు, కానిస్టేబుళ్లు ఎస్.హరిప్రసాద్, ఎన్.అప్పలరాజులను ఉన్నతాధికారులు అభినందించారు.

## పారిశుద్ధ్యంలో అలసత్వం సహించేది లేదు

### దీర్ఘకాలంగా విధులకు డుమ్మా కొడుతున్న సిబ్బందిపై చర్యలు

### ఎన్నికల పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి : కమిషనర్ కేతన్ గార్గ్



విశాఖపట్నం, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త : జీవీఎంసీ పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణలో అలసత్వాన్ని ఎంతమాత్రం సహించబోమని కమిషనర్ కేతన్ గార్గ్ స్పష్టం చేశారు. ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్య సేవలు అందేలా అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. నార్త్‌జోన్‌లోని 45, 48వ వార్డుల్లో గురువారం జోనల్ కమిషనర్ బి. రాముతో కలిసి ఆయన పర్యటించి పారిశుద్ధ్యం, తాగునీరు, రోడ్లు, కాలువలు, వీధి దీపాల నిర్వహణను పరిశీలించారు.

48వ వార్డులో పారిశుద్ధ్య కార్మికుల హాజరు పట్టికను పరిశీలించగా, ఒక శాశ్వత పారిశుద్ధ్య కార్మికురాలితో పాటు నలుగురు పొరుగు సేవల సిబ్బంది దీర్ఘకాలంగా విధులకు గైర్హాజరవుతున్నట్లు గుర్తించారు. దీనిపై అన్ని జోనల్ కమిషనర్లతో వాకీటాకీ ద్వారా మాట్లాడిన కమిషనర్, దీర్ఘకాలంగా విధులకు హాజరుకాని సిబ్బందిని గుర్తించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వారి స్థానంలో పారిశుద్ధ్య విధులకు దరఖాస్తు చేసుకున్న అర్హులకు అవకాశం కల్పించాలని సూచించారు. పలు ప్రాంతాల్లో రోడ్ల పక్కన పేరుకుపోయిన చెట్ల కొమ్మలను వెంటనే తొలగించాలని ఆదేశించారు. విద్యుత్ వైర్లకు అడ్డుగా ఉన్న కొమ్మలను ఈపీడీసీఎల్ సిబ్బంది తొలగించిన అనంతరం అక్కడే ఉంచుతున్నారని అధికారులు వివరించడం తో, ఈపీడీసీఎల్ అధికారులతో సమన్వ యం చేసుకుని వాటిని ఎప్పటికప్పుడు తరలించాలని సూచించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి పోలింగ్ స్టేషన్ల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేయాలని కమిషనర్ ఆదేశించారు. షాదీఖానా, కేంద్రీయ విద్యాలయం, ఎన్జీవోస్ కాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఎలిమెంటరీ స్కూల్, భారతీయ విజ్ఞాన కేంద్రం తదితర ప్రాంతాల్లో ప్రతిపాదించిన పోలింగ్ స్టేషన్ల ప్లాన్ కాపీలను పరిశీలించారు. అవసరమైన చోట కొత్త పోలింగ్ స్టేషన్లను గుర్తించి, సాధ్యమైనంత వరకు ఆయా వార్డుల పరిధిలోనే ఏర్పాటు చేయాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలని జోనల్ కమిషనర్లను ఆదేశించారు.

45వ వార్డు సోనియా గాంధీ కాలనీలో తాగునీటి సరఫరా తక్కువగా ఉందని స్థానిక రజకులు కమిషనర్ దృష్టికి తీసుకురాగా, అక్కడ జరుగుతున్న 24ఐ7 నీటి సరఫరా పైప్‌లైన్ పనులను త్వరితగతిన పూర్తి చేసి నీటి కొరత లేకుండా చూడాలని మంచినీటి విభాగం ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.

## విశాఖ నగర ప్రజలకు జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ శుభాకాంక్షలు



విశాఖపట్నం, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త : శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా విశాఖ నగర ప్రజలకు జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ హృదయపూర్వక శు భాకాంక్షలు తెలిపారు. శ్రీకృష్ణుని జీవితం, భగవద్గీత బోధనలు మానవాళికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. కృష్ణాష్టమి వేడుకలను భక్తిశ్రద్ధలతో పాటు పర్యావరణహితంగా నిర్వహించాలని కమిషనర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్లాస్టిక్ వినియోగాన్ని నివారించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా నగర పరిశు భ్రతకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. శ్రీకృష్ణ జన్మాష్టమి నగర ప్రజలందరికీ సుఖసంతోషాలు, ఆరోగ్యం, శ్రేయస్సును అందించాలని ఆకాంక్షించారు.

## మాధవస్వామి ఆలయంలో కృష్ణాష్టమి పూజలు



మాధవధార, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త : మాధవధారలో గల మాధవస్వామి ఆలయంలో శు క్రవారం కృష్ణాష్టమి పూజలు నిర్వహించనున్నట్టు అర్చకులు తెలిపారు.శుక్రవారం వేకువ జాము నుంచి స్వామి వారికీ ప్రత్యేక పూజలు నిర్వహించి మధ్యాహ్నం నుంచి కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించనున్నట్టు తెలిపారు.భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వేడుకలు విజయవంతం చేయాలని కోరారు

## సస్పెండ్ అయ్యిన డ్రైవింగ్ లైసెన్స్ దారులు 3 రోజుల శిక్షణ పూర్తి చేయాలి



మాధవధార, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త : మోటారు వాహనాల చట్టం, 1988లోని సెక్షన్ 19(2) ప్రకారం, వివిధ కారణాల వల్ల సస్పెండ్ చేయబడిన డ్రైవింగ్ లైసెన్స్ దారులు తమ అనర్హత కాలం పూర్తయిన అనంతరం డ్రైవింగ్ లైసెన్సు పొందాలంటే డ్రైవర్ రిఫ్రెషర్ ట్రైనింగ్ కోర్సును విజయవంతంగా పూర్తి చేయాలనీ డీటీసీ ఆర్ సి హెచ్ శ్రీనివాస్ గురువారం తెలిపారు.ప్రభుత్వం అనుమతి ఇచ్చిన 3 రోజుల డ్రైవర్ రిఫ్రెషర్ ట్రైనింగ్ కోర్స్ నిర్వహించేందుకు ఏపీఎస్ఆర్టిసికు చెందిన మొత్తం 25 డ్రైవింగ్ స్కూళ్లు,ఎన్ టి ఆర్ జిల్లా పిఎస్సి బోస్ డ్రైవింగ్ స్కూల్,కృష్ణా జిల్లా మోడల్ డ్రైవింగ్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ లో డ్రైవింగ్ శిక్షణా సంస్థలలో శిక్షణ తీసుకువాలని సూచించారు.సంబంధిత లైసెన్స్ దారులు ఈ నిబంధనను గమనించి,అవసరమైన రిఫ్రెషర్ శిక్షణను సకాలంలో పూర్తి చేసుకోవాలన్నారు.

## ఎస్ సి,బి సి,ఎస్ టి ఓటర్ల ముసాయిదాపై అభ్యంతరాల స్వీకరణకు గ్రామ సభలు



పద్మనాభం, సెప్టెంబర్ 3,ప్రభాతవార్త : రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలు మేరకు పద్మనాభం మండలంలో పలు గ్రామాలలో గురువారం బిసి, ఎస్సీ, ఎస్టీ ఓటర్ల ముసా యిదాపై అభ్యంతరాల స్వీకరణకు ఎండిఒ బి చిన్నారావు ఆధ్వర్యంలో గ్రామ సభలను సచివాలయ అది కారులు గ్రామ సభలు నిర్వహిం చారు.ఈ సభలకు హాజరైన గ్రామాల ప్రజలతో కార్యదర్శులు మాట్లాడుతూ ఈ ఓటర్ల జాబితాలను ప్రతి ఒక్కరూ పరిశీలించి అభ్యంతరాలు తెలపవచ్చునని అధికారులు కోరారు. అలాగే నూతన ఓటర్లును చేర్పించవచ్చునని వారు చెప్పారు.

## రాష్ట్ర స్థాయి బాక్సింగ్ లో మెరిసిన పెదగదిలి భువన్ స్వరూప్



ఆరిలోవ, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త : ఇటీవల తిరుపతిలో గత నెల 24వ తేది నుండి 27 వరకు జరిగిన అమరావతి ఛాంపియన్షిప్ రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో తూర్పు నియోజకవర్గం స్థానిక 12వ వార్డు పెదగదిలి గ్రామానికి చెందిన నమ్మి భువన్ స్వరూప్ అద్భుతమైన ప్రతిభ కనబరిచి బంగారు పతాకాన్ని సాధించారు. స్వరూపు బుల్లయ్య కాలేజ్ లో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలనే ఆలోచనతో నగరంలోని ఉన్న మైక్ బాక్సింగ్ క్లబ్ లో చేరి బాక్సింగ్ గురువులైన కోచ్ హరీష్, దినేష్, భవిష్యత్తు చిత్రానంద్ వద్ద శిక్షణ పొందడంతో కోచ్ లు ఇచ్చిన శిక్షణ, తల్లితండ్రులైన నమ్మి అశోక్ జయ అందించిన ప్రోత్సాహంతోనే చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణిస్తున్నట్లు భువన్ స్వరూప్ తెలిపారు. ఈ సందర్భంగా పెదగదిలి గ్రామస్తులు, గ్రామ పెద్దలు స్వరూప్ కు ప్రత్యేక అభినందనలు తెలియజేసి భవిష్యత్తులో మరెన్నో పతకాలు సాధించాలని ఆశీర్వదించారు.

## చినగదిలిలో వైభవంగా ప్రారంభమైన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



ఆరిలోవ, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త తూర్పు నియోజకవర్గం స్థానిక నేతాజీ నగర్, చినగదిలి ప్రాంతం లో ఉన్న శ్రీ తాండవ కృష్ణ ఆల యంలో తాండవ కృష్ణ యాదవ సేవా సంఘం ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు అంగరంగ వైభవంగా గురువారం ప్రారంభమ య్యాయి. కార్యక్రమములో భాగంగా ఉయ్యాల సేవా, స్వామి వారి జననా ఘట్టం కార్యక్రమం జరిగింది. 4వ తేదీ శుక్రవారం నాడు రోహిణి నక్షత్రం తులాలగ్న స్వామి వారి విగ్రహ ప్రతిష్ట, అదేవిధంగా భక్తులు చేతులు మీదుగా గోపూజ తో పాటు షోడష ఉపచార పూజలు, సాయంత్రం 6 గంటలకు ఉట్టి సంబరాలు జరగనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. శనివారం ఆలయ ప్రాంగణం వద్ద స్త్రీల చే తులసీ సహిత కుంకుమార్చన, మధ్యాహ్నం మహా అన్న సమారాధన జరుగును. ఆదివారం సుదర్శన హోమం స్వామివారి తిరువీధిలలో ఊరేగింపు కార్యక్రమాలు జరుగునున్నట్లు తాండవ కృష్ణ యాదవ సేవా సంఘం సభ్యులు తెలిపారు.

## మాన్సాస్ భూసమస్య పరిష్కారం కోసం రైతుల సమావేశం



ఆనందపురం, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త: ఆనందపురం మండలం బోని గ్రామంలో దీర్ఘకాలంగా కొనసాగుతున్న మాన్సాస్ భూసమస్య పరిష్కారం కోసం రైతులు మరోసారి ఏకతాటిపైకి వచ్చారు. బోని, మద్ది, శిర్లపాలెం, ముకుందపురం గ్రామాల రైతులతో సూరాల సత్య వరప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం సమావేశం నిర్వహించారు. మాన్సాస్ పరిధిలోని భూముల సర్వే నంబర్లు, రైతుల పేర్లు, రికార్డుల్లోని వివరాలను గ్రామాల వారీగా సేకరించి ఒకే అర్జీ ద్వారా అధికారులకు సమర్పించాలని నిర్ణయించారు. ఇటీవల ఈ సమస్యపై భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును కలిసి వినతిపత్రం అందజేయగా, ఆయన జిల్లా కలెక్టర్, రెవెన్యూ అధికారులతో మాట్లాడి సమస్య వివరాలను తెలుసుకున్నట్లు తెలిపారు. ఏళ్ల తరబడి కొనసాగుతున్న భూసమస్యకు అధికారులు శాశ్వత పరిష్కారం చూపాలని రైతులు కోరారు.

## ఎట్టకేలకు అయినాడ,రేవిడి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



పద్మనాభం, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త : మండలంలో అయినాడ,రేవిడి రోడ్డు నిర్మాణ పనులు ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. దీంతో పలు గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే అయినాడ నుండి రేవిడి గ్రామ జంక్షను వరకు గోతులతో నిండి ఉన్న రోడ్డు నిర్మాణానికి గత సంవత్సరం కోట్లాది రూపాయలతో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శంఖుస్థాపన చేసారు.తరువాత కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల కొంత కాలం రోడ్డు నిర్మాణ పనులు నిలిచిపోయాయి. దీనిపై పత్రికలలో వచ్చిన వార్తలపై ఎమ్మెల్యే స్పందించి రోడ్డు పనులను ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. దీంతో పలు గ్రామాలలో ముందుగా డ్రెయినేజీ, అక్కడక్కడ రోడ్డు పనులు ప్రారంభ మయ్యాయి.

4-9pg7exHMNWJQE.qxd:4-9pg7exHMNWJQE.qxd 1/1/02 6:57 AM Page 1



# ఎస్పిడిసిఎల్ పరిధిలో స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు ప్రాధాన్యం

- 33-11 కేవీ సబ్‌స్టేషన్ల నిర్మాణ పనుల వేగవంతం



**తిరుపతి, సెప్టెంబరు 3 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఎస్పిడిసిఎల్) పరిధిలో స్మార్ట్ మీటర్ల ఏర్పాటు పనులను వేగవంతం చేయాలని ఆ సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి ఆదేశించారు. ఎస్పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలో గురువారం వివిధ అభివృద్ధి పనులపై సంస్థ డైరెక్టర్లు, చీఫ్ జనరల్ మేనేజర్లతో సిఎండి శివశంకర్ లోతేటి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థ పరిధిలోని నెల్లూరు సర్కిల్‌లో 2.42 లక్షల స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేయాలనే లక్ష్యానికి అనుగుణంగా 1.49 లక్షల మీటర్లు ఏర్పాటు చేయడం జరిగిందని, ఇంకా 93వేల మీటర్లు ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. తిరుపతి సర్కిల్‌లో 2.36 లక్షల మీటర్లకు గానూ 2.05 లక్షల మీటర్లను ఏర్పాటు చేశారని, 30 వేల మీటర్లను ఏర్పాటు చేయాల్సి ఉందని, చిత్తూరు సర్కిల్‌లో 94 వేల మీటర్ల లక్ష్యానికి గానూ 81 వేల మీటర్లను ఏర్పాటు చేశారని, 13 వేల మీటర్లను ఏర్పాటు చేయాల్సి ఉందని. అన్నమయ్య సర్కిల్‌లో 1.01 లక్షల మీటర్ల లక్ష్యానికి గానూ 85 వేల మీటర్లను ఏర్పాటు చేశారని, 16 వేల మీటర్లను ఏర్పాటు చేయాల్సి ఉందని, కడప సర్కిల్‌లో 1.72 లక్షల మీటర్ల ఏర్పాటు లక్ష్యానికి గానూ 1.24 లక్షల మీటర్లను ఏర్పాటు చేశారని, ఇంకా 48 వేల మీటర్లను ఏర్పాటు చేయాల్సి ఉందని, శ్రీ సత్యసాయి సర్కిల్‌లో 86 వేల మీటర్ల ఏర్పాటు లక్ష్యం కన్నా ఎక్కువగా 89 వేల మీటర్లు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా అనంతపురం సర్కిల్‌లో 1.43 లక్షల మీటర్ల లక్ష్యానికి గానూ 1.27 లక్షల మీటర్లను ఏర్పాటు చేయడం జరిగిందని, ఇంకా 15 వేల మీటర్లను ఏర్పాటు చేయాల్సి ఉందని, నంద్యాల సర్కిల్‌లో 1,01 లక్షల మీటర్ల ఏర్పాటు లక్ష్యానికి గానూ 99 వేల మీటర్లను ఏర్పాటు చేశారని, ఇంకా 2 వేల మీటర్లను ఏర్పాటు చేయాల్సి ఉందని, కర్నూలు సర్కిల్‌లో 1.41 లక్షల మీటర్ల ఏర్పాటు లక్ష్యానికి గానూ 1.27 లక్షల మీటర్లను ఏర్పాటు చేశారని, ఇంకా 14 వేల మీటర్లను ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. సంస్థ పరిధిలో మొత్తంగా 13.20 లక్షల స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు లక్ష్యం నిర్దేశించగా, ఇప్పటివరకు 10.89 లక్షల మీటర్లను ఏర్పాటు చేశారని, ఇంకా 2.31 లక్షల స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయాల్సి ఉందని వివరించారు. ఈ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు అవసరమైనచర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. స్మార్ట్ మీటర్ల కమ్యూనికేషన్ స్థితి, మీటర్ల ద్వారా అందుతున్న డేటా విశ్లేషణ, ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్ల అమలు తదితర అంశాలపై సిఎండి సమగ్రంగా సమీక్షించారు.

**డేటా విశ్లేషణకు ప్రాధాన్యం:** స్మార్ట్ మీటర్ల నుండి అందుతున్న డేటాను సమర్థవంతంగా విశ్లేషించి, విద్యుత్ వినియోగ విధానం, బిల్లింగ్ తదితర అంశాల్లో అవసరమైన నిర్ణయాలు తీసుకునేలా చర్యలు చేపట్టాలని సిఎండి సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని విద్యుత్ పంపిణీ సేవలను మరింత మెరుగుపరచాలని తెలిపారు. ఎస్పిడిసిఎల్ పరిధిలో నిర్మాణంలో ఉన్న 33/11 కెవి సబ్‌స్టేషన్ల పనుల పురోగతిని ఆయన సమీక్షించారు. నిర్ణీత గడువులో పనులను పూర్తి చేసి, సబ్‌స్టేషన్లను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా వినియోగదారులకు మెరుగైన నాణ్యమైన విద్యుత్ సరఫరా అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. వ్యవసాయ విద్యుత్ సర్వీసుకు రైతులు దరఖాస్తు చేసుకునే విధానాన్ని మరింత సులభతరం చేస్తున్నామని సిఎండి తెలిపారు. ఈ చర్యల్లో భాగంగానే వినియోగదారులు 1912 కు కాల్ చేయడం ద్వారా పేరు, తండ్రి పేరు, ఆధార్ నంబరు, మొబైల్ నంబరు తదితర వివరాలను తెలియజేసి, వ్యవసాయ విద్యుత్ సర్వీసుకు దరఖాస్తును నమోదు చేసుకోవచ్చని తెలియజేశారు. ఆ తర్వాత ఈ వివరాలకు సంబంధించిన డాక్యుమెంట్లను విద్యుత్ శాఖ సిబ్బంది అందుకుని, వివరాలను ధ్రువీకరించిన అనంతరం నూతన సర్వీస్ కోసం చెల్లింపు ప్రక్రియ మొదలవుతుందని వివరించారు.

**యాప్‌ల వినియోగం సరళీకృతం:** సంస్థ పరిధిలో విద్యుత్ వినియోగదారులకు ఆధునిక సాంకేతికత ద్వారా మెరుగైన, సత్వర సేవలందించేందుకు కృషి చేస్తున్నామని సిఎండి శివశంకర్ లోతేటి తెలిపారు. సంస్థ పరిధిలో అందుబాటులో ఉన్న వివిధ యాప్ ల పనితీరుపై క్షుణ్ణంగా సమీక్షించారు. వివిధ యాప్‌ల వినియోగాన్ని సరళీకృతం చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. విద్యుత్ పంపిణీ వ్యవస్థలో సాంకేతికతను విస్తృతంగా వినియోగించుకోవడం ద్వారా వినియోగదారులకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరాతో పాటు మెరుగైన సేవలు అందించడమే ఎస్పిడిసిఎల్ ప్రధాన లక్ష్యమని సిఎండి శివశంకర్ లోతేటి పేర్కొన్నారు. ఈ సమీక్షా సమావేశంలో సంస్థ డైరెక్టర్లు కె. గురవయ్య, పి. అయూబ్ ఖాన్, చీఫ్ జనరల్ మేనేజర్లు జె. రమణాదేవి, ఆర్.పద్మ, ఎన్. శోభా వాలెంటీనా, యం.మురళీ కుమార్, సిహెచ్ రామచంద్రరావు, కె.సంపత్ కుమార్, ఎస్.రమణ, జనరల్ మేనేజర్లు సుబ్బారావు, జగదీష్, లత, సురేష్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## నల్లకోటులో వచ్చి గురజాల కోర్టులో లొంగిపోయిన హత్యకేసు నిందితుడు

### పోలీసుల అదుపులో మరో నిందితుడు లచ్చిరెడ్డి..?

**రెంటచింతల, సెప్టెంబరు 3, ప్రభాతవార్త:** పోలీసులకు చిక్కకుండా నేరుగా న్యాయమూర్తి ఎదుట లొంగిపోవాలని భావించాడు.ఆ మేరకు లాయర్ దుస్తుల్లో ఉండి పోలీసులు కళ్లుగప్పి ఆర్డీవో కార్యాలయం నుంచి న్యాయస్థాన భవనాల ప్రాంగణంలోకి వెళ్లాడు.ద్విచక్రవాహనంపై వెనుకూర్చుని నల్ల గౌను వేసుకుని చేతిలో వివిధ రకాల కాగితాలు పట్టుకుని నల్ల అద్దాలు పెట్టుకుని నేరుగా ఏజేసీజె పి.అలేఖ్య ఎదుట హత్యకేసు నిందితుడు మోర్తాల ఉమ లొంగిపోయిన ఉదంతమిది.. వివరాల్లోకెళ్తే రెంటచింతల మండలంలోని రెంటాల గ్రామానికి చెందిన వైసీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి నవులూరి చెన్నారెడ్డి ఆగస్టు 6 రాత్రి స్కూటీపై స్వగ్రామానికి వెళ్తున్న సమయంలో దారి కాచి కారుతో ఢీకొట్టించి కళ్ళల్లో కారం చల్లి గొంతు కోశారు. ఈ హత్య పల్నాట సంచలనం కలిగించింది. చెన్నారెడ్డి హత్యకు సంబంధించి ఇప్పటి వరకు 8 మందిని అరెస్ట్ చేశారు. మరో ఇద్దరునిందితులు మామ,అల్లుడైన జక్కిరెడ్డి లచ్చిరెడ్డి, మోర్తాల ఉమమహేశ్వరరెడ్డిల కోసం గాలింపు జరుపుతున్న నేపథ్యంలో గురువారం గురజాకోర్టులో ఉమ లొంగిపోగా లచ్చిరెడ్డిని అక్కడే పోలీసులు అదుపులోకి తీసుకుని గురజాల స్టేషన్కు తరలించారు. దీంతో చెన్నారెడ్డి హత్యకేసులోని నిందితులంతా 9 మంది కటకటాలపాలు కాగా లచ్చిరెడ్డి ఒక్కరే అధికారికంగా మిగిలాడు..1988 మార్చిలో విజయవాడకు చెందిన దేవినేని మురళీ హత్యకేసులోని ప్రధాన నిందితుడు అప్పటి తూర్పు ఎమ్మెల్యే వంగవీటి మోహనరంగా ఇదే తరహాలో కోర్టుకు నల్లకోటుతో వచ్చి లొంగిపోయిన విషయం పాఠకులకు విదితమే.మేజిస్ట్రేట్ అలేఖ్య నిందితుడైన ఉమమహేశ్వరరెడ్డికి 14 రోజుల పాటు రిమాండ్ విధించడంతో సబ్ జైలుకు తరలించారు.

## కల్వర్ట్‌ను ఢీకొన్న కారు.. డ్రైవర్ మృతి



**మర్రిపాడు (నెల్లూరు), సెప్టెంబర్ 3, ప్రభాతవార్త :** మర్రిపాడు మండలం నెల్లూరు-ముంబాయి జాతీయ రహదారిపై పొంగూరు కండ్రిక-నందవరం మార్గమధ్యంలో గురువారం రోడ్డు ప్రమాదం జరిగింది. వేగంగా వెళుతున్న కారు అదుపు తప్పి బ్రిడ్జ్ కల్వర్టును ఢీకొట్టింది. ఈసంఘటనలో డ్రైవర్ అక్కడికక్కడే మృతిచెందాడు. కారు ముందు భాగం నుజ్జునుజ్జు అయ్యింది. సమాచారం అందుకున్న ఎస్ఐ బలరామిరెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలను తెలుసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుని స్వగ్రామం మర్రిపాడు మండలం తిమ్మాయపాళెం కాగా మృతుడు నెల్లూరులో నివాసం ఉంటూ ఓ ఆటో ఫైనాన్స్ నడుపుతున్నాడు. మృతుని కుటుంబ సభ్యులకు ఎస్ఐ సమాచారం అందించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

## కర్నూలులో మాజీ సిఎం జగన్



వధువరులు ఆశీర్వదిస్తున్న వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి

**కర్నూలు అర్బన్, సెప్టెంబరు 3, ప్రభాతవార్త:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి కర్నూలులో పర్యటించారు. కర్నూలులోని సెయింట్ జోషఫ్ కళాశాల మైదానంలో జరిగిన మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి కుమారుడు జనక్ వివాహ రిసెప్షన్‌కు ఆయన హాజరయా ్యరు. ఈసందర్భంగా నూతన వధువరులు శ్రియ - జనక్‌లను వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీర్వదించి వారికి వివాహ శుభాకాంక్షలు తెలిపారు. నూతన దంపతులు సుఖ సంతోషాలతో ఆనందంగా దాంపత్య జీవితాన్ని గడపాలని ఆయన ఆకాంక్షించారు. వధువు శ్రియ రాజమండ్రి కూడ మాజీ చైర్మన్ షర్మిల, మెడపాటి అనిల్‌రెడ్డి దంపతుల కుమార్తె వివాహ రిసెప్షన్ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజా ప్రతనిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు హాజరయ్యారు.

## రమ్య ఫుడ్స్ ఎల్‌ఎల్ పి కంపెనీలో కార్మికుడు మృతి

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, సెప్టెంబరు3,ప్రభాతవార్త:** ఈతకోట రమ్య ఫుడ్స్ ఎల్‌ఎల్ పి కంపెనీలో పనిచేస్తున్న కార్మికుడు మృతి చెందిన ఘటన డాక్టర్ బిఆర్ అంబెడ్కర్ కోనసీమ జిల్లా లో చోటుచేసుకుంది.ఈ సంఘటన పై కేసు నమోదు చేసినట్లు రావులపాలెం అర్బన్ సిఐ జి రమేష్ బాబు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం కొత్తపేట మండలం గంటి శెట్టిబలిజ పేటకు చెందిన గుత్తుల రాజు (23) రమ్య ఎల్‌ఎల్పీ కంపెనీలో జనరల్ ఆపరేటర్ కు హెల్పర్ గా విధులు నిర్వహిస్తున్నాడు. అయితే బుధవారం రాత్రి కంపెనీలో ఫౌడర్ ట్యాంకర్ పైన పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు ట్యాంకర్లో పడటంతో మిషన్ ఆపుచేసి యాజమాన్యం స్థానిక ప్రయివేటు ఆసుపత్రికి తరలించగా వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడు తల్లి గుత్తుల భారతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఎస్సై రమణారెడ్డి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ రమేష్ బాబు తెలిపారు.దీంతో ఫ్యాక్టరీలో సరైన జాగృత్తలు ,నిబంధనలు పాటించడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

## ఆటో-బైక్ ఢీ.. ముగ్గురు కార్మికులు మృతి

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,సెప్టెంబరు3 (ప్రభాతవార్త):** వారంతా రెక్కాడితే గాని డొక్కాడని కూలి పని చేసుకునే వ్యక్తులు.పని నుంచి ఇంటికి తిరిగి వస్తూ కొద్ది నిమిషాల్లో ఇంటికి చేరుకునే లోపే ఆ వ్యక్తులను మృత్యువు కబళించింది. ఎదురుగా వస్తున్న ఆటో రూపంలో ఆ వ్యక్తుల ప్రాణాలు అనంత వాయువుల్లో కలిసిపోయాయి. ఆయా కుటుంబాలకు ఆధారంగా వుండే వారిని కోల్పోవడంతో కన్నీరుమున్నీరు అవుతున్నారు.ఒకే గ్రామ పంచాయతీకి చెందిన ముగ్గురు వ్యక్తులు మరణంతో ఆయా కుటుంబాల్లో విషాద ఛాయలు అలముకున్నాయి. ఆయా గ్రామాల్లో కుటుంబ సభ్యుల రోదనలు ఆకాశాన్నంటాయి. కాకినాడ జిల్లా తాళ్ళరేవు మండలం పటవల పంచాయతీ మట్లపాలెం కొత్తూరు వద్ద జాతీయ రహదారి 216 పై గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు మృతి చెందిన సంఘటన పలువురిని దిగ్భ్రాంతికి గురి చేసింది. కాకినాడ నుంచి తాళ్ళరేవు వైపు ద్విచక్ర వాహనంపై వస్తున్న వ్యక్తులు, కాకినాడ వైపు వెళ్తున్న ఆటో ఎదురు ఎదురుగా ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఘటనా స్థలంలో ద్విచక్ర వాహనంపై ఉన్న మట్లపాలెం గ్రామానికి చెందిన ఇంటి కృష్ణ(29) అక్కడికక్కడే మృతి చెందాడు. కొన ఊపిరిలో ఉన్న కొత్తూరు గ్రామానికి చెందిన కొమ్మనపూడి మణికంఠ(33), రాఘవేంద్రపురం గ్రామానికి చెందిన కొండ్రు తంబి(40) తీవ్ర గాయాలతో కాకినాడలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ ప్రమాదం మృతుడు మణికంఠ ఇంటి ఎదురుగా జరగడం ఆ కుటుంబ సభ్యులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఘటనా స్థలానికి కోరంగి ఎస్.ఐ. సత్యనారాయణ చేరుకుని ట్రాఫిక్ నిరోధించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఐసిడిఎస్ పిడి, కోవూరు సిడిపిఒ సస్పెన్షన్

**నెల్లూరు, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త - కలెక్టరేట్:** పలు ఫిర్యాదులు, ఆరోపణల నేపధ్యంలో నెల్లూరు ఐసీడీఎస్ పీడీ హేనాసుజన, కోవూరు ఇన్చార్జి సీడీపీఓ శారదను సస్పెండ్ చేస్తు ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. కోవూరు ఇన్చార్జి సీడీపీఓకు, కోవూరు అంగన్వాడీ కార్యకర్తలకు మధ్య చాలా కాలంగా ఆరోపణలు, ప్రత్యారోపణలు జరుగుతున్నాయి. అంగన్వాడీ వర్క్స్, అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు, సీఐటీయూ ఆధ్వర్యంలో కోవూరు సీడీపీఓ అంగన్వాడీలను వేధింపులకు గురిచేస్తోందని ఆరోపిస్తూ, కలెక్టర్, ఎస్పీలకు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఈ విషయమై విచారణాధికారిగా ఐసీడీఎస్ పీడీని నియమించారు. దీంతో విచారణకు కోవూరు ఇన్చార్జి సీడీపీఓ, అంగన్వాడీ వర్కర్లు సహకరించటం లేదని, ఐసీడీఎస్ పీడీ హేనా సుజన్ కలెక్టర్‌కు నివేదిక సమర్పించినట్లు సమాచారం. వారి సమస్యల పరిష్కారం కాలేదు. అంగన్ వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు పీడీ హేనా సుజన్, కోవూరు ఇన్చార్జి సీడీపీఓకు సహకరిస్తూ తమకు న్యాయం చేయటం లేదని ఆరోపిస్తూ ఆందోళన బాట పట్టారు. చివరగా బుధవారం ఐసీడీఎస్ కార్యాలయం ముట్టడికి కూడా వారు పిలుపు నిచ్చారు. ఇలా ఆరోపణలు, ఫిర్యాదులు, ముట్టడి కార్యక్రమ పిలుపుకు స్పందించిన ఉన్నతాధికారులు, ఐసీడీఎస్ పీడీని, కోవూరు ఇన్చార్జి సీడీపీఓను సస్పెండ్ చేశారు.

## కారుమూరి కస్టడీ కోసం పోలీసుల పీటీ వారెంట్

**విజయవాడ,.సెప్టెంబరు 3,ప్రభాతవార్తప్రతినిధి:** మద్యం రవాణా టెండర్ల కేసులో నిందితుడిగా ఉన్న కారుమూరి నాగేశ్వరరావును కస్టడీలోకి తీసుకునేందుకు పోలీసులు పీటీ వారెంట్ పిటిషన్ వేశారు. ప్రస్తుతం ఆయన చంచల్‌గూడ జైలులో రిమాండ్‌లో ఉన్నారు. ఈ పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేయాలని న్యాయవాదులను ఆదేశించిన న్యాయస్థానం, తదుపరి విచారణను సెప్టెంబర్ 11వ తేదీకి వాయిదా వేసింది.

# ఎకరం కూడా ఎండిపోకూడదు

- ఎల్ నినో ప్రభావంతో వర్షాలు అంతంత మాత్రమే
- రైతులు ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలి
- విబి జి రామ్ జి నిధుల అనుసంధానంతో కరువు పరిస్థితుల నుంచి గట్టెక్కాలే ప్రణాళికలు సిద్ధం
- కేబినెట్ భేటీలో విస్తృత చర్చ: మంత్రి కొలుసు పార్థసారథి



మంత్రి కొలుసు పార్థసారథి

**విజయవాడ, సెప్టెంబరు 3 ప్రభాతవార్త ప్రతినిధి:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలో జరిగిన మంత్రి మండలి సమావేశంలో పలు అంశాలపై తీసుకున్న నిర్ణయాలను రాష్ట్ర సచివాలయం నాల్గవ భవనం ప్రచార విభాగంలో రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారధి మీడియాకు వివరించారు. అనంతరం మంత్రి పార్థసారథి ఎల్ నినో అంశంపై మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఎల్ నినో ప్రభావాన్ని తగ్గించి ప్రజలకు తాగునీటికి ఇబ్బంది తలెత్తకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని, రైతులకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవడంతో పాటు ఆరుతడి పంటల సాగు వైపు అన్నదాతలు దృష్టిసారించే విధంగా చైతన్యవంతులను చేయాలని ఆదేశించారని వివరించారు. రాష్ట్రంలో ఒక్క ఎకరం కూడా పంట నష్టపోకూడదని, ఏ ఒక్క ఎకరంలో పంట కూడా ఎండిపోకూడదని మంత్రులు, అధికారులకు ముఖ్యమంత్రి స్పష్టం చేశారన్నారు. ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో సాధారణ వర్షపాతం కంటే తక్కువ వర్షపాతం నమోదయిందని, ఇప్పటి వరకు 52శాతం తక్కువ వర్షపాతం నమోదైందని మంత్రి పార్థసారథి వివరించారు. దేశంలోనే తక్కువ వర్షపాతం నమోదైన రాష్ట్రాల్లో మన రాష్ట్రం మొదటి రెండు స్థానాల్లో ఉందన్నారు. సాధారణ వర్షపాతం నమోదైతే ఈ పాటికి దాదాపు 90 శాతం భూమి సాగులోకి వచ్చేదని, కాని ఈ ఏడాది ఇప్పటి వరకు కేవలం 60- 65 శాతం మాత్రమే సాగులోకి వచ్చిందంటే పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతుందని అన్నారు. రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ఎల్ నినో ప్రభావాలను రైతులకు వివరిస్తూ, వారికి పంట మార్పిడిపై తగు సూచనలు, సలహాలు అందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారన్నారు. ఆరుతడి పంటల వైపు రైతన్నలు మొగ్గుచూపేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకోసం ప్రభుత్వం 90వేల కిలోల ఆరుతడి పంటల విత్తనాలను పంపిణీ కోసం సిద్ధం చేయాలని సిఎం ఆదేశించారన్నారు. విత్తనాల సబ్సిడి కోసం రూ.90 కోట్ల ఆర్థిక సాయానికి ముఖ్యమంత్రి ఆమోదం తెలిపారన్నారు. పశు రక్షణలో భాగంగా పశుగ్రాస కొరతను అధిగమించేందుకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారన్నారు. విబి జి రామ్ జి భాగస్వామ్యంతో పశుగ్రాస పెంపకం చేపట్టేలా చర్యలు తీసుకోనున్నామన్నారు. అదేవిధంగా ఉద్యానపంటలను సైతం కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. ఉద్యాన పంటల సాగుకు నీటి సరఫరా ఎంతో అవసరమని, వాటిని కాపాడుకోవడానికి అవసరమైతే విబి జి రామ్ జి పనుల ద్వారా సమీప చెరువుల నుండి కాలువల ద్వారా నీటిని తరలించడం లేదా బిందు సేద్యంపై అవగాహన పెంచి అందుకు అవసరమైన సహకారం అందించాలని ముఖ్యమంత్రి సూచించారన్నారు. జిల్లాల్లో ఉన్న అగ్రికల్చర్ యూనిర్సిటీలు, కాలేజీల అధ్యాపకులతో రైతులకు తక్కువ నీటి వనరుతో లాభదాయక పంటల సాగుపై అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. వరి సాగుకు ఎక్కువ పరిమాణంలో సాగునీరు అవసరం ఉంటుందని, కాని ఎల్ నినో ప్రభావంతో సాగు నీరు అందని స్థితి నెలకొందన్న విషయం వరి సాగు రైతులకు స్పష్టంగా వివరించి ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు మళ్లించేలా చర్యలు తీసుకోవడం ద్వారా ఫలితం ఉంటుందన్నారు. ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో త్రాగునీటి కష్టాలు తప్పేలా లేవని, రాష్ట్రవ్యాప్తంగా 14,829 హ్యాబిటేషన్లు ఉన్నాయి. నివాస ప్రాంతాల వారీగా ప్రపోజల్స్ సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారని మంత్రి పార్థసారథి తెలిపారు. ప్రజలందరికీ త్రాగునీరు సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని, ఇందుకోసం ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారని వివరించారు. అవకాశం ఉన్న ప్రాంతాల్లో బోర్లు వేయడం లేదా ట్యాంకర్ల ద్వారా త్రాగునీటిని సరఫరా చేయడం వంటి తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైతే ఇతర రాష్ట్రాల నుండి ట్యాంకర్లు అద్దె ప్రాతిపదికన తీసుకురావాలన్న ఆలోచన చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావాన్ని వివరిస్తూ కేంద్రానికి లేఖలు రాయాలని, కేంద్రానికి ఎప్పటికప్పుడు పరిస్థితిని వివరిస్తూ ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. వాతావరణ ఆధారిత బీమాను చేయడంలో మన రాష్ట్రం దేశంలోనే 6వ స్థానంలో ఉందని, కరువు నిధులు ఎక్కువగా రాష్ట్రానికి అందేలా కృషి చేస్తున్నామన్నారు. కేంద్రం, రాష్ట్ర, విబి జి రామ్ జి నిధుల అనుసంధానంతో కరువు పరిస్థితులను గట్టెక్కాలే ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తుందన్నారు. తిరుపతి నుండి ఎన్ఐఇఎల్ఐటి (నేషనల్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) సంస్థ తరలించడం లేదని, కొందరు చేస్తున్న దుష్ప్రచారంలో వాస్తవం ఎంతమాత్రం లేదన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగాల్లో మన రాష్ట్రాన్ని మరింత బలోపేతం చేసే దిశగా అమరావతిలో క్వాంటం ఎఐ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నామని, మన రాష్ట్రంలో మూడు యూనివర్సిటీల ఏర్పాటుకు అనుమతి లభించిందని మంత్రి వివరించారు.

# క్యాబినెట్ ఆమోదంతో ఆరు దశాబ్దాల ఎదురుచూపులకు తెర

- 1,215 పేద కుటుంబాలకు ఊరట
- నెల రోజుల్లోనే మాట నిలబెట్టుకున్న మంత్రినారాయణ
- త్వరలో పట్టాల పంపిణీ పండుగ





కల సాకారం చేసిన సీఎం చంద్రబాబు, మంత్రి నారాయణ చిత్రపటాలకు పాలాభిషేకం

**నెల్లూరు, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త:** వైద్యం ఆరు దశాబ్దాలుగా వెంటాడుతున్న భయం, అనిశ్చితి, కన్నీళ్లకు ఇక తెరపడనుంది. సర్వేపల్లి కాలువకట్టపై నివసిస్తున్న నిర్వాసితుల 60 ఏళ్ల సమస్యకు కూటమి ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపింది. 1,215 పేద కుటుంబాలకు శాశ్వత ఇంటి పట్టాలు మంజూరు చేసేందుకు రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. దీంతో కాలువకట్టపై సంబరాలు అంబరాన్నంటాయి. ఇళ్ల పట్టాలు ఇప్పిస్తానని నెల రోజుల క్రితం హామీ ఇచ్చిన రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. సంకల్పం గట్టిదైతే సాధించలేనిది ఏదీ లేదని మరోసారి నిరూపించారు. మున్సిపల్, ఇరిగేషన్, రెవెన్యూ శాఖలను సమన్వయ పరిచి అధికారిక ప్రక్రియను వేగవంతం చేసి క్యాబినెట్ ఆమోదం సాధించారు. త్వరలోనే నిర్వాసితులకు శాశ్వత పట్టాలు పంపిణీ చేయనున్నారు. కాలువకట్టపై నివాసాలు తొలగిస్తారన్న ప్రచారం జరిగిన ప్రతిసారీ నిర్వాసితులు వణికిపోయేవారు. ఎప్పుడు తమ ఇళ్లు ఖాళీ చేయాల్సి వస్తుందోనన్న భయంతో నిద్రలేని రాత్రులు గడిపారు. సొంత ఇంట్లోనే హక్కు లేని పరిస్థితి.. భవిష్యత్తుపై భరోసా లేని జీవితం.. ఇలా ఐదు దశాబ్దాలు గడిచిపోయాయి. తమ సమస్యను పరిష్కరించాలని కోరుతూ పలుమార్లు అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయింది. మంత్రి నారాయణ ప్రత్యేక దృష్టి సారించడంతో పరిస్థితి మారింది. గత నెల 8 వ తేదీన కాలువకట్టపై పర్యటించిన మంత్రి సమస్యను స్వయంగా పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసి పరిష్కారానికి చర్యలు చేపట్టారు. పేదల ఇళ్లకు శాశ్వత భద్రత కల్పించడంలో మరో మైలురాయిని అధిగమించారు. తొలుత భగత్‌సింగ్ కాలనీలో 1,400 కుటుంబాలకు శాశ్వత పట్టాల సమస్యకు పరిష్కారం చూపిన మంత్రి, ఇప్పుడు సర్వేపల్లి కాలువకట్టపై మరో 1,215 కుటుంబాలకు పట్టాల మార్గం సుగమం చేశారు. రెండు ప్రాంతాల్లో కలిపి వేలాది కుటుంబాలకు శాశ్వత భరోసా కల్పించడం ద్వారా పేదల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం తన చిత్తశుద్ధిని చాటుకుందని స్థానికులు చెబుతున్నారు. దీంతో నాలుగు ప్రాంతాల్లో పండుగ వాతావరణం నెలకొంది.క్యాబినెట్ ఆమోదం వార్త తెలియగానే లబ్ధిదారుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. చిల్డ్రన్స్ పార్క్ రోడ్డు,స్టోన్ హౌస్ పేట ఉడ్‌హౌస్ సంగం, బాలాజీనగర్ అన్నపూర్ణ అపార్ట్మెంట్ ఎస్ఎస్ చికెన్ సెంటర్, శెట్టిగుంటరోడ్ ప్రాంతాల్లో సంబరాలు నిర్వహించారు.సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారాయణ, డీసీఎం పవన్ కళ్యాణ్ ఫ్లెక్సీలకు పాలాభిషేకాలు చేసి పూలవర్షం కురిపించారు. స్వీట్లు పంచిపెట్టారు. రంగులు చల్లుకుని, బాణాసంచా కాల్చి ఆనందం వ్యక్తం చేశారు. దాంతో కాలువకట్ట ప్రాంతమంతా పండుగ వాతావరణాన్ని తలపించింది. 60 ఏళ్లుగా మమ్మల్ని పట్టించుకునేవారు లేరు. ఇళ్లు తొలగిస్తారన్న వార్త వచ్చిన ప్రతిసారీ భయంతో బతికాం. ఇప్పుడు మా పిల్లల భవిష్యత్తుకు భరోసా వచ్చింది. శాశ్వత పట్టాలు ఇప్పిస్తానని చెప్పి నెల రోజుల్లోనే హామీ నిలబెట్టుకున్న మంత్రి నారాయణకు ఆజన్మాంతం రుణపడి ఉంటాం అంటూ నిర్వాసితులు భావోద్వేగానికి గురయ్యారు. పేదల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం మాటలకే పరిమితం కాకుండా చేతల్లో చూపిస్తోందని ఈ పరిణామం మరోసారి నిరూపించింది. సమస్యను గుర్తించడం నుంచి శాఖల సమన్వయం, క్యాబినెట్ ఆమోదం వరకు మంత్రి నారాయణ ప్రత్యేక శ్రద్ధ చూపారు.టీడీపీ అంటే మాటల ప్రభుత్వం కాదు, చేతల ప్రభుత్వం మని మరోసారి రుజువైందని స్థానిక టీడీపీ నాయకులు పేర్కొన్నారు. రెండు తరాల నిరీక్షణ తర్వాత సర్వేపల్లి కాలువకట్ట కథలో కొత్త అధ్యాయం మొదలైందంటున్నారు. ఆరు దశాబ్దాల నిరీక్షణకు తెరదించి, 1,215 కుటుంబాలకు శాశ్వత భద్రత కల్పించే దిశగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఈ పాలాభిషేక కార్యక్రమంలో కాలువకట్ట నిర్వాసితులతో పాటు నగర మేయర్ దేవరకొండ సుజాత, రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, మాజీ మున్సిపల్ చైర్పర్సన్ తాళ్ళపాక అనూరాధ, నగర టీడీపీ అధ్యక్షులు మామిడాల మధు, కార్పొరేటర్లు కర్తం ప్రతాప్ రెడ్డి,కిన్నెర మాల్యాద్రి, వెంకటేశ్వర రెడ్డి, టీడీపీ నాయకులు సాయిరాం, పెంచల చౌదరి, ఆంచూరు శ్రీనివాసులు, బీసీ బాబు, తిరుమల నాయుడు, కొండా ప్రవీణ్, అన్నపూర్ణ, ఇంతియాజ్, జహీర్, మొయినుద్దీన్, జనసేన నేత గుణుకుల కిషోర్, మార్కెటింగ్ కమిటీ మెంబర్ గుణుకుల విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## కిడ్నాప్ కేసులో ముగ్గురు అరెస్ట్

- మూడు రోజుల్లోనే పురోగతి సాధించిన తిరుపతి రూరల్ పోలీసులు
- మరో ముగ్గురిని తీవ్రంగా గాలిస్తున్న పోలీసులు

**తిరుపతి క్రైమ్, సెప్టెంబరు 3 ప్రభాతవార్త:** తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జులై నెల 28న కిడ్నాప్ కేసు నమోదు అయిన విషయం విధితమే. ఈ సందర్భంగా రూరల్ సిఐ మద్దయ్య ఆచారి సమాచారం మేరకు తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం, నాగపట్నం గ్రామానికి చెందిన బాధితుడు సుమంత్ నాని క్రికెట్ ప్రీడిక్షన్ అప్ ద్వారా అధిక ఫాలోవర్స్‌తో విజయవంతం కావడంతో ఆ యాపుని ఉత్తర భారతదేశానికి చెందిన వర్తకులకు 6 కోట్లకు అమ్మకానికి పెట్టాడు. ఇందులో భాగంగా 30 లక్షలు అడ్వాన్స్‌ని పొందాడు. అనంతరం వివిధ రకాల హవాల ద్వారా ఆరు కోట్లు మొత్తాన్ని తీసుకున్నాడు. అనంతరం ఇండోనేషియాకి తరలి వెళ్లాడు. తర్వాత జులై 29వ తారీకు భారతదేశానికి చేరుకున్న సుమంత్‌ని అత్యాశతో మిత్రులు అయిన యస్వంత్, మనోజ్, గౌతమ్ వీళ్ళకు సహకరించిన బాలాజీ, చరణ్, వాజిద్ భాషలు కలసి చంద్రగిరి తొండవాడలో కిడ్నాప్ చేసి చంద్రగిరి మండలం శ్రీనివాస మంగాపురం సమీపన ఒక హోమ్ స్టేలో దాచి ఉంచారు. అనంతరం హైదరాబాద్‌లోని కేపిహెచ్‌బి పోలీస్ స్టేషన్ పరిధిలో వున్న మనోజుకు చెందిన అపార్ట్ మెంట్ కు సుమంతుని కిడ్నాపర్లు తరలించారు. అనంతరం మనోజ్, చరణ్ మద్యం మత్తులో ఉండగా సుమంత్వా వాట్సాప్‌లో యూరపులో ఉన్న తన గర్ల్ ఫ్రెండ్‌కు మెసేజ్ చేసాడు.సుమంత్ గర్ల్ ఫ్రెండ్ కె. పి.హెచ్.బి పోలీసులకు సమాచారం ఇచ్చారు. అనంతరం కే.పి.హెచ్.బి పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసి క్రికెట్ బెట్టింగ్‌కు సంబంధించినవిగా అనుమానించి 30 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. తరువాత సుమంత్ ఆగస్టు 28న తిరుపతి రూరల్ పోలీస్ స్టేషనులో ఫిర్యాదు చేసాడు. బాధితుడి పిర్యాదు మేరకు రూరల్ పోలీసు కేసునమోదు చేసి నేరస్థులను గాలించారు. ఇందులో భాగంగా చంద్రగిరికు చెందిన బాలాజీ, చరణ్, వాజిద్ భాషలను కాలూరు క్రాస్ వద్ద పిర్యాదు అందిన మూడు రోజుల్లోనే సెప్టెంబర్ 1, మంగళవారం తిరుపతి రూరల్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా తిరుపతి రూరల్ సి.ఐ మద్దయ్యాచారి మాట్లాడుతూ కిడ్నాప్‌లో ప్రధాన సూత్రధారులు యశ్వంత్, మనోజ్, గౌతంల కోసం గాలిస్తున్నామని అరెస్టు చేసిన నిందితులను కోర్టుకు తరలించనున్నట్లు తెలిపారు. మిగిలిన మరో ముగ్గురు కిడ్నాపర్లను తీవ్రంగా గాలిస్తున్నామని త్వరలోనే వారిని కూడా అరెస్టు చేస్తామని వివరించారు. కిడ్నాప్ కేసులో వేగంగా పురోగతి సాగిస్తున్న రూరల్ పోలీసులను తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బారాయుడు అభినందించారు.

## మక్తాపురంలో పల్లె వీక్షణలో నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్లా

**సంగం (నెల్లూరు), సెప్టెంబర్ 3, ప్రభాతవార్త :** సంగం మండలం మక్తాపురం గ్రామంలో పల్లెవీక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్లా పాల్గొన్నారు. మక్తాపురం రైతుల విజ్ఞప్తి మేరకు తక్షణమే వ్యవసాయ గోడౌను భూమిని కేటాయించారు. శ్మశాన వాటికకు భూమి మంజూరు. మక్తాపురం గ్రామానికి బస్సు నడపాలని ప్రజలు కోరగా వెంటనే ఆర్టీసి అధికాలను ఆదేశించారు. కలెక్టర్ గ్రామాల్లోని వాస్తవ పరిస్థితులను క్షేత్రస్థాయిలో నేరుగా తెలుసుకున్నారు. ప్రజలతో మమేకమై వారి సమస్యలను గుర్తించి సాధ్యమైన సమస్యలకు అక్కడిక్కడే పరిష్కారం చూపడమే పల్లె వీక్షణ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని ఆయన తెలిపారు.వి.బి.జి రాంజీ ఉపాధీ హామి పనులను కలెక్టర్ పరిశీలించారు. కూలీలతో నేరుగా మాట్లాడారు. కూలీలకు మజ్జిగ పంపిణి చేశారు. గ్రామంలో చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం గ్రామంలోని చిక్కుడు తోటలను కలెక్టర్ సందర్శించారు. రైతులతో మాట్లాడి పంటసాగు ,దిగుబడి సాగులో ఎదురౌతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులతో ముచ్చటించారు. చిన్నారులకు అందుతున్న సేవలు, విద్యా కార్యక్రమాలపై అంగన్‌వాడీ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన స్థానిక విలేఖర్లతో మాట్లాడుతు పల్లెవీక్షణ కార్యక్రమం ద్వారా గ్రామంలోని వాస్తవ పరిస్థితులను నేరుగా తెలుసుకునే అవకాశం కలుగుతుందని అన్నారు. ప్రజలతో నేరుగా మాట్లాడవచ్చునని వారి సమస్యలను పరిష్కరించ వచ్చునని చెప్పారు.

## గణేశ్ పందిళ్ల ఏర్పాటుకు అనుమతులు ఇక మరింత సులభం!

**విజయవాడ,సెప్టెంబరు 3,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వినాయక మండపాలు/పందిళ్ల ఏర్పాటుకు అవసరమైన అనుమతుల కోసం రాష్ట్రవ్యాప్తంగా ఏకీకృత ఆన్‌లైన్ అనుమతి వ్యవస్థ అందుబాటులోకి తీసుకురాబడింది.గణేష్ ఉత్సవ్.నేట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు పోలీస్, అగ్నిమాపక,మున్సిపల్, విద్యుత్ మరియు రెవెన్యూ శాఖల సమన్వయంతో అనుమతుల ప్రక్రియ మంజూరైన అనంతరం క్యూఆర్ కోడ్‌తో కూడిన డిజిటల్ అనుమతి పత్రం పొందవచ్చుఈ సేవ పూర్తిగా ఉచితంసురక్షితమైన, ప్రశాంతమైన మరియు క్రమబద్ధమైన వినాయక చవితి వేడుకల నిర్వహణ కోసం నిర్వాహకులు ఈ ఆన్‌లైన్ సదుపాయాన్ని వినియోగించుకుని ముందస్తుగా దరఖాస్తు చేసుకోవచ్చు.

## పలాసలో వైభవంగా వినాయక మండప పందిరిరాట ప్రతిష్ఠాపన



పలాస, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త :

వినాయక చవితి నవరాత్రుల మహోత్సవాల సన్నాహాల్లో భాగంగా శ్రీకాకుళం జిల్లా పలాస ఎంపీడీవో కార్యాలయ కూడలి వద్ద శ్రీ వరసిద్ధి వినాయక పూజా కమిటీ ఆధ్వర్యంలో పందిరిరాట మహోత్సవం శాస్త్రోక్తంగా జరిగింది. వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ కమిటీ సభ్యులు, భక్తులు భక్తిశ్రద్ధలతో పూజాదికాలు నిర్వహించి పందిరిరాటను ప్రతిష్ఠించారు. ఈ ఏడాది ఉత్సవాల్లో భాగంగా సుమారు 12 అడుగుల భారీ సాంప్రదాయ వినాయక విగ్రహాన్ని కొలువుదీరుస్తున్నారు. ఈ ప్రతిమను ప్రముఖ వ్యాపారవేత్త కే.వి. గోపాల్ దంపతులు వితరణగా సమర్పించారు. ఈ సందర్భంగా వారే స్వయంగా ప్రత్యేక పూజలు ఆచరించి పందిరిరాటను వేశారు. కమిటీ సభ్యులు ఎస్. జయంత్ కుమార్, సీపాన వేమనరావు, రోనంకి సూర్యారావు, లక్ష్మణరావు, సింగుపురం రాము, బాబూరావు, శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా సతీష్



వీరఘట్టం, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త :

నీలానగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణితం ఉపాధ్యాయునిగా విధులు నిర్వర్తిస్తున్న సూరు సతీష్ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపికయ్యారు. స్వస్థలం పాలకొండ కు చెందిన ఈయన 2005లో కొత్తూరు మండలం కలిగాంలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుని గా బాధ్యతలు చేపట్టారు. ఈయనకు 2023లో జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపిక కాగా నేడు 2026 లో రాష్ట్ర స్థాయి కు ఎంపికయ్యారు. సతీష్ రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎన్నిక అవ్వడం పట్ల ఉప విద్యాశాఖాధికారి పఠ్రి కృష్ణమూర్తి , మండల విద్యాశాఖాధికారులు డి.గౌరు నాయుడు ,ఆర్.ఆనందరావుతో పాటు పాఠశాల సిబ్బంది, తదితరులు అభినందనలు తెలిపారు.

## రైతులకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలు : ఎమ్మెల్యే కూన

ఆముదాలవలస, సెప్టెంబర్ 3,(ప్రభాతవార్త):



అర్హులైన రైతులందరికీ రాజముద్రతో కూడిన పట్టాదార పాస్ పుస్తకాలు పంపిణీ చేయడం జరుగు తుందని ఎమ్మెల్యే, పియుసి కమిటీ చైర్మన్ కూన రవికుమార్ అన్నారు. ఆముదాలవలస నియోజకవర్గంలో పొందూరు మండలములో లైదాం గ్రామంలో ప్రభుత్వ రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రవికుమార్ మాట్లాడుతూ అర్హులైన రైతులకు ప్రభుత్వ రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. గత వైసీపీ ప్రభుత్వ కాలంలో రెవెన్యూ వ్యవస్థలో ఎన్నో తప్పులు జరిగాయని, రైతుల పాస్ పుస్తకాలపై జగన్మోహన్ రెడ్డి బొమ్మలు వేయడం రైతులు అభద్రత భావానికి లోనయ్యారని తెలిపారు.అందుకే కూటమి ప్రభుత్వం వచ్చిన మరుక్షణమే తప్పులు సరిదిద్దామని ప్రభుత్వ రాజముద్రతో కూడిన పాస్ పుస్తకాలు రైతుల పేరుతో తయారుచేసి ఇవ్వడం జరుగుతుందని, రైతుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. సచివాలయ సిబ్బంది, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## గోదావరి జలాలతో ఉత్తరాంధ్రకు కొత్త భరోసా : బోయిన



కోటబొమ్మాళి, సెప్టెంబరు 3, ప్రభాతవార్త:

ఉత్తరాంధ్ర చరిత్రలో మరో సువర్ణ అధ్యాయం ఆవిష్కృతమైందని రాష్ట్ర కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ బోయిన గోవిందరాజులు అన్నారు. పోలవరం ఎడమ ప్రధాన కాలువ ద్వారా గోదావరి జలాలను ఉత్తరాంధ్రకు విడుదల చేయడం దశాబ్దాల కల సాకారమైన చారిత్రాత్మక ఘట్టమని పేర్కొన్నారు. పాయకరావుపేట మండలం సీతారాంపురం (పీ.ఎల్.పురం) వద్ద బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో జలహారతి ని ఇచ్చి గోదావరి జలాలకు స్వాగతం పలికారు. 447 మీటర్ల అక్విడక్ట్ వద్ద గేట్లు ఎత్తి గోదావరి జలాలను అధికారికంగా విడుదల చేయడం ఉత్తరాంధ్ర అభివృద్ధిలో కీలక మైలురాయిగా నిలిచిందని బోయిన గోవిందరాజులు తెలిపారు. తొలి దశలో 27--30 టీఎంసీల గోదావరి జలాలను ఉత్తరాంధ్రకు మళ్లించే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. పోలవరం ఎడమ కాలువలో ప్రవహిస్తున్నది కేవలం గోదావరి నీరు మాత్రమే కాదని, ఉత్తరాంధ్ర రైతుల ఆశలు, అభివృద్ధి ఆకాంక్షలు, రాష్ట్ర భవిష్యత్తు కూడా ప్రవహిస్తున్నాయని రాష్ట్ర కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ బోయిన గోవిందరాజులు అన్నారు.అంతేకాకుండా ఈ గోదావరి జలాలను శ్రీకాకుళంలో గల నదులన్నింటికీ అనుసంధానించితే చరిత్ర పుటల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేరు ప్రతిష్టలు చిరస్థాయిగా నిలిచిపోతుందని గోవిందరాజులు తన అభిలాష, ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

## పొట్టి శ్రీరాములు విగ్రహ ఏర్పాటుకు కృషి : తంగుడు

కోటబొమ్మాళి, సెప్టెంబరు 3, ప్రభాతవార్త:



కోటబొమ్మాళి మెయిన్ రోడ్ మార్కెట్ సెంటర్లో తెలుగు జాతి ముద్దుబిడ్డ, అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ప్రముఖ వ్యాపారవేత్త, కోటబొమ్మాళి బంగారు వర్తకుల సంఘం అధ్యక్షులు తంగుడు నాగభూషణం పిలుపునిచ్చారు.గురువారం ఆయన మాట్లాడుతూ తెలుగువారికి ప్రత్యేక రాష్ట్రం కావాలని 1952లో మద్రాసులో 58 రోజుల పాటు ఆమరణ నిరాహార దీక్ష చేసి, ప్రాణాలను సైతం లెక్కచేయకుండా త్యాగం చేసిన మహోన్నత వ్యక్తి పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. ఆయన త్యాగం ఫలితంగానే 1953లో ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందని, ఆ తర్వాత దేశంలో భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు బాటలు పడ్డాయని గుర్తు చేశారు.

## వినాయక చవితికి డీజే సౌండ్ సిస్టం నిషేధం : సీఐ



రాజాం, ఆగస్టు 3, ప్రభాతవార్త:

వచ్చే వినాయక చవితి పండగ సందర్భంగా వినాయక మండపాలు వద్ద అధిక శబ్దం వచ్చే డీజే సౌండ్ బాక్సులు నిషేధించబడ్డాయి అని రాజాం పట్టణం సీఐ డి. నవీన్ కుమార్ తెలిపారు.ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ పట్టణంలో ఉన్న డీజే సౌండ్ సిస్టం కలిగిన యజమానులను పిలిచి కౌన్సిలింగ్ ఏర్పాటు చేశారు. వినాయక చవితి పండగ సందర్భంగా ఎవరైనా డీజే సౌండ్స్ బాక్సులను వాడితే సుమారుగా 15 లక్షలు వరకు భారీగా జరిమానా విధిస్తామని తెలిపారు. ముఖ్యంగా డీజే బాక్సులు ఎవరికైతే కలిగి ఉన్నాయో వాటి యజమానులపై ముందస్తుగా బైండ్ వార్ కేసులు నమోదు చేశామని తెలియజేశారు.

## ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు



ఇచ్ఛాపురం, సెప్టెంబర్ 3, ప్రభాత వార్త:

శాంతినికేతన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. కృష్ణాష్టమి సందర్భంగా స్కూల్ విద్యార్థిని, విద్యార్థులు వేసిన కృష్ణుడు, రాధ , వివిధ వేషధారణలతో ఎంత గానో ఆక ట్టుకున్నారు. వేషధారణ పోటీలో విజేతలకు స్కూల్ సెక్రటరీ డి. ఇందిరా రెడ్డి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో రొంప బ్రాంచ్ డైరెక్టర్ పుష్పరాజు రెడ్డి, మేనేజర్ కె.సి. పూరి ఉపాధ్యాయులు సురేఖ, శాంతి, శంకర్,రవి, శ్రీధర్, యశోద, జయలక్ష్మి, మీనా, స్నేహ, పార్వతి, ప్రమీల, సరోజినీ, శిరీష, రాజేశ్వరి ఇం టరాక్ట్ క్లబ్ ప్రెసిడెంట్ డి. హర్షవర్ధన్ రెడ్డి సెక్రటరీ డి. భార్గవ్ ఎస్. పి.ఎల్. స్వాతి, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆక్వా రైతుల ఇబ్బందులు తొలగించండి



సంతబొమ్మాళి, సెప్టెంబర్ 3,ప్రభాత వార్త:

శ్రీకాకుళం జిల్లా ఆక్వా రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు తొలగించాలనికోరుతూ వైకాపా రాష్ట్ర కార్యదర్శి కెల్లి జగన్నాయకులు( గోవింద్ )గురువారం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ కలసి వినతి పత్రం అందజేశారు. అలాగే శ్రీకాకుళం ఆర్డీఓ సాయి ప్రత్యూష కలసి రాష్ట్ర ఆక్వా ఫార్మర్స్ అసోసియేషన్ తరుపున రొయ్యల మేత ధరలు తగ్గించాలని , విద్యుత్తు సబ్సిడీ సౌకర్యం ఆక్వారైతులకు కల్పించాలని ఆ వినతి పత్రం లో కోరారు. అలాగే రొయ్యల కొనుగోలు మార్కెట్ ను అందుబాటులోకి తేవాలని ఆయన కోరారు.ప్రస్తుతం జిల్లాలో ఎదుర్కొంటున్న సమస్యలు త్వరితగతిన ఆక్వా రైతుల పరిష్కరించాలని కలెక్టర్, ఆర్డీఓను కోరారు.

## మున్సిపాలిటీ 28 వార్డుల జాబితా ప్రదర్శన

ఇచ్ఛాపురం సెప్టెంబర్ 3, ప్రభాత వార్త:



మున్సిపాలిటీలో పెరిగిన 28 వార్డుల ఓటర్ల జాబితా మున్సిపల్ కమిషనర్ ఎన్. రమేష్ ప్రదర్శిం చారు.మారిన వార్డు డీలిమిటేషన్ ప్రకారం మొత్తం ఓటర్ల సంఖ్య 31452 కాగా పురుషులు 14935 మంది, స్త్రీలు 16512 మంది ఇతరులు 5 మంది అత్యధికంగా 28 వ వార్డు లో 1518 ఓట్లు కాగా 24 వ వార్డులో 1001 ఓట్లు ఉన్నాయి.

## అభివృద్ధిని ఓర్వ లేకపోతున్న వైకాపా నాయకులు

కంచిలి, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త :



రాష్ట్రంలో వైయస్సార్ పార్టీ నాయకులు కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రజలకు తప్పుడు సంకేతాలు పంపిస్తున్నారని కంచిలి మండలం జాడిపూడి మాజీ సర్పంచ్ పిలక చిన్నబాబు ఓ ప్రకటనలో చెప్పారు. విలేకరులకు తెలియజేస్తూ ఇచ్ఛాపురం నియోజకవర్గం వైకాపా నాయకుడు జాడపూడి లో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని పరిశీలించి ఆ పాఠశాలలో జరిగిన అభివృద్ధిని చూసి అసూయతో దినపత్రికలకు తప్పుడు ప్రకటనలు తెలియజేశారన్నారు. గతంలో నాడు, నేడు పేరుట అదనపు భవనాల పనులు చేపట్టి పూర్తిస్థాయిలో నిర్మాణం చేపట్టక అసంపూర్తిగా నిలిపివేసిన మహా నాయకులని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే శాఖ మంత్రి లోకేష్ ఆదేశాల మేరకు కోటి 60 లక్షలతో డార్మెటరీ పూర్తిస్థాయిలో నిర్మించి ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బెందాళం అశోక్ బాబు చేతుల మీదుగా ప్రారంభించడం కూడా జరిగిందని అలాగే 69 లక్షల రూపాయలతో లేబ్ రూమ్,అదనపు భవనాలు నిర్మాణాలు జరుగుతున్నాయని వైఎస్ఆర్ పార్టీ నాయకులు ఇది తెలుసుకోవాలన్నారు.అలాగే పత్రికలకు తప్పుడు ప్రకటనలు మానుకోవాలని హితువు పలికారు. గత ప్రభుత్వ హయాంలో సిడాఫ్ చైర్మన్ పదవి చేపట్టిన కాలంలో తన సొంత గ్రామానికి రోడ్డు వేయలేని దుస్థితి ఏర్పడిందని,ఇటువంటి నాయకులు కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేయడం ఏ మాత్రం సరికాదని అన్నారు.విద్యాశాఖ మంత్రి ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు. వైయస్సార్ పార్టీ నాయకులు ఏ పని లేక ఖాళీగా ఉండడంతో జరుగుతున్న అభివృద్ధి పనులను చూడలేక, ఓర్వలేక కూటమి ప్రభుత్వంపై దుష్ప్రచారాలు చేస్తున్నారని చెప్పారు.

## వైసీపీ ఐదేళ్ల పాలనలో తీసేసిన పెన్షనపై విరుచుకుపడ్డ ఎమ్మెల్యే



ఆమదాలవలస, సెప్టెంబర్ 3,(ప్రభాతవార్త):

గత వైకాపా పాలనలో సుమారు 7 లక్షల పెన్షన్లు తొలగించారని, వందమంది వైకాపా నాయకులు వచ్చిన నేను ఒక్కడినే ఆధారాలతో సహా బహిరంగ చర్చికి వస్తానని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. గురువారం జిల్లా పరిషత్ సాధారణ సమావేశంలో పెన్షన్లపై చర్చి జరిగినప్పుడు పోలాకి జడ్పిటిసి ధర్మాన కృష్ణ చైతన్య కు, ఎమ్మెల్యే రవికుమార్ మధ్య తీవ్ర ఆరోపణలు జరిగాయి. మాట మాట పెరిగి ఘర్షణకు దిగేస్థాయికి వచ్చాయి. ధర్మాన కృష్ణ చైతన్య కూటమి ప్రభుత్వంలో అర్హులను పెన్షన్లు తొలగిస్తుందని తప్పుగా మాట్లాడడంతో వెంటనే ఎమ్మెల్యే రవికుమార్ తీవ్రంగా ఖండించారు. గత వైకాపా హయాంలో సుమారు 7 లక్షల పెన్షన్లు తొలగించిన ఘనత మీ ప్రభుత్వానికి దక్కిందన్నారు. నరసన్నపేటలో ధర్మాన కృష్ణ దాస్ తెలుగుదేశం సానుభూతిపరులను ఎంతోమంది పెన్షన్లు తొలగించారని ఆధారాలతో సహా నా దగ్గర ఉన్నాయని ఎమ్మెల్యే రవికుమార్ మండిపడ్డారు. ఇద్దరూ మాట మాట పెరిగి తీవ్ర స్థాయిలో ఘర్షణకు దిగారు. పొలాకి జడ్పిటిసి ధర్మాన కృష్ణ చైతన్య మాట్లాడుతూ దమ్ముంటే నరసన్నపేటలో ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలవాలని ఎమ్మెల్యే రవికుమార్ కు కృష్ణ చైతన్య సవాల్ విసిరారు. దీనికి ప్రతి స్పందించిన ఎమ్మెల్యే రవికుమార్ జిల్లాలో ఎక్కడైనా పోటీ చేసి గెలుస్తానని,నీకు కోరిక ఉంటే తీరుస్తానని బదులిచ్చారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## అడ్డంగిలో రైతులతో ముఖాముఖి కార్యక్రమం

కొత్తూరు,సెప్టెంబర్ 3 (ప్రభాత వార్త):



మండల పరిధిలోని అడ్డంగి పంచాయతీలో జీడి రైతులకు జీడి తోటల పునరుద్ధరణ, తెగుళ్ల నివారణ, యాజమాన్య పద్ధతులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీసీసీ జీడి, కో-కో పరిశోధన కేంద్రం సౌజన్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి గ్రామానికి చెందిన 48 మంది రైతులు హాజరయ్యారు. జీడి తోటలను పునరుద్ధరించే విధానం, తోటల్లో సాగు చేయాల్సిన రకాలు, ఎరువుల వినియోగం, తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై శాస్త్రవేత్తలు రైతులకు వివరించారు. జీడి తోటల్లో అంతర పంటలు సాగు చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను కూడా తెలియజేశారు.పసుపు సాగుపై కూడా రైతులకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా సేలం రకం పసుపును సాగు చేసే విధానం, విత్తనం ఎంపిక, పంట యాజమాన్యం, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. రైతులు తమ తోటల్లో ఎదుర్కొంటున్న సమస్యలను శాస్త్రవేత్తల దృష్టికి తీసుకురాగా, వాటి నివారణకు తగిన సూచనలు చేశారు.రైతులు శాస్త్రవేత్తల సూచనలను పాటించి ఆధునిక సాగు పద్ధతులను అవలంబించాలని సూచించారు. కార్యక్రమంలో బాపట్ల జీడి పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ కె. వెంకట సుబ్బయ్య, కేవీకే శాస్త్రవేత్తలు వి. హరికుమార్, అనూష, కేబీఎస్ దివాకరరావు, గొట్టిపల్లి ఆర్ఎస్‌కేకు చెందిన వి.హెచ్.ఏ, వెలుగు ఎన్జీవో ఫీల్డ్ సూపర్‌వైజర్ శ్రీను, నారాయణ, మొబిలైజర్ జోష్, జగదీష్‌తో పాటు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



కంచిలి, ప్రభాతవార్త :

శ్రీకృష్ణ జన్మాష్టమి శుభ సందర్భంగా కంచిలి ప్రాంతంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా ముందురోజు నిర్వహించిన తులసి యాత్ర కార్యక్రమం విశేషంగా ఆకట్టుకుంది.కంచిలి శివాలయం నుండి రాధాకృష్ణ మందిరం వరకు వందలాది మంది హరే రామ హరే కృష్ణ భక్తులు సంకీర్తనలు చేస్తూ భక్తిశ్రద్ధలతో ఊరేగింపుగా తరలివెళ్లారు. ఆవుల బండిపై ఏర్పాటు చేసిన శ్రీ రాధాకృష్ణ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ భక్తులు యాత్రను కొనసాగించారు.గత కొంతకాలంగా ఈ ప్రాంతంలో హిందూ ధార్మిక, భక్తి భావనలు మరింత పెరగడంతో కృష్ణ భక్త బృందం ఏర్పడిందని నిర్వాహకులు తెలిపారు. ఏకాదశి రోజున కూడా వందలాది మంది మహిళలు, పురుషులు రాధాకృష్ణ మందిరం వద్ద చేరి హరే కృష్ణ హరే రామ సంకీర్తనలు ఆలపిస్తూ భక్తి పారవశ్యంలో మునిగిపోయారు.కృష్ణాష్టమి సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. ఈ వేడుకలకు భక్తులు భారీ సంఖ్యలో హాజరై విజయవంతం చేశారు.

## కృష్ణారావు సేవలు అమోఘం : ఎంఈవో



కవిటి, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త :

మొగలిపురి కృష్ణారావు సేవలు సేవా దృక్పథం అమోఘం అంటూ ఎంఈఓ ధనుంజయ మజ్జి కొనియాడారు. కవిటి మండల కేంద్రానికి చెందిన మొగలిపురి కృష్ణారావు శ్రీదేవి దంపతులు ప్రతి ఏటా తమ పిల్లల జన్మదినం సందర్భంగా వివిధ పాఠశాలలో పేద విద్యార్థులకు అలానే ఉత్తమ విద్యార్థులకు ఆర్థిక సహకారంతో పాటు దుస్తులు వివిధ విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు ఇతర ఇతర సామగ్రి అందించడం జరుగుతుంది. ఇందులో భాగంగా గురువారం నాడు కవిటి పంచాయతీ చిన్నమిల్లా పుట్టుక గ్రామంలో గల ప్రాథమిక ఉన్నత పాఠశాలలో 22 మంది విద్యార్థులకు యూనిఫారం దుస్తులతో పాటు పరీక్ష అట్టలను అందించే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఎంఈఓ ధనుంజయ మజ్జి మాట్లాడుతూ మొగిలిపురి కృష్ణారావు ప్రతీ సంవత్సరం వివిధ పాఠశాలలో విద్యార్థులకు వివిధ రకాలుగా సహకారం అందిస్తుంటారని ఆయన సేవలు విద్యార్థులకు వరంగా అభివర్ణించారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు బాస్ దేవ్ ప్రధాన్, హెచ్ఎం కేశవపురియా, త్రిలోశ నా బి సాయి, కొత్తపల్లి రంగారావు, పొల్లాయి వాసుదేవ రావు, జన్ని లోకనాథం, సిహెచ్ కృష్ణారావు, ఎంపీటీసీ శంకర్రావుతోపాటు పలువురు ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

కవిటి, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త :



మండల కేంద్రంలో గల కళ్యాణి విద్యా సంస్థలతో పాటు హర్షవిజ్ఞాన భారతి పాఠశాలలో ముందస్తుగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇవి విద్యార్థుల తల్లిదండ్రులకు మరియు విద్యార్థులకు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ముందుగా కళ్యాణి విద్యాసంస్థల కరస్పాండెంట్ వాళ్ల రాజేష్ శ్రీకృష్ణుడి విగ్రహానికి పూలమాలలు వేసి ప్రార్థనలు చేశారు. అనంతరం విద్యార్థులు వేసిన గోపిక సత్యభామ వేషధారణ శ్రీకృష్ణుని వేషధారణతో విద్యార్థిని విద్యార్థులు ఎంతగానో ఆకట్టుకున్నారు తదుపరి చిన్నారులు చేసిన కోలాట నృత్యాలు గోపికమ్మ పాటకు రఘుకుల తిలక రారా అనే పాటలకు విద్యార్థులు చేసిన నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. అనాథ నుంచి వస్తున్న హిందూ సంస్కృతి సాంప్రదాయ పదంలో చిన్నారులు ఉట్టికొట్టే కార్యక్రమాన్ని ఎంతో ఆకర్షణగా చేపట్టారు. కార్యక్రమంలో ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ముందస్తు శ్రీకృష్ణాష్టమి వేడుకలు

కంచిలి,సెప్టెంబర్ 3, ప్రభాతవార్త :

మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాల నందు శ్రీకృష్ణ జన్మాష్టమి ముందస్తు ఉత్సవాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా విద్యార్థులు రాధాకృష్ణులు మరియు గోపికల వేషధారణలతో విచ్చేసి గోకులాన్ని తలపించే విధంగా నృత్యాలు చేసి ఉపాధ్యాయుల్ని తోటి విద్యార్థుల్ని అలరింపజేశారు. తదనంతరం శ్రీకృష్ణుని పాటలకు కోలాటం, నృత్యాలు చేస్తూ అందర్నీ ఆకట్టుకున్నారు కార్యక్రమంలో విద్యార్థులతో పాటు ప్రధానోపాధ్యాయులు బల్ల కాంతారావు ఉపాధ్యాయులు బైపల్లి పుణ్యవతి, కొండే కుసరాజు,ఉప్పు విజయలక్ష్మి, బస్వా కిరణ్ కుమార్, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# శ్రీకాకుళం వార్త



## ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఘనంగా ఫ్రెషర్స్ డే

వీరఘట్టం, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త :




మండల కేంద్రం వీరఘట్టం లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఫ్రెషర్స్ డే కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. కాలేజీ ఆవరణ అంతా ఎంతో చూడ ముచ్చటగా, అందంగా ముస్తాబు చేశారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థినీ, విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను అత్యంత వైభవపేతంగా నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు సరికొత్త సినిమా పాటలతో పాటు, జానపద నృత్యాలను ఏర్పాటు చేసి పలువురిని ఎంతగానో ఆకట్టుకునే విధంగా విద్యార్థులు ప్రదర్శనలు ఇచ్చారు . అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డి జి ఎస్ వి త్రినాథ్ మాట్లాడుతూ సరికొత్త తరహాలో విద్యాబోధనను అందిస్తున్నామని, ఇందుకు తల్లిదండ్రులంతా తమకు సహకరించాలని ఆయన కోరారు. అలాగే విద్యార్థులు భావితరాలకు ఆదర్శంగా నిలబెట్టే విధంగా విద్యాభ్యాసాన్ని అందిస్తూ అందరి మన్ననలను పొందుతున్నామన్నారు. భవిష్యత్తులో మీరంతా మనస్ఫూర్తిగా తమ కళాశాలకు మరింత ప్రోత్సాహాన్ని అందించాలని ఆయన ఆకాంక్షించారు. విద్యార్థుల పోటీ తత్వానికి అనుగుణంగా విద్యార్థులను తయారు చేసి ప్రభుత్వ కళాశాలల రంగానికే వన్నె తెచ్చే విధంగా తీర్చిదిద్దుతామని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌తో పాటు పలువురు అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టు దంపతులకు ఘన సన్మానం



మెలియాపుట్టి, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త :

ఇటీవల ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ జిల్లా వైస్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైన ప్రజాశక్తి విలేకరి గూడ రామారావు దంపతులను మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఘనంగా సన్మానించారు. మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో రామారావు దంపతులకు పూలమాలలు వేసి, దుశ్శాలువాలతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు.ఈ సందర్భంగా రెడ్డి శాంతి మాట్లాడుతూ జర్నలిస్టులు ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. జిల్లా వైస్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైన రామారావు ప్రజా సమస్యలపై మరింత బాధ్యతాయుతంగా పనిచేసి మంచి గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. రామారావు దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రతినిధి బి. ఉదయ్‌కుమార్, వైస్ ఎంపీపీ ఎస్. ఆదినాయుడు, పల్లి యోగి, ఉర్లాన బాలరాజు, ఎస్. సుభాష్, జయముని రావు, గణేష్ ప్రధాన్, రవికుమార్, రంగారావు, మాజీ సర్పంచులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## మట్టి వినాయకుడ్ని పూజిద్దాం .. కాలుష్యాన్ని తగ్గిద్దాం

కంచిలి,సెప్టెంబర్ 3, ప్రభాతవార్త :



బూరగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మరియు ప్రాథమిక పాఠశాల లో చదువుతున్న విద్యార్థులు మట్టి వినాయక ప్రతిమలు చేసి మట్టి వినాయకులనే పూజిద్దాం అను నినాదంతో గ్రామంలో అవగాహన పరిచారు హానికరక విషతుల్య రసాయనాలతో రంగులతో ఇతర హానికారక పదార్థాలతో తయారు చేసిన విగ్రహాలను చెరువులలో కాలువలలో నదులలో నిమజ్జనం చేయడం వల్ల అక్కడి నీరు, ఆ నేల కాలుష్యం అవుతుంది ఆ నీటిలో ఉన్నటువంటి చేపలు రొయ్యలు పీతలు ఇంకా ఇతర జీవులు విసతుల్యం అవుతాయని విద్యార్థులు ఒక కరపత్రాన్ని తయారుచేసి గ్రామంలో పెద్దలకు పంచిపెట్టారు అలాగే ఆ నీటిలో లేదా ఆ నీటితో పెరుగుతున్నటువంటి ఆకుకూరలు కూరగాయలు కూడా విసతుల్యమవుతాయని పేర్కొన్నారు. వీటిని మనం తినడం వల్ల మన ఆరోగ్యం పాడై అనేక రకాల వ్యాధులకు దీర్ఘకాలిక రోగాలకు మరియు క్యాన్సర్లకు మనము గురి అవుతామని విద్యార్థులు తెలిపారు దీని విషయమై అందరు జాగ్రత్త పడతారని ఈ అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ ప్రకృతి పర్యావరణంతోనే మన ఆరోగ్యము మన భవిష్యత్తు మన మనుగడ ఆధారపడి ఉందని వీటిని మనము కాపాడుకుంటే అవి మనల్ని కాపాడతాయని తెలుపుతూ వినాయకుని మాస్కులతో విద్యార్థులు అబ్బురపరిచారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సోమేశ్వరరావు చంద్రశేఖర్ రోజా రాణి కాంతారావు నిరంజన్ కడంగా, కికె.చలపతి రావు,రమణమూర్తి గణేష్ బలకాంతరావు కిరణ్ పుణ్యవతి కుశరాజు విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## రూ. 75 లక్షలతో బహుళ ప్రయోజన కమ్యూనిటీ హాల్ ప్రారంభం



సీతంపేట, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త :

సీతంపేట మండలం రోలిగుడ్డి పంచాయతీ గౌరిపొలం గూడ గ్రామంలో పీఎం జన్మన్ పథకం క్రింద 60 లక్షల రూపాయలతో చేపట్టే బహుళ ప్రయోజన కమ్యూనిటీ హాల్‌తో పాటు ఆర్ట్స్ సంస్థ మరో 15 లక్షలు ఆర్థిక సహాయంతో స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ కమ్యూనిటీ భవనాన్ని ప్రారంభించారు. బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మారుమూల గిరిజన ప్రాంతాల్లోని ప్రజలకు విద్య, ఆరోగ్యం, చిన్నారుల సంరక్షణ సామాజిక కార్యక్రమాలకు అవసరమైన సౌకర్యాలను ఒకే చోట అందుబా టులోకి తీసుకురావడం ఎంతో ఉపయోగకరమని తెలిపారు. కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ రమాదేవి. డి ఈ నాగభూషణ్, సిడిపిఓ సిమ్మ లమ్మ, వ్యవసాయ అధికారి వారాహి, ఇమరక పవన్ మాజీ జెడ్పిటిసి ప్రతినిధి రాము ఆర్ట్స్ సంస్థ డైరెక్టర్ నూక సన్యాసిరావు పాల్గొన్నారు.

## జిసిసి ఆధ్వర్యంలో నిత్యవసర టెండర్లు

సీతంపేట, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త:

ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆశ్రమ పాఠశాలలు గురుకులాలు కస్తూరి పాఠశాలలో మినీ గురుకులాలకు అవసరమైన నిత్యవసర సరుకులు పంపిణీకి వ్యాపారుల నుంచి టెండర్లు నిర్వహించారు. బుధవారం స్థానిక ఎస్సార్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించే టెండర్లకు 15 మంది టెండర్ దారులు పాల్గొన్నారు 35 రకాల వస్తువులకు సంబంధించి ఈ టెండర్లు నిర్వహించడం జరిగిందని ఏపీవో జి. చిన్న బాబు తెలిపారు నాణ్యమైన సరుకులు సరఫరా చెయ్యాలని లేని పక్షంలో టెండర్దారులు టెండర్ను రద్దు చేయడం జరుగుతుందన్నారు. డిడి అన్నదొర. జిసిసి డివిజనల్ మేనేజర్ దాసరి కృష్ణ. పాతపట్నం సీతంపేట మేనేజర్లు జి.నర్సింలు, చిన్నబాబు, ఏటిడబ్ల్యువోలు రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

## పేదరికాన్ని జయించిన తొగిరి జయంతి

### తాపీమేస్త్రి కూతురుకు ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీటు...

కొత్తూరు,సెప్టెంబర్ 3 (ప్రభాత వార్త) :



ఆర్థిక ఇబ్బందులను అధిగమించి చదువులో ప్రతిభ కనబరిచిన నేరడి గ్రామానికి చెందిన తొగిరి జయంతికి ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీటు లభించింది. 2026 విద్యా సంవత్సరానికి డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ నిర్వహించిన మొదటి విడత కౌన్సెలింగ్‌లో జయంతికి శ్రీకాకుళం రిమ్స్ మెడికల్ కాలేజీలో కన్వీనర్ కోటాలో ఎంబీబీఎస్ సీటు కేటాయించారు. నేరడి గ్రామానికి చెందిన తొగిరి గోపాల్ తాపీమేస్త్రిగా పనిచేస్తున్నారు. ఆయన కుమార్తె జయంతి చిన్ననాటి నుంచి చదువుపై ఆసక్తి చూపింది. 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు భామిని రెసిడెన్షియల్ స్కూల్‌లో చదివిన ఆమె.. అనంతరం నరసన్నపేట రెసిడెన్షియల్ కాలేజీలో ఇంటర్ పూర్తి చేసింది.వైద్య విద్యలో సీటు సాధించాలనే లక్ష్యంతో తన మేనమామ డాక్టర్ చిన్నారావు సూచనల మేరకు విశాఖపట్నంలోని శ్రీ విశ్వా జూనియర్ కాలేజీలో నీట్ కోచింగ్ తీసుకుంది. నీట్‌లో మంచి ప్రతిభ కనబరిచి తాజాగా ఎంబీబీఎస్ సీటు సాధించింది. ఏపీ ఎంసెట్‌లోనూ జయంతి రాష్ట్రస్థాయిలో 590వ ర్యాంకు సాధించింది.జయంతి తల్లి గత ఏడాది అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో కుటుంబానికి మరిన్ని ఇబ్బందులు ఎదురైనా.. కుమార్తె చదువుకు ఆటంకం కలగకూడదని తండ్రి గోపాల్ తాపీ పని చేస్తూ ఆమెను చదివించారు. కష్టపడి సంపాదించిన సొమ్ముతో కుమార్తె చదువుకు అండగా నిలిచారు. తాజాగా జయంతికి ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీటు రావడంతో గోపాల్ కుటుంబంలో ఆనందం నెలకొంది.

## కూరగాయల వ్యాపార స్థలాల్లో శానిటేషన్ పనులు

రాజాం, ఆగస్టు 3, ప్రభాతవార్త.



రాజాం మున్సిపాలిటీలో కూరగాయల వ్యాపార స్థలాల్లో పారిశుద్ధ్యం తాండవం చేస్తుంది అనే శీర్షికను వార్తా దినపత్రికలో ప్రచురింపగా వెంటనే కమిషనర్ రామచంద్రరావు స్పందించి ఆయా ప్రాంతాల్లో పారిశుద్ధ్యం పనులను అలాగే శానిటేషన్ పనులను హటాహుటిన చేపట్టారు. ఆ ప్రాంతంలో ఈ విధంగా పనులు చేపట్టినందుకు గాను కమిషనర్ తీరుపై స్థానికులు, వ్యాపారులు హర్షం వ్యక్తం చేశారు.

## ఘనంగా చిన్న శీను జన్మదిన వేడుకలు



బొబ్బిలి, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త:

జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఈనెల 5 జన్మదిన వేడుకలు ముందస్తుగా పార్వతీపురం సాలూరు, బొబ్బిలిలో తన కుమార్తె సిరమ్మ ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు మాజీ శాసనసభ్యులు వెంకట చిన్నప్ప నాయుడు, జిల్లా పార్టీ కార్యదర్శి ఎస్. వేణుగోపాల్ నాయుడు, తూముల భాస్కర రావు ఆధ్వర్యంలో బొబ్బిలిలో రక్తదాన శిబిరంతో పాటు వివిధ ఆలయాలకు వెళ్లి సిరమ్మ మొక్కులు సమర్పించింది. పక్కనే ఉన్న ప్రభుత్వ పాఠశాలలో బాలికలకు పుస్తకాలు పెన్నులు పలకలు పంపిణీ చేసింది. మా తండ్రి మా ఆశయాలకు అనుగుణంగా నా నడవడి ఉంటుందని ప్రతి ఒక్కరూ నన్ను ఆదరించాలని ఆమె కోరారు. పార్వతీపురంలో మాజీ శాసనసభ్యులు ఆధ్వర్యంలో చిన్న శ్రీను జన్మదిన వేడుకలు సిరం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సాలూరు మాజీ శాసనసభ్యులు రాజన్న దొర ఆధ్వర్యంలో సిరమ్మతో కలిసి బహు కార్యక్రమాలు నిర్వహించారు. కేక్ కట్ చేసి అందంకూ చీరలు పంపిణీ చేశారు. స్థానిక నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని సిరియమ్మతోపాటు సంబరాలు చేసుకున్నారు.

## కాంగ్రెస్ పార్టీని జిల్లాలో బలోపేతం చేస్తాం




బొబ్బిలి, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త:

కాంగ్రెస్ పార్టీని జిల్లాలో బలోపేతం చేస్తామని జిల్లా అధ్యక్షులు మరిపి విద్యాసాగర్ తెలియజేశారు. బొబ్బిలి సాయి నగర్ కాలనీలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభించి అనంతరం మాట్లాడుతూ బొబ్బిలి టౌన్ ప్రెసిడెంట్గా ఎం. దుర్గాప్రసాద్ ఎంపిక చేశామన్నారు. స్థాయిలో బొబ్బిలిలో ప్రతి వార్డులో స్థానిక ఎన్నికలకు ఒక అభ్యర్థిని ఎంపిక చేస్తారని జిల్లా స్థాయిలో నేను అన్ని నియోజకవర్గాలను కాంగ్రెస్ పార్టీ వచ్చే విధంగా బలోపేతం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో మువ్వల శ్రీను జిల్లా అధికార ప్రతినిధి పాల్గొన్నారు. దెబ్బ గుడ్డి వలసకి చెందిన లోచర్ల రామ్ పార్టీలో జాయిన్ అయ్యారన్నారు. ప్రతి వార్డులో కాంగ్రెస్ పార్టీ మా వంతు కృషి చేస్తామని దుర్గాప్రసాద్ తెలియజేశారు. వీరితోపాటు కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

## బొబ్బిలి పురపాలక సంఘ ఎన్నికల ఫొటో గుర్తింపు కార్డు ప్రచురణ

బొబ్బిలి, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త:



రానున్న పురపాలక సంఘ ఎన్నికల ఎన్నికల కమిషనర్ ఆదేశాలతో బొబ్బిలి పురపాలక సంఘం కమిషనర్ ఎల్ రామలక్ష్మి 36వార్డులకు సంబంధించి ఫోటో గుర్తింపు కార్డులు ప్రచురణ చేసామని అన్నారు. ఈ ఎన్నికల జాబితా తహసిల్దార్ కార్యాలయము. మున్సిపల్ కార్యాలయం. సబ్ డివిజనల్ కార్యాలయం అందుబాటులో ఉంటాయని అన్నారు. కార్యక్రమంలో బొబ్బిలి మున్సిపల్ ఉద్యోగులంతా పాల్గొన్నారు.

## సరాఫ్ పాఠశాలలో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు




గరివిడి, సెప్టెంబర్ 3, ప్రభాత వార్త:

శ్రీరాం నగర్ శ్రీమతి గోదావరి దేవి సరాఫ్ సీనియర్ సెకండరీ పాఠశాలలో గురువారం ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. వేడుకల్లో భాగంగా చిన్నారి విద్యార్థులు రాధా, కృష్ణుని వేషధా రణలతో ఆకట్టుకున్నారు. విద్యార్థులు ప్రదర్శించిన నృత్యరూపకాలు సభికులను మంత్రముగ్ధులను. చిన్నారులు తమ హావభావాలతో ప్రదర్శించిన స్కిట్ ప్రదర్శనలు సభికులను ఆకట్టుకున్నాయి. కృష్ణాష్టమి ప్రాధాన్యత పై చిన్నారులు ఆలాపించే గీతాలు శ్రోతలను తన్మయత్వ పరిచాయి. విద్యార్థులు రాధా, గోపాలకృష్ణ వేషధారణల్లో చూసిన తల్లిదండ్రులు మురిసిపోయారు. సంప్రదాయం ఉట్టిపడే విదంగా విద్యార్థులు, ఉపాధ్యాయినులు వస్త్రాలు ధరించి కృష్ణాష్టమి విశిష్టతను చాటుకున్నారు. ముగ్ధ మనోహరులైన చిన్నారులు తమ వేషధారణలతో పాఠశాల ప్రాంగణం కళకళ లాడింది. కొత్త కాంతులతో ఆ ప్రాంగణం రూపుదిద్దుకుంది. శ్రీరాం విద్యాపీఠ్ కార్యదర్శి, ఎస్ జి ఎస్ సీనియర్ సెకండరీ పాఠశాల ప్రిన్సిపాల్ బలిజేపల్లి రవి, పాఠశాల డీన్ పి.సత్యనారాయణ వివిధ విభాగాల బోధన,బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## వాగ్దేవి కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్ వేడుకలు

కొత్తవలస, సెప్టెంబర్ 3, ( ప్రభాతవార్త ):




మండలంలోని వాగ్దేవి కళాశాలలో ఫ్రెషర్స్ పార్టీ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు.

కార్యక్రమానికి వాగ్దేవి గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ చైర్మన్ ప్రొఫెసర్ డాక్టర్ కెంబూరు చంద్ర మౌళి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు కళాశాల జీవితాన్ని సద్వినియోగం చేసుకుంటూ క్రమశిక్షణ, పట్టుదల, కష్టపడి పనిచేసే తత్వాన్ని అలవర్చుకోవాలని సూచించారు. గురుదేవ్ చారిటబుల్ ట్రస్ట్ , చైర్మన్ రాపర్తి జగదీష్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థి దశలో ఏర్పరుచుకునే ఆలోచనలు, అలవాట్లు, లక్ష్యాలే భవిష్యత్తును నిర్ణయిస్తాయని తెలిపారు.కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కొటిన మహేశ్వరరావు , కళాశాల డైరెక్టర్ ప్రవీణ్ కుమార్,ప్రిన్సిపల్స్ సురేష్, రాజ్ కుమార్, సతీష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమంలో నిర్వహించారు.



## విద్యార్థుల హాజరు శతశాతం ఉండాలి

తెర్లాం, సెప్టెంబర్ 3,(ప్రభాతవార్త ):

విద్యార్థుల హాజరు నూటికి నూరు శాతం ఉండేలా చర్యలు తీసుకోవాలని మండల విద్యాశాఖాధికారి జె. త్రినాద్ రావు కొరారు.గురువారం కాలంరాజుపేట ఏం.పి.యు.పి. స్కూల్ సందర్శించారు. ఈ సందర్బంగా ఆయన స్కూల్ అసెంబ్లీ నిర్వహణ తీరు పరిశీలించి, తగు సూచనలు ఇచ్చారు.స్కూల్ అసెంబ్లీ ద్వారా విద్యార్థులలో క్రమశిక్షణ,దేశభక్తి, నైతిక విలువలు పెంపొందేలా నిర్వాణ చేయాలని సూచించారు. విద్యార్థుల వర్క్ బుక్స్,నోట్ బుక్ పరిశీలించి తగు సూచనను చేయడమైనది. వర్క్ బుక్స్,నోట్ బుక్ కరెక్షన్ చేసి తప్పులున్నచో విద్యార్థులకు తెలియజేసి వాటిని సరిదిద్దాలని సూచించడమైనది.డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలు తీరు పరిశీలించి, ఎగ్స్ నాణ్యత, మెనూ అమలు, ఆహార పదార్థాల నాణ్యత పరిశీలించడమైంది. మధ్యాహ్న భోజన పథకం అమలు పట్ల నిరంతరము జాగ్రత్తవహించి సమర్ధవంతంగా నిర్వహించాలని సూచించడమైనది.విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలు, రీడింగ్ రైటింగ్ స్థాయిలు పరిశీలించి ఎఫ్. ఎల్.ఎన్.ప్రకారం అందరూ విద్యార్థుల కనీస అభ్యసనా సామర్థ్యాలు సాధించేలా కృషి చేయాలని ఆదేశించడమైనది. మరుగుదొడ్ల నిర్వహణ, పాఠశాల గ్రంథాలయం, సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థిమిత్ర కిట్స్ వినియోగం తీరు పరిశీలించి తగు సూచనలుసలహాలు ఇచ్చారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు వేపారి విజయభాస్కర్, ఉపాధ్యాయలు రెడ్డి భాస్కర్ రావు, కోటిపల్లి సూర్యనారాయణ, జి. రామారావు పాల్గొన్నారు.

## నగర పంచాయతీ ఓటర్ల జాబితా ప్రదర్శన

నెల్లిమర్ల, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త :



రానున్న స్థానిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వ ఆదేశాల మేరకు నెల్లిమర్ల నగర పంచాయతీ కి సంబంధించి 23 వార్డుల ఫోటో ఓటర్ల జాబితాలను కమిషనర్ తమ్మినేని గోవిందరావు గురువారం విడుదల చేశారు. వీటి ప్రతులను నోటీసు బోర్డులో అతికించారు. అలాగే ఈ ప్రతులను విజయనగరం ఆర్డిఓ కార్యాలయం వద్ద, నెల్లిమర్ల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద నోటీస్ బోర్డ్లో ఉంచినట్లు కమిషనర్ గోవిందరావు తెలిపారు. వాటర్లో నేరుగా ఆయా కార్యాలయాల్లో చూసుకోవచ్చునని ఆయన తెలిపారు. కార్యక్రమంలో నగర పంచాయతీ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## గడ్డి మందు సేవించి వ్యక్తి మృతి

రామభద్రపురం, సెప్టెంబర్ 3,ప్రభాతవార్త:

రామభద్రపురంలోని కనిమెరక వీధికి చెందిన గేదెల రమేష్ (39) గడ్డిమందు సేవించి మృతి చెందాడు. మద్యానికి అలవాటు పడి కుటుంబ బాధ్యతలను సక్రమంగా నిర్వహించకపోవడంతో తరచుగా భార్యతో గొడవలు జరుగుతుండేవని సమాచారం. ఈ కారణంగా అతని భార్య తన పుట్టింటికి వెళ్లిపోయిందని గ్రామస్తులు చెబుతున్నారు.కసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జ్ఞాన ప్రసాద్ తెలిపారు.

## ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం



కొమరాడ, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త:

మండలంలో దళాయిపేట, కొందులగుంప గ్రామాల్లో గురువారం 'రెండేళ్ల నమ్మకం-- సంక్షేమం, అభివృద్ధి' కార్యక్రమాన్ని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు శేఖర్ పాత్రుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో అమలు చేసిన వివిధ సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ప్రజల సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధే కూటమి ప్రభుత్వశీ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వంపై ప్రజలు చూపిస్తున్న విశ్వాసం తమపై మరింత బాధ్యతను పెంచుతోందని, ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని స్పష్టం చేశారు. క్లస్టర్ ఇంచార్జీలు వి.రాఘవేంద్రరావు, బలరాం, త్రినాధం, తెదేపా ,జనసేన నాయకులు నంగిరెడ్డి మధుసూదనరావు, రాము ,గౌరీశంకర్, ఉపేంద్రతో పాటు కూటమి నాయకులు, కార్యకర్తలు, మహిళలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## పోర్ట్ సిటీ పాఠశాలలో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

విజయనగరం, సెప్టెంబర్ 3, ప్రభాత వార్త:



పట్టణంలో ని పోర్ట్ సిటీ పాఠశాలలో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. వేడుకల్లో భాగంగా ప్రీప్రైమరీ, నుండి రెండవ తరగతి చదివే చిన్నారి విద్యార్థులు గోపిక,కృష్ణుని వేషధారణలుతో ఆకట్టుకున్నారు. ఇతర తరగతులు విద్యార్థులు నృత్యం, కోలాటం ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శనలతో సభికులను మంత్ర ముగ్ధులను చేశారు.చిన్నారులు తమ హావభావాలతో చేసే నృత్యాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. విద్యార్థులు గోపాలునిపై చేసే కీర్తనలు శ్రోతలను తన్మయత్వ పరిచాయి.కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ కె ఏ పి రాజు(శివ), పాఠశాల వైస్ చైర్మన్ చంటి, ప్రిన్సిపాల్ రోయినాఖాన్, డైరెక్టర్లు మధు,అశోక్,నీలిమ లు పాల్గొన్నారు. ప్రతీ ఒక్కరి మదిలో కృష్ణ భగవానుడు కొలువై ఉంటాడని పేర్కొంటూ కృష్ణాష్టమి ప్రత్యేకత, ప్రాధాన్యత ను శివ తదితరులు వివరించారు.వేషధారణ తో ఆకట్టుకున్న చిన్నారులకు కళాశాల యాజమాన్య ప్రతినిధులు బహుమతులు బహూకరించారు. అట్టహాసంగా, వేడుకగా కన్నుల పండువగా సాగిన ఉత్సవం తో పాఠశాల ప్రాంగణంలో కొత్త కాంతులీనాయి.

## ఆరుతడి పంటల సాగుకు రైతులు ప్రాధాన్యం ఇవ్వాలి

విజయనగరం, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త



ఎల్నినో ప్రభావం వల్ల ఆరుతడి పంటల సాగుకు రైతులు ప్రాధాన్యం ఇవ్వాలని విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు సూచించారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో, గురువారం జరిగిన ఎల్ నినో కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా లో కేవలం 50 శాతం భూమి లో మాత్రమే ఇంతవరకు వరి సాగు జరిగిందని అన్నారు. ముఖ్య మంత్రి ఆదేశాల ప్రకారం ప్రతీ రైతు కు ఒక కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసి రైతులకు అందించాలన్నారు. ప్రతీ రైతునూ వచ్చే రెండు నెలల్లో వచ్చే వర్షాలకు సన్నద్ధం చేసి, చిన్న వర్షం కురిసినా వెంటనే విత్తనాలను వేసుకొని పంట చేతికి అందేలా చర్యలు చేపట్టాలని ఆమె సూచించారు. వరి సాగు కంటే తక్కువ నీటి ఖర్చుతో ఎక్కువ దిగుబడి వచ్చే ఆరుతడి పంటలు సాగు చేయాలని ఆమె సూచించారు. ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు , గోదావరి నదీ జలాల ను ఉత్తరాంధ్ర కు తీసుకు వస్తున్నారని, నదుల అనుసంధానంతో ప్రతీ రైతుకూ, ప్రతీ పొలానికి, ప్రతీ గ్రామానికీ సాగు త్రాగు నీరు అందుతుందని ఎం ఎల్ ఏ అన్నారు.అన్ని శాఖల అధికారులు రైతులకు అన్నివిధాలుగా అండగా ఉండాలని ఆమె కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కర్రోతు వెంకట నరసింగ రావు , ప్రకృతి వ్యవసాయం , పశుసంవర్ధక శాఖల అధికారులు , ఉద్యాన శాఖ , స్టేట్ బ్యాంక్ , పంటల బీమా విభాగం అధికారులు , మండల అభివృద్ధి అధికారి, తహశీల్దార్ పాల్గొన్నారు .

## వైసీపీ శ్రేణుల్లో జోష్ ... చిన్నశ్రీనుకు బర్తడే విషెస్



సాలూరు, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త:

ఉమ్మడి జిల్లా జడ్పీ చైర్మన్ వైసీపీ జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు(చిన్నశ్రీను) ముందుస్తు జన్మదిన వేడుక మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గురువారం ఉదయం మాజీ డిసీం నివాసం వద్ద జరిపిన పుట్టినరోజు వేడుకల్లో మజ్జిసిరి సహస్ర(సిరిమ్మ) పాల్గొని కేక్ కట్ చేయగా వైసీపీ శ్రేణులు మంచి జోష్ తో శుభాకాంక్షలు తెలిపారు. అలాగే చిన్నశ్రీను కుమార్తె సిరమ్మ రాజన్నదొరకు కేకు తినిపించి ఆనందం వ్యక్తంచేసారు.అనంతరం ఆమె మాట్లాడుతు ప్రతి ఏటా జన్మదిన వేడుకల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని అలాగే మాజీ డిప్యూటీ సీఎం నివాసంలో ముందగా పుట్టిన రోజు వేడుకలు జరపడం అందులో నేను భాగస్వామి కావడం చాలా సంతోషంగా ఉందన్నారు.వైసీపీ టౌన్ ప్రెసిడెంట్అప్పలనాయుడు,గిరిరఘు, దండి.శ్రీను,పిరిడి రామకృష్ణ, హరిబాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

## వాసవీ వనిత ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం

శృంగవరపుకోట,సెప్టెంబర్3,ప్రభాతవార్త :



బొడ్డవర వాసవి వనిత క్లబ్ అధ్యక్షురాలు పూసర్ల రవికుమారి ఆధ్వర్యంలో గురువారం ఎస్ కోట పట్టణంలో శ్రీసాయి వికలాంగ వృద్ధాశ్రమంలో సేవా కార్యక్రమం నిర్వహించారు. వికలాంగ వృద్ధాశ్రమంలో ఉన్న వారికి పాలు రొట్టెలు పండ్లు నగదు అందజేశారు.అదేవిధంగా బొడ్డవర వినాయక ఆలయంలో మహిళలు పలు క్రీడా కార్యక్రమాలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.సంఘ అధ్యక్షురాలు పూసర్ల రవికుమారి మాట్లాడుతూ తమ వాసవి మాత వారోత్సవాలు సందర్భంగా కార్యక్రమాలు చేపట్టామని సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు తోడుగా ఉంటామని తెలిపారు.ముఖ్యంగా విద్య వైద్య అంశాలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఆమె తెలిపారు.కార్యక్రమంలో సంఘ సభ్యులు అన్నపూర్ణ ప్రమీల ఉన్నారు.

## సైబర్ నేరాలపై ప్రతీ ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి

### -మద్యం తాగి వాహనాలు నడిపితే జైలుకే : బొబ్బిలి రూరల్ సీఐ మల్లిఖార్జునరావు



రామభద్రపురం, సెప్టెంబర్ 3,ప్రభాత వార్త:

సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బొబ్బిలి రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ మల్లిఖార్జనరావు సూచించారు. మండల పరిధిలోని బూసాయవలస గ్రామంలో గురువారం వివిధ అంశాల పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో సైబర్ మోసాలు ఎక్కువగా జరుగ న్తున్నాయని తెలిపారు. కొంతమంది నేరగాళ్లు ఓటీపీలు చెప్పాలని, బ్యాంకు అకౌంట్లు చెప్పాలని బ్యాంకు అధికారుల ముసుగ లో ఫోన్లు చేస్తున్నారని, అటువంటి వారిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అలాగే మద్యంతాగి వాహనాలు నడపడం వలన ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని, దీనివలన వారి కుటుంబాలకు ఎంతో నష్టం కలుగుతుందని తెలిపారు. ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని తెలిపారు. ముఖ్యంగా మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని అన్నారు. అలాగే జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశాల మేరకు మహిళల రక్షణ కోసం అనేక చర్యలు తీస కుంటున్నామని తెలిపారు. మహిళలను వేధించినా, వారి పట్ల అనుచితంగా ప్రవర్తించినా గట్టి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముఖ్యంగా యువత డ్రగ్స్ దూరంగా ఉండాలని, గంజాయి, ఇతర మత్తు పదార్థాలు వినియోగించినా, రవాణా చేసినా ఉక్కుమాదం మోపుతామని అన్నారు. ప్రతీ ఒక్కరూ చట్టానికి లోబడి ఉండాలని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ప్రతీ ఒక్కరూ సహకరించాలని కోరారు. ప్రజలంతా ఐకమత్యంతో ఉండాలని సూచించారు. సమావేశంలో ఎస్ఐ వి.జ్ఞాన ప్రసాద్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విజయనగరం
పార్వతీపురం మన్యం
వార్త

## వాతావరణ మార్పులకు అనుగుణమైన సాగు పద్ధతులు అవలంబించాలి

గరుగుబిల్లి, సెప్టెంబర్ 3, ప్రభాత వార్త:



వాతావరణంలో వస్తున్న మార్పులకు అనుగుణం గా సాగు పద్ధతులను మార్చుకోవాలని గుమ్మ లక్ష్మీపురం వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్ అన్నపూర్ణ రైతులకు పిలుపునిచ్చారు. మండల పరిధిలోని చిలకాం పంచాయతీ దత్తివలస గ్రామంలో మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఎల్ నినో ప్రభావం పంటల సాగుపై మేలైన యాజమాన్య పద్దతులపై బుధవారం రైతు చర్చా కార్యక్రమమును నిర్వహిం చారు. అదే విధంగా దత్తివలస గ్రామం లో వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు మరియు రైతులు వరి పంట పొలాలను సందర్శించి పంట పరిస్థితిని పరిశీలించి రైతులకు పంటలు పండించే విధానం పై తమ సూచనలు సలహాలను అందజేశారు. అనంతరం వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్ అన్నపూర్ణ మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావ పరిస్థితుల నేపథ్యం లో తక్కువ నీటితో సాగు చేసే వాణిజ్య పంటలపై రైతులు దృష్టి సారించాలని పేర్కొన్నారు. ఆధునిక పద్దతులతో పంటల సాగు వల్ల కలిగే లాభాలను వివరించారు. వ్యవసాయ శాఖ అందించే రాయితీలు మరియు శిక్షణా కార్యక్ర మాలను ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## రైతులు ఆరుతడి పంటలపై దృష్టిసారించాలి




వేపాడ ,సెప్టెంబరు3, ప్రభాతవార్త:

ఎల్నినో ప్రభావంతో వరి పంటకు బదులుగా ఆరుతడి పంటలను సాగు చేసే విధంగా రైతులను చైతన్యవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి లక్ష్మీనారాయణ కోరారు. గురువారం వేపాడ మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి వ్యవసాయ అనుబంధ రంగాల సమన్వయంతో వ్యవసాయాధికారిణి ఎం స్వాతి ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వర్షాభావ ప్రభావంతో వరి సాగు చేయడం సాధ్యం కాదని, ఆరుతడి పంటలను ప్రత్యామ్నాయ పంటలు గా వేసుకోవాలని సూచించారు. రాగి, సజ్జ, జనుము, మినుములు, ఉలవలు వంటి అపరాల పంటలను రైతులు సాగు చేసుకునే విధంగా చూడాలని ఆదేశించారు. తుంపర , బిందు సేద్యం యొక్క ఉపయోగాలు , ప్రభుత్వం అందించు రాయితీలపై విస్తృత ప్రచారం చేయాలన్నారు. బోర్ వెల్ ఉన్న ప్రతి ఒక్క రైతు కూడా డ్రిప్ , స్ప్రింకలర్ లను ఉపయోగించు కొని ఈ ఎలెనినో పరిస్థితుల నుంచి పంటలును కాపాడుకోవాలని సూచించారు. తహసీల్దార్ జె రాములమ్మ , ఎంపి డి ఒ సి హెచ్ సూర్యనారాయణ , ఉద్యానవన శాకాధికారి పద్మ, జలవనరులు ఏఇ హనుమంతురావు, అదనపు ప్రాజెక్ట్ అధికారి స్వామినాయుడు, గ్రామ వ్యవసాయ సహాయకులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

## పర్యాటకులను ఆకర్షిస్తున్న గ్రీన్ఫీల్డ్ రహదారి టన్నెల్స్

పాచిపెంట, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త:



విశాఖపట్నం నుండి వెళ్లేరాయపూర్ గ్రీన్ఫీల్డ్ రహదారి టన్నెల్ పలువురిని ఆకర్ష తులను చేస్తున్న యి. కేంద్ర ప్రభుత్వం నిధులతో ఈ రహదారిని సులబ చేసేందుకు నిర్మాణం చేపడుతున్న విశాఖపట్నం రాయపూర్ 464 కిలోమీటర్లు రహదారిని కేంద్ర ప్రభుత్వం నిర్మిస్తున్నారు. ఈ రహదారి ఆంధ్ర సరిహద్దులు సుమారుగా 90 శాతం పైనే పనులు నిర్వహించారు ఒరిస్సా రాష్ట్రం మీదిగా వెళుతున్న ఈ రహదారి మధ్యలో కొండలను చీల్చి టన్నల్స్ సుమారుగా మూడు కిలోమీటర్లు ఒకటన్నల్ రెండవది 1:30 కిలోమీటర్ పొడవునా ఉన్న ఈ తన్నల్స్ విద్యుత్ దీపాలతో పలువురిని ఆకట్టుకుంటున్నాయినీ పలువురు పర్యాటకులు తెలిపారు. పలు రాష్ట్రాలకు ఈ రహదారి రాకపోకలకు సులభతరం కావస్తుందని పలువురు తెలిపారు.



## సైబర్ నేరాలపై అవగాహన

కురుపాం,సెప్టెంబర్ 3, ప్రభాతవార్త

కురుపాం పోలీస్ స్టేషన్ సిబ్బంది ఎస్సై పి. నారాయణరావు ఆధ్వర్యంలో ఇంటింటికి మన్యం పోలీస్ కార్యక్రమాన్ని కురుపాం పంచాయతీ పట్టఐదొరవలసలో నిర్వహించారు. సైబర్ నేరాలు, రోడ్డు భద్రతపై అవగాహన, మహిళలపై జరుగుతున్న వివిధ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ గ్రామాలలో కరపత్రాలను పంచారు. పోలీసుల సేవలకు సంబంధించి ముఖ్యమైన ఫోన్ నెంబర్లను ఇంటింటికీ సిబ్బంది అంటించారు. గ్రామస్తుల అందరితో పోలీసు సిబ్బంది అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎ ఎస్ఐ ,పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## గరివిడి నుంచి జిల్లా స్థాయి ఉత్తమ టీచర్లు ఎంపిక

గరివిడి, సెప్టెంబర్ 3, ప్రభాత వార్త:

గరివిడి మండలంకి చెందిన నలుగురు ఉపాధ్యాయులు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులు గా ఎంపికయ్యారు.శ్రీరాం నగర్ ఉన్నత పాఠశాల కు చెందిన ఎం.సాహితీ,ఎం.భారతి,కోడూరు పాఠశాల కు చెందిన ఎం.సూర్యనారాయణ, గడబ వలస కు చెందిన పెంకి బాబ్జి లు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులు గా ఎంపికయ్యారు. ఈ మేరకు విద్యాశాఖాధికారులు వెల్లడించారు.ఈ నెల 5 న జరిగే ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కలక్టరేట్ లో జరిగే కార్యక్రమంలో అవార్డులు ప్రధానం చేయనున్నారు. ఉత్తమ ఉపాధ్యాయులు గా ఎంపికైన గురువులు కి మండల విద్యాశాఖాధికారులు పోలుబోతు రామారావు, అప్పన్న, హెచ్ ఎం.నిర్మల ,బడిగంటి బంగార్రాజు,విశ్రాంతి ఉపాధ్యాయులు ఏ సత్య శ్రీనివాస్, మీసాల వెంకట రమణ, యజ్జిపురపు సత్యం తదితర విద్యావేత్తలు శుభాకాంక్షలు తెలిపారు.

## 300 మంది గిరిజనులకు అన్నదానం

శృంగవరపుకోట,సెప్టెంబర్3,ప్రభాతవార్త :



ఎస్.కోట యంగ్ స్టార్ స్పోర్ట్స్ క్లబ్ అధినేత స్వర్గీయ చాపా రామచంద్రరావు జ్ఞాపకార్దం మూల బొడ్డవర గిరిజన గ్రామంలో గురువారం భారీ ఎత్తున అన్నదానం నిర్వహించారు. అలాగే 200 మందికి 20వేలు విలువచేసే స్టీల్ ప్లేట్లు వితరణగా అందజేశారు. వైద్యులు తోట అప్పారావు, టీడీపీ క్లస్టర్ కోఆర్డినే టర్ ఇందుకూరి శ్రీనురాజు,మాజీ సర్పంచ్ కృష్ణంరాజు,విష్ణు,శంకర్,అప్పారావు పాల్గొన్నారు.

## సాలూరు మున్సిపాల్టీ 32 వార్డులకు పెంపు కన్ఫర్మ్ ...!



సాలూరు, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త :

సాలూరు పట్టణంలో ఉన్న 29 వార్డుల నుండి 32 పెంపు జరుగుతుందా లేదా అని సస్పెన్స్ కు తెరపడిందని ప్రభుత్వ ఆదేశాల మేరకు 32 వార్డులుగా కన్ఫామ్ చేసినట్టుగా సమాచారం.వివరాల్లోకి వెళ్తే ఏపి సర్కార్ ఆదేశాల మేరకు 2011 జనాభ లెక్కల ఆధారంగా ప్రస్తుతం ఉన్న 29 వార్డులను 32 పెంచాలని అలాగే ఈ ప్రక్రియ టౌన్ ప్లానింగ్ అధికారులు నేతృత్వం లో పూర్తి చేశారు. అంతేకాకుండా పెరిగిన వార్డుల జాబితాను కొత్తరూట్ మ్యాప్ తో సహ నోటీసు బోర్డులో ఇంత కుముందు అతికించారు.అలాగే ఈ విభజన ప్రక్రియ వారంపాటు అభ్యంతర ఫిర్యాదులను మున్సిపల్ అధికారులు స్వీకరించారు.ఇదిలా ఉంచితే కొంతమంది వైసీపీ మాజీ కౌన్సిలర్లు ఈ ప్రక్రియపై అభ్యంతరాలు తెలిపారు. అంతేకాకుండా వైసీపీ మాజీ కౌన్సిలర్ కోర్టును ఆశ్రయించారు. కాకపోతే ఇప్పుడు మున్సిపల్ ఇంచార్జ్ కమిషనర్ ప్రసాద్ సమాచారం ప్రకారం 32 వార్డులు కన్ఫామ్ చేసినట్టుగా తెలిపారు. అలాగే పై అధికారుల నుండి అధికారంగా సమాచారం వస్తుందని అప్పుడు 32 వార్డులగా పూర్తి ప్రకటన చేస్తామని వార్త ప్రతినిధికి గురువారం క్లారిటీ ఇచ్చారు.

## జిల్లా డిప్యూటీ డీఈఓగా తేజేశ్వరరావు ఎంపిక

బలిజిపేట, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త :

అరసాడకి చెందిన కల్యంపూడి తేజ తేజేశ్వరరావు ఇటీవల నిర్వహించిన ఏపీపీఎస్సీ గ్రూప్ వన్ ఫలితాల్లో జిల్లా డిప్యూటీ డీఈవోగా అర్హత సాధించినట్లు విలేకరుల సమావేశంలో తెలిపారు. సాధారణ రైతు కుటుంబంలో పుట్టి మారుమూల గ్రామాల్లో ఉంటూ అలుపు ఎరగని పోరాటానికి సిద్ధపడి మొదటగా ఏపీపీఎస్సీ గ్రూప్ 2లో 2020 ఫలితాల్లో 75 వ ర్యాంకు సాధించి అమరావతిలో అధికారిగా విధులు నిర్వహిస్తుండగా అంతటి తాగక ఏపీపీఎస్సీ గ్రూప్ త్రీ 2020 ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఫస్ట్ ర్యాంక్ సాధించారు.

04-09pg10exHMNWJQE.qxd:04-09pg10exHMNWJQE.qxd 1/1/02 6:37 AM Page 1



### చైనా మాస్టర్స్‌లో క్వార్టర్స్‌కు
## శ్రీకాంత్, డబుల్స్ జోడీ సాత్విక్-చిరాగ్




**షెన్‌జెన్ (చైనా):** చైనా మాస్టర్స్‌లో ప్రపంచ 9వ ర్యాంకర్ విక్టర్ లాయ్‌ను ఓడించి భారత్ షట్లర్ కిదాంబి శ్రీకాంత్ క్వార్టర్స్‌లో అడుగుపెట్టాడు. అలాగే డబుల్స్ విభాగంలో సాత్విక్‌సాయిరాజ్ రంకిరెడ్డి-చిరాగ్ శెట్టి జోడీ క్వార్టర్స్‌కు చేరుకున్నారు. చైనాలోని షెన్‌జెన్‌లో గురువారం జరిగిన చైనా మాస్టర్స్ టోర్నమెంట్‌లో, కిదాంబి శ్రీకాంత్ ప్రపంచ నంబర్ 9 విక్టర్ లాయ్‌ను వరుస గేమ్‌లలో ఓడించి తదుపరి రౌండ్‌కు దూసుకెళ్లాడు. బిడబ్ల్యూఎఫ్ సూపర్ 750 టోర్నమెంట్‌లో మాజీ ప్రపంచ నంబర్ 1 ఆటగాడు, గంటలోపే లైని 21-18, 21-19 తేడాతో ఓడించాడు. 3-3తో స్కోరును సమం చేసిన తర్వాత, లై వరుసగా తప్పులు చేయడంతో శ్రీకాంత్ 3-7తో వెనుకబడ్డాడు. ఆ తర్వాత కోలుకుని 8-8తో స్కోరును సమం చేశాడు. కెనడియన్ ఆటగాడు తిరిగి పట్టు సాధించి 15-11 ఆధిక్యంలోకి వెళ్ళాడు. కానీ శ్రీకాంత్ ఒక శక్తివంతమైన జంప్ స్మాష్‌తో స్కోరును సమం చేసిన తదుపరి 18-16 ఆధిక్యంలోకి దూసుకెళ్లాడు. ఆ తర్వాత అతను మ్యాచ్ పాయింట్ సాధించగా, లై కొట్టిన షాట్ బయటకు వెళ్లడంతో శ్రీకాంత్‌కు విజయం చేకూరింది. పురుషుల డబుల్స్ ఈవెంట్‌లో, సాత్విక్‌సాయిరాజ్ రంకిరెడ్డి-చిరాగ్ శెట్టి ఫ్రాన్స్‌కు చెందిన క్రిస్టో పోపోవ్-తోమా పోపోవ్‌లను 21-17, 22-24, 21-9 తేడాతో ఓడించి క్వార్టర్స్‌కు చేరుకున్నారు. చిరాగ్‌సాత్విక్ జోడీ 8-3 ఆధిక్యంతో బలమైన ఆరంభాన్ని సాధించింది. మొదటి విరామ సమయానికి 11-6 ఆధిక్యంలో నిలిచిన ఈ భారత జోడి, విరామం తర్వాత తమ ఆధిక్యాన్ని 16-9కి పెంచుకుంది. ఫ్రెంచ్ జోడీ చివరిలో గట్టిగా ప్రయత్నించినప్పటికీ, చిరాగ్‌సాత్విక్ పట్టుదలతో నిలబడి, 17 నిమిషాల్లో జరిగిన తొలి గేమ్‌ను 21-17 తేడాతో గెలుచుకుంది.

### ఇండోనేసియా మాస్టర్స్
## అష్మిత ముందంజ
### ప్రణయ్ నిష్క్రమణ






**ఇస్తోరా సెనాయన్:** ఇండోనేషియా మాస్టర్స్‌లో జువాన్ చెన్ ఝూ చేతిలో ఓటమితో హెచ్‌ఎస్ ప్రణయ్ ఓటమి పాలవ్వగా, అష్మిత చలిహా ముందంజ వేసింది. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ డ్రాలో, టాప్ సీడ్ అష్మిత చలిహా మలేషియాకు చెందిన గో జిన్ వెయ్‌పై 10-21, 21-10, 21-17 తేడాతో విజయం సాధించి తదుపరి రౌండ్‌కు దూసుకెళ్లింది. అలాగే స్వదేశీ క్రీడాకారిణి ఇలీషా పాల్‌పై 21-15, 21-11 తేడాతో విజయం సాధించిన మూడో సీడ్ అన్మోల్ ఖర్బ్ కూడా తదుపరి రౌండ్‌కు చేరుకుంది. పురుషుల సింగిల్స్ రౌండ్ ఆఫ్ 16లో చైనాకు చెందిన జువాన్ చెన్ జు చేతిలో ఓడిపోవడంతో హెచ్‌ఎస్ ప్రణయ్ ఇండోనేషియా మాస్టర్స్ నుండి నిష్క్రమించాడు. ఆరంభపు గేమ్ హోరాహోరీగా సాగింది, ఏ ఆటగాడూ స్పష్టమైన ఆధిక్యాన్ని నెలకొల్పలేకపోయాడు. చైనా ఆటగాడు రెండు లేదా మూడు పాయింట్ల ఆధిక్యాన్ని సంపాదించిన ప్రతిసారీ ప్రతిస్పందిస్తూ, జూ ఆధిక్యం మరీ అధికం కాకుండా ప్రణయ్ చూసుకున్నాడు. 16-18తో వెనుకబడిన ప్రణయ్, పోరాడి 19-18తో ఆధిక్యంలోకి వచ్చాడు. అయితే, ఝూ స్కోరును 19-19తో సమం చేశాడు. ఇద్దరూ 20-20తో సమంగా నిలవగా, చివరకు ఝూ స్వల్ప ఆధిక్యంతో 22-20 తేడాతో గేమ్‌ను కైవసం చేసుకున్నాడు. అక్కడి నుండి ఆట చాలా వరకు ఏకపక్షంగా సాగింది, ఝూ రెండవ గేమ్‌పై పట్టు సాధించి, దానిని 21-15 తేడాతో కైవసం చేసుకుని, 45 నిమిషాల్లోనే మ్యాచ్‌ను ముగించాడు.

### ఐపిఎల్ 2027:
## ఇంపాక్ట్ ప్లేయర్‌పై రచ్చ
### ఫ్రాంచైజీలకు బిసిసిఐ అల్టిమేటం!

**న్యూఢిల్లీ:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్ 2027)లో తీవ్ర చర్చనీయాంశంగా మారిన ఇంపాక్ట్ ప్లేయర్ నిబంధన మరోసారి పరిశీలనలోకి వచ్చింది. రాబోయే ఐపీఎల్ సీజన్‌కు ముందు మొత్తం 10 ఫ్రాంచైజీల నుంచి భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) సరికొత్త అభిప్రాయాలను కోరింది. ఐపీఎల్ 2026 ముగిసిన తర్వాత ఈ నిబంధనను సమీక్షి స్తామని గతంలో



బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా పేర్కొన్న నేపథ్యంలో బోర్డు ఈ ముందడుగు వేసింది. క్రికెట్ కార్యకలాపాల విస్తృత ఫీడ్‌బ్యాక్ ప్రక్రియలో భాగంగా తమ అభిప్రాయాలను లిఖితపూర్వకంగా సమర్పించాలని బీసీసీఐ అన్ని ఫ్రాంచైజీలను కోరింది.
పీఎంఓఏ, అంపైరింగ్, ప్రాక్టీస్ సెషన్లు, మ్యాచ్ నిబంధనలపై కూడా బోర్డు సలహాలను కోరినప్పటికీ, వాటన్నింటిలో ఇంపాక్ట్ ప్లేయర్ నిబంధనే అత్యంత కీలకమైన అంశంగా మారింది. గత కొన్ని ఐపీఎల్ సీజన్లుగా ఇంపాక్ట్ ప్లేయర్ నిబంధన తీవ్ర చర్చకు దారితీసింది. ముఖ్యంగా ఐపీఎల్ 2026 ఎడిషన్‌లో 200కు పైగా భారీ స్కోర్లు భారీగా నమోదు కావడం, బ్యాట్‌బంతి మధ్య సమతుల్యత దెబ్బతింటోందనే ఆందోళనలు తీవ్రం కావడంతో ఈ అంశం మళ్లీ తెరపైకి వచ్చింది. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ వంటి భారత క్రికెటర్లు కూడా ఈ నిబంధనపై గతంలో అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇది ఆల్‌రౌండర్ల అభివృద్ధిని దెబ్బతీయడంతో పాటు బౌలర్ల ప్రాధాన్యతను తగ్గిస్తోందని విమర్శలు ఉన్నాయి. గతంలో నిర్వహించిన కెప్టెన్ల సమావేశంలో పలువురు వ్యతిరేకించినప్పటికీ, బోర్డు ప్రాథమికంగా ఈ నిబంధనను కొనసాగించేందుకే మొగ్గు చూపింది. దేవజిత్ సైకియా మాట్లాడుతూ టోర్నీలో కొన్ని లో స్కోరింగ్ మ్యాచ్‌లు కూడా జరిగాయి, ప్రేక్షకులు మ్యాచ్‌లను బాగా ఆస్వాదిస్తున్నారు, బౌలర్లకు కూడా మంచి వికెట్లు దక్కుతున్నాయి, ఇది అన్ని అంశాలు కలగలిసిన ప్యాకేజీ అంటూ నిబంధనను సమర్థించారు. అయితే, ఫ్రాంచైజీలు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తే ఈ నిబంధనను పునఃపరిశీలించేందుకు బోర్డు సిద్ధంగా ఉంటుందని సైకియా గతంలోనే హామీ ఇచ్చారు. ప్రస్తుతం ఫ్రాంచైజీల క్రికెట్ ఆపరేషన్స్ విభాగాల నుంచి వచ్చే నివేదికలను క్రోడీకరించిన తర్వాత, ఐపీఎల్ 2027 సీజన్ కోసం ఈ నిబంధనలో ఏవైనా మార్పులు చేయాలా లేక పూర్తిగా తొలగించాలా అనే దానిపై బీసీసీఐ తుది నిర్ణయం తీసుకోనుంది.

ఆట



## యూఎస్ ఓపెన్.. దూసుకెళ్లిన సబలెంకా

**న్యూయార్క్:** అరీనా సబలెంకా యూఎస్ ఓపెన్‌లో తన సత్తా చాటింది. కేవలం 53 నిముషాల్లోనే పోలినా ఇయాట్చెంకో పై 6-1, 6-12 తేడాతో ఆధిపత్య విజయం సాధించి తదుపరి రౌండ్‌లోకి దూసుకెళ్లింది. న్యూయార్క్‌లో జరిగిన ఈ మ్యాచ్‌లో సబలెంకా తన మొదటి సర్వ్‌లో దాదాపుగా దోషరహితంగా ఆడింది. తొలి సెట్‌లో 16 పాయింట్లకు 15 పాయింట్లు, మొత్తంగా 28 పాయింట్లకు 21 గెలుచుకుంది. మూడో సీడ్ జెస్సికా పెగులా కూడా సోఫియా కెనిన్‌ను 56 నిముషాల్లోనే 6-3, 6-1 తేడాతో ఓడించి త్వరితగతిన మూడో రౌండ్‌కు చేరుకుంది. అలాగే జైమ్ ఫారియాపై 4-6, 6-0, 6-3, 6-2 తేడాతో విజయం సాధించిన కార్లోస్ అల్కరాజ్, సబలెంకా తర్వాతి స్థానంలో నిలిచాడు. గత ఏడాది ఫైనల్ వరకు ఒక సెట్ కోల్పోని ఈ డిఫెండింగ్ ఛాంపియన్, ఆ తర్వాత వరుసగా ఎనిమిది గేమ్‌లు గెలిచి ఆధిక్యం సాధించాడు. జెస్సికా పెగులా సోఫియా కెనిన్‌ను 6-3, 6-1 తేడాతో ఓడించడానికి కేవలం 56 నిమిషాలు మాత్రమే తీసుకుంది. 2020 ఆస్ట్రేలియన్ ఓపెన్ ఛాంపియన్ అయిన కెనిన్, తన మొదటి మ్యాచ్‌లో వీనస్ విలియమ్స్‌ను ఓడించింది. 8వ సీడ్ బెన్ షెల్టన్, ఆషే కోర్టులో పెగులా తర్వాత హుబెర్ట్ హుర్కాజ్‌ను 6-3, 5-7, 7-6 (3), 7-5 తేడాతో ఓడించగా, 7వ సీడ్ డానిల్ మెద్వెదేవ్, సెబాస్టియన్ గోర్జ్నిని 6-13, 6-3, 7-5 తేడాతో సునాయాసంగా ఓడించాడు.

## లండన్ స్క్వాష్ క్లాసిక్.. క్వార్టర్ ఫైనల్స్‌కు అనాహత్



**ఇంగ్లాండ్:** పిఎస్ఎ గోల్డ్-టైర్ లండన్ స్క్వాష్ క్లాసిక్ 2026 టోర్నమెంట్‌లో 18 ఏళ్ల భారత్ టీనేజ్ ప్లేయర్ అనాహత్ సింగ్ క్వార్టర్ ఫైనల్స్‌లోకి దూసుకెళ్లింది. గురువారం ఇంగ్లాండ్‌లో జరిగిన జూనియర్ ప్రపంచ ఛాంపియన్, బెల్జియంకు చెందిన ప్రపంచ నంబర్ 11 నీలే గిలిస్‌ను 39 నిమిషాల్లో 2-1 (13-11, 4-11, 11-8) తేడాతో ఓడించి క్వార్టర్ ఫైనల్స్‌లో తన స్థానాన్ని ఖాయం చేసుకుంది. అనాహత్, గిలిస్ మొదటిసారి ఒకరినొకరు ఎదుర్కొన్నారు. మరోవైపు, రామిత్ టాండన్ రెండో రౌండ్‌ను దాటడంలో విఫలమయ్యాడు. అతను ఇంగ్లాండ్‌కు చెందిన ప్రపంచ నంబర్ 15 మొహమ్మద్ ఎల్షోర్బగీ చేతిలో 29 నిమిషాల్లో 2-0 (10-12, 9-11) తేడాతో ఓడిపోయాడు. ప్రపంచ 42వ ర్యామిత్, భారత ఆటగాడైన రామిత్‌పై 40 హెడ్‌టుహెడ్ రికార్డును కలిగి ఉన్న ఎల్ షోర్బగీపై ఇంకా ఒక్క విజయాన్ని కూడా నమోదు చేయలేదు. అంతకుముందు, వీర్ చోత్రాని యానిక్ విల్హెల్మి చేతిలో వరుస గేమ్‌లలో ఓడిపోయి మొదటి రౌండ్‌లోనే నిష్క్రమించాడు. ఈ పిఎస్ఎ గోల్డ్-టైర్ టోర్నమెంట్‌లో ఇంకా బరిలో ఉన్న ఏకైక భారత ప్లేయర్ అనాహత్ మాత్రమే కావడం విశేషం.

## పుంజుకున్న సేవలరంగం
### ఆగస్టులో 54.1కి పెరిగిన పిఎంఐ సూచీ




**న్యూఢిల్లీ,సెప్టెంబరు 3:** తయారీ రంగానికి భిన్నంగా భారత్ సేవల రంగ కార్యకలాపాలు ఆగస్టులో కొంత మెరుగుపడ్డాయి. అయితే మొత్తం కార్యకలాపాల వృద్ధి నాలుగేళ్లకు పైగా కాలంలో అత్యంత బలహీన స్థాయిల్లోనే కొనసాగింది. సేవల రంగ పర్చేజింగ్ మేనేజర్స్ సూచీ జూలైలో 53.3గా ఉండగా, ఆగస్టులో 54.1కి పెరిగింది. అయినప్పటికీ ఆగస్టు పీఎంఐ 2022 మార్చి తర్వాత రెండో అత్యల్ప స్థాయిగా నమోదైంది. దీర్ఘకాలిక సగటు 54.5తో పోలిస్తే స్వల్పంగా తక్కువగా ఉంది. ఉద్యోగ నియామకాలు 15 నెలల్లోనే అత్యంత వేగంగా పెరగడం సానుకూల పరిణామంగా నిలిచింది. సేవల రంగంలోని 400 సంస్థల కొనుగోలు విభాగాల అధికారుల నుంచి సేకరించిన సమాధానాల ఆధారంగా ఈ సర్వే నిర్వహించారు. పిఎంఐ 50కి పైన ఉంటే వృద్ధిని, 50కి దిగువన ఉంటే క్షీణతను సూచిస్తుంది. ఆగస్టులో భారత్ సేవల కార్యకలాపాల వృద్ధి వేగం పెరిగింది. ఉత్పత్తి, కొత్త వ్యాపారం పెరగడం వృద్ధికి మద్దతిచ్చాయి. అయితే మొత్తం వృద్ధి వేగం నాలుగేళ్లకు పైగా కాలంలో నమోదైన అత్యంత బలహీన స్థాయిల్లోనే ఉంద్ని అని హెచ్‌ఎస్‌బిసి చీఫ్ ఇండియా ఎకనామిస్ట్ ప్రాంజుల్ భండారీ పేర్కొన్నారు. అంతర్జాతీయ డిమాండ్ నుంచి పెద్దగా మద్దతు లభించలేదని ఎస్‌అండ్‌పీ గ్లోబల్ తెలిపింది. కొత్త ఎగుమతి ఆర్డర్లు జూలైతో పోలిస్తే దాదాపు అదే స్థాయిలో పెరిగాయి. గత ఏడాది సగటుతో పోలిస్తే ఎగుమతి అమ్మకాల వృద్ధి తక్కువగానే ఉంది.మరోవైపు, సేవల సంస్థలు 15 నెలల్లోనే అత్యంత వేగంగా ఉద్యోగులను నియమించుకున్నాయి. దీంతో వ్యాపార రంగంలో కొంత విశ్వాసం ఇంకా కొనసాగుతోందని సర్వే సూచించింది.

## ఎన్‌ఎస్‌ఇపై సెబి పిటిషన్లు కొట్టివేత

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 3:** కోలోకేషన్, డార్క్ ఫైబర్ కేసులకు సంబంధించి నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్‌ఎస్‌ఇ)తో సుమారు రూ.1,500 కోట్ల సెటిల్‌మెంట్‌కు సెబీ ఆమోదం తెలిపిన నేపథ్యంలో ఎన్‌ఎస్‌ఇపై మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ దాఖలు చేసిన పిటిషన్లను సుప్రీంకోర్టు గురువారం పరిష్కరించింది. కోలోకేషన్, డార్క్ ఫైబర్ కేసుల్లో కొంతమంది స్టాక్ బ్రోకర్లు ఇతర పెట్టుబడిదారుల కంటే ముందుగా మార్కెట్ డేటాను పొందేందుకు, ట్రేడింగ్ చేసేందుకు అక్రమ మార్గాల్లో లబ్ది పొందారనే ఆరోపణలు ఉన్నాయి.జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ కే.వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం సెటిల్‌మెంట్ ప్రతిపాదనను పరిగణనలోకి తీసుకుని, సెబీ దాఖలు చేసిన పిటిషన్లను పరిష్కరించింది. జూలైలో సెబీ నుంచి సూత్రప్రాయ ఆమోదం పొందిన అనంతరం, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కోలోకేషన్, డార్క్ ఫైబర్ కేసులను రూ.1,491.21 కోట్లకు సెటిల్ చేసేందుకు ఎన్‌ఎస్ఇ రూ.714.74 కోట్లను సెబీకి చెల్లించింది. ఇప్పటికే ఎన్‌ఎస్ఇ డిపాజిట్ చేసిన రూ.776.47 కోట్లతో కలిపి మొత్తం సెటిల్‌మెంట్ మొత్తం రూ.1,491.21 కోట్లు పూర్తయింది.ఎన్ఎస్ఇ తొలుత 2025 జూన్ 20న సెబీకి రెండు సెటిల్‌మెంట్ దరఖాస్తులు సమర్పించింది. కోలోకేషన్, డార్క్ ఫైబర్ అంశాలకు కలిపి రూ.1,387.39 కోట్ల సెటిల్‌మెంట్‌కు ప్రతిపాదించింది. అనంతరం 2026 మార్చి 13న సెటిల్‌మెంట్ నిబంధనలను సవరించి, మొత్తం మొత్తాన్ని రూ.1,491.21 కోట్లకు పెంచింది. దేశంలోనే అతిపెద్ద స్టాక్ ఎక్స్ఛేంజ్ అయిన ఎన్‌ఎస్ఇ త్వరలో ఐపిఓకు సిద్ధమవుతున్న నేపథ్యంలో ఈ సెటిల్‌మెంట్ ప్రాధాన్యత సంతరించుకుంది.

## ఇక వాట్సాప్‌లోనూ బిల్లు చెల్లింపుల సేవలు




**న్యూఢిల్లీ, సెప్టెంబరు 3:** భారత్‌లో వాట్సాప్ ద్వారా బిల్లుల చెల్లింపు సేవలను మెటా ప్లాట్‌ఫామ్స్ అందుబాటులోకి తీసుకువస్తోంది. ప్రపంచంలోని అతిపెద్ద మార్కెట్లలో ఒకటైన భారత్‌లో వాట్సాప్ ఆర్థిక సేవల విస్తరణలో భాగంగా ఈ కొత్త సదుపాయాన్ని ప్రవేశపెడుతోంది. ఆండ్రాయిడ్, ఐఓఎస్ రెండుప్లాట్‌ఫామ్‌లలోనూ ఈ సేవలు అందుబాటులో ఉంటాయి. ఇకపై వినియోగదారులు మరోయాప్‌కు వెళ్లాల్సిన అవ సరం లేకుండా నేరుగా వాట్సాప్‌నుంచే వివిధ రకాల బిల్లులు చెల్లించవచ్చు.ఈ సేవలో విద్యుత్, గ్యాస్, నీటి బిల్లులు, ఫాస్ట్‌ట్యాగ్, బీమా, క్రెడిట్ కార్డు, రుణ చెల్లింపులు తదితరాలు ఉంటాయి. భారత్ కనెక్ట్ నెట్‌వర్క్ ఆధారంగా ఈ సేవను అందిస్తున్నారు. వాట్సాప్ బిల్ పేమెంట్ సేవ ద్వారా దేశవ్యాప్తంగా 30 కేటగిరీల్లో 22,722 బిల్లర్లకు చెల్లింపులు చేసే అవకాశం వినియోగదారులకు లభిస్తుంది. అయితే ఈ సదుపాయం దేశవ్యాప్తంగా ఒకేసారి అందరికీ కాకుండా దశలవారీగా అందుబాటులోకిరానుంది. వాట్సాప్ హోమ్ స్క్రీన్ పైభాగంలో కనిపించే ఐఎన్ఆర్ గుర్తుద్వారా బిల్ పేమెంట్ విభాగాన్ని యాక్సెస్ చేయవచ్చు. అక్కడినుంచి బిల్లుల చెల్లింపులతోపాటు సంబంధిత ఖాతాలను నిర్వహించుకో వచ్చు. ఒకే బిల్లర్ వద్ద ఒకటికంటే ఎక్కువ ఖాతాలు ఉన్న వినియోగదారులు వాటిని ఒకేప్రొఫైల్ కింద నిర్వహించుకునే సదుపాయం కూడా ఉంటుంది.

## వరుసగా నాలుగో రోజు నష్టాల్లో స్టాక్ మార్కెట్లు




**ముంబయి, సెప్టెంబరు 3:** దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా నాలుగో సెషన్‌లోనూ నష్టాలతో ముగిశాయి. బ్యాంకింగ్, రియల్టీ షేర్లలో కొనుగోళ్ల జరిగినప్పటికీ ఐటీ, ఆటో తదితర రంగాల షేర్లలో అమ్మకాల ఒత్తిడి సూచీలను దిగజార్చింది. ముడిచమురు ధరలు అధిక స్థాయిలో ఉండటం, మధ్యప్రాచ్యంలో భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు కొనసాగుతుండటంతో ఇన్వెస్టర్లలో అప్రమత్తత నెలకొంది. బిఎస్‌ఇ సెన్సెక్స్ 417.49 పాయింట్లు తగ్గి 76,152.86 వద్ద స్థిరపడితే నిఫ్టీ 41 పాయింట్లు క్షీణించి 23,873.45 వద్ద ట్రేడింగ్‌ముగించింది. వరుసగా నాలుగు సెషన్లలో సెన్సెక్స్ 1.44 శాతం, నిఫ్టీ 1.25 శాతం చొప్పున నష్టపోయాయి.ముడిచమురు భయాలుబ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు సుమారు 96 డాలర్లకు చేరడం మార్కెట్ సెంటిమెంట్‌పై ప్రభావం చూపింది. ఇంధన సరఫరాల్లో అంతరాయాలపై ఆందోళనలు కొనసాగడంతో ద్రవ్యోల్బణం, బాండ్ ఈల్డ్స్, భారత్ బాహ్య రంగ సమతుల్యతపై ఇన్వెస్టర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.మరోవైపు ఆర్‌బిఐ ప్రత్యేక ఫారెక్స్ స్వాప్ పథకం చివరి పది రోజుల్లో భారత బ్యాంకులు 60 బిలియన్ డాలర్లకు పైగా సమీకరించడంతో బ్యాంకింగ్ షేర్లు మార్కెట్ ట్రెండ్‌కు భిన్నంగా రాణించాయి. నిఫ్టీలో మహీంద్రా అండ్ మహీంద్రా 1.25 శాతం, ఇన్ఫోసిస్ 0.85 శాతం, రిలయన్స్ ఇండస్ట్రీస్ 0.81 శాతం చొప్పున నష్టపోయి సూచీపై ఒత్తిడి పెంచాయి. బిఎస్ఇ 150 మిడ్‌క్యాప్ సూచీ 0.15 శాతం, బిఎస్ఇ 250 స్మాల్‌క్యాప్ సూచీ 1.01 శాతం లాభపడ్డాయి. బిఎస్ఇలో 2,545 షేర్లు లాభపడగా, 1,778 షేర్లు నష్టపోయాయి. 228 షేర్లు మార్పులేకుండా ముగిశాయి. నవంబర్ సెటిల్‌మెంట్ బ్రెంట్ ముడిచమురు ఫ్యూచర్స్ ధర 1.21 డాలర్లు పెరిగి బ్యారెల్‌కు 96.84 డాలర్లకు చేరింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి బలపడింది. రూపాయి 94.5900 వద్ద ట్రేడవగా గత సెషన్‌లో 94.7300 వద్ద ముగిసింది.అక్టోబర్ 5, 2026 సెటిల్‌మెంట్ ఎంసీఎక్స్ గోల్డ్ ఫ్యూచర్స్ 0.74 శాతం పెరిగి 10 గ్రాములకు రూ.1,53,533కు చేరాయి. ఆర్‌బిఎల్ బ్యాంక్ 4.80 శాతం దూసుకెళ్లింది. యూరో టైటన్ బయోటెక్ 4.91 శాతం వెల్‌స్పన్ కార్ప్ 4.26 శాతం పెరిగింది. ఓ విదేశీ బ్రోకరేజ్ సంస్థ రేటింగ్‌తో కవరేజీ ప్రారంభించి రూ.3,250 టార్గెట్ ధరను ప్రకటించింది.ఎక్స్‌టీజీ గ్లోబల్ ఇన్ఫోటెక్ 5.11 శాతం లాభపడింది. ఐపిఒల పరంగాచూస్తే రేస్ ఆఫ్ బిలీఫ్ సంస్థకు సాయంత్రం 5 గంటల వరకు 31,37,810 షేర్లకు గాను 33,77,36,692 షేర్లకు బిడ్లు వచ్చాయి. దీంతో ఇష్యూ 107.63 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. ఇష్యూ ధరల శ్రేణి రూ.227-239గా ఉంది. కనీసం 62 షేర్లకు, ఆ తర్వాత వాటి గుణిజాల్లో బిడ్ వేయాల్సి ఉంటుంది. దీపా జ్యువెలర్స్ 1,85,20,085 షేర్లకు గాను 78,85,39,164 షేర్లకు బిడ్లు వచ్చాయి. ఇష్యూ 42.58 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. ధరల శ్రేణి రూ.168-177గాప్రకటించింది. కనీసం 84 షేర్లకు, ఆ తర్వాత వాటి గుణిజాల్లో బిడ్ చేయవచ్చు. రెండు ఐపీఓలు సెప్టెంబర్ 1న ప్రారంభమై గురువారం ముగిసాయి.

## ఎన్‌ఆర్‌ఐల నుంచి రూ.33,975 కోట్లు ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ సేకరణ




**ముంబయి, సెప్టెంబర్ 3:** రిజర్వ్‌బ్యాంకు ప్రవేశపెట్టిన ఎఫ్‌సిఎన్నార్బీ స్వాప్ విండో కింద ఎన్ఆర్ఐ ఖాతాదారుల నుంచి ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ సుమారు 3.57 బిలియన్ డాలర్లు అంటే దాదాపు రూ.33, 975 కోట్లు సమీకరించింది. ఈ వివరాలను సెప్టెంబర్ 3న బిఎస్‌ఇకి ఇచ్చిన నియంత్రణ సంస్థల దాఖలులో బ్యాంక్ వెల్లడించింది. జూన్ 30, 2026 నాటికి బ్యాంక్ మొత్తం డిపాజిట్ బేస్‌లో ఈ సమీకరణ దాదాపు 11 శాతానికి సమానం. ఇదే సమయంలో బ్యాంక్‌కు చెందిన ఇంటర్నేషనల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సెంటర్ బ్యాంకింగ్ యూనిట్ (ఐబియూ) సుమారు 2.60 బిలియన్ డాలర్లు అంటే దాదాపు రూ.24,720 కోట్లు విలువైన రుణకల్పనకు ముందుకువచ్చింది. ఆర్‌బిఐకి చెందిన ఫారిన్ కరెన్సీ నాన్‌రెసిడెంట్ (బ్యాంక్) డిపాజిట్ ఆర్బీఐకి చెందిన ఫారిన్ కరెన్సీ నాన్ రెసిడెంట్ (బ్యాంక్) డిపాజిట్ స్వాప్ విండో కింద ఈ నిధులను సమీకరించారు. నిర్దేశిత నిబంధనలకు అనుగుణంగా అర్హత కలిగిన ఎన్ఆర్ఐ ఖాతాదారుల నుంచి బ్యాంకులు విదేశీ కరెన్సీ డిపాజిట్లను సమీకరించేందుకు ఈ సదుపాయం వీలు కల్పిస్తుంది. ఈ నిధుల సమీకరణతో ఐడిఎఫ్సీ ఫస్ట్ బ్యాంక్ డిపాజిట్ బేస్‌కు ఊతం లభించింది. బ్యాంక్ వెల్లడించిన రూపాయి విలువలను ఆగస్టు 31, 2026న అమల్లో ఉన్న మారకపు రేటు ఆధారంగా లెక్కించినట్లు తెలిపింది. ఎఫ్సీఎన్నార్బీకింద సమీకరించిన నిధుల వివరాలు తాత్కాలికమైనవని, ఆడిట్ చేయనివని బ్యాంక్ స్పష్టం చేసింది. ఎన్ఆర్ఐల నుంచి 3.57 బిలియన్ డాలర్ల నిధుల సమీకరణ, ఐబియు ద్వారా 2.60 బిలియన్ డాలర్ల రుణకల్పనతో విదేశీ కరెన్సీ డిపాజిట్లు, అంతర్జాతీయ బ్యాంకింగ్ కార్యకలాపాల్లో బ్యాంక్ విస్తరిస్తున్న కార్యకలాపాలను సూచిస్తోంది.

## వేతన ఖాతాదారులకు ఎస్‌బిఐ షాక్




**ముంబయి, సెప్టెంబరు 3:** భారతదేశంలోని అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాలరీ ప్యాకేజీ ఖాతాదారులకు సడెన్ షాక్ ఇచ్చింది. ఈ కేటగిరీ ఖాతాదారులు ఎస్‌బిఐ డెబిట్ కార్డును ఉపయోగించి ఇతర బ్యాంకు ఎటిఎంలు, డిపాజిట్‌కమ్ విత్‌డ్రాయల్ మెషిన్లనుంచి నుంచి చేసుకునే ఉచిత ఎటిఎం ట్రాన్సాక్షన్లపై పరిమితులు విధించింది. ఇప్పటివరకు ఎస్‌బిఐ శాలరీ ప్యాకేజ్ అకౌంట్స్ కింద ఈ డెబిట్ కార్డులతో ఇతర బ్యాంకు ఎటిఎంలలో నెలవారీగా ఉచితంగా 10 సార్లు నగదు విత్‌డ్రా చేసుకునేందుకు అవకాశం ఉండేది. ఇప్పుడు ఆ పరిమితిని 5కు తగ్గించింది. ఈ పరిమితి ఫైనాన్షియల్, నాన్ ఫైనాన్షియల్ ట్రాన్సాక్షన్లు రెండింటికీ వర్తిస్తుంది. కొత్త రూల్స్ 2026, అక్టోబర్ 1 నుంచి అమల్లోకి వస్తుందని స్పష్టం చేసింది. ఇక ఈ ఉచిత లావాదేవీల పరిమితి దాటితే బ్యాంక్ తమ శాలరీ ప్యాకేజ్ అకౌంట్ హోల్డర్లకు ఛార్జీలు విధించనుంది. ఇక్కడ నెలవారీగా 5 ట్రాన్సాక్షన్ల లిమిట్ దాటితే అదనంగా చేసే ఒక్కో ట్రాన్సాక్షన్‌పై రూ. 23 ప్లస్ జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుంది. ఇదే సమయంలో నాన్ ఫైనాన్షియల్ ట్రాన్సాక్షన్లకు అయితే రూ. 11 ప్లస్ జీఎస్టీ ఛార్జీ పడుతుంది. ఈ కొత్త రూల్స్ కేవలం శాలరీ అకౌంట్ హోల్డర్లకే ఉండగా, ఇతర సాధారణసేవింగ్స్ అకౌంట్లకు సంబంధించి రూల్స్‌లో ఎలాంటి మార్పులు చేయలేదు. ఇక్కడ నెలవారీ ఉచిత లావాదేవీలు, సర్వీస్ ఛార్జీలు వంటివి గతంలో ఉన్నవే వర్తించనున్నాయి. మరోవైపు ఎస్‌బిఐ ఎటిఎంలలో కస్టమర్లు ప్రతి నెలా 10 ఉచిత ట్రాన్సాక్షన్లు చేసుకోవచ్చు. ఇతర బ్యాంకు ఎటిఎంలలో 5 వరకు ఫ్రీ క్యాష్ విత్‌డ్రా ట్రాన్సాక్షన్లకు అనుమతి ఉంటుంది. ఇది సాధారణ కస్టమర్లకు వర్తిస్తుంది. మరోవైపు ఎస్‌బిఐ అన్ని రకాల శాలరీ ప్యాకేజీ అకౌంట్ హోల్డర్లు.. ఎస్బీఐ ఎటిఎంలలో అపరిమిత ట్రాన్సాక్షన్లు చేసుకోవచ్చు.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 1 -187, Kushalpuram, Srikakulam Dist. PIN: 532005 Ph. 270684, 271144, 9848387562 Fax : 08942–271146, RNI No. AP TEL/2004/13708 Editor :*Damerla Sai Baba *Responsible for selection of News under the PRB Act. Regd.: No.J/RNP/VM111 Air Surcharge: Delhi : 40 Ps.